30-05Pg1exHMNWJQE.qxd:30-05Pg1exHMNWJQE.qxd 01/01/01 9:30 AM Page 1

ఫోకస్ గత వారం రోజుల్లో విశేషాలు
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
గుంటూరు
: fb.com/vaartha Digital
Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
30-5-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 118 పేజీలు: 12 వెల: 6.50

పివోకె ప్రజలు మనవాళ్లే: రాజ్‌నాథ్

ట్రంప్‌నకు న్యూయార్క్ కోర్టు షాక్!

9లో

# సీమను రతనాలసీమ చేస్తా

## • పది రోజుల్లో కడప స్టీల్‌ప్లాంట్ పనులు ప్రారంభం • 2027 డిసెంబర్‌కు పోలవరం పూర్తి • బిసిలే పార్టీకి వెన్నెముక • మహానాడు ముగింపు సభలో సిఎం చంద్రబాబు



[illegible] ప్రసంగిస్తున్న సిఎం చంద్రబాబు

రాయలసీమను రతనాల సీమగా మార్చి రాష్ట్రానికి మణిహారంగా మారుస్తామని టిడిపి జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు పునరుద్ఘాటించారు. గత పాలకులు రాయలసీమను రాజకీయ అవసరాలకు వాడుకున్నారని విమర్శించారు. కడపలో గురువారం మహానాడు ముగింపు సభలో చంద్రబాబు మాట్లాడుతూ ఎన్ని ఇబ్బందులు ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు తీసుకెళుతున్నామని చెప్పారు. సీమ అభివృద్ధికి తమ వద్ద పక్కా ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని ఇందులో భాగంగానే కర్నూలులో హైకోర్టు బెంచి ఏర్పాటు చేసి, కడపలో ఉక్కు పరిశ్రమ నెలకొల్పి హార్టికల్చర్ హబ్‌గా మార్చి అన్ని విధాల అభివృద్ధి చెస్తామని హామీ ఇచ్చారు. పది రోజుల్లో ఉక్కు పరిశ్రమ పనులు ప్రారంభిస్తామని మొదటి దశలో రూ 4500 కోట్లతో పనులు పూర్తి చేస్తామని తద్వార మూడు వేల మందికి ఉద్యోగ అవకాశాలు దక్కుతాయని పేర్కొన్నారు. ఎన్టీఆర్ ముందు చూపుతోనే ఇక్కడ త్రాగునీటి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారని తమ హయాంలోనే ప్రాజెక్టులన్నీ పూర్తి చేశామని పోలవరం, బనకచర్ల ప్రాజెక్టు పూర్తి చేసి సీమలోని ప్రతి ఎకరాకు సాగు నీరు అందిస్తామని స్పష్టం చేశారు.
2027 డిసెంబర్ నాటికి పోలవరం పూర్తి చేస్తామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి 30 సంవత్సరాలు వెనక్కి పోయిందని తాము గెలిచిఉంటే రాష్ట్రానికి ఇలాంటిపరిస్థితి వచ్చేదికాదని అభిప్రాయ పడ్డారు. అభివృద్ధి అనేది వైకుంఠపాళి కాకూడదని అన్నారు. జగన్ పాలనలో కార్యకర్తలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని వారికి అండగా ఉంటామని వారి సంక్షేమానికి కట్టుబడి ఉన్నామన్నారు. ల్యాండ్ టైటిల్ యాక్టుతీసుకొచ్చి వైఎస్సార్సీ నేతలు భూదందాలకు పాల్పడ్డారని తాము అధికారంలోకి వచ్చాక చట్టాన్ని రద్దు చేశామని వచ్చే మహానాడు నాటికి భూసమస్యలకు పూర్తిగా పరిష్కారం చూపుతామని హామి ఇచ్చారు. ఉగ్రవాదం అనేది చాలా ప్రమాదకరం అని ఆర్థిక ఉగ్రవాదులు అంతకంటే ప్రమాదం అని దీని వలన నష్టపోతామని సిఎం తెలిపారు. మూడు రాజధానుల పేరుతో మూడు ముక్కలాట ఆడారని జగన్‌పై నిప్పులు చెరిగారు. అన్న క్యాంటిన్‌లను మూయించి పేదల పొట్టకొట్టిన వ్యక్తి మనకు అవసరమా అని ప్రశ్నించారు. ఉద్యోగులను అవమానాలకు గురిచేసి వారి పిఎఫ్ డబ్బులను కూడా ఇతర అవసరాలకు మళ్లించాడని ధ్వజమెత్తారు. అటవీ భూమలు ఆక్రమించడంతో పాటు ల్యాండ్, శ్యాండ్, మైన్స్‌ను దోచేశారని ఓబులా పురం ఘనులను దోచిన మాఫియా జైలులో ఉందని తెలిపారు.
ఎన్నో సమస్యలు ఉన్న ధైర్యంగా ముందుకెళుతున్నామని విధ్వంసం అయిన రాష్ట్రాన్ని నిలబెట్టి అభివృద్ధి సంక్షేమం సంపద దృష్టిపైనే దృష్టి పెట్టానని స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని పునర్నిర్మించేందుకు జనసేన, బిజెపి కూటమి ఏర్పాటు చేసి ముందుకెళుతున్నామని పాలన ఎలా ఉండాలో చెప్పిన కేస్ స్టడి తమ పార్టీది అయితే, పార్టీ ఎలా ఉండకూడదో అన్నదానికి ఉదాహరణ వైఎస్సార్సీ ఒక కేస్ స్టడి అని తెలిపారు. డ్రగ్స్, గంజాయి అమ్మడి ఆడబిడ్డలపై అఘాయిత్యాకు పాల్పడితే ఖబడ్దార్ అని హెచ్చరించారు. అహంకారంతో విర్రవీగిన వారికి గత ఎన్నికల్లో ప్రజలు సరైన తీర్పు ఇచ్చారని ఎద్దేవ చేశారు. అందు వల్లనే 94 శాతం స్ట్రైక్ రేట్, 57 శాతం ఓటు షేర్‌తో విజయం సాధించామన్నారు. బిసిలు పార్టీకి వెన్నుముఖగా ఉన్నారని వారి అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. పి4 విధానం ద్వారా పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని 2029 నాటికి జీవో పాలసి ద్వారా అందరికి ఇండ్లునిర్మించి అన్ని అవసరాలు తీరుస్తామని

>>2

# అభివృద్ధిలో బెంగాల్‌కూ భాగస్వామ్యం

## - ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ,మే 29:** అభివృద్ధిచెందిన దేశంగా భారత్ శరవేగంగా రూపాంతరం చెందుతోందని, బెంగాల్ భాగస్వామ్యం కూడా ఇందుకు అత్యవసరమని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. ఈ లక్ష్యంతోనే కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి మౌలికవనరులు సమకూర్చడంలో పెట్టుబడులు కీలక పాత్రపోషిస్తా యన్నారు. బెంగాల్ అభివృద్ధి భారత్ భవిష్యత్తుకు దిక్సూచి వంటిదన్నారు.
నగరంలో సిటీగ్యాస్ పంపిణ ఈప్రాజెక్టు ఒక పైప్‌లైన్‌ప్రాజెక్టు వంటిదని, ఇంటింటికీ ప్రభుత్వ పథకాల డెలివరీ వంటిదని మోడీ అన్నారు. బెంగాల్‌లో గురువారం అనేక ప్రాజెక్టులను ఆయన ప్రారంభించారు. భారత్‌లో చౌకధరలకే స్వచ్ఛ ఇంధనం సులువుగా లభిస్తుందన్న వాదనకు మరింత మద్దతు పెరుగుతోందని ప్రధాని పేర్కొన్నారు. నగరంలో గ్యాస్ పంపిణీ నెట్‌వర్క్‌ను మరింత విస్తరించేందుకుగాను ఆలిపుర్ద్వార్‌లో సిజిడి ప్రాజెక్టు నిర్మాణానికి భూమిపూజచేసారు. ఈ ప్రాంతంలో సాంస్కృతి వారసత్వం పరిఢవిల్లు తున్నదని, ప్రాచీన కాలంనాటి సాంప్రదాయాలు ఇక్కడ మనకు కనిపిస్తాయన్నారు. భూటాన్‌తో ఆలిపుర్ద్వార్ సరిహద్దును పంచుకుంటున్నదన్నారు. అస్సాం కూడా మరోవైపు సరిహద్దుతో ఉందని, ప్రకృతి అందాల గని జల్పాయిగురి, కూచ్‌బెహార్ వారసత్వ సంపదవంటివి ఈ ప్రాంతంలో కీలక మన్నారు.
ఈ ప్రాంతం సందర్శించడం తనకులభించిన అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. బెంగాల్ అభివృద్ధి భారత్ భవిష్యత్తుకు పునాది వంటిదని అన్నారు. ఈ ప్రయాణంలో ఇపుడు కీలక ప్రాజెక్టులతో మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. సిటీగ్యాస్ ప్రాజెక్టు గ్వారా ఆలిపూర్ద్వార్, కూచ్‌బెహార్‌లలో 2.5 లక్షల కుటుంబాలకు ఇంటింటికీ గ్యాస్ అందుతుందని, ఎల్పీజీ సిలిండర్ల కొనుగోలు ఇక ముగుస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. ప్రభుత్వ రవాణాలోకూడా ఇపుడు సిఎన్‌జి కీలకంగా మారిందని అన్నారు. దీనివల్ల కాలుష్యం తగ్గుతుందని, సంపూర్ణ ఆరోగ్యం సమకకూరుతుందని, ఆర్థిక భారం కూడా తగ్గుతుందని మోడీ అన్నారు. ప్రధానమంత్రి ఉజ్వలయోజన కింద మిలియన్లకొద్దీ నిరుపేద మహిళల జీవితాల్లో వెలుగులు నింపామన్నారు. పొగచూరు పొయ్యిల

>>2



## రెడ్‌బుక్ పేరు చెపితేనే వణికిపోతున్నారు

### - నారా లోకేష్

**కడప మే 29 ప్రభాతవార్త బ్యూరో:** రెడ్‌బుక్ పేరెత్తితేనే వైఎస్సార్సీ నేతలు వణికి పోతున్నారని మంత్రి నారా లోకేష్ ఎద్దేవా చేశారు. నకిలి మద్యంతో వేల కోట్ల రూపాయలు దోచేయడంతో పాటు 30 వేలమందిని బలి తీసుకున్నారని మండి పడ్డారు. మహానాడు ముగింపు కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ టిడిపి పార్టీ లేకుండా చేస్తామన్నారు. అడ్రస్ లేకుండా పోయారని అన్నారు. తప్పు చేయకున్న సిఎం చంద్రబాబును అన్యాయంగా జైలులో పెట్టారని ఇందుకు తగిన మూల్యం చెల్లించుకున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం

>>2

## సిట్ కస్టడీని అనుమతించిన ఎసిబి కోర్టు

**విజయవాడ,మే28,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి లిక్కర్ స్కాం కేసులో నిందితులను తమ కస్టడీకి అప్పగించాలంటూ సిట్‌అధికారులు దాఖలు చేసిన పిటిషన్‌పై ఎసిబి కోర్టు గురువారం తీర్పు ఇచ్చింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న రాజ్ కసిరెడ్డి, ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, బాలాజీ గోవిందప్పను సిట్ కస్టడీకి ఎసిబి కోర్టు అనుమతించింది. రేపటి నుంచి రెండు రోజుల పాటు సిట్ అధికారులు కేసిరెడ్డి, ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, గోవిందప్పను విచారించనున్నారు. వారిని న్యాయవాది సమక్షంలో విచారించాలని కోర్టు తెలిపింది. లిక్కర్ స్కామ్‌లో నిందితులను తమ కస్టడీకి అప్పగించాలంటూ ఎసిబి కోర్టులో

>>2

## వంశీకి మళ్లీ షాక్

### బెయిల్ తిరస్కృతి

### 12 వరకూ రిమాండ్

**విజయవాడ,మే29,ప్రభాతవార్తప్రతినిధి:** వైకాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి ఊరట లభించింది. వంశీని రెండోసారి పోలీస్ కస్టడీకి ఇవ్వాలంటూ పోలీసులు పిటిషన్ దాఖలు చేయగా. ఆ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది నూజివీడు కోర్టు. నకిలీ ఇళ్ల పట్టాల పంపిణీ కేసులో వంశీని రెండోసారి కస్టడీకి ఇవ్వాలంటూ హనుమాన్ జంక్షన్ పోలీసులు కోర్టును కోరారు. మూడు రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. రెండు రోజుల క్రితం ఈ పిటిషన్‌పై న్యాయస్థానంలో విచారణ జరిగింది.

>>2


# ఊరా వాడా యోగా

## ఆరోగ్య స్వర్ణాంధ్రకు యోగాంధ్ర

## 26 జిల్లాల్లో 26 ఇతివృత్తాలు

## ప్రధాన కార్యదర్శి యోగానంద్

**విజయవాడ, మే29, ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడ బిఆర్‌టిఎస్ యోగాంధ్ర స్ట్రీట్‌లో విజయవంతంగా పోలీస్ యోగాంధ్ర ఇదే స్ఫూర్తితో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సమష్టిగా ముందడుగేద్దామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ పిలుపును ఇచ్చారు. ఆరోగ్య ఆనంద స్వర్ణాంధ్ర సాకారానికి రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి ఆకాంక్షలకు అనుగుణంగా మే 21న ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన యోగాంధ్ర కార్యక్రమం ముందుకెళ్తోందన్నారు. ఆయుష్‌శాఖ, ఎన్‌టిఆర్‌జిల్లా అధికారయంత్రాంగం, జిల్లా పోలీస్ కమిషనరేట్, విజయవాడ నగరపాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం విజయవాడ బిఆర్‌టిఎస్ యోగా స్ట్రీట్‌లో నిర్వహించిన పోలీసు థీమ్ యోగా కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ పాల్గొని సీనియర్ ఐఎఎస్, ఐపిఎస్ అధికారులతో కలిసి యోగాసనాలు అభ్యసించారు. అనంతరం సిఎస్ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సంతోషకరమైన సమాజ నిర్మాణం లక్ష్యంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21 వరకు రాష్ట్రంలోని ప్రతి గ్రామం, పట్టణంలో యోగాంధ్ర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అప్పటికి కనీసం రెండుకోట్ల మందికి యోగాను నేర్పించేలా ప్రణాళిక ప్రకారం కృషిచేస్తున్నట్లు తెలిపారు.
రాష్ట్ర వ్యాప్తంగా 1,25,000 మంది యోగా ట్రైనర్లు నమోదు చేసుకున్నారని, వీరి సహాయంతో ప్రజలకు యోగాపై అవగాహన కల్పించడంతోపాటు యోగాసనాలు నేర్చుకునేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. 26 జిల్లాల్లో 26 థీమ్‌లతో యోగాంధ్ర ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని.. రైతులు, కార్మికులు, ఉపాధి హామీ శ్రామికులు, సీనియర్ సిటిజన్స్, విభిన్న ప్రతిభావంతులు.. ఇలా సమాజంలోని ప్రతివర్గానికి యోగాను చేరువ చేసేందుకే ఈ థీమ్ యోగాను నిర్వహిస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 100 పర్యాటక ప్రాంతాల్లోనూ యోగా విశిష్టతను వివరించి, అవగాహన కల్పించే కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఇందుకు ప్రతిజిల్లాలో నాలుగైదు చొప్పున పర్యాటక ప్రాంతాలను గుర్తించినట్లుతెలిపారు. థీమ్ యోగాంధ్రలో భాగంగా గురువారం విజయవాడ బిఆర్‌టిఎస్ యోగా స్ట్రీట్‌లో నిర్వహించిన పోలీస్ థీమ్ యోగా కార్యక్రమం విజయవంతమైందన్నారు. ఇదేస్ఫూర్తితోయోగాంధ్ర విజయవంతానికి కృషిచేద్దామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అన్నారు.



యోగముద్రలో విజయానంద్

**రాష్ట్ర వ్యాప్తంగా యోగాంధ్రకు విశేష స్పందన:కృష్ణబాబు**

ఈ నెల 21న రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైన యోగాంధ్రకు విశేష స్పందన లభిస్తోందని.. అన్ని వర్గాల ప్రజలు కార్యక్రమంలో భాగస్వాములవుతూ యోగా ఔన్నత్యానికి వన్నెతెస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధానకార్యదర్శి (వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం) ఎం.టి.కృష్ణబాబు అన్నారు. దాదాపు అన్నిజిల్లాల్లోనూ యోగాభిలాషులు నమోదు చేసుకుంటున్నారని, కొన్ని

>>2

# రాష్ట్రంలో 10 పారిశ్రామిక పార్కులు

## పిపిపి పద్ధతిలో అభివృద్ధికి ప్రతిపాదనలు

**విజయవాడ,మే28,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో అంతర్జాతీయ ప్రమాణాలతో 10 భారీ పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పారిశ్రామికవేత్తల నుండి డిమాండ్ ఉన్న ప్రాంతంలో ఏపీఐఐసీ వద్ద అందుబాటులో ఉన్న భూముల్లో వాటిని ప్రతిపాదించింది. విశాఖ-చెన్నై(వీసీ), హైదరాబాద్-బెంగుళూరు (హెచ్‌బీ) పారిశ్రామిక కారిడార్లకు సమీపంలో కొన్ని పార్కులను ప్రతిపాదించింది. ఇందులో భాగంగా కల్పించే మౌలిక సదుపాయాలను వినియోగించుకునేలా అనకాపల్లి, కర్నూలు జిల్లాల్లో కొన్ని పార్కులను అభివృద్ధి చేసేందుకు నిర్ణయించింది. గుత్తేదారుల ఎంపికకు ఇప్పటికే ఆసక్తి వ్యక్తీకరణ (ఇఒఐ) ప్రకటన జారీ చేసింది.
మొత్తం 4,012.46 ఎకరాలను పార్కుల కోసం ప్రతిపాదించింది. ఆసక్తి ఉన్న సంస్థలు జూన్ 6 లోగా బిడ్‌లు దాఖలు చేసుకోవాలని గడువు నిర్ధేశించింది.గుత్తేదారుల సంస్థల నుండి వచ్చే స్పందన మేరకు...పార్కు అభివృద్ధి చేయడం ద్వారా వచ్చే ప్రయోజనంలో పెట్టుబడి పెట్టిన వారికి,ఎపిఐఐసి ఎంత ఇవ్వాలనేది ప్రభుత్వం నిర్ణయిస్తుంది. ఎపి ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్కుల పాలసీ నిబంధనలకు అనుగుణంగా డెవలపర్లకు ప్రోత్సాహకాల చెల్లింపు ఉంటుంది. ఒప్పందంలో భాగంగా ప్లగ్ అండ్ ప్లే విధానంలో పరిశ్రమల ఏర్పాటుకు వీలుగా భూముల అభివృద్ధి, గోదాములు, స్కిల్,శిక్షణా కేంద్రాల వంటివి గుత్తేదారు సంస్థ కల్పించాలి. మన రాష్ట్రంలో ఉన్న పోర్టులు, విమానాశ్రయాలు, రైల్వే నెట్‌వర్క్‌లను అనుసంధానించడం పొరుగు రాష్ట్రాల సరిహద్దుల్లో ఏర్పాటు చేసే పార్కులకు అక్కడి నెట్‌వర్క్‌ను వినియోగించుకునేలా ప్రభుత్వం ప్రతిపాదించింది. నగరి దగ్గర ప్రతిపాదించిన పార్కు కోసం తమిళనాడులోని తిరుత్తణి రైల్వే స్టేషన్‌తో పాటు, చెన్నై పోర్టును వినియోగించుకోవాలన్నది ఆలోచనగా సమాచారం.మొత్తం ప్రతిపాదించిన 10 పార్కుల్లో...ఒకటి రెండు మినహా మిగిలిన వాటికి రైలు,రోడ్డు,పోర్టులకు అనుసంధానంగా ఉన్న ప్రాంతాలను ఎంపిక చేసింది.
ప్రాజెక్ట్‌కు మార్కెటింగ్ ప్రచారాన్ని కల్పించాలి. ఎపిఐఐసి ఆదేశించింది.పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నిర్వహణ కల్పించాలి.ప్రాజెక్టును వినియోగించుకునే వారి నుండి వసూలు చేయాల్సిన ఫీజులు, ఛార్జీలు,భూములు కేటాయించినందుకు చెల్లించాల్సిన మొత్తాన్ని వసూలు చేసే భాధ్యత వారిపైనే ఉంటుంది.



# బంగాళాఖాతంలో అల్పపీడనం

## రెండు రోజులపాటు భారీ వర్షాలు

**విజయవాడ,మే28,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. ఓవైపు రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు విస్తరించగా, మరోవైపు వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం బలపడింది. అల్పపీడనం ఉత్తరం వైపు కదులుతుందని, రాబోయే 24 గంటల్లో వాయుగుండంగా మారుతుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. రానున్న రెండు రోజులు కోస్తాంధ్రలో భారీ వర్షాలు పడే అవకాశం ఉంది, భారీ వర్షాల నేపథ్యంలో ఆకస్మిక వరదలు, కోస్తాంధ్రలో భారీ వర్షాలతో పాటు, ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది. నేడు శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో అక్కడక్కడ మోస్తారు నుంచి భారీవర్షాలు, ఏలూరు, ఎన్టీఆర్, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు,నంద్యాల, కర్నూలు, అనంతపురం, వైఎస్సార్ కడప, శ్రీసత్యసాయి జిల్లాల్లో మోస్తారువర్షాలు, మిగతా జిల్లాల్లో తేలికపాటి వర్షాలుకురిసే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఆకస్మిక వరదల అవకాశం ఉంది. గోదావరి, నాగావళి, వంశధార నదీ పరివాహక లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. నదీ తీరాలు, సరస్సులు, చెరువులు, కాలువల్లో కొట్టుకుపోయే కేసులను తగ్గించడానికి, ప్రమాదాన్ని కలిగించే నీటి వనరులు తక్షణంగుర్తించి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్లకు సూచనలు జారీ చేసారు.
ఎపిలోని పలుప్రాంతాల్లో మోస్తరు వర్షాలు పడుతున్నాయి. ఇప్పుడు వాయుగుండం ప్రభావంతో.. మరో 24 గంటల్లో ఉత్తర, దక్షిణ కోస్తాలో భారీ వర్షాలు కురుస్తున్నాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. అల్లూరి జిల్లా, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. రెండురోజులపాటు భారీవర్షాలతో పాటు.. గంటకు 40నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు కూడా వీస్తాయని వెల్లడించింది. ఎపిలోని 10 జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది.

# రాజధాని మాస్టర్ ప్లాన్‌కు కొత్త చిక్కులు

## గత భూసేకరణ ప్రకటనలు రద్దు, ఆ భూములపై హక్కులు లేని ప్రభుత్వం

**విజయవాడ,మే29,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి రాజధాని అమరావతి పరిధిలో మాస్టర్‌ప్లాను అమలుకు కొత్త చిక్కులొచ్చాయి. సమీకరణ కింద ఇవ్వని భూములను సేకరణ పద్ధతిలో తీసుకుంటామని ఇచ్చిన నోటిఫికేషన్లో ఉన్న గ్రామాల వారీ ప్రకటనలను గత వైకాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రద్దు చేసింది. అలా రద్దయిన భూములు సుమారు 1,500 ఎకరాల వరకూఉన్నాయి. ఇవన్నీ ఎక్కువ శాతం ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించే ప్రాంతంలోనే ఉన్నాయి. వాటిల్లో పనులు చేపట్టాలంటే రైతుల అనుమతికావాలి. దీనిపై సిఆర్‌డిఎ అధికారులు తర్జన భర్జన పడుతున్నారు. ఒకసారి నోటిఫికేషన్ వెనక్కు తీసుకున్న తరువాత మరలా అదే సర్వే నెంబర్లకు నోటిఫికేషన్ ఇవ్వడం అంత తేలికైన విషయం కాదు. రైతులు కోర్టుకు వెళితే ప్రభుత్వానికి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. 2015 జనవరి ఒకటోతేదీనుండి రాజధాని పరిధిలో భూ సమీకరణ ప్రక్రియను అప్పటి టిడిపి ప్రభుత్వం చేపట్టింది. దీన్ని పలువురు రైతులు వ్యతిరేకించారు. ఈ నేపథ్యంలో 2015 జూన్ నాటికి మొత్తంరాజధాని గ్రామాల పరిధిలో 4,410 ఎకరాల వరకూ పూలింగుకు ఇవ్వలేదు. దీంతో ప్రభుత్వం 2013 భూసేకరణ చట్టంలో సెక్షన్ 11/1కింద సేకరణకు నోటిఫికేషన్ ఇచ్చింది. వీటిపై రైతులు కోర్టును ఆశ్రయించారు.
2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం మూడు రాజధానుల ప్రకటన చేయడంతో అక్కడ పనులు నిలిచిపోయాయి. 2024 ఫిబ్రవరి 28న అన్ని గ్రామాల్లోనూ భూసేకరణ ప్రకటనలు వెనక్కు తీసుకుంటున్నట్లు ప్రకటించింది. ఉపసంహారణలోనూ గ్రామంలో సేకరణ ప్రకటన ఇచ్చిన అన్ని భూములను కాకుండా కొన్నిటిని మినహాయించింది. లింగాయపాలెంలో 98.57 ఎకరాలకు నోటిఫికేషన్ ఇస్తే అక్కడ51.06 ఎకరాలను మినహాయించింది. వెంకటపాలెంలో 66.11 ఎకరాలు సేకరణ తీసుకుంటామని ప్రకటించినా 39.83 ఎకరాలకు ఉపసంహారించుకుంది. అన్ని గ్రామాల్లోనూ ఇదేపరిస్థితిఉంది. అయితే అంతకు ముందు సేకరణ ప్రకటనలోఉన్న కొన్ని భూము లను రైతులు వెనక్కుతీసుకున్నారు. కొన్ని భూముల్లో అప్పటి సిఆర్‌డిఎ అధికారులు వ్యక్తిగత కారణాలను అడ్డుపెట్టుకున్నారు. సేకరణ ప్రక్రి యలో ఉన్న భూములను పూలింగుకు ఇస్తామంటే అమ్మకానికి అనుమతి ఇచ్చారు. అలా కొనుగోలు చేసినవారు పూలింగుకు ఇచ్చేశారు. మిగిలిన భూముల్లో కొంతవరకు సేకరణ నుండి ఉపసంహా రిస్తూ లింగాయపాలానికి 50, వెంకటపాలానికి 47 నెంబరుతో లోకల్ విత్‌డ్రా గెజిట్ ఇచ్చారు. దీనిలో 2013 భూసేకరణ చట్టంలో సెక్షన్ 19(1) ఫారం 7 ప్రకారం గ్రామాల వారీ సేకరణ వెనక్కు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.



## తేజశ్వని ట్రిపుల్‌ఐటి ప్రవేశానికి అనుమతి

**విజయవాడ.మే29,ప్రభాతవార్తప్రతినిధి:** పదో తరగతి పరీక్షల మార్కుల కౌంటింగ్‌లో జరిగిన తప్పిదంతో తొలుత ఫెయిల్ అయి రీకౌంటింగ్‌లో పాసైన విద్యార్థిని ఈమని తేజస్వినికి ట్రిపుల్ ఐటీలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం లభించింది. బాపట్ల జిల్లా కొల్లూరు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని ఈమని తేజస్వినికి జవాబు పత్రాల మార్కుల లెక్కింపులో జరిగిన పొరపాటుతో సోషల్ సబ్జెక్ట్‌లో 23 మార్కులే వచ్చాయి. దాంతో ఆమె ట్రిపుల్ ఐటీలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోలేకపోయింది. అనంతరం జరిగిన రీకౌంటింగ్‌లో ఆ విద్యార్థి సోషల్ సబ్జెక్ట్‌లో 96 మార్కులుసాధించి మొత్తం 575మార్కులు తెచ్చుకుంది. ఐదింటిలో 90 పైనే మార్కులుఒక సబ్జెక్ట్‌లో తేజస్విని ఫెయిల్ అయింది.ఆమె రీకౌంటింగ్‌కు

>>2



కడప మహానాడు ముగింపు రోజున జరిగిన భారీ బహిరంగసభలో వేదికపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆశీసులైన మంత్రులు, పార్టీ ముఖ్యనేతలు

# ఊరా వాడా యోగా

>> జిల్లాల్లో లక్ష్యానికి మించి ఔత్సాహికులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు వివరించారు.

భూ పరిపాలన చీఫ్ కమిషనర్, ఎన్‌టిఆర్ జిల్లా ప్రత్యేక అధికారి జి.జయలక్ష్మి మాట్లాడుతూ భారతీయ సంస్కృతి అందించిన విలువైన యోగా సంపదపై ప్రతిఒక్కరూ అవగాహన కల్పించుకొని, రోజువారీ జీవితంలో యోగాతో అనుసంధానమై సుసంపన్న జీవితాన్ని సొంతం చేసుకోవాలని సూచించారు. యోగాచరణను ఏ ఒక్క రోజుకో పరిమితం చేసుకోకుండా జీవితాంతం ఓ మంచి అలవాటుగా కొనసాగించాన్నారు.

ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ యోగాంధ్రలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ప్రతిరోజూ యోగాసనాల కార్యక్రమాలు జరుగుతున్నాయని, బిఆర్‌టిఎస్ యోగా స్ట్రీట్‌లోనూ థీమ్ యోగాను నిర్వహిస్తున్నామని, ఇప్పటికే పాత్రికేయులు, యోగా శిక్షణ సంస్థలు, ప్రభుత్వ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, వాహన చోదకులు తదితరులతో థీమ్ యోగా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. పర్యాటక ప్రాంతాల్లో యోగాలో భాగంగా గాంధీ హిల్‌పై యోగాసనాల అభ్యసన కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. మిగిలిన పర్యాటక ప్రాంతాల్లోనూ నిర్వహిస్తామని.. ఒక ప్రణాళిక ప్రకారం జిల్లాలో దాదాపు 15 లక్షల మందికి యోగాను చేరువచేసేందుకు కృషిచేస్తున్నామన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా పోలీసు కమిషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబు మాట్లాడుతూ శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యాన్నీ సొంతం చేసే యోగా ఉపయోగాలపై ప్రజలకు అవగాహన కల్పించి, ఆచరించేలా ప్రోత్సహించే లక్ష్యంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న యోగాంధ్రలో పోలీసు శాఖ భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. గురువారం బిఆర్‌టిఎస్ యోగా స్ట్రీట్‌లో దాదాపు అయిదువేల మంది పోలీసు అధికారులు, సిబ్బంది, యోగా ఔత్సాహికులతో నిర్వహించిన పోలీసు యోగాంధ్ర విజయవంతానికి కృషిచేసిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు.

**కనులవిందుగా కళాత్మక యోగా:**

కార్యక్రమంలో భాగంగా చిన్నారుల ఆర్టిస్టిక్ యోగా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శ్వాసపై ఏకాగ్రత అనేది సర్వరోగ నివారిణిగా పనిచేస్తుందంటూ యోగా, ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ ఓం శాంతి బ్రహ్మకుమారీలు యోగా ఔత్సాహికులతో ధ్యాన సాధన చేయించారు. ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం కమిషనర్ జి.వీరపాండ్యన్, ఆయుష్ డైరెక్టర్ కె.దినేష్ కుమార్, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్.ఎం, ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి.రాజకుమారి, ఈగల్ ఐజి ఆకే రవికృష్ణ, ఎపిఎస్‌పి ఐజీ రత్నకుమారి, డిసిపి కెజివి సరిత, విజయవాడ ఆర్‌డిఒ కావూరి చైతన్య, జిల్లా ఆయుష్ యోగాంధ్ర నోడల్ అధికారి డా. వి.రాణి, ఆయుష్ అధికారి డా. రామత్లేహి, మెడికల్ ఆఫీసర్ డా.వై.రత్న ప్రియదర్శిని, అమరావతి యోగా, పతంజలి యోగా, ఈషా ఫౌండేషన్, ఆర్ట్ ఆఫ్ లివింగ్, ఓం శాంతి బ్రహ్మకుమారీలు, పెద్దఎత్తున యోగా ఔత్సాహికులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# రతనాల సీమ చేస్తా

>> హామి ఇచ్చారు. యువతకు 20 లక్షల ఉద్యోగాలుకల్పనే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామని అమరావతిలో క్వాంటం వ్యాలి, వైజాక్‌లో గూగుల్, టిసిఎస్, బిహెచ్‌ఈఎల్, ఎన్టీపిసి వంటి ప్రతిష్టాత్మకమైన కంపెనీలు రాబోతున్నాయని వాటి ద్వారా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. యువ శక్తికి అవకాశం ఇస్తే అద్భుతాలు చేస్తారని నమ్ముతున్నట్లు సిఎం చెప్పారు. 2047 నాటికి వికసిత్ భారత్ నరేంద్రమోడి ద్వారా సాధ్యం అవుతుందన్నారు. ఈసందర్భంగా కడప జిల్లాకు వరాలు కురిపించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు పెమ్మసారిచంద్రశేఖర్, రామ్మోహన్ నాయుడు, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎం. శ్రీనివాసులు, మంత్రులు అనిత, రామ్‌ప్రసాదరెడ్డి, అచ్చెనాయుడు, బిసి జనార్ధన్‌రెడ్డి, సవితమ్మ, టీజీ భరత్, నారాయణ, అనగాని సత్యప్రసాద్, ఎంపిలు, ఎమ్మెల్యేలు, పలువురు నామినేటెడ్ చైర్మెన్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేడు ఢిల్లీకి సిఎం

**విజయవాడ,మే29,ప్రభాతవార్తప్రతినిధి:** భారత పరిశ్రమల సమాఖ్య (సిఐఐ) వార్షిక సమావేశంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 30న ఢిల్లీ వెళ్లనున్నారు. శుక్రవారం మధ్యాహ్నం అక్కడకు చేరుకొని సాయంత్రం 4.30 నుండి 5.30 వరకు హోటల్ తాజ్‌ప్యాలెస్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు.ఆయన ఈ క్రమంలో కొందరు మంత్రులను కలిసే అవకాశం ఉంది. టిడిపి పార్లమెంటరీ పార్టీ నిర్వహించి, ఎంపీలకు మహానాడు విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు తెలిపే అవకాశం ఉంది.

# వణికిపోతున్నారు

>> హామీలన్నీ ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని అన్నారు. జూన్ నెలలో తల్లికి వందనం అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. మిషన్ రాయలసీమ అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. పార్టీలో కార్యకర్తలే అధినేత అని అహంకారం పక్కన పెట్టాలని పార్టీ నేతలకు లోకేష్ సూచించారు. 2014లో కష్టపడి రాష్ట్రాన్ని నడిపించాము, 2019లో ఒక సైకో సిఎం కావడంతో రాష్ట్రం ఇబ్బంది ల్లోకి నెట్టబడిందని ఆవేదన వ్యక్తం చేశారు. దేవుని కడప సాక్షిగా తాను సందించే ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలని జగన్‌కు సవాలు విసిరారు.

తల్లిని చెల్లిని గెంటేసింది ఎవరు? బాబాయిని లేపేసింది ఎవరు? ఎర్రబటన్ నొక్కి ప్రజల బటన్‌లు నొక్కింది ఎవరు? నకిలి మద్యంతో ప్రజల ప్రాణాలు తీసింది ఎవరో చెప్పాలని లోకేష్ డిమాండ్ చేశారు. రెడ్‌బుక్ చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని ఆనాడే చెప్పినట్లు గుర్తుచేశారు. ఆగస్టు 15 నుండి మహిళలకు ఆర్టీసి బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామన్నారు. ఏ సమస్య వచ్చిన నా ఇంటి తలుపులు తెరిచే ఉంటాయని పార్టీ కార్యకర్తలకు లోకేష్ హామి ఇచ్చారు.

# జిల్లాకో మోడల్ రూఫ్‌టాప్ విలేజ్

## ప్రధాన కార్యదర్శి యోగానంద్

**విజయవాడ, మే 29: ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో వచ్చే నెల జూన్ చివరి నాటికి డిస్కాములు, నెడ్ క్యాప్ కలిపి మొత్తం 3 లక్షల సోలార్ రూఫ్ టాప్ కనెక్షన్లు ఏర్పాటు చేసేలా లక్ష్యంగా పెట్టుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ సిఎండిలను ఆదేశించారు. గురువారం సిఎస్ క్యాంప్ కార్యాలయం నుండి రాష్ట్రంలోని డిస్కాముల సిఎండిలు పృథ్వీ తేజ్ ఇమ్మడి, పి పుల్లా రెడ్డి , కె సంతోష రావు, నెడ్ క్యాప్ ఎండి కమలాకర్ బాబుతో పాటు రాష్ట్రంలోని సిఇలు/ఎస్ఇలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాన మంత్రి సూర్య ఘర్ పథకం అమలు తీరు గురించి సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కె విజయానంద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ గారి సహకారంతో రాష్ట్రాన్ని పునరుత్పాదక ఇంధన రంగంలో దేశంలో ముందంజలో ఉంచడంలో విజయవంతంగా పనిచేస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈఏడాది చివరినాటికి రాష్ట్రంలో 20 లక్షల రూఫ్‌టాప్ సోలార్ కనెక్షన్లు ఏర్పాటు చేయాలనీ లక్ష్యంగా పెట్టుకుని ముందుకు వెళ్తోందన్నారు. డిస్కంలు, నెడ్కాప్ కలిసి ఈ జూన్ 2025 నాటికి మొత్తం మూడు లక్షల కనెక్షన్లను ఏర్పాటుచేయాలని లక్ష్యంగా పెట్టుకోవాలని, ఒక్కో డిస్కం 75,000 కనెక్షన్లు, నెడ్కాప్ మరో 75,000 కనెక్షన్ల బాధ్యత తీసుకోవాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. దీనికి సంబంధించిన యాక్షన్ ప్లాన్ తక్షణమే పంపించాలని ఆదేశిస్తూ, వారంలో ఒక్కరోజు ఈ పథకం పురోగతిని సమీక్షిస్తామన్నారు. పిఎం సూర్య ఘర్ పథకం ప్రకారం ఎస్సీ, ఎస్టీ లబ్దిదారులకు 2 కిలోవాట్ల రూఫ్ టాప్ సోలార్ యూనిట్‌లు ఉచితంగా ఏర్పాటు చేయాలన్నారు. వెనకబడిన తరగతుల కులాల వారికి (బిసి) కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.60,000, రాష్ట్ర ప్రభుత్వం నుంచి అదనంగా రూ.20,000 సబ్సిడీ కలిపి మొత్తం రూ.80,000 మంజూరవుతుందని , దీని వల్ల రూ.1.20 లక్షల సోలార్ రూఫ్ టాప్ సిస్టం పై పెద్ద మొత్తంలో ప్రోత్సాహకర సాయం లభిస్తుందన్నారు. ఈ అంశాన్ని ప్రజలకు విస్తృతంగా తెలిసేలా ప్రచారం చేయాలని ఆయన సూచించారు.

రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఒక గ్రామాన్ని సోలార్ రూఫ్ టాప్‌మోడల్ గ్రామంగా చేయాలన్నారు. మొత్తం 26 గ్రామాలను ఎంపిక చేసుకుని సోలార్ రూఫ్ టాప్ ఆదర్శంగా తీర్చిదిద్దాలని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు పిఎం సూర్యఘర్ పోర్టల్లో 12.12 లక్షల దరఖాస్తులు నమోదైనట్లు పేర్కొన్నారు. ఎపిఇపిడిసిఎల్ 85,711, ఎపిసిపిడిసిఎల్ 5.34 లక్షలు, ఎపిఎస్పిడిసిఎల్ 5.92 లక్షల దరఖాస్తులు నమోదయ్యాయని తెలిపారు. నిర్ణయించిన సమయానికి ముందే లక్ష్యాలను సాధించేందుకు డిస్కంలు కృషి చేయాలని కె విజయానంద్ ఆదేశించారు. రాష్ట్రంలోని 5.87 లక్షల ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు ఈ పథకం కింద నమోదైనట్లు ఆయన తెలిపారు. వీటికి 1,174 మెగావాట్ల సామర్థంతో, ఏడాదికి 1,743 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థం కలిగిన సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ప్రతి లబ్దిదారుకు 2 కిలోవాట్ల రూఫ్టాప్ సోలార్ వ్యవస్థ 6 నెలల్లో ఏర్పాటుచేసి, 5 సంవత్సరాల పాటు ఉచితంగా నిర్వహణ చేయనున్నట్లు తెలిపారు. పిఎం సూర్యఘర్ పథకాన్ని వేగవంతంగా అమలు చేయాలని సూచిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని పునరుత్పాదక ఇంధన రంగాభివృద్ధి కృషి చేస్తోందని, అర్హులైన ప్రతి కుటుంబానికి ఈ పథకం ప్రయోజనం చేకూర్చేలా కృషి చేస్తున్నదని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ తెలిపారు.



# ఏసియన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌కు మంత్రి అభినందనలు

**విజయవాడ, మే29 ,ప్రభాతవార్తప్రతినిధి:** ఏషియన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించిన తెలుగు క్రీడాకారిణి జ్యోతి యర్రాజీని క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అభినందించారు. యర్రాజీ 12.96 సెకన్లలో లక్ష్యం ఛేదించిన గోల్డ్ మెడల్ సాధించడం పట్ల గర్వకారణం ఉంది. జ్యోతి విజయం తెలుగు క్రీడాకారులకు గర్వకారణం, యువతకి స్ఫూర్తి. అన్నారు. పరుగుల రాణి జ్యోతి యర్రాజీ ఇంకెన్నో విజయాలు సాధించాలన్నారు. తెలుగు తేజం జ్యోతి నిరంతర శ్రమకు ఫలితంగా ఈ గోల్డ్ మెడల్. దక్కిందన్నారు. ప్రభుత్వం ఆమెకు నిరంతరం అండగా ఉంటుందన్నారు. 'ఎక్స్' వేదికగా ఆమె ఈ విషయం వెల్లడించారు.

# 'పది' మూల్యాంకనం తప్పులపై సిఎం అసహనం

## బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

**విజయవాడ,మే29,ప్రభాతవార్తప్రతినిధి:** టెన్త్ పబ్లిక్ పరీక్షల మూల్యాంకనంలో పలు చోట్ల తప్పిదాలు జరిగినట్లు వస్తున్న ఆరోపణలపై ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర అసహనం వ్యక్తం చేసారు. అభియోగాలకు తగినట్లుగానే ఒకటి,రెండు చోట్ల ఈ విషయం వెల్లడి కావడం పట్ల సీఎం చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేసారు.ఇప్పటికే ఈ తప్పిదాలకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసారు.ఇదే అంశంపై తాజాగా 'ఎక్స్' పదో తరగతి మూల్యాంకనంలో ఒకటి, రెండు చోట్ల తప్పిదాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేసారు.ఈ వ్యవహారంలో మూల్యంకన అధికారులుతో సహ బాధ్యులపై విచారించి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. బాధిత విద్యార్థులు నష్టపోకుండా చూడాలని సూచించారు.బాధిత విద్యార్థులు నష్టపోకుండా చూడాలని సూచించారు.

ఈ ఏడాది జరిగిన పదో తరగతి పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనంలో పలువురు విద్యార్థులు నష్ట పోయేలా ఉండటం సరికాదన్నారు. రీవాల్యూయేషన్, రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకున్న తర్వాత విద్యార్థుల మార్కుల్లో వ్యత్యాసం కనిపించడాన్నితీవ్ర తప్పిదంగా ముఖ్యమంత్రి పరిగణించారు. నష్టపోయిన విద్యార్థులకు ఇంటర్ ప్రవేశాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సంబంధిత శాఖాధికారులను ఆదేశించారు.

తప్పిదానికి బాధ్యులైన అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుని, వెంటనే నివేదికను సమర్పించాలన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా వ్యవస్థాత్మక సంస్కరణలు తీసుకురావాలని ఆదేశించారు. బాపట్ల జిల్లాకు చెందిన ఈమని తేజస్వినికి సాంఘిక శాస్త్రంలో 23 మార్కులు రావడంతో ఆమె రీకౌంటింగ్ జరిపితే 96 మార్కులు వచ్చాయన్నారు.ఆమె అభీష్టం మేరకు నూజివీడు ట్రిపుల్ ఐటి అవకాశం కల్పిస్తాయన్నారు.చిన్న తప్పిదాలే విద్యార్థుల భవిష్యత్తును నాశం చేస్తాయన్నారు.

# వంశీకి మళ్లీ షాక్

>> గతంలో ఇదే కేసులో రెండు రోజుల పాటు వంశీని పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారించారని వంశీ తరపు న్యాయవాది వాదించారు. కస్టడీకి తీసుకున్న సమయంలో వంశీ అస్వస్థతకు గురయ్యారని, దీంతో విచారణ సరిగా జరగలేదని పోలీసులు కోర్టుకు తెలిపారు. ఇరువురి వాదనలు విన్న న్యాయస్థానం రెండు రోజుల్లో ఏం విచారణ చేశారో చెప్పాలని పోలీసులను ఆదేశిస్తూ నేటికి విచారణను వాయిదా వేసింది. ఈరోజు మరోసారి విచారణకు రాగా.. గతంలో ఒకసారి ఇదే కేసులో రెండు రోజుల పాటు కస్టడీకి ఇవ్వటంతో తాజా పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది.

ఇక నకిలీ ఇళ్ల పట్టాల కేసులో వంశీకి మరోసారి రిమాండ్ పొడిగించింది కోర్టు. నకిలీ ఇళ్ల పట్టాల పంపిణీ కేసులో నేటితో (గురువారం) వంశీకి రిమాండ్ ముగిసింది. దీంతో వంశీని వర్చువల్‌గా న్యాయమూర్తి ఎదుట పోలీసులు హాజరుపర్చారు. ఈ క్రమంలో వంశీకి జూన్ 12 వరకు రిమాండ్ పొడిగిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. నూజివీడు కోర్టులో వంశీ మరో పిటిషన్ వేసారు.ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించడానికి అనుమతి ఇవ్వాలని వల్లభనేని వంశీ పిటిషన్‌లో కోరారు. అనారోగ్యంతో బాధ పడుతున్న కారణంగా ప్రైవేట్ ఆసుపత్రికి తరలించాలని పిటిషన్‌లో కోరారు. దీనిపై ఈరోజు విచారణ జరిపిన కోర్టు.. కౌంటర్ దాఖలు చేయాల్సిందిగా పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను వచ్చే నెల 2కు వాయిదా వేసింది.

**వంశీకి ముందస్తు బెయిల్‌ను హైకోర్టు మంజూరు**

వల్లభనేని వంశీకి ఎపి హైకోర్టులో ఊరట లభించింది. ఆయనకు ముందస్తు బెయిల్‌ను హైకోర్టు మంజూరు చేసింది. మైనింగ్ కేసులో ముందస్తు బెయిల్‌ను ఇచ్చింది. కాగా, వల్లభనేని వంశీ మెడికల్ బెయిల్ పిటిషన్‌పై కూడా హైకోర్టు విచారణ జరిపింది. అనారోగ్య కారణాలతో ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకోవడానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ వంశీ నూజివీడు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం, కౌంటర్ దాఖలు చేయాల్సిందిగా పోలీసులను ఆదేశిస్తూ, తదుపరి విచారణను జూన్ 2వ తేదీకి వాయిదా వేసింది.

## వారం - వర్జ్యం

తేది : 30-05-2025, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
జ్యేష్ఠ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, శుక్ల పక్షం
చవితి రా. 9.29
పునర్వసు రా. 9.34
వర్జ్యం తె.5.27-7.02
దు.ఉ.8.10-9.45, 2) మ.12.32-1.24
శుభసమయం : ఉ.7.15-7.50
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. శ్రమ పెరుగుతుంది. ఖర్చులు.

**వృషభం:** నూతన ప్రయత్నాలు ఫలిస్తాయి. కుటుంబంలో శుభకార్యాలు జరుగుతాయి. వస్తు, వస్త్రాలు కొనుగోలుచేస్తారు.

**మిథునం:** ఆస్తి వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

**కర్కాటకం :** బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

**సింహం:** వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. ఉద్యోగాలలో పదోన్నతులు, పదవీయోగం.

**కన్య :** దూర ప్రాంతాల నుండి శుభవార్తలు అందుకుంటారు. ఆర్థిక పరిస్థితి అనుకూలిస్తాయి.

**తుల :** సంఘంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. దూరప్రాంతాల నుండి విలువైన సమాచారం అందుకుంటారు.

**వృశ్చికం:** ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. కుటుంబ బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు.

**ధనుస్సు:** వ్యవహారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే.

**మకరం:** ఋణవత్తిడులు ఎదురై చికాకులు పెడతాయి. ఆకస్మిక ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి.

**కుంభం:** వృత్తి, వ్యాపారాలలో ఒడిదుడుకులు ఎదురై చికాకులు పెడతాయి. ధన వ్యయం.

**మీనం:** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



ఢిల్లీ లోక్‌నాయక్ ఆసుపత్రిలో జనిటిక్స్ వార్డు ప్రారంభించిన సందర్భంగా రోగికి పండ్లు అందజేసిన ఢిల్లీ సిఎం రేఖా గుప్తా

# విశాఖ- చెన్నై పారిశ్రామిక కారిడార్‌లో కొప్పర్తి నోడ్

## ప్రభుత్వ నోటిఫికేషన్ జారీ

**విజయవాడ,మే29,ప్రభాతవార్తప్రతినిధి:** కడప జిల్లాలోని కొప్పర్తి పారిశ్రామిక నోడ్‌ను విశాఖ- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా గుర్తిస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఏపీ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ యాక్ట్‌లో భాగంగా ప్రభుత్వం ఈ నోటిఫికేషన్ జారీ చేసింది. కడప జిల్లాలోని 6 మండలాల్లో విస్తరించిన కొప్పర్తి పారిశ్రామిక నోడ్ లోని 6740 ఎకరాల ప్రాంతాన్ని ఇక నుంచి విసిఐసి కారిడార్‌లో భాగం అవుతుందని ప్రభుత్వం పేర్కొంది. ఈ పారిశ్రామిక నోడ్ ద్వారా రూ. 17,310 కోట్ల పెట్టుబడులు ఆకర్షించేందుకు ఆవకాశం ఉన్నట్టు ప్రభుత్వం అంచనా వేసింది. అలాగే 1.76 లక్షల ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు వస్తాయని ప్రభుత్వం భావిస్తోంది.

# బెంగాల్‌కూ భాగస్వామ్యం

>> నుంచి వారికి విముక్తి లభించిందన్నారు. 2014లో కేవలం 14 కోట్ల ఎల్‌పిజి కనెక్షన్లుమాత్రమే ఉన్నాయని, ఇపుడు అవి 31 కోట్లకు పెరిగాయన్నారు. ఎల్పీజీ పంపిణీదారులు కేవలం 14వేలమంది మాత్రమే ఉండేవారని ఇపుడు 25 వేలకుపైగా పంపిణీ ఏజెన్సీలున్నాయన్నారు. ఊర్జాగంగా ప్రాజెక్టు ప్రాధాన్యతను ఈ సందర్భంగా ప్రస్తావించిన మోడీ గ్యాస్ ఆధారిత ఆర్థికవ్యవస్థను కూడా మనం పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. స్వచ్ఛ ఇంధన ఉత్పత్తి ద్వారా భారత్ ప్రపంచంలోనే అందుబాటుధరల్లో స్వచ్ఛ ఇంధనం అందించే దేశంగా నిలుస్తోందని ప్రకటించారు.

# 'డోజ్'నుంచి తప్పుకుంటున్న ఎలాన్‌మస్క్!

**వాషింగ్టన్, మే 29:** ప్రపంచ కుబేరుడు, టెస్లా సీఈవో, అమెరికా ప్రభుత్వంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియెన్సీ (డోజ్) శాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న ఎలాన్ మస్క్ సంచలనం నిర్ణయం తీసుకున్నారు. అధ్యక్షుడు ట్రంప్ పాలకవర్గం నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు తన సోషల్‌మీడియా ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ప్రత్యేక ప్రభుత్వ ఉద్యోగిగా నాషెడ్యూల్ ముగిసింది. ప్రభుత్వంలో వృథా ఖర్చులను తగ్గించే అవకాశం నాకు అవకాశం ఇచ్చినందుకు అధ్యక్షుడు డొనాల్ట్ ట్రంప్‌నకు కృతజ్ఞతలు తెలుపుతున్నా. డోజ్ మిషన్ భవిష్యత్తులో మరింత బలపడుతుందని ఎక్స్‌లో చేసిన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఇటీవల ట్రంప్ ప్రభుత్వం రూపొందించిన బిల్లుపై ఎలాన్ మస్క్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ బిల్లుకు అధిక బడ్జెట్ కేటాయించాల్సి వస్తుండడం వల్ల ప్రభుత్వ ఖర్చులు తగ్గించాలనే డోజ్ ఆశయాలకు విరుద్ధంగా ఉందని ఇటీవల జరిగిన ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ఇప్పటి వరకు డోజ్ తీసుకున్న చర్యలు ఈ నిర్ణయంతో వృథా అవుతాయని పేర్కొన్నారు. ట్రంప్ రూపొందించిన ఈ బిల్లులో పన్నుకోతలు, ఇమ్మిగ్రేషన్ అమలు వంటి పలు అంశాలు ఉన్నాయి. ప్రభుత్వ సలహాదారుగా ఉన్న ఎలాన్ మస్క్ త్వరలోనే ఆ బాధ్యతల నుంచి వైదొలగనున్నట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. అవి ఫేక్ వార్తలంటూ ఎలాన్ మస్క్ గతంలో కొట్టిపారేశారు.

అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రభుత్వంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన డోజ్ విభాగానికి ఎలాన్ మస్క్‌ను సారథిగా నియమించారు. ప్రభుత్వ వ్యవస్థలో సమూల మార్పులు, శాఖల్లో వృథా ఖర్చులు తగ్గించడమే లక్ష్యంగా ఈ డోజ్ విభాగం పని చేస్తుంది. ఆ తర్వాత వివిధ శాఖల్లో వేలాది మంది ఉద్యోగులను తొలగించే ప్రక్రియను చేపట్టారు. ఉద్యోగులను తొలగించే ఈ క్రమంలో మస్క్ తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ట్రంప్ యంత్రాంగాన్ని ఎలాన్ మస్క్ వెనకుండి నడిపిస్తున్నారనే ఆరోపణలుకూడా వచ్చాయి. ఈ నేపథ్యం లోనే శ్వేతసౌధం స్పందిస్తూ ట్రంప్ సలహాదారుడిగా మాత్రమే మస్క్ ఆ బాధ్యతలు చూస్తున్నారని వెల్లడించింది.

# పాక్‌లో అణుపరీక్షల వార్షికోత్సవ ర్యాలీ

## నిర్వహించిన పాకిస్థాన్ మర్కజీ ముస్లిం లీగ్..

**ఇస్లామాబాద్, మే 29:** పాకిస్థాన్‌లో నిర్వహించిన ర్యాలీలో లష్కరే తోయిబా ఉగ్రవాది, పహల్గాం ఉగ్రదాడి మాస్టర్‌మైండ్ సైఫుల్లా కసూరీ పాల్గొన్నాడు. దేశ అణుపరీక్షల వార్షికోత్సవం సందర్భంగా పాకిస్థాన్ మర్కజీ ముస్లింలీగ్ ఆధ్వర్యంలో దీనిని నిర్వహించారు. లాహోర్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో పంజాబ్ అసెంబ్లీ ప్రావిన్షియల్ స్పీకర్ మాలిక్ అహ్మద్ ఖాత్‌తో కలిపి అతడు వేదిక పంచుకోవడం గమనార్హం. ఈ ర్యాలీలో భారత వ్యతిరేక నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కసూరీ మాట్లాడుతూ తనను పహల్గాం ఉగ్రదాడికి మాస్టర్‌మైండ్‌గా నిందించడంతో ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఫేమస్ అయ్యాను అని వ్యాఖ్యానించాడు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత్ దాడిలో మరణించిన ఉగ్రవాది ముదస్సిర్ అహ్మద్ పేరిట పంజాబ్ ప్రావిన్స్‌లోని అల్లాహాబాద్‌లో పలు నిర్మాణాలు చేపడతానని చెప్పాడు. ఇదే ర్యాలీలో లష్కరే తోయిబా వ్యవస్థాపకుడు హాఫీజ్‌సయీద్ కుమారుడు మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది తల్హా సయీద్ కూడా పాల్గొన్నారు. అతడు కూడా భారత వ్యతిరేకతను పెంచేలా ప్రసంగించాడు.

# అనుమతించిన ఎసిబి కోర్టు

>> సిట్ అధికారులు పిటిషన్ దాఖలు చేసింది. ఈ కేసులో నిందితులు కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డిని మూడు రోజులు.. అలాగే ధనుంజయ రెడ్డి, కృష్ణ మోహన్ రెడ్డి, బాలాజీ గోవిందప్పలను వారం రోజుల పాటు తమ కస్టడీకి అప్పగించాలంటూ పిటిషన్‌లో పేర్కొన్నారు. పిటిషన్‌పై వాదనలు పూర్తికావడంతో ఎసిబి కోర్టు నేడు తీర్పును వెల్లడించింది. నలుగురు నిందితులను రెండు రోజులపాటు కస్టడీకి అనుమతించింది. రేపు, ఎల్లుండి ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విచారించేందుకు సిట్ అధికారులకు అనుమతించింది. ఎపి లిక్కర్ స్కాంపై పూర్తిగా దర్యాప్తు చేయాలని కూటమి ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేసింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగానే కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డిని అరెస్ట్ చేశారు. అతడు చెప్పిన వివరాలు ఆధారంగా తర్వాత విశ్రాంతి ఐఎఎస్ అధికారి ధనుంజయ్ రెడ్డి, మాజీ సిఎం జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డిలతోపాటు బాలాజీ గోవిందప్పను పోలీసు అధికారులు అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. అయితే, వీరిని తమ విచారణకు అప్పగించాలంటూ సిట్ అధికారులు ఎసిబి కోర్టును ఆశ్రయించారు. అయితే, ఇప్పటికే కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డిని సిట్ అధికారులు ఒకసారి కస్టడీకి తీసుకుని విచారించారు. అయితే, మరోసారి అతడిని తమ కస్టడీకి అప్పగించాలంటూ సిట్ అధికారులు కోర్టులో పిటిషన్ దాఖలు చేయడంతో నిందితులను రెండు రోజుల కస్టడికి అనుమతించింది.

# తేజశ్వని ట్రిపుల్‌ఐటి ప్రవేశానికి అనుమతి

>> పెట్టుకోగా 96 మార్కులు వచ్చాయి. ఈ అంశం మీడియా ద్వారా వెలుగులోకి రావడంతో జిల్లా విద్యాశాఖాధికారులు వెంటనే స్పందించారు. వారి ఆదేశాల మేరకు మండల విద్యాధికారి జ్యోతి నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్‌తో ఫోన్ ద్వారా మాట్లాడి విషయాన్ని వివరించడంతో ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ నెల 20తో ఆ సంస్థలో ప్రవేశానికి దరఖాస్తుకు గడువు ముగిసినా బాధిత విద్యార్థినికి అవకాశం కల్పించారు.పదో తరగతి పబ్లిక్ పరీక్షల మూల్యాంకనంలో జరిగిన తప్పిదాల కారణంగా ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోలేకపోయిన విద్యార్థులు జూన్ 2, 3 తేదీల్లో దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకుడు శ్రీనివాసులురెడ్డి తెలిపారు. సవరించిన మార్కుల మెమోతో పాటు దరఖాస్తు చేసుకునేందుకు అనుమతిస్తున్నట్లు వెల్లడించారు.

మార్కుల తప్పిదాలకు బాధ్యులైన సహాయక పరీక్షల అధికారి, ప్రత్యేక సహాయకులపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటి వరకు 64,251 పునఃపరిశీలన దరఖాస్తులు రాగా, అందులో 2,112 రీకౌంటింగ్‌కు వచ్చాయన్నారు. వీటిని ప్రాధాన్యత క్రమంలో పరిశీలిస్తున్నామని తెలిపారు. జూన్ 1కి ఈ ప్రక్రియ పూర్తవుతుంది. మూల్యాంకనం సమయంలో 4 వరసల మార్కుల నమోదు విధానంలో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ వరసలను చేర్చకపోవడంతో తప్పులు జరిగినట్లు గుర్తించామని ఆయన వివరించారు. ఈ ఏడాది జరిగిన పదో తరగతి పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనంలో పలువురు విద్యార్థులు నష్టపోయేలా ఒకటి, రెండు చోట్ల జరిగిన తప్పిదాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. రీ వాల్యూయేషన్, రీ కౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకున్న తర్వాత విద్యార్థుల మార్కుల్లో వ్యత్యాసం కనిపించడాన్ని తీవ్ర తప్పిదంగా ఆయన పరిగణించారు. నష్టపోయిన విద్యార్థులకు ఇంటర్మీడియట్ ప్రవేశాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. తప్పిదానికి బాధ్యులైన అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుని, వెంటనే నివేదిక సమర్పించాలని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంస్కరణలు తీసుకురావాలని చెప్పారు.

# భగవద్గీత సారాంశాన్ని పిల్లలు, యువతకు అర్ధవంతంగా అందించాలి



**తిరుమల,మే 29ప్రభాతవార్తప్రతినిధి:** సనాతన ధర్మాన్ని విస్తృతంగా ప్రచారం చేయడంలో భగవద్గీత సారాంశాన్ని పిల్లలు,యువతకు అర్ధవంతంగా అందించేందుకు చర్యలు తీసుకోవాలని టిటిడి ఇఒజె.శ్యామలరావు అధికారులకు సూచించారు. హిందూ ధర్మం విశిష్టత,ధార్మిక, ఆధ్యాత్మిక ,మానవీయత,నైతిక విలువల గురించి యువతకు తెలియజేసేలా కార్యక్రమాలు రూపొందించాలన్నారు. మతమార్పిడులకు అడ్డుకట్టవేసేలా ధార్మిక కార్యక్రమాలను తయారుచేయాలని ఇఒ ధార్మికప్రాజెక్టుఅధికారులకు తెలిపారు. గురువారం సాయంత్రం పద్మావతిఅతిధిగృహంలో హెచ్‌డిపిపి, శ్రీనివాసకల్యాణంప్రాజెక్టు, అన్నమాచార్యప్రాజెక్టు,ఎస్వీరికార్డింగ్‌ప్రాజెక్ట్, పురాణ ఇతిహాస్ ప్రాజెక్ట్, ఎఫిక్‌స్టడీస్ తదితర ప్రాజెక్ట్ అధికారులతో సమీక్షసమావేశం ఇఒ శ్యామలరావు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని విస్తృతంగా క్షేత్రస్థాయికి తీసుకెళ్ళేలా ప్రణాళికలు తయారుచేయాలన్నారు. విద్యార్థుల్లో దైవభక్తి, నైతిక విలువలు, క్రమశిక్షణ,ఉమ్మడికుటుంబ వ్యవస్థ తదితర అంశాలపై యువతకు శిక్షణ ఇచ్చేలా ఇప్పటినుండే ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. రాష్ట్రంలో భజనమందిరాలు ఇప్పటివరకు ఎన్ని పూర్తయ్యాయి, చివరిదశలో ఎన్ని ఉన్నాయో సమగ్ర నివేదిక అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. హిందూ ధార్మిక ప్రచార పరిషత్ ద్వారా ఇప్పటివరకు అమలుచేసిన కార్యక్రమాలను సమీక్షించుకుని మరింత నాణ్యంగా,అందరికీ అందుబాటులో ఉండే విధంగా కార్యక్రమాలను అమలుచేసేందుకు కార్యాచరణ తయారుచేయాలన్నారు. పచ్చదనాన్ని మరింత పెంచేలా శ్రీవారి దర్శనార్థం వచ్చి తిరిగి వెళ్ళు భక్తులద్వారా గ్రీనరీని ప్రోత్సహించే విధంగా 'శ్రీవారి వననిది"ద్వారా ఒక మొక్కను ఇచ్చే అంశాన్ని పరిశీలించాలన్నారు. టిటిడి వెబ్‌సైట్‌లోని ప్రత్యేక యూట్యూబ్ ఛానల్‌లో తాళ్ళపాక అన్నమాచార్య సంకీర్తనలు అన్నిటినీ ఒకేచోట ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అన్నమయ్య సంకీర్తనలలో ఇప్పటికే బాగా పాపులర్ అయిన వాటిని ముందుగా పొందుపరచిన ,దశలవారీగా అన్ని సంకీర్తనలను అందులో పొందుపరచాలని ఇఒసూచించారు. 32వేల అన్నమయ్య సంకీర్తనలలో 14,932 సంకీర్తనలు లభ్యమయ్యాయన్నారు. అందులో ఇప్పటివరకు ఎన్ని సంకీర్తనలు రికార్డుచేశారనేది తెలుసుకున్నారు. అన్నమయ్య కీర్తనలు ప్రత్యేక వెబ్‌సైట్ పేజీలో అప్‌లోడ్‌చేసిన కీర్తనలు గురించి సమాచారం రాబట్టారు. టిటిడి ముద్రించిన పుస్తకాలను బుక్‌స్టాల్స్‌లో లభ్యం అయ్యేలా చూడాలని ఇఒ శ్యామలరావు అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో టిటిడిజెఇఒ వీరబ్రహ్మం, డిపిపి కార్యదర్శి శ్రీరామ్‌రఘునాథ్, ప్రత్యేక అధికారి రాజగోపాల్, అదనపు కార్యదర్శి శ్రీరామ్‌గోపాల్, అన్నమాచార్యప్రాజెక్టు ప్రత్యేక అధికారి మేడసాని మోహన్, డైరెక్టర్ లత, డిపిపి ప్రత్యేక అధికారి బిఆర్ రామానందతీర్థాచార్యులు, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి పాల్గొన్నారు.

# అంతర్జాతీయ యోగా దినోత్సవ నిర్వహణకు నోడల్ అధికారిగా కృష్ణబాబు

## పలువురు ఐఏఎస్,ఐపిఎస్ అధికారులకు వివిధ భాధ్యతలు

**విజయవాడ,మే28,ప్రభాతవార్తప్రతినిధి:** విశాఖలో జూన్ 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ప్రధాని మోడీ హాజరుకానుండటంతో… ఈ కార్యక్రమానికి సంబంధించి వివిధ భాధ్యతలను పలువురు ఐఎఎస్,ఐపిఎస్ అధికారులకు అప్పగిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం కార్యక్రమానికి నోడల్ అధికారిగా..వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు వ్యవహరిస్తారు. జిల్లా అడ్మినిస్ట్రేషన్‌కు సంబంధించి కార్యక్రమ ఇన్చార్జిగా విశాఖ కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్,కార్యక్రమ షెడ్యూల్ రూపకల్పన తదితరాలు జీఏడీ ముఖ్య కార్యదర్శి(ప్రోటోకాల్)ముకేష్‌కుమార్ మీనా,విద్యాశాఖ పరంగా పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్,సాంకేతిక అంశాలకు సంబంధించి ఐటీశాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్,కోచ్‌లు,అథ్లెట్లు,యోగా ట్రైనర్లను సమీకరించడం వంటి భాధ్యతలు క్రీడలు,యువజన సంక్షేమ శ్ఫాఖ కార్యదర్శి వినయ్‌చంద్‌కు అప్పగించారు. ప్రచార కార్యక్రమాలకు పౌర సంబంధాల శాఖ కమీషనర్ హిమాన్షు శుక్లా,వైద్యపరమైన సహకారం కోసం ఆరోగ్య శాఖ కమీషనర్ వీరపాండ్యన్,వైద్య విద్య డైరెక్టర్ నరసింహం,సెకండరీ హెల్త్ సంచాలకులు సిరి,ఆయుష్ డైరెక్టర్ దినేష్‌కుమార్,బీచ్ రోడ్,యోగా దినోత్సవ వేదిక నిర్వహణ భాధ్యత వీఆర్ఆర్‌డీఏ కమీషనర్ కేఎస్ విశ్వనాథన్‌కు,వేడుకకు వచ్చే ప్రజలకు తగిన సదుపాయాలు కల్పించే భాధ్యత బిసీ సంక్షేమ శాఖ సంచాలకులు మల్లిఖార్జునకు,ఆహారం,త్రాగునీరు వంటివి కల్పించే బాధ్యత ఏపీఎస్‌సీఎస్ఎల్ ఎండీ మనజీర్ జిలానీ సమూన్‌కు ఇచ్చారు.పారిశుద్ధ్యం లైటింగ్,సుందరీకరణ భాధ్యతలు జీవీఎంసీ కమీషనర్‌కు,ఎయిర్‌పోర్ట్ అడ్మినిస్ట్రేషన్ అంశాలు విశాఖ ఎయిర్‌పోర్టు డైరెక్టర్‌కు,హెలిప్యాడ్ వంటివి ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ నిశాంత్‌కుమార్‌కు అగ్నిమాపక యంత్రాలు,పరికరాలు సమకూర్చడం వంటివి రాష్ట్ర విపత్తు,అగ్నిమాపక శాఖ డీజీకి,సెక్యూరిటీ ప్రొటోకాల్,భద్రతా ఏర్పాట్లు విశాఖ పోలీస్ కమీషనర్‌కు,రహదారుల పనులు ఆర్ అండ్ బీ ఈఎన్‌సీకి,వీవీఐపీ ప్రొటోకాల్ వాహనాలు,ప్రజలు వేడుకకు హాజరయ్యేందుకు వాహనాలు సమకూర్చే భాధ్యతను రవాణా

శాఖ కమీషనర్ మనీష్‌కుమార్ సిన్హాకు కేటాయించారు. పోలీస్ నోడల్ ఆఫీసర్‌గా లా అండ్ ఆర్డర్ అదనపు డీజీ మధుసూధనరెడ్డి,జిల్లా స్థాయిలో విశాఖ నగర పోలీస్ కమీషనర్ శంకబ్రతబాక్చి తదితరులకు భాధ్యతలు అప్పగించారు. 'యోగాంధ్ర-2025 క్యాంపయిన్ యాక్షన్ ప్లాన్'కు సంబంధించి రూపొందించిన మార్గదర్శకాలకు అనుగుణంగా సమర్ధంగా బాధ్యతలు నిర్వర్తించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆదేశించారు.

# విజయవాడ -ఖమ్మం గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే భూసేకరణ పనులు ప్రారంభం

**విజయవాడ,మే28,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ -ఖమ్మం గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే భూసేకరణ పనులు ప్రారంభమయ్యాయి, ఆ దిశలో అధికారులు కాయ్యచరణ చేపట్టారు, ఎన్టీఆర్ జిల్లా పరిధిలో 30 కి.మీ పొడవులో హైవే పనులు జరగనున్నాయి. దీనికోసం మొత్తం 329.30 ఎకరాల భూసేకరణ చేపట్టాలనేది ప్రతిపాదన. ఇప్పటికే 243.67 ఎకరాలు అధికారులు సేకరించారు. మరో 85.63 ఎకరాలు సేకరించాల్సి ఉంది. దీనిలో ప్రభుత్వ, అసైన్డ్ భూములు అధికంగా ఉండడంతో వాటి సేకరణ ప్రక్రియను పూర్తి చేసి మిగిలిన ప్రైవేటు పట్టా భూములపై దృష్టి సారిస్తామని అధికారులు చెప్తున్నారు.

ఎన్టీఆర్ జిల్లాలోని గంపలగూడెం, జి. కొండూరు, విజయవాడ గ్రామీణ మండలాల్లో కలిపి 9,86,125 చ.మీ. భూసేకరణ చేస్తున్నారు. దీనిలో గంపలగూడెంలోని తునికపాడులో 36,704.98చ.మీ. సేకరిస్తున్నారు. ఆ తర్వాత జీ కొండూరు పరిధిలోని సున్నంపాడు, దుగ్గిరాలపాడు, గడ్డమనుగు, మునగపాడు, కొండూరు, పేత్రంపాడు, గంగినేనిపాలెం, తెలదేవరపాడు, చెరువుమాధవరం, పినపాక, కవులూరు మీదుగా విజయవాడ రూరల్ మండలంలోకి ఈ హైవే ప్రవేశిస్తుంది. ఈ గ్రామాలన్నింటిలోనూ భూసేకరణ జరుగుతోంది. విజయవాడ సమీపంలోని రాయనపాడు, పైడూరుపాడు మీదుగా వచ్చి జక్కంపూడి వద్ద వెస్ట్ బైపాస్‌కు ఈ రోడ్డును కలుపుతారు. ఈ 3 ప్రాంతాల్లోనూ భూసేకరణ చేపడుతున్నారు.,విజయవాడ నాగపూర్ ఎకనమిక్ కారిడార్‌లో భాగంగా ఖమ్మం నుంచి చేపడుతున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు పూర్తయితే ఈ ప్రాంతం అభివృద్ధికి మరింత దోహదపడుతుంది. ఖమ్మం విజయవాడ మధ్య ప్యాకేజీ 01లో వీ వెంకటాయపాలెం నుంచి బ్రాహ్మణపల్లె వరకు 25 కి.మీ, ప్యాకేజీ 02లో బ్రాహ్మణచర్ల నుంచి రెమిడిచర్ల వరకూ 28 కి.మీ పనులు చాలా వేగంగా జరుగుతున్నాయి. ఎన్టీఆర్ జిల్లాలోకి ప్రవేశించాక రెమిడిచర్ల నుంచి జక్కంపూడి వరకూ చేపట్టాల్సిన ప్యాకేజ్ 03 పనులే చాలా జాప్యం జరిగాయి. భూసేకరణ ఆలస్యంగా జరగడంతో పనులు ప్రారంభం కాలేదు. మిగిలిన భూసేకరణను త్వరగా పూర్తి చేయలంటూ కలెక్టర్ లక్ష్మీశ తాజాగా అధికారులను ఆదేశించారు. ఖమ్మం - విజయవాడ మధ్య గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు 3 ప్యాకేజీల్లో చేపడుతుండగా ఇప్పటికే 2 ప్రారంభమయ్యాయి. ఖమ్మం నుంచి ఎన్టీఆర్ జిల్లా మీదుగా 3వ ప్యాకేజీ పనులు ఆరంభించాల్సి ఉంది. దీని కోసం మిగిలిన భూసేకరణ త్వరగా పూర్తి చేస్తే పనులు ప్రారంభమవుతాయి. ఇప్పటికే పనులను మేఘా సంస్థ దక్కించుకుంది. ఖమ్మం జిల్లాలోని రెమిడిచర్ల నుంచి మొదలయ్యే ప్యాకేజ్ 03 గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు గంపలగూడెం మండలంలోని తునికిపాడు నుంచి ఎన్టీఆర్ జిల్లాలోకి ప్రవేశిస్తాయి. ఇక్కడి నుంచి ప్రస్తుతం భూసేకరణ జరుగుతోంది.

273.73ఎకరాల ప్రైవేటు భూములు: మొత్తం 329.30 ఎకరాల భూములు 30 కి.మీ రహదారి కోసం అవసరం. వీటిలో 273.73 ఎకరాలు ప్రైవేటు పట్టా భూములు ఉన్నాయి. వీటిలో ఇప్పటికే 243.67 ఎకరాలను అధికారులు సేకరించారు. ప్రస్తుతం మరో 30.6 ఎకరాలు మాత్రమే సేకరించాల్సి ఉంది. ఇవికాకుండా ప్రభుత్వ భూములు 32.74 ఎకరాలు, అసైన్డ్ భూములు 22.83 ఎకరాలు సేకరించాలి. మొత్తం 85.63 ఎకరాల భూసేకరణ పూర్తి అయితే ఈ హైవే పనులకు పూర్తి స్థాయి అవకాశం చిక్కుతుంది.

# జూన్ నుండి రేషన్ షాపుల ద్వారా నిత్యావసర వస్తువుల పంపిణీ

## రాష్ట్రంలో బియ్యం మాఫియా అనేది లేకుండా చేసేందుకే : మంత్రి నాదెండ్ల మనోహర్



ఈపోస్ మిషన్, ఎలక్ట్రానిక్ కాటా పని తీరును పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల

**విజయవాడ,మే 29,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో బియ్యం మాఫీయా అనేది లేకుండా చేసేందుకే జూన్ ఒకటి నుంచి రేషన్ షాపుల ద్వారా నిత్యావసర వస్తువుల పంపిణీ చేపడుతున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. 29,760 రేషన్ డిపోల ద్వారా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, అలాగే సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సరుకుల పంపిణీ జరుగుతుందన్నారు. విజయవాడ మధురానగర్ లోని 218వనెంబరు రేషన్ షాపుల్లో సరుకుల పంపిణీ ట్రయల్ రన్ అధికారులు నిర్వహించారు. మంత్రి నాదెండ్ల మనోహర్, పౌరసరఫరాల శాఖ కమీషనర్ సౌరభ్ గౌర్ లు ఈపోస్ మిషన్, ఎల్కట్రానిక్ కాటా పని తీరును పరిశీలించారు. గత ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ పేరుతో వేల కోట్లు దుర్వినియోగం అయ్యేలా చేశారని మంత్రి మండిపడ్డారు.అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో యుండియు వాహనం ఎపుడు వస్తుందో వెళుతుందో తెలియని దుస్తితి ఉందని దీంతో కార్డుదారులు రేషన్ కోసం వాహనం కోసం రోడ్ల మీద తిరగాల్సిన పరిస్థితి ఉందని ఇపుడు కార్డుదారులకు ఆ కష్టాలు ఉండవని చెప్పారు. నెలలో ఒకటో తేది నుండి 15వ తేది వరకు ఉదయం 8 నుండి మద్యహ్నాం 12 వరకు సాయంత్రం నాలుగు నుండి 8 గంటల వరకు రేషన్ దుకాణంలో సరుకులు తీసుకోవచ్చుని చెప్పారు.65 సంవత్సరాలు దాటిన ఒంటరి వృద్ధులు, వికలాంగులు, భార్యభర్తలు ఇద్దరు వృద్దులైన వారి జాబితాలు రేషన్ షాపుల వారికిగా సిద్ధం చేశామని వారికి 1 నుండి 5వ తేదీలోగా డీలర్ ఇంటికి వెళ్లి రేషన్ సరుకులు ఇస్తారని చెప్పారు. ఇల్లు మారి వేరే ప్రాం తాలకు వెళ్లిన వారికి కూడా పోర్టబిలిటీ విధానం ద్వారా సమీప రేషన్ దుకాణంలో రేషన్ పొం దవచ్చుని చెప్పారు.రేషన్ దుకాణాలలో అవినీతి జరగ కుండా ప్రభుత్వం సరికొత్తయాప్ను రూపొం దించిందని చెప్పారు. ఈ యాప్లో డీలర్ వివరాలు ఫోటోతో సహా వస్తాయన్నారు. యంఎల్ఎస్ పాయంట్ నుండి సరుకు ఎంత వచ్చింది. కార్డుదారులకు ఎంత పంపిణీ చేశారనే వివరాలు, రేషన్ దుకాణం వద్ద జనం ఎక్కువ మంది ఉన్నా వెంటనే ఈ యాప్ ద్వారా తెలుస్తుందన్నారు.

# హైకోర్టుల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల

**విజయవాడ,మే29,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్‌లో ఖాళీగా ఉన్న,నూతనంగా అవసరమైన ఉద్యోగాల భర్తీకి నిర్ణయించింది.హైకోర్టుల్లో ఖాళీగా ఉన్న 245 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. వివిధ కేటగిరిలలో రెగ్యులర్ బెస్‌లో 242 పోస్టులు అలాగే కాంట్రాక్ట్ పద్దతిలో 3 పోస్టులను భర్తీ చేయనుంది. ఈ మేరకు న్యాయశాఖ కార్యదర్శి జి. ప్రతిభాదేవి ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీలో ఉద్యోగ నియమాకాలు నెమ్మదిగా ఊపందు కుంటున్నాయి. ఇప్పటికే 16,347 పోస్టులతో ఏపీ డీఎస్సీ నోటిఫికేషన్ 2025 విడుదల చేసిన సంగతి తెలిసిందే. అలాగే.. రాష్ట్రంలోని పలు జిల్లా కోర్టుల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకై ఇటీవల కూటమి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 1620 ఉద్యోగాలను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇచ్చింది. అయితే..తాజాగా, ఏపీ హైకోర్టులో ఖాళీగా ఉన్న 245 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలకు అధికారిక వెబ్‌సైట్ చూడొచ్చు.



మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి సూర్యకుమారిని కలిసిన మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శైలజ

**విజయవాడ,మూ28,ప్రభాతవార్తప్రతినిధిశ** ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శిని సూర్యకుమారి మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంలో ఇరువురూ మహిళా కమిషన్ కు సంబంధించిన విధివిధానాల గురించి చర్చించారు.ఈ సందర్భంలో సూర్యకుమారి ఆంధ్రప్రదేశ్ లోని పరిశ్రమలలో పనిచేయుచున్నటువంటి మహిళా కార్మికులకు సంబంధించి వారి పని ప్రదేశంలో ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులు, మొదలగు సమస్యల పట్ల స్పందించుటకు అంతర్గత ఫిర్యాదులు కమిట్టీలు ఏర్పాటు చేయవలసిందిగా చైర్‌పర్సన్ కోరటం జరిగింది. మహిళా కమిషన్ భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక మొదలగు అంశాలపై చర్చలో ప్రస్తావనకు వచ్చింది.

# నాయుడు పేటలో ప్రేమజంట ఆత్మహత్య ..

**నాయుడుపేట మే 29 ప్రభాతవార్త;** తిరుపతి జిల్లా నాయుడుపేట పట్టణంలోని ఓ లాడ్జిలో జమ్మల సుబ్రమణ్యం(35), శిరీష(29)అనే ప్రేమజంట అనుమానాస్పదంగా మృతిచెందిన సంఘటన గురువారం జరిగింది.పోలీసుల సమాచ్చారం మేరకు వివరాలిలా ఉన్నాయి .దొరవారిసత్రం మండలం కుప్పారెడ్డిపాళెం గ్రామానికి చెందిన జమ్మల సుబ్రమణ్యం,శిరీషలు కలిసి నాయుడుపేట పట్టణంలోని లాడ్జిలో రూమ్ తీసుకొన్నారు.సాయంత్రమైన రూమ్‌లోనుండి ఎవరు బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన లాడ్జి సిబ్బంది తలుపులుతీసి చూసేసరికి రూమ్‌లో ఆ ప్రేమ జంట అనుమానాస్పదంగా ప్యాన్‌కు ఉరివేసుకొని మృతిచెంది ఉండటాన్ని గుర్తించి నాయుడుపేట పోలీసులకు సమాచారం మిచ్చారు. పోలీసులు లాడ్జివద్దకు చేరుకొని మృతదేహాలను పరిశీలించారు.అనంతరం పంచ నామా నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు

# బీహార్ ప్రత్యేక రైళ్లు పొడిగింపు

**గుంతకల్లు రైల్వే,మే 29,ప్రభాతవార్త** తెలుగు రాష్ట్రాల నుంచి బీహార్ మధ్య రాకపోకలు సాగించే రైలు సర్వీసులను ప్రయాణికుల సౌకర్యార్థం పొడిగించినట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. ప్రతి శనివారం చర్లపల్లి నుంచి దానాపూర్‌కు బయలుదేరే నెంబర్ 07419రైలును ఈ నెల 31నుంచి జూన్ 28వరకు ప్రతి సోమవారం దానాపూర్ నుంచి చర్లపల్లికు బయలుదేరే నెంబర్ 07420రైలును జూన్ 2నుంచి 30వరకు పొడిగించారు. ప్రతి బుధవారం చర్లపల్లి నుంచి పాట్నాకు బయలుదేరి వెళ్లే నెంబర్ 07255రైలును జూన్ 4నుంచి జూలై 30వరకు పొడిగించడంతో పాటు, ప్రతి శుక్రవారం చర్లపల్లి నుంచి పాట్నాకు బయలుదేరే నెంబర్ 07256రైలును జూన్ 6 నుంచి ఆగస్టు 1వరకు ప్రతి సోమ, బుధవారాల్లో పాట్నా నుంచి చర్లపల్లికు బయలుదేరే నెంబర్ 03253రైలును జూన్ 2నుంచి జూలై 30వరకు అలాగే ప్రతి ఆది,సోమవారాల్లో దానాపూర్ నుంచి బెంగళూరు బయలుదేరే నెంబర్ 03251రైలును ప్రతి మంగళ,బుధవారాల్లో బెంగళూరు నుంచి దానాపూర్‌కు బయలుదేరే నెంబర్ 03252రైలును జూన్ 3నుంచి జూలై 1వరకు ప్రతి మంగళవారం దానాపూర్ నుంచి బెంగళూరుకు బయలుదేరే నెంబర్ 03259రైలును జూన్ 3నుంచి 24వరకు ప్రతి గురువారం బెంగళూరు నుంచి దానాపూర్ వెళ్లే నెంబర్ 03260రైలును జూన్ 5నుంచి 26వరకు ప్రతి శనివారం యశ్వంత్‌పూర్ నుంచి గయాకు బయలుదేరే నెంబర్ 06563ప్రత్యేక రైలును జూన్ 21నుంచి 28వరకు ప్రతి సోమవారం గయా నుంచి యశ్వంత్‌పూర్‌కు బయలుదేరే నెంబర్ 06564రైలును జూన్ 23నుంచి 30వరకు పొడిగించారు.

# తిరుమల సమాచారం

## జూన్ 2నుండి బ్రహ్మోత్సవాలు

### - గోవిందరాజస్వామి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



**తిరుమల,మే 29ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలతిరుపతిదేవస్థానమ్ ఆధ్వర్యంలోని తిరుపతిలో శ్రీగోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు జూన్ 2వతేదీ నుండి 10వతేదీ వరకు కన్నులపండువగా జరగనున్నాయి. ఈ బ్రహ్మోత్సవాలకు తొలి ఘట్టంగా గురువారం ఉదయం ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. ఉదయం 6.45గంటలకు స్వామి సన్నిధితోబాటు ఆలయప్రాంగణంలోని ఇతర ఆలయాల గోడలు,పైకప్పు,పూజాసామాగ్రి, తదితర వస్తువులను నీటితో శుద్ధిచేశారు. అనంతరం నామకోపు,శ్రీచూర్ణం, కస్తూరి, పసుపు, పచ్చాకు,గడ్డకర్పూరం, గంధంపొడి, కుంకుమ,.కిచిలీగడ్డతదితర సుగంధ్రద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణంచేశారు. భక్తులను దర్శనానికి అనుమతించారు. గోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు జూన్ 1వతేదీ ఆదివారం సాయంత్రం సేనాధిపతి ఉత్సవం,అంకురార్పణతో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుడతారు.జూన్ 2వతేదీ సోమవారం ఉదయం ధ్వజారోహణం,రాత్రి పెద్దశేషవాహనం, 4వతేదీ ఉదయం సింహవాహనం, 6వతేదీ రాత్రి గరుడవాహనం, 7న రాత్రి గజవాహనం, జూన్ 9న ఉదయం రథోత్సవం, 10న ఉదయం చక్రస్నానంతో ముగుస్తాయి.

## వెంకన్న దర్శనానికి కొనసాగుతున్న భక్తుల రద్దీ



**తిరుమల,మే29ప్రభాతవార్తప్రతినిధి:** వేసవిసెలవులు ముగింపుకు చేరుకుంటున్న సమయంలో కలియుగవైకుంఠం తిరుమల భక్తజనసంద్రంగా కొనసాగుతోంది. వారాంతంలోనేగాక సాధారణరోజుల్లోనూ తిరుమలలో భారీగా భక్తులు ఉంటున్నారు. గురువారం ఉదయానికి వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లలోని కంపార్టుమెంట్లు అన్నీ నిండి పోయి భక్తులు వెలుపల రెండు కిలోమీటర్ల క్యూలైన్లలో బారులుతీరారు. దీంతో స్వామివారి సర్వదర్శనానికి 18గంటలు సమయం పడుతుండగా ప్రత్యేక ప్రవేశ దర్శనానికి ఆరేడుగంటలపైగానే భక్తులు నిరీక్షిస్తున్నారు.గదులు దొరకని భక్తులు ఆరుబయట, పార్కుల్లో, షెడ్లలో తలదాచుకుని విశ్రాంతి పొందుతున్నారు. సాయంత్రం వరకు 47వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. ఇంకా 25వేలమంది భక్తులు అర్ధరాత్రివరకు దర్శనం చేసుకునే వీలుందని టిటిడి వర్గాలు తెలిపాయి. ఆలయ ద్వారం వద్ద భక్తుల రద్దీ విపరీతంగా ఉంది.

## శ్రీవారి ఆశీస్సులతో ప్రజలకు శుభాలు



**తిరుమల,మే 29ప్రభాత వార్తప్రతి నిధి:** కలియుగ ప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో ప్రజలకు శుభాలు కలగాలని స్వామి వారిని ప్రార్థించినట్లు ఎస్సీ కమిషన్ జాతీయ సభ్యుడు హుస్సేన్‌నాయక్, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. గురువారం ఉదయం విఐపి బ్రేక్‌లో కుటుంబంతో వీరిరువురూ వేర్వేరుగా స్వామివారిని దర్శించుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# ప్రభుత్వాసుపత్రిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

**గుంతకల్లు, మే 29 ప్రభాతవార్త** జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ గుంతకల్లు పట్టణంలోని ప్రభుతాసుపత్రిలో బుధవారం రాత్రి 11.30 గంటల సమయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఒకే ఒక్కడు సినిమా తరహాలో మారువేషంలో వచ్చి ఆసుపత్రిలో కలియ తిరిగారు. మెడలో టవల్ వేసుకుని, ముఖానికి మాస్కు ధరించి చెప్పులు, అంగరక్షకులు కూడా లేకుండా ఆసుపత్రిలో కలియ తిరుగుతూ రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఓ ప్రైవేట్ ఫంక్షన్‌కు వెళ్లి తిరిగి వెళుతూ

వాహనాలను, సిబ్బందిని దూరంగా వుంచి ఒక్కడే ఆసుపత్రిలోనికి వెళ్లి రోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఘటన సోషల్ మీడియాలో వైరల్ అవుతుండడంతో చర్చనీయాంశంగా మారింది. దీంతో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.

# విద్యుదాఘాతానికి గద్వాల్ యువకుడు మృతి

**పుంగనూరు రూరల్(చిత్తూరు జిల్లా), మే 29, ప్రభాతవార్త** పొట్టకూటి కోసం గద్వాల జిల్లా మనపాడు గ్రామం నుంచి వచ్చి కూలి పనులు చేసుకుంటున్న ఒక యువకుడు విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందిన సంఘటన మండలంలో జరిగింది. మంగళం పంచాయతీ కంగా నెల్లూరు గ్రామ సమీపంలో హంద్రీనీవా పుంగనూరు బ్రాంచ్ లైనింగ్ పనుల గురువారం సర్వే నిర్వహించారు. గద్వాల్ జిల్లా మనప్పాడు గ్రామానికి చెందిన వెంకటరాముడు కుమారుడు జస్వంత్ (25)సర్వే స్టాంపర్ పట్టుకొని సర్వే నిర్వహిస్తుండగా సర్వే స్టాంపర్ హై టెన్షన్ విద్యుత్ తీగలు తగిలి ఘాతానికి గురై జస్వంత్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది. ఘటన గురువారం మధ్యాహ్నం ఒక గంటకు వెలుగులో వచ్చింది.

# చీటి కడితే బంగారం ఇస్తా! పత్తాలేకుండా పోయిన జిత్తులమారి

**విజయవాడ,మే29,ప్రభాతవార్తప్రతినిధి:** కొత్త తరహా చీటీ పాటల పేరుతో పలువురు సామాన్య మధ్య తరగతి జనాన్ని నిలువున ముంచి పత్తా లేకుండా పోయాడో జిత్తుల మారి. చీటీలో చేరి పాడుకున్న వారికి బంగారం బిస్కెట్ ఇస్తానంటూ ఆశ చూపి నిలువునా చీట్టిదారుల కొంపముంచావు. తాము మోసపోయామంటూ బాధితులంతాపోలీసులను ఆశ్రయించారు. విజయవాడ, అయోధ్యనగర్‌కు చెందిన ముచ్చర్ల శ్రీనివాస్ లోటస్ ల్యాండ్ మార్క్ సెక్టర్1లో నివాసం ఉంటున్నారు. గతంలో శ్రీనివాస్ పచ్చళ్ల వ్యాపారం చేసేవారు. స్థానికులతో మంచిగా పరిచయాలు ఏర్పడ్డాయి. పెద్ద ఎత్తున వ్యాపారం చేస్తుండడంతో స్థానికులంతా నమ్మారు. చీటీలు వేసి అందరికీ సకాలంలో సొమ్ము చెల్లించేవాడు. అనం తరం బంగారం బిస్కెట్ల పేరుతో పలు రకాల పథకాలు పెట్టి అందరినీ ఆకర్షించాడు. బంగారం ధర రోజు రోజుకు పెరుగుతోందని, తాను తక్కువ ధరకే బంగారం ఇస్తానని ఆశ చూపాడు. ఒక్కొక్కరు ప్రతి నెలా 5 గ్రాముల బంగారం ధర ఎంత ఉంటే అంత సొమ్ము కట్టాలంటూ చెప్పుకొచ్చాడు. ఇలా 25 మంది కడితే మొత్తం వచ్చిన 125 గ్రాములకు పాట పెడతానని, పాడుకున్న వారికి 125 గ్రాముల బంగారం బిస్కెట్ కొని ఇచ్చేస్తానని నమ్మబలికాడు. పాట పాడుకున్న వారు, తర్వాతి నెల నుంచి 5 గ్రాములతో పాటు అదనంగా మరో 3 గ్రాములకు చెల్లించాలని అన్నాడు. అంటే మొదటి నెలలో పాడుకున్న వారికి 125 గ్రాముల బంగారం వస్తే, రెండో నెలలో పాట పాడుకున్న వారికి 128 గ్రాముల బంగారం వస్తుంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన
సుమారు రూ.31.50 లక్షల విలువ గల 2 పనులకు నిట్ నెం. 13 టు 14/ఇ.ఇ/ఆర్ & బి/నరసరావుపేట/2025-26. తేది: 26.05.2025 ద్వారా టెండర్లు ఆహ్వానింపబడుచున్నవి. వివరములకు ఇ-మార్కెట్ ప్లేస్ అనగా www.apeprocurement.gov.in తేది: 02.06.2025, మ.3.00 గం.ల నుండి 16.06.2025, మ.3.00 గం.ల వరకు డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును.
సం/- కార్యనిర్వాహక ఇంజినీరు, (ర.భ) డివిజను, నరసరావుపేట
DIPR.No.16555/CL/Advt/1/1/2022-23, తేది: 29.05.2025

వార్త

జీవితం ఒక క్షేత్రం. దాని ఫలసాయం నీవు నాటే విత్తుల మీద ఆధారపడి ఉంటుంది.

-బీచర్

# విస్తరిస్తున్న అవయవ వ్యాపారం!

ఆశయం జీవితానికి విలువ నేర్పుతుంది. ఆశ ఆటపట్టిస్తుంది. అదే ఆశ మరో అడుగు ముందుకు వేసి అత్యాశగా మారి దురాశగా రూపాంతరం చెందితే సమాజంపై తీవ్ర ప్రభావం పడుతుంది. కష్టపడకుండా తెల్లవారేసరికి లక్ష్మీపుత్రులు కావాలనే దురాశతో కొందరు చేయరాని, చేయకూడని పనులు చేస్తున్నారు. ఈ డబ్బు సంపాదనలో మంచి, చెడు ఆలోచించడం లేదు. ఏమి చేసి అయినా డబ్బు సంపాదించాలనే ఆరాటం పెరిగిపోతున్నది. ఇదిఅది అని కాదు ఎక్కడబడితే అక్కడ డబ్బుసంపాదనే ధ్యేయంగా కొందరు చేయరాని, చేయకూడని పనులు చేయడానికి వెనుకాడడం లేదు. మానవ అవయవాలు, జీవితాలతో వ్యాపారం చేసే దుస్సంప్రదాయానికి తెగపడుతున్నారు. ఈ డబ్బు సంపాదన ఆరాటంలో రకరకాల మార్గాలను అనుసరిస్తున్నారు. ఏకంగా ఇన్సూరెన్స్ చేయించి ఆ తర్వాత వ్యక్తులను హతమార్చి డబ్బు ఖాజేసే ఘరానా కార్యక్రమం గతంలో వెలుగుచూసింది. ఆ మధ్య నిజామాబాద్ జిల్లాలో జరిగిన సంఘటన ఆశ్చర్యమే కాదు ఆవేదన కలిగించింది. రోజువారి నిరుపేద అయిన వ్యక్తికి ఏకంగా నలభైఐదు లక్షల రూపాయల ఇన్సూరెన్స్ చేయించారు. ఆ తర్వాత ప్రమాదంలో చనిపోయినట్లు రికార్డులు సృష్టించి ఇన్సూరెన్స్ డబ్బులను భోంచేసేందుకు రంగం సిద్ధం చేశారు. స్థానిక పోలీసులకు సందేహాలు తలెత్తడంతో మొత్తం కథ బయటపడింది. మనుషుల ప్రాణాలు అత్యంత కిరాతకంగా తీసిదాన్ని డబ్బుగా మార్చుకోవడం కంటే మరొకటి ఉండదేమో. ఇక మానవ అవయవాల వ్యాపారం కూడా తెలంగాణలో అటు ఆంధ్రప్రదేశ్‌లోనూ జరగనే జరుగుతున్నాయి. అప్పుడప్పుడు ఈ వ్యవహారం పోలీసుల దృష్టికి వచ్చినా నిర్దిష్టమైన చర్యలు తీసుకొని చరమగీతం పాడలేకపోతున్నారు. మరొక పక్క కిడ్నీల వ్యాపారం చాపకింద నీరులా విస్తరిస్తున్నది. ఎందరో అమాయకులు ముఖ్యంగా యువకులు బలైపోతున్నారు. శ్రీలంక రాజధాని కొలంబో కేంద్రంగా ఈ రాకెట్ కొనసాగుతున్న విషయం గతంలో బయటపడింది. విజయవాడ ప్రాంతంలో కూడా మరొక ముఠా పోలీసులు పట్టుకున్నారు. రోగికి అవసరమైన కిడ్నీ ఇచ్చే దాతలను రోగికి దగ్గర బంధువులు అంటూ నకిలీ పత్రాలు సృష్టించి సంబంధిత అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసికిడ్నీలు అమ్మేఇద్దరు వ్యక్తులు గతంలో పోలీసులకు పట్టుపడ్డారు. ఇటీవల హైదరాబాద్ సరూర్‌నగర్‌లో ఏకంగా ఒకఆస్పత్రిలో కిడ్నీలు మార్చేందుకు ఏర్పాట్లు చేస్తున్న సమయంలో అందిన సమాచారం మేరకు అధికారులు చేసిన అకస్మిక దాడుల్లో విస్తుపోయే విషయాలు వెలుగు చూస్తున్నాయి. ఇతర రాష్ట్రాలతోనే కాదు పొరుగు దేశాలతో ఈ నేరాలకు సంబంధం ఉన్నట్లు తెలియడంతో ఈ కేసును నేరపరిశోధనా విభాగానికి అప్పగించారు. కిడ్నీఅమ్ముకొన్న వ్యక్తి కంటే మధ్యవర్తులకే లాభదాయకంగా ఉండడంతో గతంలో కిడ్నీ అమ్మిన వ్యక్తే ఈ వ్యాపారానికి దళారీగా మారిపోయాడు. కిడ్నీగ్రహిత నుంచి అరవై లక్షల వరకు వసూలు చేసుకుంటే కిడ్నీ ఇచ్చిన వ్యక్తికి ఐదు, పదిలక్షలే ఇస్తున్నట్లు దర్యాప్తులో తెలిసింది. మిగిలింది డాక్టర్లు, అందరి కంటే అగ్రభాగం దళారీకే చెందుతున్నట్లు బయట పడింది. మారిన ఆహార అలవాట్లతో కిడ్నీవ్యాధులు దేశ వ్యాప్తంగా తెలుగు రాష్ట్రాల్లో బాగా పెరిగిపోయాయి. వ్యవసాయరంగంలో పెరుగుతున్న క్రిమిసంహారక మందులు, రసాయనిక ఎరువులు, ప్రజారోగ్యంపై తీవ్రప్రభావం చూపుతున్నాయి. దీనికితోడు వాతావరణ కాలుష్యం, జీవన విధానంలో మార్పులు కారణంగా మూత్రపిండాలు, కాలేయ వ్యాధులు విస్తరిస్తున్నాయి. దేశవ్యాప్తంగా కోటి మందికిపైగా మూత్రపిండాలకు సంబంధించిన దీర్ఘకాలిక ఆరోగ్యసమస్యలతో కొట్టుకమిట్లాడుతున్నట్లు అంచనా. అవసరం మేరకు మూత్రపిండాలు ఇచ్చే దాతలు ముందుకు రావడం లేదు. ఒక్క తెలుగు రాష్ట్రాల్లోనే దాదాపు లక్షన్నర మందికిపైగా మూత్రపిండాలు పనిచేయక డయాల్సిస్‌తో జీవనం సాగిస్తున్నారు. వీరికి మార్పిడి చికిత్స ఒక్కటే పరిష్కారం. అయితే ఇందుకు నలభై, యాభై లక్షల రూపాయల వరకు వ్యయం చేయాల్సి ఉంటుంది. నిరుపేదలు అంతటి ఖర్చును పెట్టుకునే పరిస్థితుల్లోలేరు. ప్రభుత్వం నుండి ఈ విషయంలో పెద్దగా శ్రద్ధ కన్పించడం లేదు. ప్రమాదంలో బ్రెయిన్‌డెడ్ అయి కోమాలో ఉన్న వ్యక్తుల నుంచి అవయవాలు సేకరించి 'జీవన్‌ధార్' పథకం కింద ముందుగా నమోదు చేయించుకున్న వారికి సినియార్టీని బట్టి మార్పిడి చికిత్స చేస్తున్నారు. అయితే దాత నుండి అవయవాలు వేరు చేసిన తర్వాత వీలైనంత త్వరగా రోగికి అమర్చాల్సి ఉంటుంది. హైదరాబాద్ వంటి నగరాల్లో తప్ప మిగిలిన ప్రాంతాల్లో ఈ మార్పిడి చికిత్స సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన డాక్టర్లు కానీ, పరికరాలు కానీ వసతులు కానీ లేవు. ఇటు తెలంగాణలో, అటు ఆంధ్రప్రదేశ్‌లో డయాలసిస్ చేయించుకునే ఆర్థిక స్తోమత లేక మంచానికే పరిమితమై రోజురోజుకూ కృంగికృశిస్తూ మరణం కోసం ఎదురు చూస్తున్నారు. నరక యాతనను అనుభవిస్తూ యమలోకానికి పయనం కడుతుంటే ఏమీ చేయలేని నిస్సహాయక స్థితిలోఉన్న కుటుంబ సభ్యులు పడుతున్న వేదన అంతా ఇంతా కాదు. తెలంగాణ గత ప్రభుత్వం ఈ డయాలసిస్ సెంటర్లు పెంచి పేదలకు ఉచితంగా చికిత్స అందించే ఏర్పాటు చేసింది. అది అవసరం మేరకు కిడ్నీ బాధితులందరికీ అందుబాటులో లేదని చెప్పొచ్చు. పాలకులు ఈ విషయంలో శ్రద్ధ తీసుకొని అటు కిడ్నీల వ్యాపారానికి ఫుల్‌స్టాప్ పెట్టించడమే కాక ఇటు ప్రభుత్వపరంగా చర్యలు తీసుకొని మార్పిడి చికిత్స సామాన్యులకు అందుబాటులోకి వచ్చేలా చేయాల్సిన అవసరం ఉంది.

నొప్పించే మాటలు, అసూయ, దురాశ, కోపం వంటి దుర్లక్షణాలు మానండి. అదే న్యాయసంగతమైన మార్గం అవుతుంది.



తిరుక్కురళ్

బలీయమైన విశ్వాసాలకు, నైతిక సూత్రాలకు కట్టుబడని వారు ఏ పార్టీలో ఉన్నా వారికి ఆ పార్టీకి కూడా క్షేమం కలగదు.



ఆండర్సన్

# భారత్ అగ్రరాజ్యంగా అవతరించాలి!

**మీడియాలో వచ్చిన యు.యస్.డిఫెన్స్ ఇంటెలిజెన్స్ రిపోర్టులోని విశేషాల వల్ల ఏ విధంగా భారత్ తన ఆయుధ సంపత్తితోపాటు న్యూక్లియర్, కన్వెన్షనల్, అన్ కన్వెషనల్ యుద్ధనైపుణ్యాన్ని సాంకేతిక పరిజ్ఞానంతో పెంపొందించుకోవాల్నో సంపూర్ణంగా తెలుసుకోవటానికి సహాయపడినట్లుగానే భావించాలి. భారత్ ఆర్థికవ్యవస్థను ఇతర దేశాలకు అందనంతగా పెంచుకొని ప్రపంచంలో నాలుగవస్థానం తెచ్చుకుంది. ఈ పరిణామం వల్ల భారత్ అగ్రదేశంగా ప్రపంచం యావత్తూ లెక్కించే స్థాయికి చేరుకుంది. అందుకనే చైనా, పాకిస్థాన్‌లతోపాటు అమెరికా కూడా దెబ్బతీసే ప్రయత్నాలు ముందు ముందు తలపెట్టే అవకాశం ఉంది. ఆర్థికవ్యవస్థ అభివృద్ధేకాదు, రాజకీయంగా కూడా ఈ దేశాలతో సమానంగా ఎదిగే దిశగా ఆపరేషన్ సిందూర్‌తో ముందడుగు వేసింది.**



రావులపాటి సీతారాంరావు

ప్రపంచంలోని ఆర్థికవ్యవస్థలలో భారత్ నాల్గవస్థానానికి ఎగబాకటం అద్భుత పరిణామం అని చెప్పకతప్పదు. నాలుగు ట్రిలియన్ డాలర్లుగా మన ఆర్థికవ్యవస్థ ఎదగటం అందరికీ గర్వకారణం. జపాన్‌ను అధిగమించి నాల్గవ స్థానాన్ని ఆక్రమించుకోవటం నిజంగా ప్రభుత్వం ఆర్థిక ప్రయోగాలలోవెలువర్చిన నేర్పరితనం, పనితీరు, ఇతర దేశాలకు విస్మయాన్ని కలిగిస్తుంది. అమెరికా, చైనా, జర్మనీల తర్వాత భారతదేశం అగ్రస్థానాల జాబితాలో చోటు చేసుకుంది. రాజకీయంగా అందుకనే భారత్ ఎత్తుగడల పరిశీలన అవసరం. చైనాను భారత్‌కు ప్రథమ శత్రువుగా బైటికి చెప్పకపోయినా, ప్రపంచ దేశాలు గుర్తిస్తున్నాయి. అయితే ఈ విషయంలో భారత్ ఆలోచనలు ఏవిధంగా ఉన్నాయో అని విదేశీ డిఫెన్స్ ఏజెన్సీలు కూడా అంచనాలు వేస్తున్నాయి. అమెరికా డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (డి.ఐ.ఏ) 2025 వరల్డ్ వైడ్ థ్రెట్ ఎసెస్‌మెంట్ జరిపింది. ఆ ఎసెస్‌మెంట్‌లో భారత్ గురించి కొన్ని ఆసక్తికరమైన విషయాలు వెలిబుచ్చింది. 'ఇండియా చైనాను ప్రథమ శత్రువుగా భావిస్తున్నది. పాకిస్థాన్‌ను ఒక సెక్యూరిటీ ప్రాబ్లెం'గా చైనాకు అనుబంధంగా ఉండే దేశంగానే అనుకుంటున్నది. అందుచేత ప్రధాన మంత్రి నరేంద్రమోడీ, దేశానికి అనుసరించే విదేశాంగ విధానం, డిఫెన్స్‌లక్ష్యాలు, ప్రపంచ నాయకత్వాన్ని సాధించే విధంగా చైనాను సమర్థవంతంగా ఎదుర్కొనే రీతిలో, న్యూఢిల్లీ మిలటరీ పవర్‌ను పెంచుకొనే తీరులో ఉంటాయి అని ఈ మధ్య విడుదలయిన వారి రిపోర్టులలో పేర్కొనటం భారత దేశం గమనంలోకి తీసుకుంటుంది. అంతేకాదు మరికొన్ని విశ్లేషణలు కూడా ఆ రిపోర్ట్‌లో ఉన్నాయి. పహెల్గాం దాడి తర్వాత ఆపరేషన్ సిందూర్ ఎదురుదాడి వల్ల వచ్చిన ఒక అవగాహనతో భారత్ ముందడగు వేస్తున్నది. ముందు ముందు ఎదుర్కోవాల్సిన చైనాప్రభావం అధిగమించడానికీ, ప్రపంచాధిపత్యం సాధించడానికీ, త్వరితగతిన డిఫెన్స్ సహచరత్వం పొరుగు దేశాలతో పటిష్టంగా ఏర్పరుచుకొనే ప్రయత్నంలో పడింది. అందుకనే ట్రయినింగ్, ఆయుధాల అమ్మకాలు, సమాచారాన్ని పంచుకోవటంతోపాటు డిఫెన్స్ ఎక్సర్‌సైజులు కూడా హిందూ మహాసముద్ర ప్రాంతాలలో విరివిగా చేస్తున్నది. ఆర్మీపరంగా బలపడాల్సిన అవసరం, ప్రాముఖ్యత ఇప్పుడు భారత్ పూర్తిగా గుర్తించటం వల్లనే ఆ దిశగా ఫలితాలు సాధించడానికి ప్రయత్నలోపం లేకుండా కృషి చేస్తున్నది. వివిధ దేశాల బలాబలాలను అంచనా వేసుకొని అందుకు అనుగుణంగా ఏ విధంగా లక్ష్యసాధనతో ముందుకు వెళ్లాలనే ఆలోచనతోపాటు కృషి కూడా భారత్ చేస్తున్న మాట నిజం. ఇండియా సౌత్ ఈస్ట్ ఏషియన్ రాజ్యాలతో మరింతగా సంబంధాలను వృద్ధి చేసుకోవడానికి అంటే బ్రిక్స్, షాంగై కోపరేషన్ ఆర్గనైజేషన్‌లతో పరిస్థితులను బాగా మెరుగుపర్చుకొనే దిశగా నడుస్తున్నది. రష్యా వల్ల భారత్ 2024లో మిలటరీని ఆధునికరించుకోగలిగింది.





2025 సంవత్సరంలో కూడా రష్యాతో సంబంధాలు బాగానే ఉంచుకోటానికి కారణం రష్యాతో ముడిపడిన బంధం వల్ల ఆర్థికంగా, డిఫెన్స్‌పరంగా, లాభపడటంతోపాటురష్యా, చైనాల మధ్య బంధం బలపడకుండా ఉండటానికే. అయితే ప్రధాని మోడీ క్రమక్రమంగా రష్యా నుంచి మిలటరీ పరికరాలు సరఫరా చేసుకోవడం తగ్గించుకుంది. అయినప్పటికినీ రష్యన్ స్పేర్‌పార్ట్స్ కొన్న రష్యన్ టాంక్స్, ఫైటర్ ఎయిర్ క్రాఫ్ట్స్ నిమిత్తం కొనుగోలు చేస్తూనే ఉంది. భారత్ మిలటరీ సామర్థ్యానికి ఈ ఆయుధ సంపత్తి వెన్నుముకలాంటిది. చైనాతో పాకిస్థాన్ బెదరింపులను తట్టుకోటానికి ఈ ఆయుధాలు అవసరం కూడా. ప్రధాని మోడీ 'మేడ్ ఇన్ ఇండియా' పాలసీని బహుళార్థ సాధనలో వినియోగిస్తూనే ఉన్నారు. డొమెస్టిక్ డిఫెన్స్ ఇండస్ట్రీ సప్లయి విధానంలో మిలటరీ ఆధునీకరణలో భారత్‌లో తయారు చేసిన,చేస్తున్న వాటినే వాడుతుండటం విశేషం. 2024లో భారత్ మిలటరీని ఆధునీకరించటం మొదలుపెట్టింది. దానివల్ల న్యూక్లియర్ కాపబుల్ డెవలప్‌మెంటల్ అగ్ని -2 ప్రైమ్ మీడియం రేంజీ బాలిస్టిక్ మిసైల్స్ (ఎం.ఆర్.బి.యం), అగ్ని-5, (మల్టిపల్, ఇండిపెండెంట్లీ టార్గెట్‌బుల్ రీ ఎంట్రీ వెహికల్‌తోపాటు సెకండ్ న్యూక్లియర్ పవర్డ్ సబ్ మెరైన్‌ను కూడా కమిషన్ చేయగలిగింది. దీనివల్ల న్యూక్లియర్ ఎబిలిటీ, సంపత్తి, ఒక విధంగా మేడ్ ఇన్ ఇండియా ఆలోచనలతో శత్రువులను ఎదుర్కోటానికి భారత్ తనను తాను సిద్ధపర్చుకోవటం జరుగుతున్నది. పాకిస్థాన్ భారత్‌ను ఎదుర్కోటానికి మిలటరీ ఆధునీకరణతోపాటు,యుద్ధంలో వాడాల్సిన న్యూక్లియర్ ఆయుధ సంపత్తిని మెరుగుపర్చుకుంటున్నది. సాంప్రదాయ మిలటరీ సంపత్తితో యుద్ధాలు జయించే భారత్‌కు దీటుగా జవాబివ్వడానికి ఈ విధమైన ఆధునీకరణ అవసరమని పాకిస్థాన్ భావిస్తున్నది. విదేశాల నుంచి స్నేహ దేశాల నుంచి పాకిస్థాన్ డబ్లుయూ-ఎం-డీ అప్లయి చేసే వస్తువులు కూడా ఇండియాను దెబ్బతీయడానికి తెప్పించుకుంది. (పహెల్గాం ఎటాక్ తర్వాత ఆపరేషన్ సిందూర్‌తో కొత్త తరహా దాడికి దిగినభారత్‌తో అలాంటి పాకిస్థాన్ ఆయుధాలుకూడా పనికిరాలేదని భారత్ యుద్ధనిపుణులు అనుకోవడంలో ఆశ్చర్యం లేదు. రిపోర్టులో ఈ వివరాలు లేవు. కేవలం మన నిపుణుల అంచనా మాత్రమే.ఇండియా, చైనాలమధ్య జరిగిన అక్టోబర్ 2024 ఒడంబడిక (డిప్సాంగ్, డెమ్‌చోక్‌లో ఒకరికొకరు తలపడకుండా ఉండేందు కోసం చేసుకున్న ఒప్పందాన్ని ప్రస్తావిస్తూ ఈ రిపోర్టు ఎన్నోఏళ్ల నుంచి ఉన్న వైరం ఈ ఒప్పందం వల్ల సమిసిపోలేదు అనికూడా పేర్కొంది. ఇంకా అడపాదడపా ఈగొడవ తాలూకు ఛాయలు (2020 ఘటనలో లైన్ ఆఫ్ యాక్చువల్ కంట్రోల్ దాటారని ఇరు దేశాల సైన్యాలు గొడవపడి సైనికుల ప్రాణాలు పోగొట్టుకున్నాము) చెదురు మదురు సంఘటనలతో బయటపడ్తూనే ఉన్నాయి అని ఈ రిపోర్టులో పొందుపర్చటం గమనించక తప్పదు.మీడియాలో వచ్చిన యు.యస్.డిఫెన్స్ ఇంటెలిజెన్స్ రిపోర్టులోని విశేషాల వల్ల ఏ విధంగా భారత్ తన ఆయుధ సంపత్తితోపాటు న్యూక్లియర్,కన్వెన్షనల్, అన్ కన్వెషనల్ యుద్ధనైపుణ్యాన్ని సాంకేతిక పరిజ్ఞానంతో పెంపొందించుకోవాల్నో సంపూర్ణంగా తెలుసుకోవటానికిసహాయపడినట్లుగానే భావించాలి. భారత్ ఆర్థికవ్యవస్థను ఇతరదేశాలకు అందనంతగా పెంచుకొని ప్రపంచంలో నాలుగవస్థానం తెచ్చుకుంది. ఈ పరిణామంవల్ల భారత్ అగ్రదేశంగా ప్రపంచం యావత్తూ లెక్కించే స్థాయికి చేరుకుంది.అందుకనేచైనా, పాకిస్థాన్‌లతోపాటు అమెరికా కూడా దెబ్బతీసే ప్రయత్నాలు ముందు ముందు తలపెట్టే అవకాశం ఉంది. ఆర్థికవ్యవస్థ అభివృద్ధేకాదు,రాజకీయంగా కూడా ఈదేశాలతో సమానంగా ఎదిగే దిశగా ఆపరేషన్ సిందూర్‌తో ముందడుగువేసింది. ●

# ప్రపంచ దేశాలను దూరం చేసుకుంటున్న ట్రంప్ విధానాలు

డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్

డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షతన అమెరికా ప్రపంచ పటంలోని స్థానాన్ని గణనీయంగా మార్చింది. అతని విధానాలు, ప్రసంగాలు మిత్రరాజ్యాలను దూరం చేశాయి. ప్రత్యర్థులను ప్రోత్సహించాయి.ముఖ్యమైన అంశాలపై అంతర్జాతీయ సహకారాన్ని బలహీనపరిచాయి. అమెరికా దీర్ఘకాలంగా దాని విదేశీ జోక్యాల వల్ల విమర్శలను ఎదుర్కొంటుంది. ఇప్పుడు ట్రంప్ పాలనతో మరింత స్థిరపర్చింది. ఇప్పుడు అమెరికా ను స్వార్థపూరిత దేశంగా చిత్రీకరించబడింది. సహజంగా ప్రపంచంలో అమెరికా పట్ల ఉన్న ద్వేషాన్ని ట్రంప్ పాలన మరింత విశాలం చేసింది. ట్రంప్ అత్యంత హానికరమైన వారసత్వాలలో ఒకట బహుళపక్ష వాదాన్ని తిరస్కరించడం. అతను పారిస్ క్లైమేట్ ఒప్పందం నుండి అమెరికాను వైదొలిగేలా చేశారు. వాతావరణ మార్పులతో పోరాడే ప్రపంచ ప్రయత్నాలను విస్మరించాడు. అలాగే, ఇరాన్ అణు ఒప్పం దం (జేసీపీఓఏ) నుండి బయటకు వచ్చి, మధ్య ప్రాచ్యంలో అస్థిరతను పెంచారు. ఈ చర్యలు అమెరికా సామూహిక భద్రత కంటే స్వల్పకాలిక రాజకీయ ప్రయోజనాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుందనే అభిప్రాయాన్ని ధృవపరిచాయి. వాణిజ్య యుద్ధాలు కూడా ట్రంప్ మరొక నిదర్శనం. కెనడా, యూరోపియన్ యూనియన్ జపాన్ వంటి మిత్రదేశాలపై సుంకాలు విధించడం ద్వారా, ఈఆర్థిక భాగస్వాములను సహకారులుగా కాకుండా 'పరాన్న జీవులుగా' చిత్రీకరించారు. ట్రంప్ చర్యలు ప్రపంచ సరఫరా గొలుసులను దెబ్బతీసాయి. ఎత్తుకు పైఎత్తు వేసే జిత్తులమారి తనాన్ని పెంచేలా చేశాయి. వాణిజ్యాన్ని 'జీరోసమ్' గేమ్‌గా చూడటం ద్వారా, అమెరికా నాయకత్వంపై నమ్మకాన్ని కోల్పోయింది. ట్రంప్ అధికారవాద నాయకులతో ఉన్న సన్నిహిత సంబంధాలు అమెరికాకు ఉన్న కన్నింగ్ ఇమేజ్‌ను పెంచాయి. వ్లాదిమిర్ పుతిన్, కిమ్ జాంగ్‌అన్ వంటినాయకులను మెచ్చుకోవడం, ప్రజాస్వామ్యాలు నియంతృత్వాల మధ్య తేడాలు లేవని సూచించింది. సిరియా నుండి అకస్మాత్తుగా సైనికులను వెనక్కి తీసుకోవడం, ఐఎస్ ఐఎస్‌తో పోరాడిన కుర్దిష్ మిత్రులను ద్రోహం చేయడం వంటివి అమెరికా వాగ్దానాలు నమ్మదగినవి కావని ప్రపంచానికి చాటింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ పట్ల అతని వైఖరి కూడా విధ్వంసకరమైనది. కొవిడ్ 19 మహమ్మారి సమయంలో (డబ్ల్యూహెచ్ఓ)కు నిధులను కత్తిరించడం అమానుషం. ఆరోగ్య విషయంలో అంతర్జాతీయ సహకారా న్ని విస్మరించడం వంటివి అతని 'అమెరికా ఫస్ట్' విధానం స్వార్థపూరిత ప్రమాదాలను బయట పెట్టాయి. దేశీయంగా, ఆఫ్రికన్ దేశాలను 'చెత్త దేశాలు' అని పిలవడం, వలస దారులపై దాడిచేయడం, జాతి వివక్ష వ్యతిరేక ప్రదర్శనలను విస్మరించడం వంటి ట్రంప్ విభజనకరమైన ప్రసంగాలు అమెరికా ఒక జాత్యాహంకార, విదేశీ విరోధ శక్తిగా భావించబడేలా చేశాయి. ట్రంప్ తర్వాతి నాయకులు మిత్ర రాజ్యాలతో సంబంధాలు మరమ్మత్తు చేయవచ్చు, కానీ నష్టం అలాగే మిగిలిపోయింది. అమెరికా అనూహ్యమైన, స్వార్థ పూరితమైన దేశంగా సహకారానికి విరుద్ధంగా ఉన్న దేశంగా ప్రపంచం చూసింది. వాతావరణ మార్పులను తిరస్కరించడం, వాణిజ్య యుద్ధాలు, మిత్రులను వదిలేయడం వంటి ట్రంప్ విధానాలు అమెరికాను ప్రపంచానికి శత్రువుగా చూపే భయాలను నిజం చేశాయి. నమ్మకాన్ని పునరుద్ధరిం చడానికి కేవలం పాలన మారడం సరిపోదు. బహుళపక్ష సహకారానికి కట్టుబడటం అవసరం. ●

# ప్రజావాక్కు



## ప్రకటనల వ్యవస్థను ఏర్పాటు చేయాలి

మనదేశంలో నదులు, చెరువులు, జలపాతాలు, సముద్రాల వద్ద అనేక మంది నీట మునిగి మరణిస్తున్నారు. ఇందులోపిన్నలు, పెద్దలు, వృద్ధులు అందరూ ఉంటున్నారు. అవగాహనాలోపం, తగు జాగ్రత్తలు పాటించకపోవటం వల్ల ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయి. ఇవి నివారించతగిన మరణాలు. ఈత రాకుండా లోతైన నీటిలోకిదిగటం అతిప్రమాదకరం.అన్నీతెలిసి కూడా కొందరు నీటిలోకి దిగి సాహసాలకు ఒడిగడుతుంటారు. సరదా కోసం చేసే పని వారి తల్లిదండ్రులకు, బంధుమిత్రులకు క్షోభనుమిగులుస్తున్నాయి. ప్రభుత్వాలు ఇటువంటి సంఘటనల పట్ల ప్రజలలో అవగాహన తేవాలి. నీరు ఉండే అన్ని పర్యాటక ప్రదేశాలు, పుణ్యతీర్థాల వద్ద నిరంతరం మైకు ద్వారా జాగ్రత్తలు, హెచ్చరికలు తెలిపే ఆటోమేటిక్ ప్రకటనల వ్యవస్థను తప్పని సరిగా ఏర్పాటు చేయాలి.

- కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

## ఆందోళనకరంగా మారుతున్న ట్రాఫిక్ సమస్య!

ఇటీవల కాలంలో మనం గమనించగలిగిన ఒక ముఖ్యమైన సామాజిక సమస్య ట్రాఫిక్ సమస్య. ఇది కేవలం మెట్రో నగరాలకే పరిమితం కాకుండా, చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోనూ తీవ్రతరమౌతుంది. ఈ మధ్య కాలంలో వాహనాల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రతి కుటుంబంలో కనీసం రెండు వాహనాలు ఉండటం సహజమే అయిపోయింది. కానీ ఈ పెరుగుతున్న వాహనాల సంఖ్యకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు, రోడ్ల విస్తీర్ణం,ట్రాఫిక్ నియంత్రణవిధానాలు పెరగకపోవడం వల్ల అనేక సమస్యలు తలెత్తుతున్నాయి.

-తోట యోగేందర్, మిర్యాలగూడ, నల్లగొండ జిల్లా

## టీచర్ల బదలీ షెడ్యూల్ గడువు పెంచాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉపాధ్యాయుల బదలీల కోసం రూపొందించిన ట్రాన్స్ఫర్ అప్లికేషన్ సాఫ్ట్వేర్‌లో అనేక సాంకేతిక లోపాలు ఉన్నాయి. దీంతో ఉపాధ్యాయులకు రావాల్సిన స్టేషన్ పాయింట్లు సర్వీస్ పాయింట్లు సరిగ్గా రావడం లేదు. ముఖ్యంగా రీఅపోర్షన్ గురవుతున్న ఉపాధ్యాయులకు పాత స్టేషన్ పాయింట్లు రావడంలేదు. టీచర్ల సమస్యలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం బదిలీల షెడ్యూల్ గడువు పెంచాలి.

-వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

## విద్యావ్యవస్థపై రాజకీయ నాటకం

రాష్ట్రంలో రాజకీయ నాయకుల పిల్లలు విదేశాలలో చదువుతారు. కానీ వీళ్ల మన ఎడ్యుకేషన్‌ని మారుస్తాం అని బూటకపు మాటలు చెప్తారు. మనం కూడా అదే నమ్ముతాము. ఎందుకని వాళ్ల పిల్లల్ని మన ప్రాంతంలోనే చదువుపించరు. అంటే విద్య వ్యవస్థను వారు మార్చరు అనే భావనతోనే కదా! ఎందుకని ఇన్ని విన్యాసాలు పదవుల కోసమేకదా ! పార్టీలకు అతీతంగా ఏ ఒక్క రాజకీయ నాయకులు ఎందుకు చేయడం లేదు. వారు చేర్పించిఅందరిని ఇన్స్పైర్ చేయచ్చుకదా.ఇలా ఐన మన విద్యా వ్యవస్థను సమూల ప్రక్షాళన చేయచ్చు. ఉదాహరణకి ప్రస్తుత కాలంలో ఒక మహిళా జడ్జి గారు ప్రభుత్వ దవాఖానలో ఒక బిడ్డకి జన్మనిచ్చింది. ఇలా ఒక పెద్ద స్థానంలో ఉన్న వ్యక్తులు చేస్తే బాగుంటది. పేరుకు విద్యావ్యవస్థకి కొన్ని వేల కోట్ల రూపాయలు కేటాయిస్తున్నాం అని గొప్పలు చెప్పుకోవడం కామన్ అయింది ఈరోజుల్లో. ఏరాజకీయ పార్టీదైన ఇదే పరిస్థితి.

-సునీల్ కుర్రే, ఆరేపల్లి,భూపాలపల్లి

## హిందీ నిర్బంధం

భారతదేశం భాషా వైవిధ్యానికి నిలయం. ఇటువంటి దేశంలో హిందీని తప్పనిసరిగా విద్యా భాషగా ప్రవేశపెట్టాలన్న కేంద్ర ప్రభుత్వ యత్నాలు భాషల సమానత్వానికి విరుద్ధంగా ఉన్నాయి. దక్షిణాది రాష్ట్రాలు,ముఖ్యంగా తమిళనాడు, దీనికి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. తమిళనాడు ఎప్పటి నుంచో ద్విభాషా విధానాన్ని (తమిళం,ఆంగ్లం) అనుసరిస్తూ, హిందీని తిరస్కరిస్తోంది. ఇటీవల సీఎం స్టాలిన్ నేతృత్వంలో హిందీ నిర్బంధానికి వ్యతిరేకంగా పార్టీ శ్రేణులతో ప్రతిజ్ఞ చేయడం ఈ అసంతృప్తికినిదర్శనం.త్రిభాషాసూత్రాన్ని అమలుచేయలేదని కేంద్రం తమిళనాడుకు రూ.573 కోట్ల విద్యానిధులను నిలిపి వేసింది.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## ఇజ్రాయెల్‌ను మందలించాలి

ఎంత చెడ్డ మనిషికైనా ఎంతో కొంతమంచితనం ఎక్కడో హృదయాంతరాలలో ఉంటుందంటారు మనపెద్దలు. ఇజ్రాయెల్‌లో ఆదేశ ప్రధానమంత్రి రూపంలో ఉన్నాడు. ఆకలిగొన్న వారికి ఆహారం తీసుకొస్తున్న వాహనాన్ని తన సైనిక బలంతో ఆపివేయడంవలన ఆకలిబాధ భరించలేక అనేకపసిప్రాణాలు గాలిలో కలసిపోయాయి. బ్రిటన్, ఫ్రాన్స్, కెనడా స్వల్పంగా మందలించడంతో కడుపు నిండని ఆహార పదార్థాలను అందించడానికి ఒప్పుకున్నాడట. కరుడుగట్టిన మూర్ఖుడు.

-ఎన్. రామలక్ష్మి,సికింద్రాబాద్

# రైతులను ముంచుతున్న 'నకిలీ'లు

కామిడి సతీష్ రెడ్డి

వానా కాలం సీజన్ వచ్చిందంటే చాలు రైతులకు నకిలీల బెడద తప్పడం లేదు. ఆరుగాలం శ్రమించి సాగుచేస్తే తీరా చేతికొస్తుందనుకున్న పంట రాకపోవడంతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. దీంతో రైతు కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. మొదట్లోనే నకిలీ విత్తనాల ఆటకట్టిస్తే పంట చేతికొచ్చి, నష్టాల్లేకుండా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. వానాకాలం సీజన్ కంటే ముందే నకిలీ విత్తన ముఠా చేయని ప్రయత్నమంటూ ఉండదు. లూజ్ విత్తనాలను ఆకర్షణీయమైన కవర్లలో ప్యాకింగ్ చేసి రైతులకు తక్కువ ధరలకే అంటగడుతూ నిలువునా మోసం చేయడం దళారులకు అలవాటుగా మారింది. అధికార యంత్రాంగం ఎన్నిచర్యలు తీసుకుంటున్నా, ఏదో ఒకచోట పట్టుబడుతూనే ఉన్నాయి. ప్రతీ వానాకాలం సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా నాసిరకం విత్తనాల బెడద రైతాంగానికి పెను సవాల్‌గా మారింది. అసలు ఏదో, నకిలీ ఏదో గుర్తించలేని విధంగా విత్తనాలు మార్కెట్‌లో ఉండటంతో రైతాంగం తీవ్రంగా నష్టపోతుంది. ప్రధానంగా వరి, పత్తి విత్తనాలు నాసిరకం కావడంతో రైతులకు నష్టాలు తప్పడంలేదు. తీరా పత్తి పంటలో దిగుబడి రాక రైతులు ఆర్థికంగా దెబ్బతింటుండగా వరిలో సైతం తెగుళ్లు, తాలు, నాణ్యతలేకపోవడంతో రైతులు పంట చేతికొచ్చే సమయంలో లబోదిబోమంటున్నారు. వరి, పత్తి విత్తనాల విషయంలో దళారులదే పెత్తనమైంది. గ్రామీణ ప్రాంతాల్లో దళారులు రైతులను మచ్చిక చేసుకుని తక్కువ ధర, అధిక దిగుబడులు, తక్కువ సమయంలో పంట చేతికి వస్తుందని నమ్మించి నాసిరకం విత్తనాలు అంటకడుతున్నారు. రాష్ట్రప్రభుత్వ ఆదేశాలమేరకు ప్రత్యేక బృందాలు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నా దళారుల దందాను నిలువరించలేకపోతున్నారు. గత ఏడాది మేలో అన్నిజిల్లాల్లో వ్యవసాయ శాఖ విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. పలు జిల్లాల్లో పలుచోట్ల కేసులను కూడా నమోదు చేసిన సందర్భాలున్నాయి. ఒకానొక దశలో పీడీ యాక్టును కూడా అమలు చేశారు. అయినప్పటికీ విత్తనాల నాణ్యతపై పలు అనుమానాలు వ్యక్తమవుతూ వస్తున్నాయి. పెట్టుబడులు చేతిలో లేని రైతులు తక్కువ ధరకు వచ్చే విత్తనాలను తీసుకుని వేసిన సందర్భాలూ ఉన్నాయి. దీంతోనే రైతులు నష్టపోతున్నారు. తాజాగా ఆయా జిల్లాల్లో ఉన్నతాధికారులు టాస్క్‌ఫోర్స్‌లను ఏర్పాటుచేస్తూ ఆదేశాలు జారీ చేశారు. వ్యవసాయ శాఖతోపాటు పోలీసుశాఖ,రెవెన్యూశాఖ సమన్వయంతో పలు టీంలు ఏర్పడి తనిఖీలు విస్తృతంగా చేయాలని నిర్ణయించాయి. అయితే ప్రతీ సంవత్సరం తనిఖీలు చేస్తున్నా, ఎక్కడో ఒకచోట నకిలీ విత్తనాల బెడద తప్పడం లేదు. అన్ని జిల్లాల్లో గతంలో లూజు పత్తి విత్తనాలు పెద్దఎత్తున స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నెల నాలుగోవారం నుంచి వ్యవసాయసీజన్ ప్రారంభం కానుంది. ఇప్పటికే దుక్కులను దున్నుకునిసిద్ధం చేసుకున్నారు. ఈ నెలాఖరులోనే నైరుతి రుతుపవనాలు కేరళను తాకడంతోపాటు తెలంగాణలో సైతం ముందుగానే వర్షాలు కురిసే అవకాశాలున్నాయి. ఈనేపథ్యంలో అన్ని జిల్లాల్లో వర్షాలు కురిస్తే ముందుగానే విత్తనాలు వేస్తారు. ఈ నెలచివర్లో రోహిణి కార్తె ప్రారంభం కానుంది. రాష్ట్రవ్యాప్తంగా వరితోపాటు పత్తి అంతా కలిపి కోట్లాది హెక్టార్లలో పంటలు సాగుకానున్నాయి. కొందరు డీలర్లది ఆడిందే ఆట, పాడిందే పాటగా మారిందన్న ఆరోపణలు వస్తున్నాయి. కొందరు డీలర్లు తమకు ప్రజాప్రతినిధుల అండ ఉందని రాజకీయ పార్టీలతో సంబంధాలున్నాయని బాహాటంగా పేర్కొం



టూ దందాలకు పాల్పడుతున్నట్లు రైతుల నుంచి విమర్శలు వస్తున్నాయి. సీజన్‌లో తమ దుకాణాలను టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు చేయకుండా ఉండేలా తమకు ప్రజాప్రతినిధుల అండ ఉందని చెబుతుండటం గమనార్హం. ప్రస్తుతం టాస్క్‌ఫోర్స్‌లో పోలీస్, వ్యవసాయ, రెవెన్యూశాఖ అధికారులున్నారు. ప్రతీ సీజన్‌కు ముందు టాస్క్‌ఫోర్స్ అధికారులను తప్పుదోవ పట్టించేవిధంగా పత్తి విత్తనాలు విక్రయించే రంగంలో ముదిరిపోయిన కొందరు డీలర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈసారైనా టాస్క్‌ఫోర్స్ అధికారులు పత్తి విత్తనాలు విక్రయించే డీలర్లపై నిఘా పెట్టి తనిఖీలు చేస్తారా? అనేది వేచి చూడాల్సి ఉంది. ఆంధ్ర నుంచి నిషేధిత బీటీ3 విత్తనాలువస్తున్నాయి అమెరికా దేశంలోని మోనో శాంటోను కంపెనీకి చెంది బీటీ 3 రకం విత్తనాలపై దేశవ్యాప్తంగా నిషేధం ఉంది. బీటీ3 విత్తనాలకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి లేదు. బీటీ1, బీటీ2 రకాలకు మాత్రమే అనుమతి ఉంది. దాదాపు 20 ప్రధాన కంపెనీలకు చెందిన అనుమతిగల విత్తనాలను అందుబాటులో ఉంచారు. ఇకపోతే నిషేధిత విత్తనాల వల్ల కాలుష్యంతో ముప్పువాటిల్లే అవకాశంతోపాటు అనేక రకాలుగా నష్టాలున్నాయి.వివిధ జిల్లాల్లో అత్యధికంగా పత్తి జిన్నింగ్ మిల్లులు ఉండటంతో విత్తనోత్పత్తి సులువుగా జరుగుతుంది. అన్నిరకాల విత్తనాలు నష్టం కలిగించనప్పటికీ దళారుల జోక్యంతో బీటీ2 రకం విత్తనాల పేరిట బీటీ 3 రకం విత్తనాలను అంటగడుతున్నట్లు వ్యవసాయశాఖ అధికారుల దృష్టికి సైతం వచ్చినట్లు సమాచారం. దీంతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని మాచర్ల నుంచి సైతం అన్ని జిల్లాలకు నాసిరకం విత్తనాలతోపాటు బీటీ3 రకం విత్తనాలు కూడా చేరుతున్నట్లు తెలుస్తోంది. నల్లగొండ జిల్లాలోని నాగార్జునసాగర్ సరిహద్దులోనే మాచర్ల ఉండటంతో సులువుగా వివిధ మార్గాల్లో నకిలీ పత్తివిత్తనాలు చేరుతున్నాయి. మహారాష్ట్ర నుండి కూడా వస్తున్నాయి. వాస్తవానికి అయితే చాలామంది డీలర్లు, వ్యాపారులు రైతులు పత్తి, వరి విత్తనాలు కొనుగోలు చేసిన వెంటనే వారికి బిల్లు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ చాలాచోట్ల రశీదు ఇవ్వకుండా రైతులనుమభ్యపెట్టి పంపించి వేస్తున్నా సంఘటనలున్నాయి. పంట దిగుబడులు తక్కువగా వచ్చినప్పుడు రైతులు నిలదీస్తారన్న భయంతో ఏ వ్యాపారి కూడా బిల్లులు ఇవ్వడం లేదు. ఒక ఆంధ్రప్రదేశ్ నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, గుజరాత్‌ల నుంచి కూడా వివిధ ప్రాంతాల నుంచి రాష్ట్రంలోకి రోడ్డుమార్గం ద్వారా పట్టుబడుతామన్న ఆలోచనతో కొంతమంది దళారులు రైళ్లలో తరలించడం,లేదంటే ట్రాన్స్ ఫోర్ట్ వాహనంలో జిల్లాలకు చేరవేస్తున్నారు. ఒరిజినల్ కంపెనీలకు చెందిన ప్యాకెట్ల మాదిరిగానే నకిలీ ప్యాకెట్లు తయారుచేసి అందులో నాసిరకమైన పత్తి విత్తనాలను నింపి రైతులకు అంటగట్టే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో గత సంవత్సరం వ్యవసాయ శాఖ అధికారులు వరితోపాటు పత్తి విత్తనాలకు సంబంధించిన నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపించారు. కొంతమంది మధ్య దళారులు పత్తి వేసే రైతులను తీసుకువెళ్లి నాసిరకం విత్తనాలు అంటగట్ట దంతోపాటు వారు డిస్కౌంట్ ఇస్తున్న మాదిరిగా వ్యవహ రించి భోజనాల ఖర్చులు ఇవ్వడం, రానుబోను వాహన చార్జీలు ఇచ్చి మభ్యపెట్టి మోసం చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ప్రతీ రైతు కూడా విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలి. ఇతర ప్రాంతాల నుంచి బీటీ2 విత్తనాల పేరిట బీటీ3 విత్తనాలను అంటగట్టే ప్రమాదం ఉంది. బీటీ3ని కేంద్రం నిషేధించింది. రైతులు పూర్తి స్థాయిలో అనుమతులున్నా డీలర్లు, వ్యాపారుల వద్దే విత్తనాలను కొనుగోలు చేసి రశీదులు తీసుకోవాలి. నాణ్యమైన విత్తనాలకు మాత్రమే అనుమతి ఇవ్వాలి. లైసెన్స్ ఉన్న డీలర్ల నుంచి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి. మధ్య దళారుల వద్ద ఎట్టిపరిస్థితులోను విత్తనాలను కొనుగోలు చేయవద్దు. ●

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# సిఎం చంద్రబాబు ఆధ్వర్యంలో తెదేపా మరింత పటిష్టం : ఎమ్మెల్యే నసీర్

**గుంటూరుతూర్పు,మే29,ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులుగా మరోసారి ఎన్నికైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర



ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ శుభాకాంక్షలు తెలిపారు. కడపలో జరుగుతున్న మహానాడులో పాల్గొన్న ఆయన ఈ మేరకు గురువారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. తెలుగుదేశం పార్టీని క్రమశిక్షణతో, ఒక ఆశయంతో ముందుకు తీసుకెళుతున్న నాయకుడు సీఎం చంద్రబాబు నాయుడు అని కొనియాడారు. ఆయన రాజకీయ ప్రస్థానం పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసమే సాగిందని తెలిపారు. 1990లో నారా చంద్రబాబునాయుడు తీసుకొచ్చిన సంస్కరణ ఫలితమే నేడు యువత ఉజ్వల భవితకు బాటలు వేసిందని చెప్పారు. హైదరాబాద్ లో హైటెక్ సిటీ ఏర్పాటు చేస్తే అప్పటి ప్రతిపక్షాలు హేళన చేశాయని, కానీ ఇప్పుడు ఆ హైటెక్ సిటీ ప్రపంచానికే ఆదర్శంగా మారిందని తెలిపారు. ఇది సీఎం చంద్రబాబు నాయుడు విజనరీకి నిదర్శనమని పేర్కొన్నారు. గత ఐదేళ్లలో అభివృద్ధి కనరాక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి వెళ్లిందని అలాంటి రాష్ట్రాన్ని మళ్లీ కేవలం 10 నెలల కాలంలోనే గాడిలో పెట్టిన ఘనత చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వంతో కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని నిర్మాణాన్ని ఒక యజ్ఞంలా చేపట్టారని, ఇది భావితరాలకు ఒక శుభ సంకేతమని ఆయన కొనియాడారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్య సాధనలో సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో అందరం భాగస్వాములమవుతామని . పేర్కొన్నారు.

# వ్యర్థాల నుండి సంపదను సృష్టిస్తున్న చర్యల్లో అంతరాయం ఉండరాదు : విజయవాడ కమిషనర్ ధ్యానచంద్ర

**విజయవాడ కార్పొరేషన్,మే 29,ప్రభాతవార్త:** వ్యర్థాల నుండి సంపదను సృష్టిస్తున్న చర్యల్లో ఎటువంటి అంతరాయం ఉండరాదని మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. గురువారం ఉదయం ఆయన తన పర్యటనలో భాగంగా అజిత్‌సింగ్‌నగర్ పర్యటించి గార్బేజ్ ట్రాన్స్ఫర్



స్టేషన్,అన్న క్యాంటీన్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ సిపాయి కర్మచారి పథకంలో భాగంగా కొత్తగా వచ్చిన ఐదు టిప్పర్ వాహనాలను పరిశీలించారు. లబ్ధిదారులతో పెద్ద టిప్పర్లను సాధ్యమైనంత త్వరలో అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్లో వ్యర్థాల నుండి సంపద సృష్టిస్తున్న చర్యలను ఎటువంటి అంతరాయం లేకుండా చేస్తూనే ఉండాలని, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించే విధంగా ఎప్పుడూ పరిశుభ్రంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సింగ్‌నగర్ వద్ద ఉన్న అన్నా క్యాంటీన్‌ను పరిశీలించారు. సమయపాలన సక్రమంగా జరుగుతుందా లేదా అని అక్కడున్న ప్రజలనడిగి తెలుసుకున్నారు. ఆహారంలో నాణ్యత పరిశుభ్రత నిర్వహణ తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అన్నా క్యాంటీన్‌కి వస్తున్న ప్రజలు తమ అభిప్రాయాలను క్యూ ఆర్ కోడ్ ద్వారా ఫీడ్‌బ్యాక్ తెలియచేయవచ్చన్నారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి, ఇంఛార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్,వెహికల్ డిపో ఇన్‌ఛార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏసుపాదం పాల్గొన్నారు.

# లైబ్రరీలో వేసవి శిక్షణ తరగతులు

**తిరువూరు, మే 29, ప్రభాతవార్త :** తిరువూరు ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో లైబ్రేరియన్ పద్మావతి ఆధ్వర్యంలో వేసవి శిక్షణ తరగతుల్లో విద్యార్థులకు వివిధ అంశాలపై కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులచే కథలు, జనరల్ నాలెడ్జ్ ఇంగ్లీష్ గ్రామర్, తెలుగు పుస్తక పఠనం చేయుట, తదుపరి చదివిన అంశములను సమాధానములు తెలియచేయుట, సబ్ జూనియర్స్ జూనియర్స్‌తో తెలుగు అక్షరములు బోర్డుపై చూడకుండా వ్రాయుట వంటి అంశములు మరియు విద్యార్థులచే మెడిటేషన్ యోగా వంటి కార్యక్రమములు నిర్వహించడమైనది.



# పదవీకాంక్ష కంటే ప్రజల బాగోగులే ప్రత్తిపాటికి ముఖ్యం

## -తిరుపతిలో ప్రత్తిపాటి జన్మదిన వేడుకలలో తెదేపా నాయకులు

**చిలకలూరిపేట,మే29,ప్రభాతవార్త:** ప్రజల బాగోగులే ముఖ్యమని, నియోజకవర్గాన్ని ఎలా అభివృద్ధి చేయాలి, ఏం చేస్తే తన ప్రాంత ప్రజలు



సంతోషంగా ఉంటారన్న ఆలోచనలు తప్ప ప్రత్తిపాటికి ఎలాంటి పదవీకాంక్ష ఉండదని నియోజకవర్గ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు గట్టినేని సాయి తెలిపారు. గురువారం నియోజకవర్గ టీఎన్ఎస్ఎఫ్ విభాగం ఆధ్వర్యంలో తిరుపతిలో మాజీమంత్రి ప్రత్తిపాటి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.ప్రత్తిపాటి తిరుమల దర్శనానికి వెళ్లారని తెలుసుకున్న టీఎన్ఎస్ఎఫ్ నేతలు నేరుగా తిరుపతి వెళ్లి అక్కడ ఆయన సమక్షంలోనే ఘనంగా పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ప్రత్యేకంగా తయారుచేయించిన కేకును ప్రత్తిపాటిచేత కట్‌చేయించి ఆయన చేత తినిపించి తమ ఆనందాన్ని ఆయనతో పంచుకున్నారు. అనంతరం ప్రత్తిపాటిని పూలమాలలతో సన్మానించి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి మల్లెల రాజేష్‌నాయుడు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కందుల రమణ, టిడిపి నాయకులు గంగా శ్రీనివాసరావు, సోము, తూబాటి శ్రీహరిరావు, పిల్లి కోటి, పి జానీ, కె అనిల్, జవ్వాజి హర్ష, పొన్నం శివ, బేరింగ్ నాగూర్, వంశీ, చందు, షేక్ జానీ, తెలుగుయువత నాయకులు పాల్గొన్నారు.

# జూన్ 2న సిపిఐ ధర్నా

**ఎ కొండూరు, మే 29, ప్రభాతవార్త :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల మేరకు గ్రామాల్లో 3సెంట్లు పట్టణాల్లో 2 సెంట్లు ఇంటి జాగాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ఎన్‌టిఆర్ జిల్లా ఎ కొండూరు క్రాస్ రోడ్డు వద్ద సిపిఐ మండల కమిటీ ఆధ్వర్యంలో గోడ పత్రికను గురువారం ఆవిష్కరించారు. ఈ



సందర్భంగా సిపిఐ పార్టీ జిల్లా నాయకులు మేకల డేవిడ్ పాల్గొని మాట్లాడుతూ సిపిఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జూన్ 2న మండల కార్యాలయాల వద్ద ఇంటి జాగాలు మంజూరుపై ప్రధానంగా ధర్నా నిర్వహిస్తున్నట్లు ఇంటిస్థలం లేని నిరుపేదలకు గ్రామీణంలో 3 సెంట్లు పట్టణ ప్రాంతాల్లో నివసించే వారికి రెండు సెంట్లు నివేశన స్థలాలు ఇవ్వాలని అలాగే గృహ నిర్మాణం కోసం రూ.5లక్షలు ఐరన్ (ఇనుము), ఇసుక, ఇటుక, సిమెంట్ పేద లబ్ధిదారులకు అందించి ఆదుకోవాలని డేవిడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఎం వెంకటేశ్వరరావు, పి పుల్లయ్య, బి ఆదాం, బి సురేంద్ర, భూక్యా చిట్టెమ్మ, మంగమ్మ, బి లక్ష్మి పార్వతి తదితరులు పాల్గొన్నారు.

## అమరావతి వార్త

# విధుల్లో నిరక్ష్యంగా ఉంటే చర్యలు

## కమిషనర్ పులి శ్రీనివాసులు

**గుంటూరు కార్పొరేషన్,మే29,ప్రభాతవార్త :** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని టిడ్కో గృహ సముదాయాల వద్ద మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను



ఆదేశించారు. గురువారం కమిషనర్ అడవితక్కెళ్లపాడులోని టిడ్కో గృహ సముదాయాలను జీఎంసి, టిడ్కో ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించి, మౌలిక వసతులపై ప్రజల తెలిపిన సమస్యలను తెలుసుకొని, సంబందిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అడవితక్కెల్లపాడులోని టిడ్కోఇళ్లల్లో షుమారు 13 వందల కుటుంబాలు నివాసం ఉంటున్నారని, సదరు ప్రాంతంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. తక్షణం త్రాగునీటి సమస్య తీరేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఈని ఆదేశించారు. అలాగే పారిశుధ్య సమస్యలపై కూడా ప్రజల నుండి అధికంగా ఫిర్యాదులు అందుతున్నాయని, సదరు ప్రాంతంలో ప్రత్యేకంగా డ్రైవ్ చేపట్టి శుభ్రం చేయాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. పెన్షన్ల పంపిణీని ప్రజలకు వారి ఇంటి వద్దకు వచ్చే అందించాలని సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. విధుల్లో నిరక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అవసరమైన ప్రాంతాల్లో కచ్చా డ్రైన్లు, జిఎస్బీ రోడ్ లు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. టిడ్కో గృహసముదాయాల్లో చేపట్టే అభివృద్ధి పనులకు టిడ్కో ఇంజినీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. పర్యటనలో ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, టిడ్కో ఎస్ఈ ఉమామహేశ్వరశా , సిఎంఓహెచ్ డాక్టర్ అమృతం, కార్పొరేటర్ బి.స్మిత పద్మజ, జిఎంసి డిఈఈలు శ్రీనివాస్, హనీఫ్, టిడ్కో డిఈఈ సేతుబాబు, ఎస్ఎస్ సోమశేఖర్, ఏఈలు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# కడప అమీన్‌పీర్ దర్గాలో చీఫ్‌విప్ జీవీ ప్రత్యేక పూజలు

**వినుకొండ,మే29,ప్రభాతవార్త:** కడపలోని అమీన్‌పీర్ దర్గాను ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు సందర్శించారు. పల్నాడు జిల్లా తెదేపా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్, డిసిసిబి ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావుతో కలిసి జీ.వీ గురువారం దర్గాలో ప్రత్యేక పూజలు



చేశారు. ఈ సందర్భంగా దర్గా నిర్వాహకులు ముస్లిం సంప్రదాయ పద్ధతిలో ఘన స్వాగతం పలికారు. దర్గా చారిత్రక, సాంస్కృతిక విశిష్టతను తెలియజేసి జీ.వీ, మక్కెనలకు తలపాగా చుట్టి సత్కరించారు. జీ.వీ మాట్లాడుతూ తెదేపా మహానాడు కనీవినీ ఎరుగని రీతిలో విజయవంతం కావడం పట్ల చాలా ఆనందంగా ఉందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలని ప్రార్థించినట్లు తెలిపారు.

# మహిళ అనుమానస్పద మృతి

**అమరావతి, మే 29 ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఎండ్రాయి గ్రామానికి చెందిన కాకి సంధ్యారాణి రెండవ కుమార్తె పావని ప్రేమ వివాహం చేసుకుంది. పావనికి ఇద్దరు కవల పిల్లలు జన్మించారు. చదువు మధ్యలో ఆపివేయడంతో తల్లి అమరావతిలో నివాసం ఉండటంతో ఆమె వద్దనే ఉంటుంది. భర్త వచ్చి వెళ్ళడం జరుగుతుందని తల్లి సంధ్యారాణి తెలిపారు. రెండవ సారి గర్భవతి కావడంతో చెకప్ చేయించుకొని వస్తానని వెళ్ళిన పావనిని భర్త, అత్తలు చిత్రహింసలకు గురి చేసి గొంతు నులిమి చంపేశారని తెలిపారు. పావని మృతదేహాన్ని భర్త తీసుకెళ్ళలేదని, మోతడకలో అబ్బాయి ఇంటి ఎదుట తల్లి బైటాయించారు. సంఘటనా స్థలానికి సి.ఐ.చేరుకొని మృతికి కారణమైన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపుతామని హామీ ఇచ్చారు.

# 31న లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

**ఎ కొండూరు, మే 29, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా ఎ కొండూరు మండలంలో ఎన్‌టిఆర్ భరోసా క్రింద ఈ నెల 31న లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయా గ్రామాల్లో సచివాలయాల సిబ్బంది ఇంకా ఇతర సిబ్బంది నిర్వహిస్తారని ఎంపిడివో బొజ్జగాని శ్రీనివాసరావు తెలిపారు. జూన్ 1న ఆదివారం సెలవురోజు కావడం వల్ల ప్రభుత్వం ఒకరోజు ముందుగానే మే నెల 31న ఈ పెన్షన్ల పంపిణీ కార్యక్రమం చేపడుతున్నట్లు ఎండివో శ్రీనివాసరావు తెలిపారు. మండలంలో ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్‌లు పొందే లబ్ధిదారులు 7283 మంది ఉన్నారని ఎంపిడివో శ్రీనివాసరావు తెలిపారు. ఈ పెన్షన్ పంపిణీ కార్యక్రమం ఈ నెల 31న ఉదయం 6 గంటలకే ప్రారంభమవుతుందని ఎంపిడివో శ్రీనివాసరావు తెలిపారు.

# పర్యావరణాన్ని కాపాడుతూ పరిశ్రమలను ఏర్పాటు చేయాలి : బాపట్లజిల్లా కలెక్టర్

**బాపట్ల,మే29,ప్రభాతవార్త:** పర్యావరణాన్ని కాపాడుతూ పరిశ్రమలను నడుపు కోవాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి సూచించారు. గురువారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో ఆక్వా పరిశ్రమలు, రిసార్ట్స్ యజమానులు,



హోటల్ యజమానులతో పర్యావరణ పరిరక్షణపై తీసుకోవాల్సిన చర్లపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఆక్వా పరిశ్రమల్లో విడుదల చేసిన వ్యర్థ పదార్థాలను నిల్వ చేయడానికి తప్పనిసరిగా అర ఎకరా భూమిని కేటాయించాలన్నారు. ఆక్వా పరిశ్రమల్లో విడుదల చేసిన వ్యర్థపదార్థాలను పంటకాలువలలోకి విడుదల చేయకుండా కట్టడి చేయాలన్నారు. ఇరిగేషన్ వనరులు దెబ్బతినకుండా పర్యావరణాన్ని కాపాడాలని యజమానులను ఆయన కోరారు. రొయ్య ప్రాసెసింగ్ యూనిట్లు ప్రభుత్వం ఆదేశాలను పాటించాలని యాజమాన్యానికి ఆయన తెలిపారు.రొయ్య ప్రాసెసింగ్ యూనిట్లపై 45 రోజుల్లోగా అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఆక్వా యాచరీలు 20 ఉన్నాయని, వీటిలో ఏడు ఆక్వా హేచరీలకు లైసెన్స్ లేవని అన్నారు. లైసెన్సులు లేని హేచరీలు నెలరోజుల్లోగా లైసెన్సులు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. జిల్లాలో రిసార్ట్స్ యజమానులు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి గాజు ప్లేట్లను, గాజు బాటిల్స్ వినియోగించాలని ఆయన చెప్పారు. జిల్లాలో రిసార్ట్స్ యజమానులు కోస్టల్ రెగ్యులేషన్ చట్టానికి లోబడి నిర్మాణాలు చేపట్టాలని ఆయన చెప్పారు. రిసార్ట్స్ యజమానులు పర్యాటకులకు మంచి అనుభూతి ఇచ్చే విధంగా సేవలు అందించాలని ఆయన చెప్పారు. రిసార్ట్స్ యజమానులు పర్యాటకులకు సముద్రంలోకి ఈతకు వెళ్లే సమయంలో సూచనల బోర్డులను తప్పనిసరిగా ఇవ్వాలని ఆయన చెప్పారు. పర్యాటకులను ఉత్సాహపరిచే విధంగా ప్లాస్టిక్ ఫ్రీ బోర్డులను రిసెప్షన్లో ఏర్పాటు చేయాలని ఆయన చెప్పారు. జిల్లా పంచాయతీ అధికారి, మత్స్య శాఖ జెడి, జిల్లాపర్యాటక శాఖఅధికారి, పొల్యూషన్ బోర్డ్ అధికారులు పరిశ్రమలను, రిసార్ట్స్ ను, హోటళ్లను జాయింట్ ఇన్స్పెక్షన్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, గ్రామీణ నీటి సరఫరాశాఖ ఎస్ఈ అనంతరాజు, జిల్లా పరిశ్రమలశాఖ మేనేజర్ రామకృష్ణ, పొల్యూషన్ బోర్డ్ ఇ. ఇ రాఘవరెడ్డి, బాపట్ల రెవిన్యూ డివిజనల్ అధికారి పి. గ్లోరియా, చీరాల రెవిన్యూ డివిజన్ అధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌సిసి ప్రత్యేక శిక్షణా శిబిరంలో విద్యార్థులకు శిక్షణ

**గుంటూరు విద్య,మే 29,ప్రభాతవార్త :** సమాజానికి సేవ చేసే శక్తివంతమైన యువతను సన్నద్ధం చేసేందుకు ఎన్‌సిసి ప్రత్యేక శిక్షణా శిబిరం దోహదపడుతుందని లెఫ్టినెంట్ కల్నల్ ఎస్.వి.ఎస్.సుదర్శన్ పేర్కొన్నారు.స్థానిక గుంటూరు చోడవరంలోని ఆర్‌విఆర్ జేసి ఇంజనీరింగ్ కళాశాల్లో 10 ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్ ఆధ్వర్యంలో గత 3రోజుల నుండి జరుగుతున్న కంబైన్డ్ యాన్యువల్ ట్రైనింగ్ క్యాంప్-1 శిక్షణా తరగతుల్లో భాగంగా బుధ,గురువారం రెండు రోజుల పాటు ఎన్‌సిసి క్యాడెట్లు ఆయుధాల వినియోగంపై ప్రత్యేక శిక్షణను అందించారు.ఈ శిక్షణలో విద్యార్థులు భద్రతా నియమావళి, ఆయుధాల ఉపయోగ విధానాలు,లక్ష్య సాధన నైపుణ్యం,ఆధునిక కాలంలో ఆయుధాల ప్రాధాన్యత వంటి అంశాలను నేర్చుకున్నారు.కార్యక్రమంలో ప్రత్యేక అతిథి లీగల్ అడ్వైజర్ అనురాధ మాట్లాడుతూ ఇలాంటి శిక్షణ తరగతుల ద్వారా విద్యార్థులకు దేశ భద్రత, చట్టభద్రత,సామాజిక బాధ్యత,త దితర అంశాలపై అవగాహన కల్పించుకుంటూ, దేశ సేవకులుగా సమాజంలో ఉత మ పౌరులుగా కొనియాడబడతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ మేజర్ అవినాశ్ పట్వాల్, క్యాంపు సీనియర్ జేసిఓ ఇమాం సాహెబ్ షేక్,క్యాంపు ట్రైనింగ్ జేసిఓ ఆర్. ఎస్.రాజు,క్యాంపు సూపరింటెండెంట్ కొల్లా రాజశేఖరబాబు, కళాశాల ఎన్‌సిసి అధికారులు డాక్టర్ తారాచంద్,డాక్టర్ ఉషా క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాన డ్రైన్లలో పూడిక తీత పనులను వేగవంతం చేయాలి : కమిషనర్ పులి శ్రీనివాసులు

**గుంటూరు కార్పొరేషన్,మే29,ప్రభాతవార్త :** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో వర్షం నీరు రోడ్ల మీద నిలవకుండా డ్రైన్లలోకి వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నామని, అందులో భాగంగా ప్రధాన డ్రైన్లలో పూడిక తీత పనులను వేగవంతం చేశామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. గురువారం కమిషనర్ బాలాజీ నగర్, పాత గుంటూరు తదితర ప్రాంతాల్లో పూడికతీత పనులను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించి, తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షాలకు డ్రైన్లలో నీరు సక్రమంగా పారుదల ఉండేలా పూడిక తీత చేపట్టామని, డ్రైన్ల మీద ఆక్రమణదారులకు ఇప్పటికే స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సమాచారం ఇచ్చామని, త్వరలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి ఆక్రమణలను తొలగిస్తామన్నారు. డ్రైన్లలో తీసిన పూడికను ఎప్పటికప్పుడు తొలగించాలని, పనులకు ముందు, తర్వాత ఫొటోలతో పూడిక తీత వివరాలు ఇవ్వాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అంతర్గత డ్రైన్లు మేజర్ డ్రైన్లలో కలిసే చోట తప్పనిసరిగా మెష్ లు ఏర్పాటు చేస్తున్నామని, వీటి వలన ప్లాస్టిక్ వ్యర్థాలను అడ్డుకోవచ్చన్నారు. ఆయా ప్రాంతాల్లో నిలిచే వ్యర్థాలను



ప్రజారోగ్య కార్మికులు ఎప్పటికప్పుడు తొలగించడం ద్వారా డ్రైన్ల ఓవర్ ఫ్లో తగ్గించుకోవచ్చన్నారు. వర్షాల వలన నీరు నిలిచే ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా నీటిని జెట్టింగ్ యంత్రాల ద్వారా బెయిల్ అవుట్ చేయడానికి ఇంజినీరింగ్ అధికారులు సిద్దంగా ఉండాలని ఆదేశించారు. ప్రజలు కూడా వ్యర్థాలను డ్రైన్లలో వేయకుండా ఇంటి వద్దకు వచ్చే ప్రజారోగ్య కార్మికులకే అందించాలని కోరారు.

# పభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వైకాపా వ్యతిరేకం

## మాజీ మంత్రి విడదల రజిని

-కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటుకు దారాదత్తం
-రూ.8500 కోట్ల ఆస్తులను రూ.5 వేలకే ఇచ్చేస్తున్నారు
-లీజు పేరుతో ప్రైవేటుకు 66 ఏళ్లకు కట్టబెట్టే కుట్ర
-మాజీ మంత్రి విడదల రజిని ఆగ్రహం

**గుంటూరు,మే29,ప్రభాతవార్త:** (రాష్ట్రంలో పేద విద్యార్థులకు వైద్య విద్యను చేరువ చేయాలనే గొప్ప సంకల్పంతో గత ప్రభుత్వంలో సీఎం వైయస్ జగన్ తీసుకువచ్చిన కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీలను కూటమి సర్కార్ దుర్మార్గంగా ప్రైవేటు వ్యక్తులకు కట్టబెటుతోందని మాజీ మంత్రి, వైయస్ఆర్‌సీపీ పీఏసీ మెంబర్ విడదల రజిని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడేపల్లి వైయస్ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ లీజు ముసుగులో దాదాపు రూ.8500 కోట్ల విలువైన ఆస్తులను కేవలం రూ.5వేలకే ప్రైవేటు వ్యక్తులక దారాదత్తం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లీజు ముసుగులో ప్రభుత్వ మెడికల్ కాలేజీలను 66 ఏళ్ళ పాటు ప్రైవేటు యాజమాన్యాలకు అప్పగించి, పేద విద్యార్థుల భవిష్యత్తుతో కూటమి ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని ధ్వజమెత్తారు. ఇంకా ఆమె ఎమన్నారంటే దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా గత వైయస్ జగన్ పాలనలో ఐదేళ్లలోనే 17 మెడికల్ కాలేజీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టి, వేగంగా పనులు మొదలుపెట్టారు. నాడు నేడు ద్వారా ప్రపంచశ్రేణి వసతులతో అపోలో, ఏఐజీ వంటి కార్పొరేట్ స్థాయి ఆస్పత్రులకు దీటుగా కాలేజీల నిర్మాణంను పరుగులు పెట్టించారు. మూడు విడతల్లో సుమారుగా రూ. 8500 కోట్లతో కాలేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. వైద్య విద్యను అభ్యసించాలని కలలు కనే పేదింటి బిడ్డల ఆశలను నెరవేర్చాలనే గొప్ప ఆశయంతో వైయస్ జగన్ ముందడుగు వేశారు. ప్రతి జిల్లా ప్రజలకు స్థానికంగానే సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ఉచితంగా అందించాలని వినూత్నమైన ఆలోచనలను ఆచరణలో పెట్టారు. అందరికీ అందుబాటులో ఉండేలా ఆయా ఆస్పత్రుల నిర్మాణం కోసం అతి కష్టం మీద ప్రైమ్ ఏరియాల్లోనే 50 ఎకరాల చొప్పున భూములు సేకరించారు. మొదటి దశలో ఐదు మెడికల్ కాలేజీలు పూర్తి చేసి క్లాసులు కూడా ప్రారంభించారు. రెండో దశలో పాడేరు, పులివెందుల, మార్కాపురం, ఆదోని, మదనపల్లె మెడికల్ కాలేజీలు పూర్తి చేయాలని నిర్ణయించాం. పాడేరు కాలేజీకి 50 సీట్లు కూడా మంజూరయ్యాయి. పులివెందుల కాలేజీకి ఎన్ఎంసీ సీట్లు కేటాయించినా వద్దని వెనక్కి ఇచ్చేసిన నీచ చరిత్ర చంద్రబాబుది. రెండో దశలో పూర్తి కావాల్సిన మెడికల్ కాలేజీల నిర్మాణం కోసం కూటమి ప్రభుత్వం వచ్చాక ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకుండా మూలన పడేసింది. ప్లగ్ అండ్ ప్లే తరహాలో ఎంబీబీఎస్ తరగతులు నిర్వహించేందుకుసకల సౌకర్యాలతో తీర్చిదిద్దిన కాలేజీలను ప్రైవేటుకు కట్టబెట్టి ఏకంగా 66 ఏళ్ల పాటు హక్కులు కల్పించబోతోంది. గత ప్రభుత్వంలో దాదాపుగా పూర్తయిన 10 మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తోంది.





**కన్సల్టెన్సీ ముసుగులో పథక రచన**

ప్రభుత్వం చేస్తున్న కుట్రలకు ఆమోద ముద్ర వేయించుకునేందుకు ఓ కన్సల్టెన్సీని తెరపైకి తెచ్చి కథ నడిపిస్తున్నారు. అధ్యయనం చేసి ప్రైవేటు వ్యక్తులకు ఏవిధంగా ఇస్తే బాగుంటుందో చెప్పే బాధ్యతను కేపీఎంజీ అనే ఒక కన్సల్టెన్సీకి అప్పగించారు. ప్రభుత్వం ముందుగానే ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టాలని నిర్ణయించుకుని మధ్యలో కన్సల్టెన్సీని తీసుకొచ్చి వారి రిపోర్టుతోనే ఇచ్చామనేలా కథ సిద్ధం చేసుకున్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్టుదలతో సాకారమైన ప్రభుత్వ నూతన వైద్య కళాశాలలను పీపీపీ పేరుతో (ప్రైవేట్ విద్యా సంస్థలకు కట్టబెట్టే యత్నాలను టీడీపీ కూటమి సర్కారు ముమ్మరం చేసింది.

**66 ఏళ్లపాటు ఎకరం లీజు ఏడాదికి రూ. 100లకే..**

ప్రతి గవర్నమెంట్ మెడికల్ కాలేజీని కనీసం 50 ఎకరాల్లో నిర్మాణం చేయడం జరిగింది. వాటిలో ఎకరం విలువ దాదాపు రూ. 2 కోట్లకు పైమాటే. ఇలాంటి స్థలాలను చంద్రబాబు ప్రభుత్వం కేవలం రూ. 100లకే లీజు పేరుతో కట్టబెట్టే వ్యూహాలకు పదునుపెట్టింది. 50 ఎకరాల స్థలంతో పాటు రూ.500 కోట్లతో నిర్మించిన కాలేజీలను ఏడాదికి కేవలం రూ. 5 వేలకే అప్పజెబుతున్నారు. ప్రభుత్వ కళాశాలలు, బోధనాస్పత్రులను ప్రైవేట్‌కు ఏకంగా 66 ఏళ్ల పాటు లీజుకు ఇస్తున్నారు. ప్రభుత్వ కాలేజీలను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెడితే రేపొద్దున పేదవాడు అనారోగ్యంతో ఆయా ఆస్పత్రులకు వెళితే వారికి ఉచితంగా వైద్యం అందే పరిస్థితి ఉండదు. వైద్య సేవలకు పేదల నుంచి ముక్కుపిండి డబ్బు వసూలు చేసే హక్కు ప్రభుత్వం కల్పిస్తోంది. డాక్టర్ విద్యను అభ్యసించాలనుకున్న ఎంతోమంది పేద విద్యార్థుల ఆశలపై చంద్ర బాబు నీళ్ల చల్లాడు. ఈ ఏడాది కాలంలో ఆస్పత్రులను ప్రభుత్వం పూర్తి చేసి ఉంటే ఎంతోమందికి స్థానికంగానే ఉచిత వైద్యంతోపాటు మరెంతోమందికి ఉపాధి అవకాశాలు దొరికేవి. చంద్రబాబు తీసుకున్న ప్రైవేటుపరం చేసే నిర్ణయంతో అన్ని అవకాశాలకు గండికొట్టేశాడు. ఇది మెడికల్ కాలేజీలను ప్రైవేటుకు అమ్ముకునే కుట్రే. ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేసే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి. కాదని ముందుకెళితే వైయస్సార్‌సీపీ చూస్తూ ఊరుకోదు. మళ్లీ వైయస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ నిర్ణయాన్ని రివ్యూ చేసి నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుంది.

**ఏడాదిలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం**

ఆర్థిక, రాజకీయ, సాంఘిక అంశాల మీదనే రాష్ట్ర అభివృద్ధి ఆధారపడి ఉంటుంది. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీటికి అర్థమే మారిపోయింది. వ్యవసాయం, పరిశ్రమలకు ప్రోత్సాహం లేక ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటోంది. సమస్యలపై రైతులు రోడ్డెక్కుతున్నారు. పరిశ్రమల ఊసేలేదు. ఐకానిక్ టవర్లంటూ మాయమాటలతో కాలయాపన చేస్తున్నారు. వారు ఎంచుకున్న అతికొద్ది మందిని ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ ప్రభుత్వం పనిచేస్తోంది. సాంఘిక అభివృద్ధి గురించి ఎంత తక్కువగా మాట్లాడితే అంత మంచిదేమో. సంక్షేమం అంటే ఈ ప్రభుత్వానికి నచ్చని పని. విద్య, వైద్యరంగాలను పూర్తిగా నిర్వీర్యం చేశారు. పొలిటికల్ డెవలప్ మెంట్ అంటే రెడ్ బుక్ పాలనతో ప్రశ్నించిన వారి మీద అక్రమ కేసులు బనాయించడమే ఈ ప్రభుత్వానికి తెలుసు. ఏడాదిలోనే అన్ని వ్యవస్థలను పూర్తిగా నిర్వీర్యం చేశారు.

# యాజలి గ్రామంలో ఆచార్య నాగార్జునుడి విగ్రహం ఆవిష్కరణ

**బాపట్ల,మే29,ప్రభాతవార్త:** బౌద్ధ ధర్మం, సంస్కృతి ఆచార్య నాగార్జునుడుతో పునర్జీవం పోసుకుంటూ విరాజిల్లడం అభిలషణీయమని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అన్నారు. ఆచార్య నాగార్జునుడి జన్మస్థలమైన బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం యాజలి గ్రామంలో ఫోరమ్ ఫర్ బెటర్ బాపట్ల సంస్థ ఏర్పాటు చేసిన ఆచార్య నాగార్జునుడి విగ్రహాన్ని కలెక్టర్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆచార్య నాగార్జునుడి శూన్య వాదంతో భారత్ ఐన్ స్టెన్ గా చరిత్రలో నిలిచిపోయారని ఆయన తెలిపారు. భారత దేశంలో రెండవ బుద్ధుడుగా ప్రాచుర్యం పొందారని, సృహలేఖ, రత్నావళి వంటి కావ్యాలను రాసిన గొప్ప వ్యక్తిగా అభివర్ణించారు. ప్రపంచ తత్వవేత్తగా ఎదిగి సమాజానికి మార్గ నిర్దేశించేశారని వివరించారు. నాగార్జునుడు రెండు వేల సంవత్సరాల క్రితం ఈ ప్రాంతంలోనే జన్మించారని చరిత్రను గుర్తు చేశారు. బుద్ధుడు, నాగార్జునుడు నడిచిన భూమిలో పర్యటించడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. నాగార్జునుడి కావ్యాలను శాతవాహన చక్రవర్తి ప్రాచుర్యంలోకి తెచ్చారన్నారు. ఆనాటి సంస్కృతిని, సంప్రదాయాలను ప్రజలు విస్మరించరాదన్నారు. నాగార్జునుడి పేరుతోనే నాగార్జునసాగర్ డ్యాం ని కేంద్ర ప్రభుత్వం నిర్మించిందన్నారు. ఆనాటి తవ్వకాలలో నాగార్జునుడి వస్తువులు వెలుగులోకి రావడంతో మ్యూజియం ఏర్పాటైందన్నారు. ఆయన పేరుతోనే ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఆయన గొప్ప చరిత్రకారుడు అని కొనియాడారు. బుద్ధుడి బోధనలను క్షేత్రస్థాయిలోకి తీసుకొని వెళ్ళిన గొప్ప మేధావిగా ఆయన అభివర్ణించారు.



బుద్ధుడి బోధనలు సదా ఆచరణీయమన్నారు. ఆయన జన్మించిన గ్రామాల్లోని ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం గ్రామస్తులకు గొప్ప భాగ్యమన్నారు. ఆయనను స్మరించుకోవడం శుభ పరిణామం అని ఆయన అన్నారు.ఫోరమ్ ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఆర్డీవో లవన్న, డిపిఓ ప్రభాకర్ రావు, ఎంపీడీవో ఏ శ్రీనివాసరావు, తహసిల్దార్ సుందరమ్మ, ఎంఈఓ విజయశ్రీ, కార్యదర్శి డాక్టర్ పిసి సాయిబాబు, సభ్యులు జీవి గురజాల శ్రీనివాసరావు, కె.నరసింహారావు, కరణం రవీంద్ర, లక్కాకుల వెంకటరావు, కేశవులు, సూరిబాబుతోపాటు గ్రామ సర్పంచ్ నాదెండ్ల భాను ప్రసాద్, ఉపసర్పంచ్ ఇక్కుర్తి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వాల కిట్ల పంపిణీ

**నరసరావుపేట, మే 29 ప్రభాతవార్త :** జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వాల కిట్ల పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మిరియాల సుబ్బమ్మ,



అద్దెపల్లి ఆనంద్, గుప్తా శ్రీకాంత్, కిష్టంశెట్టి గోవింద్, నిర్మల, శ్రీవణి, గాయత్రి తదితరులు పాల్గొని మాట్లాడారు. జనసేన కార్యకర్తల భద్రత కోసం జీవిత భీమా సభ్యత్వం తీసుకోవటం ద్వారా లభిస్తుందన్నారు. ప్రమాద భీమ సైతండిప్యూటీ సియం పవన్‌కళ్యాణ్ కల్పించటం గొప్ప విషయమన్నారు. పది సంవత్సరాల పవన్ కళ్యాణ్ నిస్వార్ధ పోరాటానికి ఫలితంగా ప్రజలు చారిత్రాత్మక విజయాన్ని అందించారని తెలిపారు. జాతీయ రాజకీయాలలో పవన్‌కళ్యాణ్ తనదైన ప్రభావాన్ని చూపి ఎన్డీయేను కేంద్రంలోకి అధికారంలోకి పవన్‌కళ్యాణ్ తెచ్చారన్నారు. రాబోయే కాలంలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో జనసేన నడుపుతుందని తెలియజేశారు.

# స్వచ్ఛందంగా విచ్చేసి రక్తదానం చేయటం అభినందనీయం : తహశీల్దార్

**యడ్లపాడు, మే 29, ప్రభాతవార్త :** స్వచ్ఛందంగా రక్తదాన శిబిరానికి విచ్చేసి రక్తదానం చేయటం చాలా అభినందనీయమని, రక్తదానం చేయటం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని, ప్రమాదాలు, శస్త్రచికిత్సలు లేదా అనారోగ్యాల కారణంగా రక్తమార్పిడి అవసరమైన వ్యక్తులకు



రక్తదానం ప్రాణాలను కాపాడుతుందని తహశీల్దార్ విజయశ్రీ పేర్కొన్నారు. యడ్లపాడు ఎంపీడీవో కార్యాలయంలో గురువారం జిల్లా కలెక్టర్ అదేశాలమేకు రెడ్ క్రాస్ సొసైటీ వారి సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. అంతేకాకుండా స్దానిక శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు జన్మదినం పురస్కరించుకొని నాయకులు, కార్యకర్తలు విచ్చేసి రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. వీరితోపాటు స్దానిక ఎస్సై బి శివరామకృష్ణ, రెవిన్యూ విర్వోలు, హౌసింగ్ ఏఈ షేక్ గౌస్‌భాషా, అర్ఐ సుబ్బారావు, వెల్ఫేర్ అసిస్టేంట్లు, ఇంజనీరింగ్ అసిస్టేంటులు, మండల టిడిపి అధ్యక్షుడు కామినేని సాయిబాబు రక్తదానం చేయటం జరిగింది. వీరందరికి రెడ్ క్రాస్ సొసైటీ తరుపున గుర్తింపు కార్డులు అందజేసారు. కార్యక్రమంలో తహాశీల్దార్ విజయశ్రీ, ఎంపీడీవో వి హేమలతాదేవి, ఇవోపిఅర్‌డి జాకీర్‌హుసేన్, పలువురు మండల, గ్రామ తెదెపా పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విజయవంతమైన రెడ్‌క్రాస్ రక్తదాన శిబిరం

**నరసరావుపేట, మే 29 ప్రభాతవార్త :** జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశాల మేరకు యడ్లపాడు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించినట్లు ఛైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తహాశీల్దార్ విజయశ్రీ, ఎంపిడిఓ హేమలతదేవిలు ఈ కార్యక్రమానికి ఎంతో సహకారం అందించారని తెలియజేశారు. ఆయా కార్యాలయాల సిబ్బంది, గ్రామ పెద్దలు రక్తదాన శిబిరానికి సహకారం అందించినట్లు తెలియజేశారు. ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు



జన్మదినం సందర్భంగా తెలుగుదేశంపార్టీ కార్యకర్తలు సైతం రక్తదానం చేసి తమవంతు సేవలను అందించారని తెలియజేశారు. యడ్లపాడులో రెడ్‌క్రాస్ సొసైటీ సబ్ బ్రాంచ్ ఏర్పాటు చేసి సేవలను కొనసాగిస్తామన్నారు. రక్తదానం చేసిన ప్రభుత్వ ఉద్యోగులకు డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కోశాధికారి జి.మురళీకృష్ణ, తెలుగుదేశం పార్టీ నాయకులు, ఆయా కార్యాలయాల ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మహానాడులో జెలీల్‌ఖాన్‌కు వైద్యసేవలు అందించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

**నరసరావుపేట, మే 29 ప్రభాతవార్త :** కడపలో జరుగుతున్న తెలుగుదేశంపార్టీ మహానాడులో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు వైద్యునిగా తన సేవలను అందిస్తున్నారు. విజయవాడ మాజీ ఎమ్మెల్యే జెలీల్‌ఖాన్ వేదికపై అకస్మాత్తుగా కుప్పకూలిపోయారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాలతో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు తక్షణమే స్పందించారు. ప్రాథమిక చికిత్సను అందించి జెలీల్‌ఖాన్‌ను వెంటనే వైద్యశాలకు తరలించే కార్యక్రమాన్ని చేపట్టారు. హాస్పటల్‌కు వెళ్లి వైద్య పరీక్షలు సంబంధించి తగు సూచనలు చేశారు. సకాలంలో ప్రాథమిక చికిత్స అందించడంతో పాటు హాస్పట



ల్‌కు వేగంగా తరలించేందుకు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు చూపిన చొరవ, వైద్యునిగా అందించిన సేవలను సిఎం నారా చంద్రబాబునాయుడు, మంత్రులు, ఎమ్మెల్యేలు అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ అరవింద్‌బాబు మాట్లాడుతూ మహానాడులో ఎటువంటి ఇబ్బందులు లేకుండా నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక వైద్యసేవలు అందుతున్నట్లు తెలియజేశారు.

# గుంటూరు జిల్లా వినియోగదారుల కమీషన్ అధ్యక్షురాలిగా విజయలక్ష్మీ

**గుంటూరు లీగల్,మే 29,ప్రభాతవార్త :** గుంటూరు జిల్లా వినియోగదారుల కమీషన్ అధ్యక్షురాలిగా కుమ్మమూరు విజయలక్ష్మిని నియమిస్తూ రాష్ట్ర వినియోగదారుల వివాద పరిష్కార కమీషన్ ఆదేశాలు జారీ చేసింది.పరిపాలనా పర మైన కారణాల నేపథ్యంలో ప్రస్తుత అధ్యక్షురాలు తాడికొండ సునీత



నుంచి విజయలక్ష్మీ పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. 2022 ఫిబ్రవరి నుంచి ఫోరం మహిళా సభ్యురాలిగా విజయలక్ష్మీ కొనసాగుతున్న విషయం విధితమే. వినియోగదారుల వివాదాల కేసులను త్వరితగతిన పరిష్కరిస్తామని బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా విజయలక్ష్మీ పేర్కొన్నారు.

# పారిశుద్ధ్య పనులు పర్యవేక్షించిన కమిషనర్

**నరసరావుపేట, మే 29 ప్రభాతవార్త :** పురపాలక సంఘ పరిధిలోని 2వ వార్డులో సింహాల మేడ బజారులో కాలువ పూడిక పనులతో పాటు కత్వాచెరువు డ్రైన్ క్లీనింగ్ పనులను మున్సిపల్ కమిషనర్ జశ్వంత్‌రావు గురువారం పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలను పాటించి పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశాలిచ్చారు. సమన్వయంతో



పనులు నిర్వహించాలని శానిటరీ అధికారులకు, సిబ్బందికి సూచనలు చేశారు. డ్రైయినేజీ నీరు ఎక్కడా నిల్వ ఉండకూడదని ఆదేశాలిచ్చారు. డ్రైన్లలో సమస్యాత్మక ప్రదేశాలను ముందుగా గుర్తించాలన్నారు. 34వ వార్డులలో పూడికతీత పనులకు రూ.40 లక్షలను కేటాయించి టెండర్లు పిలిచి పనులు జరుపుతున్నట్లు కమిషనర్ జశ్వంత్‌రావు తెలియజేశారు.

# ప్రభుత్వం నల్ల బర్లీ పొగాకు కొనుగోలు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం ఉధృతం చేస్తాం

## - రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు కృష్ణయ్య డిమాండ్

**పెదనందిపాడు మే 29 (ప్రభాతవార్త):** రాష్ట్ర ప్రభుత్వం నల్ల బర్లీ పొగాకును కొనుగోలు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా అన్ని సంఘాలను కలుపుకుని ఆందోళన ఉధృతం చేస్తామని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి. కృష్ణయ్య తెలిపారు . శుక్రవారం పెదనందిపాడు తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రంలో జరిగిన వివిధ ప్రజా అన్నారు .రైతాంగం అనేకవోట్ల వివిధ సంఘాల ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళన చేస్తున్నారని తెలిపారు. నల్లబర్లీ పొగాకును కొనుగోలు చేయాలని వివిధ కంపెనీలతో సమావేశాలు జరిపి కొనాలని మంత్రులు, ముఖ్యమంత్రులు ఆదేశించిన ఇంతవరకు కొనుగోలు చేయలేదని తెలిపారు. కనుక వెంటనే కొనుగోలు



సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి రైతు సంఘం నాయకులు దొప్పలపూడి రమేష్ బాబు అధ్యక్షత వహించారు.అనేక ప్రయాసలకు వోర్చి రైతాంగం నల్లబర్లీ పొగాకు పండించారని ఇంతవరకు కొనుగోలు చేయకపోవడం దారుణమని కృష్ణయ్య అన్నారు. ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి, ఇతర ప్రజాప్రతినిధులు ప్రతి కేజీ కొంటామని రైతాంగం ఆందోళన చేయవద్దని ప్రకటిస్తూ కాలయాపన చేయడం తప్ప కొనుగోలు ప్రారంభించ లేదని అన్నారు .ఈ చర్యలు రైతాంగాన్ని దగా చేయడమేనని చెప్పారు.

రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు మాట్లాడుతూ గుంటూరు ఛానల్ పొడిగింపుకు, నల్లమడ ఆధునికరణ కు నిధులు కేటాయిస్తామని ప్రస్తుత ప్రభుత్వం, గత ప్రభుత్వం వాగ్దానం చేసిన ఆచరణలో నిధులు కేటాయించలేదని వెంటనే నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సంవత్సరం గుంటూరు ,బాపట్ల, ప్రకాశం ,పల్నాడు జిల్లాల పరిధిలో వేలాది ఎకరాల్లో నల్లబర్లీ పొగాకును అనేక మంది పేదలు వ్యయ ప్రయాసలకు వోర్చి సాగు చేశారని అన్నారు. గత సంవత్సరం ఆశాజనకంగా ఉన్న ఈ పొగాకు పంట ఈ సంవత్సరం కొనుగోలు చేసే నాధుడు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన వలసి వస్తుంది. కనీసం 4000 కూడా కొనే పరిస్థితి లేదు .అధిక వర్షాలకు పంటను రక్షించుకునే ప్రయత్నం చేశారు .నల్లబెర్లీ పొగాకు సాగు చేసిన రైతులను పరిశీలిస్తే ఎక్కువ మంది పేద రైతులే ఉన్నారు అధిక కవులు చెల్లించి కౌలు రైతులు కూడా పొగాకు సాగు చేసిన స్థితి ఉంది. పొగాకు కొనుగోలు చేయక అప్పుల పాలైన రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న సందర్భాలు ఉన్నాయని ప్రారంభించాలని ఈరోజు జరిగిన సమావేశం తీర్మానించింది . నల్లమడ వాగు ఆధునికరణకు నిధులు కేటాయించి వెంటనే పనులు ప్రారంభించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు .నల్లమడ అడవుల్లో నుండి ప్రవహిస్తున్న దాదాపు 125 కిలోమీటర్లు ప్రయాణించే వాగు చిలకలూరిపేట, పెదనందిపాడు, కాకుమాను, పర్చూరు, బాపట్ల ,కర్లపాలెం మండలాలలో వర్షాకాలం వస్తే వాగు పొంగి కట్టలు తెగి లక్షలాది ఎకరాల్లో పంటలు ముంపుకు గురవుతున్నాయని అన్నారు. వాగులు వెడల్పు చేయడం మలుపుల వద్ద చరిచేయడానికి భూసేకరణ కూడా అవసరమని దాదాపు 310 కోట్లు నల్లమడ ఆధునికరణకు అవసరమని అధికారులు అంచనా వేశారని తెలిపారు. కానీ ఇంతవరకు నిధులు కేటాయించి పనులు ప్రారంభం కాలేదని అన్నారు. ప్రతి సంవత్సరం రైతులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని జీవిస్తున్నారని తెలిపారు .కనుక ఇంత ప్రాధాన్యత కలిగిన నల్లమడ ఆధునీకరణకు వెంటనే నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు .లేనిచో రాజకీయాలతో నిమిత్తం లేకుండా ఈ ప్రాంతం ప్రజానీకాన్ని ఐక్యం చేసి దశల వారీగా ఆందోళనకు పూను కొంటామని సమావేశం తీర్మానించింది. ఈసమావేశంలో రైతు సంఘం మండల నాయకులు దొప్పలపూడి రమేష్ బాబు, ముద్దన వెంకటేశ్వర్లు, జంపని రామారావు, పసుపులేటి శేషగిరిరావు, కన్నెగంటి చంద్రరావు ,పెన్షనర్ సంఘం నాయకులు గారపాటి రమేష్ ,నూర్ భాష సుభాని సాహెబ్, సిఐటియు నాయకులు ఫణిదపు భువనేశ్వరి, మర్రి లక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అన్నలదాసు ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

# కడప మహానాడులో సందడి చేసిన తెలుగు తమ్ముళ్లు

**మంగళగిరి, మే 29, ప్రభాతవార్త :** టిడిపి పార్టీ ప్రతిష్టాత్మకంగా కడపలో నిర్వహిస్తున్న 2025 మహానాడు కార్యక్రమం లో తెలుగుదేశం పార్టీ మంగళగిరి నియోజకవర్గ పెద్దవడ్లపూడి గ్రామం నుండి పార్టీ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. ఉత్సాహంగా మహానాడు సభలో మంగళగిరి మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ పార్టీ నేతలు సందడి చేశారు. ఈ సందర్భంగా జవ్వాది కిరణ్ చంద్ మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, స్థానిక శాసనసభ్యులు మంత్రి నారా లోకేష్ అంతగానో కృషి చేస్తున్నారని అన్నారు. ఈ మహానాడులో యువత, మహిళలు, రైతుల



సంక్షేమం సహా రాష్ట్ర సర్వతో ముకాభివృద్దే ప్రధాన అజెండాగా పలు నిర్ణయాలు అధినాయకత్వం ప్రకటించిందని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన విజయాలు భవిష్యత్ ఆలోచనలపై మహానాడులో సమగ్రంగా చర్చించారని తెలిపారు. అమరావతిని పునర్ నిర్మించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి మరువలేనిదని అన్నారు. అమరావతి రాజధానిలో రాష్ట్రవ్యాప్తంగా పెట్టుబడులు పెట్టటానికి పారిశ్రామికవేత్తలు ముందుకు తరలిరావడం మంత్రి స్థానిక శాసన సభ్యులు నారా లోకేష్ కృషి ఫలితమేనని జవ్వాది కిరణ్ చంద్ కొనియాడారు. కడపలో మహానాడు కు హాజరైన మంగళగిరి మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ మర్యాదపూర్వకంగా పరిటాల సునీతాను కలిసి ఆమెకు జన్మదినం సందర్భంగా శాలువాతో ఘనంగా సత్కరించి, పుష్పగుచ్ఛాన్ని అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# నేడు రేపు జాబ్ మేళా

**గుంటూరు విద్య,మే 29,ప్రభాతవార్త :** 10వ తరగతి నుంచి పోస్టు గ్రాడ్యుయేషన్ వరకు విద్యార్హతలు గల అభ్యర్థులకు ఈనెల 30,31తేదీల్లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు మాస్టర్ మైండ్స్ హెచ్‌ఆర్ విభాగాధిపతి సురేష్ రెడ్డి తెలిపారు. ఆయా తేదీల్లో ఉదయం 10నుండి సాయంత్రం 6గంటలట వరకు నిర్ణీత ధృవపత్రాలతో ఇంటర్వ్యూకి హాజరు కావాలని పేర్కొన్నారు. అర్హత గల అభ్యర్థులు బ్రాడీపేట 3/11లోని మాస్టర్ మైండ్స్ మెయిన్ క్యాంపస్ నందు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని వెల్లడించారు.

# 31న మెగా జాబ్ మేళా

**వినుకొండ,మే29,ప్రభాతవార్త:** రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 31న పట్టణంలోని జూనియర్ కాలేజి నందు మెగా జాబ్ మేళా కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజిరావు తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ, బీటెక్ తదితర విద్యార్హతలు గల నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. వివరాలకు సెల్: 9951214919, 9100566581, 7702921219 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

# కౌలు రైతులు రైతుల సమస్యలు పరిశీలించాలని కోరుతూ జూన్ 2.3.4, తేదీల్లో మండల కేంద్రాల వద్ద నిరసన

**పెదనందిపాడు మే 29 (ప్రభాతవార్త):** కౌలు రైతులు,రైతులు ,వ్యవసాయ కార్మికులు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి జూన్ 2 ,3, 4 తేదీలలో మండల కేంద్రాలలో నిరసన కార్యక్రమాలు చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పాశం రామారావు పిలుపునిచ్చారు. శుక్రవారం పెదనందిపాడు తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రంలో జరిగిన పత్రిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్నదాత



సుఖీభవ పథకంలో పెట్టుబడి సహాయాన్ని రైతులు, కౌలు రైతులకు ఇవ్వాలని, కౌలు రైతులకు యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా గుర్తింపు కార్డులు ఇచ్చి ,పంట రుణాలు మంజూరు చేయాలని కోరారు. కౌలు రైతులను ఈ క్రాప్ లో నమోదు చేయాలని, దేవాదాయ భూముల కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి పంట రుణాలు ఇవ్వాలని కోరారు. నల్లబర్లి పొగాకును ప్రభుత్వమే బాధ్యత తీసుకొని కంపెనీల ద్వారా కొనుగోలు చేయాలని, లేనిచో ఆందోళనకు పూనుకుంటామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు చేసిన వ్యవసాయ కార్మికులకు వెంటనే వేతనాలు ఇవ్వాలని కోరారు. గుంటూరు ఛానల్ ను పర్చూరు వరకు పొడిగించేందుకు నిధులు కేటాయించాలని, వెంటనే పనులు ప్రారంభించాలని కోరారు. 50 గ్రామాలకు త్రాగునీరు, 50 వేల ఎకరాలకు సాగునీరు అందజేసే ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేయాలని అన్నారు. నల్లమడ వాగు ఆధునీకరణకు నిధులు కేటాయించి, వర్షాకాలంలో పంటలు ముంపునకు గురికాకుండా కాపాడాలని, ప్రభుత్వం వాగ్దానానికి అనుగుణంగా నల్లమడ ఆధునీకరణకు నిధులు కేటాయించాలని కోరారు. పై సమస్యల పరిష్కారానికి జరిగే ఆందోళనలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో రైతు సంఘం నాయకులు దొప్పలపూడి రమేష్ బాబు, ముద్దన వెంకటేశ్వర్లు, జంపని రామారావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అన్నలదాసు ఆశీర్వాదం పాల్గొన్నారు.

# ఎన్నారై సంస్థలో పనిచేసే ఉద్యోగుల భద్రత పై కట్టుబడి ఉన్నాం

**మంగళగిరి మే 29, ప్రభాతవార్త :** ఎన్నారై సంస్థలో పనిచేసే ఉద్యోగుల భద్రతకు మేనేజ్మెంట్ ఎల్లవేళలా కట్టుబడి ఉంటుందని ఎన్నారై అకాడమీ



ఆఫ్ సైన్సెస్ అడ్మినిస్ట్రేటర్ మండవ విష్ణువర్ధన్ రావు స్పష్టం చేశారు. ఎన్నారై జనరల్ హాస్పిటల్ నందు పనిచేస్తున్న వెనిగండ్ల అమర్నాథ్ పెనుగంచిప్రోలు లక్ష్మీ తిరుపతమ్మ వారి దర్శనానికి వెళ్తూ ప్రమాదవశాత్తు జరిగిన యాక్సిడెంట్లో తీవ్రంగా గాయపడ్డారు. దాదాపు మూడు నెలలు పాటు వైద్యం తీసుకొని తిరిగి సాధారణ స్థితికి వచ్చిన అమర్నాథ్ కష్టకాలంలో అండగా నిలిచి, నాణ్యమైన వైద్యాన్ని అందించిన ఎన్నారై అకాడమీ ఆఫ్ సైన్సెస్ అడ్మినిస్ట్రేటర్ మండవ విష్ణువర్ధన్ రావు ని కుటుంబ సమేతంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ మాట్లాడుతూ అమర్నాథ్ ని తిరిగి సాధారణ స్థితికి తీసుకొచ్చిన డాక్టర్ అమిత్ డాక్టర్ ఆరిఫ్ మరియు టీమ్ వైద్యులను అభినందించారు. అమర్నాథ్ కి ఎన్నారై జనరల్ అండ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ట్రీట్మెంట్ అంతా సవ్యంగానే అందించామని అన్నారు .ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ద్విచక్ర వాహనాలపై వెళ్లే ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరిస్తే యాక్సిడెంట్ తీవ్రతను చాలా వరకు తగ్గించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ వేంకటేశ్వర రావు , మెడికల్ రికార్డ్ యూనిట్ విభాగాధిపతి వేంకటేశ్వర రావు పాల్గొన్నారు.

# దళితులు,బలహీన వర్గాల వారిపై దాడులను ఖండిస్తున్నాం

**మంగళగిరి, మే 29, ప్రభాతవార్త :** ఇటీవల తెనాలిలో పోలీసులు నిర్వహించిన రాజ్యాంగ చట్ట వ్యతిరేక పోలీసు రౌడీ దర్బార్ శృతిమించిన వికృత



క్రీడగా అభివర్ణిస్తూ ఆంధ్రప్రదేశ్ ఎమ్మార్పీఎస్ లీగల్ సెల్ కన్వీనర్, న్యాయవాది చిలువూరు నాగరాజు మాదిగ తీవ్రంగా గురువారం ఒక ప్రకటనలో ఖండించారు. పోలీసులు శృతిమించిన వ్యవహార శైలి సమాజంలో అలజడి సృష్టించే విధంగా హింసను ప్రేరేపించే విధంగా ఉందన్నారు. అంబేద్కర్ రాజ్యాంగ అమలు అవుతున్న విశ్వ విఖ్యాత ప్రజాస్వామ్య భారత దేశంలో ఎంతటి వారైన చట్టానికి లోబడి,విధేయతగా ప్రవర్తించాలని పోలీసులు అందుకు అతీతులు కాదని ఆయన అన్నారు. సమాజానికి రక్షణ కల్పించి ఆదర్శంగా విధులు నిర్వహించాల్సిన పోలీసులు చట్టాన్ని చేతిలోకి తీసుకోవడం క్షమించరాని నేరం అన్నారు. నేరస్తులను అసాంఘిక ప్రవర్తనను నియంత్రించాల్సిన బాధ్యత పోలీస్ శాఖకు ఉన్నప్పటికీ వారికి రాజ్యాంగం ప్రకారం చట్ట పరిధి ఉందని దానిని వారు అతిక్రమించి రాజ్య హింసకు పాల్పడ్డారని బాధ్యులైన పోలీస్ లను వెంటనే సస్పెండ్ చేసి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని నాగరాజు డిమాండ్ చేశారు. నేరస్తులను నియంత్రించడానికి పోలీస్ లే నేరస్తులుగా మారితే సమాజానికి ఎలాంటి సందేశం ఇస్తున్నారని ఆయన ప్రశ్నించారు. కేవలం సమాజంలో దళితులు, బలహీన వర్గాలపై ఇలాంటి పోలీసుల దమన కాండ అకృత్యాలు ప్రదర్శిస్తున్నారని పెద్ద పెద్ద నేరాలు చేసిన అగ్ర వర్ణాలవారు రాజకీయ నాయకులు పోలీసు, న్యాయ వ్యవస్థలో పెద్ద నేరాలు చేసిన వారు సమాజంలో స్వేచ్ఛగా తిరుగుతూ చట్టాన్ని రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నారని పోలీసులకు దమ్ముంటే వారిని చట్ట పరిధిలోకి తీసుకొచ్చి కఠినంగా శిక్షించి చట్టానికి అందరూ సమానమే అనే ఒక ఆదర్శవంతమైన సందేశాన్ని ఇవ్వాలని నాగరాజు మాదిగ సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటన జరగకుండా పోలీస్ శాఖ ఉన్నతాధికారులు ఈ సంఘటనపై తగిన చర్యలు తీసుకోవాలని నాగరాజు విజ్ఞప్తి చేశారు.

# ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టు ఉద్యోగుల జీతాల సమస్య పరిష్కరించాలి

**గుంటూరు విద్య,మే 29,ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు చాంద్‌భాషా తో జిల్లా కార్యవర్గ సభ్యులు కలసి గుంటూరుజిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ను కలసి స్పోర్ట్స్ అథార్టి లో (బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో) పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు మరియు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు గత 11నెలలుగా జీతాల్లేక ఇబ్బంది పడుతున్నారని వారి దృష్టికి



తీసుకెళ్ళారు. ఇన్‌చార్జ్ కలెక్టర్ ఎ.భార్గవ తేజని కలసి వినతిపత్రం అందజేశారు. సమస్యను పరిష్కరించాలని కోరారు. వారు స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా అధ్యక్షులు చాంద్ భాష, జిల్లా సంయుక్త కార్యదర్శి కోటా సాహెబ్, జాన్ తదితరులు పాల్గొన్నారు.

# మహానాడులో ఉత్సాహంగా పాల్గొన్న తెలుగు తమ్ముళ్లు

**మంగళగిరి, మే 29, ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా కడపలో చేపట్టిన 2025 మహానాడు కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ మంగళగిరి నియోజకవర్గం నుండి పార్టీ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు ఉత్సాహంగా మహానాడు సభలో మంగళగిరి పట్టణ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు గోవాడ దుర్గారావుమంగళగిరి పట్టణ పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు వాకా మాధవ్ గౌడ్



తెలుగుదేశం పార్టీ గుంటూరు జిల్లా పద్మశాలి సాధికార సమితి సభ్యులు జొన్నాదుల బాలకృష్ణ , పాల్గొన్న వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మంత్రి స్థానిక ఎమ్మెల్యే నారా లోకేష్ కార్యకర్తలకు పెద్దపీట వేస్తున్నారని తెలిపారు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ఇచ్చే ప్రాధాన్యత మరే పార్టీలోనూ ఉండదని తెలిపారు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కష్టాల్లో ఉన్న అమరావతిని తిరిగి గాడిలో పెట్టే పనిలో నిమగ్నమయ్యారని పేర్కొన్నారు. పారిశ్రామికవేత్తలు అమరావతిలో పెట్టుబడులు పెట్టేందుకు తరలిరావడం శుభ సూచికమని తెలిపారు. విద్యా ఉపాధి అవకాశాలు మెరుగుపడాలంటే తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంతోనే సాధ్యమని తెలిపారు.

# తెలుగు జాతి గుండె చప్పుడు స్వర్గీయ ఎన్టీఆర్

**మంగళగిరి, మే 29, ప్రభాతవార్త :** మంగళగిరి పట్టణ 14 వార్డు, గుంటూరు పార్లమెంటరీ పద్మశాలి సాధికార సమితి సభ్యుడు జొన్నాదుల బాలకృష్ణ.. ..ఆధ్వర్యంలో స్వర్గీయ విశ్వవిఖ్యాత నటసార్వభౌమ డాక్టర్ నందమూరి తారక



రామారావు 102 వ జయంతి వేడుకలు బుధవారం మంగళగిరి పట్టణంలోని 14 వ వార్డులో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తిరుమల తిరుపతి దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకి దేవి పాల్గొని మాట్లాడుతూ సినీ రంగంలో మకుటం లేని మహారాజుగా అగ్రస్థానంలో ఉండి, తెలుగు ప్రజల కోసం రాజకీయ రంగ ప్రవేశం చేసిన ఎన్టీఆర్ బడుగు బలహీనవర్గాలకు వర్గాలకు రాజ్యాధికారం కల్పిస్తూ.... దేశ రాజకీయాలను ఎంతగానో ప్రభావితం చేశారని కొనియాడారు. ఎన్టీఆర్ పాలన పేద వక్కాల సంక్షేమానికి ఆయన చేసిన కృషి చిరస్థాయిగా తెలుగు ప్రజల గుండెల్లో నిలిచిపోయి ఉంటుందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి పట్టణ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు వాకా మాధవరావు గౌడ్, మాజీ కౌన్సిలర్ వింజమూరు ఆశాబాల, రాష్ట్ర సాధికార రాష్ట్ర సాధికార సమితి సభ్యులు అన్నం నాగబాబు, మంగళగిరి నియోజకవర్గ వాణిజ్య విభాగపు అధ్యక్షుడు మాజేటి సూర్య వేణుగోపాలకృష్ణ శేష్టి, నియోజకవర్గ అధికార ప్రతినిధి వెలగపాటి విలియం, సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకుడు గోవాడ రవి, జంజనం వెంకట సుబ్బారావు, జొన్నాదుల వెంకట రామాంజనేయులు, మంగళగిరి నియోజకవర్గ ఎమ్మార్పీస్ అధ్యక్షులు కలకోటి నాగేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ 14 వ వార్డు అధ్యక్ష కార్యదర్శులు కొల్లి వేణుబాబు, వెనిగల భద్రయ్య, పార్టీ నాయకులు ఆకురాతి లక్ష్మణ్, దామర్ల హరి, కారంపూడి శివరామకృష్ణ, నంది,గంటి హనుమాన్ ప్రసాద్, ఆకురాతి రాము తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ సెక్యూరిటీ పై శిక్షణ వర్క్‌షాప్

**తాడేపల్లి,మే 29,ప్రభాతవార్త :** రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం కార్యాలయంలో ఢిల్లీ ఫౌండేషన్ ఫర్ ఎంఎస్ఎంఈ క్లస్టర్,సింగపూర్ ఏషియా ఫౌండేషన్,రామచంద్రపురం త్రిపాఠి ఎడ్యుకేషనల్



సొసైటీ ఆధ్వర్యంలో గురువారం సైబర్ సెక్యూరిటీ శిక్షణ వర్క్‌షాప్ నిర్వహిం చారు.ముఖ్యఅతిధులుగా అర్బన్ సిఐ డి.వినోద్‌కుమార్,జిల్లా స్వర్ణకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు పారేపల్లి మహేష్ హాజర య్యారు.శిక్షణ వర్క్‌షాప్‌లో స్వర్ణకారులు, చిన్న కుటీర పరిశ్రలమ ద్వారా రుణాలు పొందిన లబ్ధిదారులకు సైబర్ సెక్యూరిటీ పై శిక్షణ ఇచ్చారు.ఈ సందర్భంగా అర్బన్ సిఐ వినోద్‌కుమార్ మాటా ్లడారు.సమాజంలో సైబర్ నేరాలు పెరుగుతున్న నేపధ్యంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సైబర్ నేరాలపై విపరీతంగా అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపడుతున్నాయన్నారు.పోలీస్‌శాఖ కూడా సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ,ఎన్నో కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఇంటి దగ్గర నుండి డబ్బులు సంపాదించవచ్చు ,ఆన్‌లైన్ ట్రేడింగ్ చేయమని వచ్చే లింకులను నమ్మవద్ద న్నారు.ఆన్‌లైన్ లింకుల నుండి సాధ్యమైనంత వరకు తప్పించుకోవాలన్నారు. సైబర్ సెక్యూరిటీ పై శిక్షణ పొందుతున్న మీరు,సైబర్ మోసాలకు గురికాకుండా ప్రజలకు తెలియ చెప్పాలన్నారు. జిల్లా బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు పారేపల్లి మాట్లాడుతూ సైబర్ మోసాలకు ఎక్కువగా గురయ్యేది స్వర్ణకారులే అన్నారు. స్వర్ణకారులకు అవగాహన కలి ్పంచి,శిక్షణ ఇచ్చేందుకు ముందుకొచ్చిన సంస్థల నిర్వాహకులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ ఫౌండేషన్ స్టేట్ కోఆరి ్డనేటర్ పి.శ్రీనిబాబు,జిల్లా ట్రైనర్ కె.రమేష్‌బాబు,త్రిపాఠి సొసైటీ కార్యదర్శి కొప్పుశెట్టి త్రిపాఠి,కోశాధికారి పారేపల్లి నారాయణ రాహుల్,బిసి సంక్షేమ సంఘం నాయకులు జంజనం వరప్రసాద్, నగేష్,నారాయణ,ఆళ్ళ శివాజీ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వర్క్‌షాప్‌లో శిక్షణ పొందుతున్న వారికి జిల్లా పోలీస్ శాఖ రూపొందించిన సైబర్ నేరాలపై తెలియని ఏపికే ఫైళ్ళను ఎప్పుడు ఇన్‌స్టాల్ చేయవద్దు అనే నినాదంతో కూడిన సైబర్ సెక్యూరిటీ, 1930టోల్‌ఫ్రీ నెంబర్‌తో కూడిన అవగాహన ప్లకార్డులను పంపిణీ చేశారు.

# పంట కాలువల పనులు వేగవంతం చేయాలి

**బాపట్ల,మే29,ప్రభాతవార్త:** పంట కాల్వల పూడికతీత, మరమ్మతు పనులను వేగంగా పూర్తి చేయాలని జల వనరుల శాఖ ఇంజినీర్లను జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ఆదేశించారు.కర్లపాలెం మండలంలో కలెక్టర్ వెంకట మురళి గురువారం విస్తృతంగా పర్యటించారు.రూ.12 లక్షలతో తిమ్మరాజు కాల్వ మరమ్మతు పనులకు జిల్లా కలెక్టర్ భూమి పూజ చేసి ప్రారంభించారు.కాల్వల పూడికతీత పనులను పరిశీలించారు. దమ్మన్న వారిపాలెంలోని చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. రైతుల పక్షపాతి ప్రభుత్వంగా రైతుల వెంట నిలిచిందన్నారు. రైతులకు మేలు చేయడమే లక్ష్యంతో పంట కాల్వల పూడికతీత, మరమ్మతు పనులను చేపట్టిందన్నారు. వ్యవసాయ రంగంపై ఆధారపడిన బాపట్ల జిల్లాలో పంట కాల్వలను ఎప్పటికప్పుడు పూడిక తీత పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆయకట్టు భూములన్నింటికీ సాగునీరు చేరేలా అధికారులు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలన్నారు. కాల్వలలో నీరు సజావుగా దిగువ ప్రాంతాలకు వెళ్తే రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ విషయాలను అధికారులు పరిగణనలోకి తీసుకోవాలన్నారు. కృష్ణ పశ్చిమ డెల్టా పరిధిలోని పంటకాల్వల మరమ్మతులకు నిధులు విడుదల చేసిందన్నారు. బాపట్ల జిల్లాలోని కాల్వలపై 454 పనులు గుర్తించి ప్రతిపాదనల పంపగా ప్రభుత్వం రూ.12.59 కోట్లు నిధులను విడుదల చేసిందన్నారు. వాటితో జిల్లా



వ్యాప్తంగా మరమ్మతు పనులు మొదలయ్యాయన్నారు. తిమ్మరాజుపాలెం గ్రామానికి వెళ్లే పంట కాలువ 10 కిలోమీటర్ల మేర మరమ్మతు పనులు ప్రారంభం అయ్యాయన్నారు. వర్షాలు రాకమునుపే, చేపట్టిన పనులన్నిటిని పూర్తిచేయాలని జల వనరుల శాఖ ఇంజినీరింగ్ అధికారులకు ఆయన సూచించారు.గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. భావితరాల కొరకు పర్యావరణాన్ని కాపాడాలని, పర్యావరణ పరిరక్షణతోనే ప్రజల ఆరోగ్యం పదిలంగా ఉంటుందన్నారు. ఆ గ్రామంలో చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. 350 గృహాల నుంచి వెలువడే చెత్తను గ్రామం వెలుపల డంపింగ్ చేయడంపై అధికారులను ప్రశ్నించారు. ఆ గ్రామానికి ఇద్దరు క్లాప్ మిత్రులు ఉండడం ఏమిటని, జనాభా సంఖ్యను బట్టి క్లాప్ మిత్రులను ఏర్పాటు చేసుకోవాలని డిపిఓ కి సూచించారు. ఏ గ్రామంలోనైనా చెత్త దిబ్బలు కనిపించరాదన్నారు. చెత్తను కాల్చివేయడం ద్వారా పర్యావరణానికి హాని కలుగుతుందన్నారు. పరిసరాలలో పరిశుభ్రత లోపిస్తే ప్రజలు రోగాల భారిన పడతారన్నారు. ప్రతి ఇంటి వద్దనే ప్రజలు పొడి చెత్త, తడి చెత్త ను వేరుపరిచేలా అవగాహన కల్పించాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు వేరుగా, ఇనుము వంటి లోహాలు వేరుగా, గాజు పదార్థాలు వేరుగా, భూమిలో కూలిపోయే పదార్థాలను వేరు చేసి చెత్త కుండిలో వేయాలన్నారు. కుళ్లిపోయే పదార్థాలను చెత్త సంపద కేంద్రంలో వేరువరచి సంపద సృష్టికి సహకరించాలన్నారు. తద్వారా పర్యావరణానికి ఎలాంటి హాని ఉండదనే విషయాలను గ్రామస్తులకు వివరించాలన్నారు. ప్లాస్టిక్ ఉద్గారాలను వేరుచేసి విక్రయించుకునే పద్ధతులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాలలో అధికారులు నిర్లిప్తంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. అధికారులు ఛాలెంజ్ గా పనిచేయాలని సూచించారు. దుకాణాల వద్ద ప్లాస్టిక్ సంచుల వాడకాన్ని నియంత్రించుకోవాలన్నారు. తదుపరి పర్యటనలో అధికారుల పద్ధతి మారకపోతే క్రమశిక్షణ చర్యలు ఉంటాయన్నారు.ఆయన వెంట జలవనరుల శాఖ ఎస్ఈ వెంకటరత్నం, డిపిఓ ప్రభాకర్, బాపట్ల ఇంచార్జి ఆర్డీవో లవన్న, డిఈ జాకిర్, ఎండిఓ ఏ శ్రీనివాసరావు, తహసిల్దార్ సుందరమ్మ, తదితరులు ఉన్నారు.

## కళారత్న పురస్కారగ్రహీత మస్తానయ్యకు సన్మానం

**గుంటూరు కల్చరల్,మే 29,ప్రభాతవార్త :** స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం కార్యాలయంలో గురువారం సాయంత్రం కళావిపంచి అధ్యక్షులు ఆరాధన ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షులు తిరుమలేశ్వరరావు, కళావిపంచి ఉపాధ్యక్షులు సయ్యద్ జానీ భాష ఆధ్వర్యంలో తిరుమలేశ్వరరావు, యువకళావాహిని ప్రధాన కార్యదర్శి జి.మల్లికార్జునరావు,తెనాలి మోటార్ వెహికల్ అధికారి మధుసూదన్‌రావు,ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున కళారత్న పురస్కార గ్రహీత పాలకమండలి అధ్యక్షులు సి.హెచ్.మస్తానయ్య ను ఘనంగా సత్కరించారు.



## మలబార్ సేవా కార్యక్రమాలు ఆదర్శనీయం : అరండల్‌పేట సిఐ ఆరోగ్యరాజు

**గుంటూరు విద్య,మే 29,ప్రభాతవార్త :** మలబార్ సంస్థ పేద ప్రజలకు చేస్తున్న సేవా కార్యక్రమాలు ఆదర్శనీయమైనవని స్థానిక అరండల్‌పేట పోలీస్ే ్టషన్ సిఐ ఆరోగ్యరాజ్ అన్నారు.బంగారు,వజ్రాభరణాల వ్యాపార రంగంలో ప్రసిద్ధి చెందిన మలబార్ లక్ష్మీపురం షోరూమ్ లో హంగర్ ఫ్రీ వరల్డ్ అనౌన్ ్స ఈవెంట్‌ను ప్రారంభించింది.ఈ ఈవెంట్‌లో అరండల్‌పేట స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఆరోగ్యరాజు ముఖ్యఅతిధిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా సిఐ ఆరోగ్యరాజు మీడియాతో మాట్లాడుతూ సేవారంగంలో మలబార్ చేస్తున్న విశేష కార్యక్రమాలను అభినందించారు.పేద ప్రజలకు ఆకలిని తీరుస్తూ,విలువైన విద్యను అందించే విధంగా మలబార్ చేస్తున్న సేవా కార్యక్రమాలు ఆదర్శనీయమన్నారు.స్టోర్ మార్కెటింగ్ మేనేజర్ గోపి కిరణ్ మాట్లాడుతూ ఏ వ్యాపార సంస్థ చేయని రీతిలో గత మూడు సంవత్సరాల్లో మలబార్ సంస్థ పేదల కోసం రూ.310కోట్లు ఖర్చుచేయడం జరిగిందన్నారు.ఈ సంవత్సరం రూ.150కోట్లు కేటాయించడం జరిగిందన్నారు.అదే విధంగా పేదలకు అందించే భోజనం ప్యాకెట్లను 60వేల నుంచి 70వేలకు పెంచడం జరిగిందని వివరించారు.పేద ప్రజలకు అండగా మలబార్ సంస్థ ముందుంటుందన్నారు.మలబార్ సంస్థ ఎదుగుదలలో భాగమైన కస్టమర్లకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో స్టోర్ హెడ్ నదీర్,పెద్ది రమణారావు తదితరులు పాల్గొన్నారు.



## చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట,మే29,ప్రభాతవార్త:** రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్న చంద్రబాబు నాయుడు ఆశలు, ఆకాంక్షలు నెరవేరాలని, ఆయన నాయకత్వంలోని కూటమి ప్రభుత్వంలో



నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధి, సంక్షేమంలో దేశంలోనే అగ్రస్థానంలో నిలవాలని కలియుగదైవం శ్రీ వేంకటేశ్వరుని వేడుకున్నట్లు మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. మహానాడు చివరిరోజైన గురువారం ఉదయం ప్రత్తిపాటి తిరుమల శ్రీవారిని దర్శించుకొని స్వామివారి సేవలో పాల్గొన్నారు. దర్శనాంతరం తిరుమల మాడవీధులలో ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు నాయ కత్వంలోని కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం దినదినాభివృద్ధి చెంది, దేశానికే గర్వకారణంగా నిలవాలని, ఆ దిశగా రాష్ట్ర పురోగతిసాధనకు అవసరమైన శక్తియుక్తులను ముఖ్య మంత్రికి ప్రసాదించాలని స్వామివారిని వేడుకున్నట్లు ప్రత్తిపాటి తెలిపారు. స్వామివారి ఆను గ్రహంతోనే పార్టీ పండుగైన మహానాడు అనుకున్నదానికంటే ఎక్కువగా విజయవంతం అయిందిని ప్రత్తిపాటి చెప్పారు. మహానాడులో తీర్మానాలన్నీ దిగ్విజయంగా అమలై లోకేష్ నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ తిరుగులేని విధంగా ఎదగాలని స్వామిని ప్రార్థించినట్లు ఆయన చెప్పారు. అనంతరం టిడిపి చైర్మన్ బిఆర్ నాయుడుతో ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా బేటి అయ్యారు. టిడిడిలో చేపట్టిన సంస్కరణలు, భక్తులకు అందిస్తున్న సేవలు బాగున్నాయని ప్రత్తిపాటి బిఆర్ నాయుడుని ప్రత్యేకంగా అభినందించారు. ఆలయ అధికారులు సమన్వయంతో పనిచేసి తిరుమల ప్రతిష్టను మరింత పెంచాలని ప్రత్తిపాటి సూచించారు. ప్రత్తిపాటి జన్మదినమని తెలుసుకున్న బిఆర్ నాయుడు ఆయనను ప్రత్యేకంగా సన్మానించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియచేశారు. ప్రత్తిపాటితో పాటు తిరుమల స్వామివారి దర్శనానికి టిడిపి నాయకులు కందుల రమణ, గంగా శ్రీనివాసరావు, గట్టినేని రమేష్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



## గారపాడు గ్రామంలో ఎన్టీఆర్ జయంతి

**పెదకూరపాడు, మే 29 ప్రభాతవార్త :** మండలంలోని గారపాడు గ్రామంలో ఎన్టీఆర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిరాల గంగాధర్ మాట్లాడుతూ సినిమాలలోనూ, రాజ కీయాలలోనూ నందమూరి తారక రామారావు



విప్లవాత్మక మార్పులు తెచ్చారన్నారు. పేదలకు కూడు, గూడు, గుడ్డ కల్పించడమే లక్ష్యంగా సేవలందించారన్నారు. అదే విధంగా రూ.2కే కిలో బియ్యం, జనతా వస్త్రాలు, పక్కా గృహాల నిర్మాణం వంటి సంక్షేమ పథకాలను అందించారన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు మక్కెన సాగర్, పొదిలి కోటేశ్వరరావు, రమేష్, రమణబాబు, సాగర్, రామకృష్ణ, వెంకటేశ్వరరావు, సౌరీలు, రామయ్య, గోపి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవు

### -తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్

**పొన్నూరు, మే 29,ప్రభాతవార్త:** సినిమాహాళ్ళ నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను తప్పని సరిగా పాటించాల్సిందేనని, పాటించని వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకొంటామని తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ హెచ్చరించారు. పట్టణంలోని సినిమాహాళ్ళను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సినిమా హాళ్ళలో ప్రేక్షకులకు కల్పిస్తున్న వసతులపై ఆరా తీశారు. నిబంధనల మేరకు హాళ్ళు నడుస్తు న్నాయా..?లేదా? అనే విషయాలను పరిశీలించారు. ఫైర్ సేఫ్టీ మెథడ్స్ ప్రకారం ఉన్నాయా..?లేదా అనే



విషయాలను చూశారు. ప్రేక్షకులకు కల్పించాల్సిన వసతులు సక్రమంగా ఉన్నాయా..?లేదా..?అని తెలుసుకొన్నారు. సినిమాహాలులో విక్రయించే తినుబండారాలు, ఇతర పానీయాలు వాటికి సంబంధించిన నాణ్యత, ధరల గురించి అడిగి తెలుసుకొన్నారు. సినిహాలుకు సంబంధించిన అన్ని అనుమతులు ఖచ్చితంగా ఉన్నాయా..?లేదా..? లేకపోతే ఎందుకు లేదు అనే విషయాలను కూడా తెలుసుకొన్నారు. తహశీల్దార్ వెంట ఇన్‌చార్జి సూపరింటెండెంట్ రామారావు, విఆర్వో శ్రీకాంత్ తదితరులున్నారు.

# ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

**చిలకలూరిపేట,మే29,ప్రభాతవార్త:** పదవులు హోదాలకంటే తను నమ్ముకున్న ప్రజల యోగ క్షేమాలు, నియోజకవర్గ అభివృద్దే మాజీమంత్రి, శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావుకు ఎంతో ముఖ్యమని, ఆయన ప్రతిపని. ప్రతి ఆలోచన ప్రజల మేలును దృష్టిలో పెట్టుకునే చేస్తారని చిలకలూరిపేట నియోజకవర్గ కూటమి నేతలు



కొనియాడారు. ప్రత్తిపాటి పుట్టినరోజును పురస్కరించుకొని ప్రత్తిపాటి గార్డెన్స్‌లో గురువారం



నియోజకవర్గ స్థాయిలో 35వ ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జిసి యూత్, ఉపేంద్రరావులు తీసుకొచ్చి రెండు భారీ కేక్‌లను తీసుకువచ్చి రోగులకు, వైద్య సిబ్బందికి పంచిపెట్టారు. ఈ వైద్య శిబిరాన్ని ప్రముఖ వైద్యులు కొమ్మినేని నర్సింగ్‌హోం అధినేత కొమ్మినేని వీరశంకరరావు, టిడిపిరాష్ట్ర వైద్య విభాగం కార్యదర్శి డాక్టర్ ముప్పాళ్ల హనుమంతురావు, టిడిపి జిల్లా వైద్య విభాగం ప్రధాన కార్యదర్శి డాక్టర్ చాపలమడుగు రామకృష్ణలు ప్రారంభించారు. ఉదయం 7గంటలకే ప్రత్తిపాటి గార్డెన్స్‌లో పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి వైద్య బృందం రోగులను పరీక్షించడం ప్రారంభించారు. మొత్తం షుమారు 6,500 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో షుమారు 2వేలమందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమని డాక్టర్లు బృందం తేల్చారు. వీరందరిని మే 30వ తేదినుంచి జూన్ 13వ తేదివరకు రోజుకు 150మంది వంతున ప్రత్యేక బస్‌లలో శంకర కంటి ఆసుపత్రికి తీసుకొని వెళ్లి శస్త్ర చికిత్సలు చేయించి వారిని తిరిగి గమ్యస్థానాలకు చేర్చడం జరుగుతుందని శిబిర కన్వీనర్ కంచర్ల శ్రీనివాసరావు తెలియచేశారు. శంకర కంటి ఆసుపత్రికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వారి వైద్యబృందం డాక్టర్ మేఘన, డాక్టర్ శివాని, డాక్టర్ రమ్య, డాక్టర్ నళిన్, ఆప్తోమెట్రిక్స్, నర్సులు, అదేవిధంగా పట్టణంలోని లక్ష్మీ నర్సింగ్ హోం కు చెందిన వడ్లమూడి సుజాత ఆధ్వర్యంలో 50మంది నర్సింగ్ విద్యార్థులు, ఆర్‌యంపి రాష్ట్ర అధ్యక్షుడు మురళి, ఖాజాల ఆధ్వర్యంలో 50మంది ఆర్‌యంపి డాక్టర్ల బృందం ఈ వైద్య శిబిరంలో పాల్గొని తమ సేవలను అందించారు. కాగా వేలాదిమంది శిబిరంలో పాల్గొన్న వారికి ఎటువంటి ఇబ్బంది కలుగుకుండా పట్టణ సిఐ పి రమేష్ ఆధ్వర్యంలో ఎస్ఐలు, 90మంది పోలీస్ సిబ్బంది శిబిరం ముగిసేవరకు తమ సేవలు అందించారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నెల్లూరి సదాశివరావు, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, మున్సిపల్ కమీషనర్ పతి శ్రీహరిబాబు, టిడిపి నాయకులు జవ్వాజి మదన్‌మోహన్, కామినేని సాయిబాబు, జవ్వాజి బుచ్చిబాబు, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, బేరింగ్ మౌలాలి, షేక్ అజారుద్దిన్, ఈవూరి బ్రహ్మానందం, పుల్లారావు, మద్దూరి వీరారెడ్డి, నాగబైరు ఆంజనేయులు, దగ్గుమల్లి సాంబశివరావు, గోరంట్ల సింగరకొండ చౌదరి, కనమర్లపూడి రమేష్, కొత్త కోటేశ్వరరావు, రాచుమల్లు సూర్యారావు, వెల్లంపల్లి రవిశంకర్, చేవూరి కృష్ణమూర్తి, తుపాకుల అప్పారావు, షేక్ అబ్దుల్ మీజద్, జిసి యూత్ కరిముల్లా, మస్తాన్‌వలి, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొత్తమాసు శ్రీనివాసరావు, టిడిపి రాష్ట్ర మహిళ ప్రధాన కార్యదర్శి షేక్ జరీనా సుల్తానా, పోపూరి లక్ష్మీ, అమరా రమాదేవి, అద్దంకి అనితాబాయి, టిడిపి మహిళా కౌన్సిలర్లు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త తోట రాజారమేష్, బిజెపి ఇన్‌చార్జి తాటిపర్తి జయరామిరెడ్డి, కస్తూరి వెంకటేశ్వరు తదితరులు పాల్గొని తమ సేవలు అందించారు.

## రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం సమావేశం

**నరసరావుపేట టౌన్, మే 29 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం సమావేశం గురువారం నిర్వహించారు. ఇటీవల పాకిస్తాన్ – ఇండియాకు జరిగిన యుద్ధంలో ఆపరేషన్ సింధూరాలో పాల్గొని నరసరావుపేటకు వచ్చిన విశ్రాంత కానిస్టేబుల్ సుభాని కుమారుడు పఠాన్ గౌస్‌ను సంఘం సభ్యులు సత్కరించారు. బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్‌లో జవాన్‌గా ఆయన పని చేస్తూ దేశం కోసం సేవలందించడం సంతోషమన్నారు. పూల మాలలు, బొకేలతో ఆయనను అభినందిం చారు. ఈ కార్యక్రమానికి సంఘం ఉపా ధ్యక్షులు ఈశ్వరరెడ్డి అధ్యక్షత వహించారు. సెక్రటరీ సి.సి.ఆదెయ్య, రంగనాయకులు, ఎంఎస్ఆర్‌కె ప్రసాద్, పచ్చల నాగభూషణం, ఫ్రాన్సిస్, రాజేశ్వరరావు, మాధవరెడ్డి, షేక్.హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## గోవధ నిషేధాన్ని పక్కాగా అమలు చేయాలి

### -విశ్వహిందూ పరిషత్, బ్రాహ్మణ మహాసభ నాయకులు

**పొన్నూరు, మే 29,ప్రభాతవార్త:** వచ్చే నెల ఏడవ తేదీన జరిగే బక్రీదు పర్వదినాన్ని పురస్కరించుకొని గోవధ నిషేధ చట్టాన్ని పక్కాగా అమలు చేయాలని, అందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని విశ్వహిందూ పరిషత్ ప్రాంతీయ



గోరక్ష సహప్రముఖ్ మన్నవ మురళీకృష్ణ వెంకట చలపతిరావు కోరారు. స్థానికంగా జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బక్రీదు పర్వదినాన్ని పురస్కరించుకొని పాడికి, వ్యవసాయానిక ఆధారమైన ఆవులు, ఎద్దులు, కోడెలను చట్ట వ్యతిరేకంగా చంపుతున్నారని, ఇది సరైన విధానం కాదన్నారు. అక్రమ జంతు వధను నివారించడానికి అన్ని గ్రామాల్లో యువత చైతన్య వంతులు కావాలన్నారు. అక్రమ జంతు రవాణా, వధించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకొనేం దుకు అన్ని వర్గాల వారు కృషి చేయాలన్నారు. బక్రీదు పర్వదినం ముగిసిన పది రోజుల వరకు గ్రామాల్లో ఆవులు, గేదెలు, ఎద్దులు,కోడెలు అమ్మకాలు జరగకుండా గ్రామ స్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎక్కడైన ఇలాంటి వధలు జరిగినట్లయితే అధికారులు తక్షణమే సమాచారం అందించి, సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకొనేవరకు ఒత్తిడి పెంచాలన్నారు. ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర కోశాధికారి పులిపాక సత్యసాయి వరప్రసాద్(ఆడిటర్ ప్రసాద్) మాటా ్లడుతూ పోలీసు, రెవెన్యూ తదితర అధికారులు ప్రభుత్వ ఉత్తర్వులను కఠినంగా అమలు చేయాలన్నారు. అడవుల నుండి గ్రామీణ ప్రాంతా లకు మేపడానికి వచ్చే ఆవుల మందల యజ మానుల నుండి మందల వివరాలు తీసుకొని వారు అమ్మకుండా పంచాయితీ, పోలీస్ స్టేషన్‌లో బైండోవర్ చేసేవిధంగా అధికారులు దృష్టి సారిం చాలన్నారు. గో సంపదను కాపాడడంలో ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో సిహెచ్ఎల్ఎన్ ప్రభాకర్ పాల్గొన్నారు.

## చిలకలూరిపేట అభివృద్ధికి చిరునామా ప్రత్తిపాటి

### -జనసేన రాష్ట్ర నాయకుడు పెంటేల బాలాజీ

**చిలకలూరిపేట,మే29,ప్రభాతవార్త:** చిలకలూరిపేట నియోజకవర్గ అభివృద్ధికి శాశ్వత చిరునామాగా మాజీమంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి నిలిచారని జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్రా కో కన్వీనర్ పెంటేల బాలాజీ అన్నారు. గురువారం ప్రత్తిపాటికి ఆయన జన్మదిన శుభాకాంక్షలు తెలియచేశారు. దేవుడు మీకు మంచి ఆరోగ్యం, సంతోషం, దీర్ఘాయుష్షు ఇవ్వాలని, మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని, ప్రజాసేవలు సుధీర్ఘకాలం ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు బాలాజీ పేర్కొన్నారు. ప్రజలకు మంచి చేయాలన్న సంకల్పం, దానిని నెరవేర్చే చిత్తశుద్ధి ఉంటే ఏ నాయకుడైనా ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేస్తారన్నది చరిత్ర చెపుతున్న నిజమని, అనునిత్యం ప్రజలలో ఉంటూ వారి సమస్యల సాధనకోసం పాటుపడుతున్న వ్యక్తి ప్రత్తిపాటి అని బాలాజీ చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తికావస్తున్నా స్వల్ప సమయంలోనే నియోజకవర్గంలో ప్రత్తిపాటి తనదైన ముద్ర వేసుకున్నారని వెల్లడించారు. గతంలో తన హయంలో కొనసాగి మధ్యలో వైసిపి హయంలో నిలిచిపోయిన అభివృద్ధిని పట్టాలెక్కిండానికి ప్రత్తిపాటి సిద్ధమయ్యారని వివరించారు. చిత్తశుద్ధి ఉన్నప్పుడు ప్రజలకు మంచి చేయాలన్న లక్ష్యంతో, సంకల్ప సిద్ధి ఉన్నప్పుడు అభివృద్ధి పరుగులు పెడుతుందన్న విషయానికి ప్రత్తిపాటి నిదర్శనంగా నిలుస్తారని అన్నారు. ఈ సంవత్సర కాలంలోనే ఎన్నో అపరిష్కృత సమస్యలకు ప్రత్తిపాటి పరిష్కారం చూపారన్నారు.



## వీధినాటకాల ద్వారా హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన

**మాచర్ల, మే 29 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో కళాజాతర బృందాల ద్వారా ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమంలో మాచర్లలో నిర్వహించారు. మాచర్ల బస్టాండ్ సమీపంలో నిర్వహించిన ఈ కళాజాతర బృందం వీధి నాటకం ద్వారా హెచ్ఐవీ ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది, ఎలా వ్యాపించదు, హెచ్ఐవీ ఎయిడ్స్ రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత, చిన్నచూపు



లేకుండా చూడటం, సమాజంలో ఎలా జీవించాలి వంటి విషయాలపై అవగాహన కల్పించారు. ఎయిడ్స్–క్షయ వ్యాధి సంబంధం గురించి, సుఖవ్యాధులు చికిత్స, కండోమ్ ఉపయోగం, హెచ్ఐవీ/ఎయిడ్స్ యాక్ట్ 2017 గురించి ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించారు. హెచ్ఐవీ పరీక్షలు అన్ని ప్రభుత్వ వైద్యశాలల్లో ఉచితంగా చేస్తారని, వ్యాధి ఉన్నవారు ఏఆర్‌టీ కేంద్రాల ద్వారా ఇచ్చే మందులు క్రమం తప్పకుండా వాడితే జీవిత కాలాన్ని పెంచుకోవచ్చన్నారు. క్రమం తప్పకుండా సీడీ4, వైరల్ లోడ్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో దాచేపల్లి రీడ్స్ టీఐ సిబ్బంది, పీడీ గౌస్, పీఎం కోమలి, ఏఆర్‌డబ్ల్యూ మౌలాబి, పీఈ మస్తాన్‌బి, ఆశ, కళాజాత బృందం వీర్నాల మల్లికార్జునరావు, వెంకటలక్ష్మి, మిర్యాల మల్లయ్య, బి.కనకారావు, బి.ప్రభావతి, వి.శాంతి స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## జూన్ ఒకటో తేదీ నుంచి రేషన్ షాపువద్దే సరుకులు పంపిణీ

### -తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్

**పొన్నూరు, మే 29,ప్రభాతవార్త:** జూన్ ఒకటో తేదీ నుంచి రేషన్ కార్డులు కలిగిన కార్డుదారులకు రేషన్ షాపుల వద్దే డీలర్ నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తారని, ఈ విషయాన్ని కార్డుదారులు గుర్తించాలని తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాల యంలో జరిగిన సమా వేశంలో గురువారం ఆయన వివరాలను వెల్లడిం చారు. పొన్నూరు అర్బన్, రూరల్ పరిధిలో 35,029మంది కార్డుదారులు ఉన్నట్లు చెప్పారు. రూరల్ పరిధిలో 45 రేషన్ షాపులు, అర్బన్ పరిధిలో 23షాపులు ఉన్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు ఎండియు వాహనాల ద్వారా పంపిణీ జరిగిందని, ప్రభుత్వం ఎండియు వ్యవస్థను రద్దు చేసిందన్నారు. ఇక మీదట కార్డుదారులు పాత విధానంలో రేషన్ షాపులకు వెళ్ళి బియ్యం, తదితర నిత్యావసరాలను తీసుకోవాలన్నారు. పొన్నూరు రూరల్ పరిధిలో-20,216కార్డుదారులు,అర్బన్ పరిధిలో-14,813కార్డుదారులున్నట్లు చెప్పారు. డీలర్ షాపు వద్ద ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, సాయంత్రి 5గంటల నుంచి 8గంటల వరకు నిత్యావసరాలను తీసుకోవచ్చన్నారు. రేషన్ డీలర్లు సమయపాలన పాటించి కార్డుదారులకు విధిగా నిత్యావసరాలను పంపిణీ చేయాలన్నారు. రేషన్ డీలర్లు విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకొంటా మన్నారు. రేషన్ షాపుల వద్ద పంపిణీ చేసే నిత్యావసరాల స్టాకు, ధరలు తెలియజేసే పట్టికలను విధిగా ఏర్పాటు చేయాలన్నారు. కార్డుదారులకు మెరుగైన సేవలు అందించాల న్నారు. కార్డుదారులు కూడా రేషన్ డీలర్లకు సహకరించి సుహృద్భావ వాతావరణంలో రేషన్ సరుకులను తీసుకోవాలని తహశీల్దార్ సూచించారు.



## దళిత బహుజన రీసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో శిక్షణ

**రాజుపాలెం, మే 29 ప్రభాతవార్త :** దళిత బహుజన రీసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో మండలంలోని అనుపాలెం గ్రామంలో గురువారం స్వయం ఉపాధి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్ఫ్, ఫెనాయిల్, లిక్విడ్, జెండు బామ్ తయారు చేయడం శిక్షణలో నేర్పుతారని తెలియజేశారు. 33 మంది ఉచిత భోజనం, సర్టిఫికెట్లు, యూనిఫాం ఇవ్వడం జరిగిందని ఏరియా కోఆర్డినేటర్ కోటిరత్నం తెలిపారు. బ్యాంక్‌ల ద్వారా రుణాలు తీసుకొని వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవాలని బ్యాంక్ రీజనల్ హెడ్ మాధురి అన్నారు. బ్యాంక్ నుండి రుణాలు తీసుకొని ఎదగాలని డిప్యూటీ రీజనల్ కోఆర్డినేటర్ సి.హెచ్.మురళీ తెలియజేశారు. కార్యక్రమంలో ధనుశ్రీ తదితరులు పాల్గొన్నారు.




## డాష్ బోర్డు పరుగుపందెంలో సచివాలయ ఉద్యోగులు బలౌతున్నారు

**నరసరావుపేట టౌన్, మే 29 ప్రభాతవార్త :** డాష్ బోర్డు పరుగుపందెంలో సచివాలయ ఉద్యోగులు బలౌతున్నారని అసోసియేషన్ నాయకులు షేక్ మహ్మద్ ఆలీ, విజయలక్ష్మి, కరిముల్లా, రమేష్‌లు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏలూరులో పని చేస్తున్న ఏఎన్ఎం కళ్యాణి పని ఒత్తిడి తట్టుకోలేక గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకోవడం జరిగిందన్నారు. రేపల్లెలో ఏఎన్ఎం కోటేశ్వరమ్మ జంబులదిన్నె సచివాలయంలో అగ్రికల్చర్ ఉద్యోగి హరినాథ్‌రెడ్డి ఆత్మహత్య చేసుకోవడం జరిగిందన్నారు. శాఖలతో సంబంధం లేకుండా డోర్ టూ డోర్ వెళ్ళి సర్వేలు చేపిస్తున్నారని, సస్పెండ్‌లు, షోకాజు నోటీసులు అంటూ పని ఒత్తిడితో చివరకు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితికి ఉద్యోగులను నెడుతున్నారని ఈ సందర్భంగా వారు ఆవేదన వ్యక్తం చేశారు.

## సంక్రాంతిపాడు గ్రామ సర్పంచ్ బొల్లయ్య మాతృమూర్తి పుల్లమ్మ భౌతికకాయానికి నివాళులు అర్పించిన మర్రి రాజశేఖర్

**నాదెండ్ల,మే29,ప్రభాతవార్త:** మండలంలోని సంక్రాంతి పాడు గ్రామ సర్పంచ్ జెట్టి బొల్లయ్య మాతృమూర్తి పుల్లమ్మ ఈనెల 15వతేదిన మృతిచెందారు. కాగా ఆమె పెదకర్మను గురువారం సంకురాత్రిపాడు గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యుడు మర్రి రాజశేఖర్ పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పిం చారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్‌తో పాటు గ్రామ నాయకులు కిలారి బాలకృష్ణ, మురుకుట్ల సాంబశివరావు, శివమాణిక్యాలు, కె కోటయ్య, కె వీరాస్వామి, రాచమంటి చింతారావు, కె చిట్టిబాబు, బి సీతారామయ్య, సాంబయ్య, కుమార్ తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.



## ఆర్యవైశ్య ప్రముఖుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి జన్మదిన వేడుకలు

**చిలకలూరిపేట,మే29,(ప్రభాతవార్త):** నియోజక వర్గ అభివృద్ధి ప్రధాత, అజాత శత్రువు, అందరివాడు, అభివృద్ధికి చిరునామా,



జనహృదయాల విజేత మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పుట్టినరోజును పురస్కరించుకొని పట్టణంలో వాడవాడలా వేడుకలు గురువారం పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ సంఘాల వారు భారీస్థాయిలో నిర్వహించారు. ఆర్యవైశ్య ప్రముఖుల ఆధ్వర్యంలో భాస్కర్‌ఫ్యాన్సీ సెంటర్ వద్ద 100కిలోల లడ్డు,జున్ను కేక్‌ను నియోజక వర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు ఆర్యవైశ్య ప్రముఖులు సమక్షంలో కట్‌చేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ చిలకలూరిపేట అధ్యక్షులు కొత్తమాసు శ్రీనివాసరావులు రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నెల్లూరి సదాశివరావు, ఆర్యవైశ్య ప్రముఖులు మాట్లాడుతూ ప్రజలకు మంచి చేయాలన్న సంకల్పం, దాన్ని నిర్వహించే చిత్తశుద్ధి ఉంటే ఏ నాయకుడైనా ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేస్తాడన్నాది ఎంత సత్యమో మన నాయకుడు ప్రత్తిపాటి 26 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ చరిత్ర చూసినవారికి అవగతం అవుతుందని తెలిపారు. అనునిత్యం ప్రజలలో ఉంటూ వారి సమస్యల సాధనకోసం నిరంతరం పాటుపడుతున్న ఏకైన వ్యక్తి ప్రత్తిపాటి అని కొనియాడారు. పార్టీ కార్యాలయంలో టిడిపి లీగల్ సెల్ ఆధ్వర్యంలో ప్రత్తిపాటి పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ప్రత్తిపాటి పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్‌ను మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, మున్సిపల్ కమీషనర్ పతి శ్రీహరిబాబులు పారిశుధ్య కార్మికులచేత కట్‌చేయించి వారందరికి అందచేశారు. అనంతరం వారందరికి దుస్తులను మున్సిపల్ చైర్మన్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలలో పార్టీ నాయకులు జవ్వాజి మదన్‌మోహన్, కామినేని సాయిబాబు, దగ్గుమల్లి సాంబశివరావు, కక్కెర నాగేశ్వరరావు, షేక్ అజారుద్దిన్, అబ్దుల్ మజీద్, ఆరెమల్లి, మస్తాన్‌వలి, సయ్యద్‌రఫీ,



ఏసుబాబు, పుల్లారావు, బేరింగ్ మౌలాలి, కూనల ప్రమీల, కొత్తకుమారి, రాయని హరిత, కంచర్ల కరుణ, జంగా సుజాత, కె లక్ష్మీ తిరుమల, ఆర్యవైశ్య నాయకులు గ్రంధి భాస్కరరావు, రాచుమల్లు సూర్యారావు, చేవూరి కృష్ణమూర్తి, కనమర్లపూడి రమేష్, మల్లిఖార్జునరావు, అమరా మణికుమార్, కొత్త కోటేశ్వరరావు, తవ్వా నాగమల్లేశ్వరరావు, తోట బ్రహ్మస్వాములు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త తోట రాజారమేష్, టిడిపి లీగల్‌సెల్ నాయకులు ఈవూరి బ్రహ్మానందం, కె రామకృష్ణ, బి కోటేశ్వరరావు, జివిహెచ్‌ఎస్ ప్రసాద్, సయ్యద్ వహాబ్, సైదావలి, టి రవి, శ్యామ్యూల్‌జాన్, సాపా ఆదినారాయణ, కె సంగమేశ్వరరావు, పి వీరయ్య, త్రిపురం రామకృష్ణ. ఐ నాగరాజు, వై శ్రీనివాసరావు, జి శ్రీనివాసరావు, వేణు, జయకర్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## గాలులతో కూడిన వర్షం జలమయమైన రోడ్లు

**కొల్లిపర,మే 29 ప్రభాతవార్త:** మండలంలో గురువారం సాయంత్రం ముబ్బులు కమ్ముకుని భారీవర్షం కురవటంతో రోడ్లన్ని జలమయమయ్యాయి. వల్లభాపురం, మున్నంగి, కొల్లిపర తదితర గ్రామాల్లో ప్రధాన రహదారులు నీటితో నిండటంతో పాటు పల్లపు ప్రాంతాలలో ఉన్న గృహాల వద్ద నీరు అధికంగా చేరటంతో గృహాలలో నుంచి బయటకు రావటానికి ప్రజలు ఇబ్బందులు



ఎదుర్కొన్నారు. కొల్లిపర శివాలయం వద్ద నుండి గ్రామ పంచాయతీ వరకు రోడ్డుపై అధికంగా నీరు చేరటంతో వాహనదారులు పలు ఇబ్బందులు పడ్డారు. అక్కడక్కడ కొద్దిపాటి ఎండబెట్టిన మొక్కజొన్న తడవకుండా ఉండేందుకు రైతులు పట్టాలు కప్పి పంటను రక్షించుకున్నారు.

## మే 29 నుంచి జూన్ 2 తేదీ వరకు నేషనల్ సిల్క్ ఎక్స్‌పో

**విజయవాడ. ప్రభాతవార్త:** నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ఎగ్జిబిషన్ కమ్ సేల్ 2025 విభిన్న రూపాల ఆకర్షణీయమైన దుస్తుల సంబారాలు జరుపుకునేందుకు విజయవాడ నగరానికి వచ్చేసింది. నేషనల్



సిల్క్ ఎక్స్‌పో స్థానిక ఏ-ప్లస్ కన్వెన్షన్ సెంటర్, మునిసిపల్ ఎంప్లాయిస్ కాలనీ, లలితా జ్యుయలరీ రోడ్, మొగల్రాజుపురం వద్ద 29 మే నుండి జూన్ 2వ తేదీ వరకు 5 రోజులుపాటు వస్త్ర ప్రదర్శన మరియు అమ్మకాలు నిర్వహిస్తున్నారు. ఈ వస్త్రాలు వేసవి కాలానికి మరియు వివాహాది వేడుకలలో భారతీయ వస్త్రదారణ గొప్ప అనుభూతిని కలిగిస్తాయి. దేశంలోని విభిన్న ప్రాంతాల సాంస్కృతి సంప్రదాయాలు మిళితమైన వేలాది రకాల మగ్గాల ఉత్పత్తులు అన్నింటిని ఒకే కప్పు క్రిందకు ఈ ఎక్స్ పో తీసుకు రావటం జరిగినది.

నేషనల్ సిల్క్ ఎక్స్‌పో సందర్శనం భారతదేశంలోని అనేక నేత సంప్రదాయాల చుట్టూ తిరిగి వచ్చిన అనుభూతిని కలిగిస్తుందని నిర్వాహకులు చెబుతున్నారు. భారతదేశం లోని వివిధ ప్రాంతాలలో తయారైన వేలాది రకాల పట్టు మరియు కాటన్ వస్త్రాలు డిజైన్ వస్త్రాలు డిజైనర్ బ్లౌజులు, కుర్తీలు మొదలైనవి చేనేత పనివారు 50% వరకు తగ్గింపుతో విక్రయించుటకు నేషనల్ సిల్క్ ఎక్స్‌పో నందు తమ స్టాల్స్ ఏర్పాటు చేసారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి నేరుగా తయారీదారులు నుండి సేకరించిన మహారాష్ట్ర వారి సొగసైన పైఠాని సిల్క్ చీరలు, కర్ణాటక వారి బెంగుళూరు సిల్క్, సాఫ్ట్ సిల్క్ మరియు కాషిదా సిల్క్ చీరలు, మధ్యప్రదేశ్ వారి పేరొ ందిన చందేరి మహే శ్వరి సిల్క్ చీరలు, పశ్చిమ బెంగాల్ వారి బలూచారి, జమ్దానీ, టాంగైల్, ఢకాయ్ మాస్లిన్ సిల్క్ చీరలు లినెన్ శారీ కాంతా వర్క్ స్టిచ్ వస్త్రాలు మొదలైన అన్నింటిని నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ఒకేచోట అందుబాటులో ఉంచే లక్ష్యంతో ఈ ప్రదర్శన ఏర్పాటు చేసామని నిర్వాహకులు తెలిపారు. అంతేకాక బీహార్ వారి భాగల్పూర్ సిల్క్ చీరలు, గుజరాత్ వారి సాంప్రదాయ బంధిని, కచ్ ఎంబ్రాయిడరీ చీరలు, పటోలా చీరలు, తమిళనాడు నుంచి ప్రసిద్ధ కంజీవరం ఎంబ్రాయిడరీ పట్టు చీరలు, జమ్మూ కాశ్మీర్ వారి తాబి సిల్క్ చీరలతో పాటు దుపట్టాలు మరియు సల్వార్ మెటీరియల్స్ వివిధ డిజైన్స్ కలిగినవి ఈ సిల్క్ ఎక్స్ పో నందు ఉన్నాయి. ఇంకనూ ఉత్తరప్రదేశ నుండి తెచ్చిన ప్రఖ్యాత బనారస్ పట్టు చీరలు, జమదాని, సిఫాన్ చీరలు, లక్నవి చికాన్ వర్క్ చీరలు మరియు రాజస్థాన్ వారి బంధిని, బందేజ్, చేనేత బ్లాక్ ప్రింట్ చీరలు లభిస్తాయి. దేశంలోని అన్ని రాష్ట్రాల వస్త్రాలు ఒకేచోట మీరు చూడవచ్చును. ఈ నేషనల్ సిల్క్ ఎక్స్‌పో జూన్ 2వ తేదీ వరకు మాత్రమే తికన్వెన్షన్ సెంటర్, మునిసిపల్ ఎంప్లాయిస్ కాలనీ, మొగల్రాజపురం, విజయవాడ వద్ద 11 నుండి రాత్రి 9 గంటలు వరకు ఉంటుంది. ప్రవేశం ఉచితం, అన్ని డెబిట్ క్రెడిట్ కార్డులు స్వీకరించబడతాయి.



## విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు,బ్యాగ్‌లు పంపిణీ : ఎంఈవో-2 ఝాన్సిలత

**కొల్లిపర,మే 29 ప్రభాతవార్త:** 1 నుండి 10 తరగతి వరకు విద్యార్థులకు సంభందించిన పాఠ్య పుస్తకాలు, బ్యాగ్‌లు మండలంలోని పాఠశాలలకు పంపిణీ చేయటం జరిగిందని వాటిని స్కూల్ ప్రారంభించిన వెంటనే విద్యార్థులకు అందజ యాలని ఎంఈవో-2 ఝాన్సిలత అన్నారు. గురువారం మండల కేంద్రం కొల్లిపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ సిబ్బంది విద్యార్థులకు సంభందించిన కిట్స్‌ను ఎంఈవో



ఝాన్సిలత ఆద్వర్యంలో వ్యాన్‌ల ద్వారా మండలంలోని పాఠశాలలకు తరలించారు. ఈ సందర్భంగా ఝాన్సిలత మాట్లాడుతూ స్కూల్స్ జూన్ 12 వ తేదీ నుండి మరల ప్రారంభం కావటంతో మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు సంభందించిన పాఠ్య, నోట్ పుస్తకాలు ఆయా ఉపాధ్యాయులకు అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, ఎంఐఎస్ రమేష్, సీఆర్పీలు పిడపర్తి రమేష్‌బాబు, వి. మురళీ, అలేఖ్య, స్వరూపరాణి, రాంబాబు, సురేష్, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

## జిఎస్టీతో వేగంగా ఆర్థికాభివృద్ధి

### -సెంట్రల్ జిఎస్టీ కమిషనర్ సుజిత్ మల్లిక్

**గుంటూరు విద్య,మే 29,ప్రభాతవార్త :** వస్తు సేవల పన్నుతో దేశం వేగంగా ఆర్థికంగా ముందుకు వెళుతుందని, పన్ను వ్యవస్థ పూర్తిగా చక్కబడిందని




సెంట్రల్ జీఎస్టి కమీషనర్ సుజిత్ మల్లిక్ అన్నారు. గురువారం గుంటూరు కన్నావారితోట లోని జిఎస్టీ భవన్‌లో ప్రీ జిఎస్టీ డే వేడుక జరిగింది. ఈ సందర్భంగా కమీషనర్ సుజిత్ మల్లిక్ మాట్లాడుతూ జీఎస్టీతో పన్నులను అంగీకరించే సమాజం ఏర్పడింద న్నారు. పన్ను చట్టాల్లో పారదర్శకత పెరగటమే కాకుండా, పన్ను అధికారులకు, పన్ను చెల్లింపుదారుల మధ్య స్నేహభావం ఏర్పడిందన్నారు. జిఎస్టీ అడిషనల్ కమీషనర్ బి. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జిఎస్టీ ప్రయాణాన్ని గుర్తు చేసే ఒక ముఖ్యమైన కార్యక్రమంగా ఈ వేడుక నిర్వహిస్తున్నామన్నారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ రాష్ట్ర అధ్యక్షులు భాస్కరరావు మాట్లాడుతూ జిఎస్టీ ప్రారంభంలో తెలియక చాలామంది వ్యాపారులు తమ రిటర్న్‌లో తప్పుడు వివరాలు నమోదుచేశారని, ఇప్పుడు జిఎస్టీ ఆడిట్‌లో అవన్నీ పట్టుబడుతున్నాయన్నారు. అవి కావాలని చేసిన తప్పులు కావన్నారు. నేషనల్ కన్యూమర్స్ ఫెడరేషన్ ఉపాధ్యక్షులు చదలవాడ హరిబాబు మాట్లాడుతూ.. ప్రాణ రక్షణ కొరకు వాడే మందులపై జిఎస్టీని తక్షణమే తీసెయ్యాలన్నారు. చేనేత మగ్గాలపై విధించే 5శాతం పన్నును కూడా రద్దుచేయాలన్నారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షులు ఏల్చూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిఎస్టీ పై వ్యాపారుల ఇబ్బందులను ప్రతి మూడు నెలలకొకసారి అధికారులు రివ్యూ చేయాలన్నారు. ఇండియన్ టెక్స్‌టైల్స్ అసోసియేషన్ అధ్యక్షులు బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి మాట్లాడుతూ జీఎస్టీ రేట్లలో రెండు శ్లాబులే ఉండాలని సూచించారు. ఇంకా పలువురు పరిశ్రమ ప్రతినిధులు జిఎస్టీ అంశాలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. అనుభవాలు వెల్లడిస్తూ, మెరుగుదలకు సూచనలు చేశారు. అనంతరం కమీషనర్ సుజిత్ మల్లిక్ ను ట్రేడ్ వర్గాలవారు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిఎస్టీ అసిస్టెంట్ కమీషనర్లు ఎం.నాగరాజు, బి.రవి కుమార్, వి.వెంకటేశ్వరరావు, మనోజ్‌కుమార్, మరియదాసు, రాయలు, ఆనందరావు, ఛాంబర్ మాజీ అధ్యక్షులు ఆతుకూరి ఆంజనేయులు పాల్గొన్నారు.

## నీటి సంఘాల ఏర్పాటుతో రైతులకు మేలు

### -డీసీ వైస్ చైర్మన్ తోటా ఏడుకొండలు

**కొల్లిపర,మే 29 ప్రభాతవార్త:** ప్రభుత్వం నీటి సంఘాల ఏర్పాటుతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని డీసీ వైస్ చైర్మన్ తోటా ఏడుకొండలు అన్నారు. గురువారం మండల పరిధిలోని మున్నంగి, కొల్లిపర, చివలూరు, దావులూరు, వల్లభాపురం పంట పొలాల్లో కాల్వల పూడికతీతకు రూ.15 లక్షలు మంజూరు కావటంతో నీటి సంఘ అద్యక్ష, ఉపాద్యక్షులు



ప్రొక్లెయిన్ ద్వారా పనులు ప్రారంభించారు. అ సందర్భంగా ఏడుకొండలు మాట్లాడుతూ సంవత్సరాల తరబడి పంటకాల్వల పూడికతీత పనులకు నోచుకోకపోవటంతో రైతులు ఇబ్బందులకు గురైనట్లు చెప్పారు. కార్యక్రమంలో నీటి సంఘం అద్యక్షులు బి. శ్రీరాములరెడ్డి, కోటా వీరాంజనేయులు, నీటి సంఘం ఉపాద్యక్షులు జొన్నల నాగిరెడ్డి, కట్టా శ్రీహరిరెడ్డి, ఆరిమండ శివనాగమల్లీశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగించుకోవాలి

### -గ్రంధాలయాధికారి సత్యమ్మ

**కొల్లిపర,మే 29 ప్రభాతవార్త:** చిన్నతనం నుండి గ్రంధాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం విద్యార్థులు గ్రంధాలయాన్ని సద్వినియోగించుక జరుపుకున్నారు. అవుతు సంజీవరెడ్డి అందజేసిన



బిస్కెట్లు, పెన్నులను విద్యార్థులకు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా సత్యమ్మ మాట్లాడుతూ విద్యార్థులు పోటీ పరీక్షలకు కూడా గ్రంధాలయాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చు కోవాలన్నారు. గ్రంధాలయాల ద్వారా నూతన పరిజ్ఞానాన్ని పెంచుకోవా

ోవాలని గ్రంధాలయాధికారి సత్యమ్మ అన్నారు. లన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మండల పరిధిలోని తూములూరు శాఖా పాల్గొన్నారు.

## హెచ్‌ఐవి పై అవగాహన

**నరసరావుపేట టౌన్, మే 29 ప్రభాతవార్త :** హెచ్‌ఐవి / ఎయిడ్స్ పై అవగాహన, ప్రచార కార్యక్రమాలను మాచర్ల బస్టాండ్‌లో గురువారం



నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు వీధి నాటకాల ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు కళాజాతర బృందాల సభ్యులు తెలిపారు. ఈప్రభ కల్చరల్ ఆర్గనైజేషన్ కళాజాత బృందం మాచర్ల బస్టాండ్‌లో జానపద కళారూపమైన వీధి నాటకం ద్వారా హెచ్‌ఐవి / ఎయిడ్స్ పై అవగాహన కల్పించారు. ఎయిడ్స్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. అదే విధంగా గర్భిణీ నుండి బిడ్డకు రాకుండా ఎటువంటి పద్ధతులు అవలంభించాలో తెలియజేశారు. వైద్యశాలలో హెచ్‌ఐవి పరీక్షలు, చికిత్స ఉచితంగా అందిస్తారన్నారు. ఏఆర్‌టి కేంద్రాల ద్వారా ఇచ్చే మందులను క్రమం తప్పకుండా వాడాలన్నారు. 1097 టోల్ ఫ్రీ నెంబర్ ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రీడ్స్ సిబ్బంది పి.డి.గౌస్, కోమలి, ఓఆర్‌డబ్ల్యూ మౌలాబి, మస్తాన్‌బి, మల్లికార్జునరావు, వెంకటలక్ష్మి, మల్లయ్య, కనకారావు, ప్రభావతి, శాంతి పాల్గొన్నారు.

## కడప దుర్గా, ఒంటిమెట్ట కోదండరామస్వామి ఆలయాలను సందర్శించిన ఎమ్మెల్యే దంపతులు

**నరసరావుపేట, మే 29 ప్రభాతవార్త :** కడపలోని పలు ఆధ్యాత్మిక కేంద్రాలను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు దంపతులు గురువారం సందర్శించారు. ఒంటిమెట్ట కోదండరామస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ అధికారులు, అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వారు తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. వారితో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు మాట్లాడుతూ ప్రసిద్ధిగాంచిన కోదండరామస్వామి ఆలయాన్ని



దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. స్వామివారి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలపై ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలియజేశారు. అదే విధంగా కడప దర్గాను వారు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముస్లిం మత పెద్దలు వారికి స్వాగతం పలికారు. ఆశీస్సులను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు దంపతులకు అందించారు.

## పేద ప్రజల ఆరాధ్యదేవుడు అన్న ఎన్‌టిఆర్

### బెజవాడ శంకర్ చలపతి ఆదాంల ఘన నివాళులు

**ఎ కొండూరు, మే 29, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా ఎ కొండూరు మండలం చీమలపాడు గ్రామంలో కొత్తూరు సెంటర్‌లో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, నట సార్వభౌమ మాజీ సిఎం స్వర్గీయ ఎన్‌టిఆర్ జయంతిని టిడిపి మండల బిసి సెల్ అధ్యక్షుడు గ్రామ టిడిపి అధ్యక్షుడు బెజవాడ శంకర్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు నాయకులు కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ స్వర్గీయ ఎన్‌టిఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించడంతో యువతకు రాజకీయ ప్రాధాన్యత రూ.2కే కిలో బియ్యం, మాండలిక వ్యవస్థ లాంటి వ్యవస్థను ప్రవేశపెట్టిన పేద ప్రజల ఆరాధన దేవుడు యుగపురుషుడని శంకర్



పేర్కొన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో మండల టిడిపి మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్‌కె ఆదాం షరీఫ్ తిరువూరు ఎఎంసి డైరెక్టర్ ఎస్‌కె కరీముల్లా సీనియర్ నాయకుడు పర్సా వీరయ్య జంగా స్టాలిన్ బెజవాడ ఆదిశేషు హైస్కూల్ ఎస్‌ఎంసి చైర్మన్ ఎస్‌కె నాగుల్ మీరా (ఆటో బంగారం) పాలకేంద్రం అధ్యక్షుడు మరీదు చలపతి తదితరులు పాల్గొని ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి కేక్ కటింగ్ చేసి, ఘనంగా నివాళులర్పించారు.

## అహల్యబాయి హోల్కర్ జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకం

గుంటూరు విద్య,మే 29,ప్రభాతవార్త : అహల్యాబాయి హోల్కర్ జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తి దాయకమని బిజెపి రాష్ట్ర సంఘటన మంత్రి నూకల మధుకర్ అన్నారు. బిజెపి జిల్లా పార్టీ అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు ఆధ్వర్యంలో జరిగిన అహల్యాబాయి హోల్కర్ త్రిశతాబ్ది ఉత్సవాల అవగాహన కార్యక్రమం అమరావతి రోడ్డులోని హిందూ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ నందు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మధుకర్ మాట్లాడుతూ అహల్యాబాయి హోల్కర్ జీవిత చరిత్రను వివరించారు. దేశంలో అనేక ఆలయాలను నిర్మించడంతోపాటు జీర్ణోద్ధరణ చేశారన్నారు. 300ఏళ్ళ క్రితమే ప్రజారంజకంగా పాలన సాగించారన్నారు. మహిళలు, రైతుల కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఆదర్శ ప్రాయురాలు అహల్యాబాయి ఇండోర్ కేంద్రంగా రాజ్యాన్ని పరిపాలించిన వీరవనిత అహల్యాబాయి హోల్కర్ జీవితాన్ని నేటితరం మహిళలు ఆదర్శంగా తీసుకోవాలి. అహల్యాబాయి రాజ్యపాలన చేపట్టి సమాజంలో పేరుకుపోయిన అనేక సంఘ రుగ్మతలను తరిమి కొట్టారన్నారు. మహిళా ఎమ్మెల్యే అంటే చిన్నచూపు ఉన్న 300సంవత్సరాల క్రితమే 30ఏళ్ళు రాజ్యపాలన చేయడం సామాన్య విషయం కాదన్నారు. ఏన్నో దేవాలయాలను పునర్మించి హిందుత్వాన్ని కాపాడిన అహల్య బాయి హోల్కర్ జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శనీయం .మధ్యప్రదేశ్ ను కీలకంగా చేసుకొని పరిపాలన చేశారన్నారు. ఆమె పాలనలో దేశ సాంస్కృతిక వైభవం వెలుగొందిందని, 152ఆలయాలు పున:నిర్మించారన్నారు. కాశీలో ఆమె విగ్రహాన్ని ప్రధాని ఏర్పాటు చేశారన్నారు. అహల్యాబాయి హోల్కర్ జీవిత చరిత్ర నేటి యువతకు ఆదర్శమని 300ఏళ్ళక్రితం అహల్యాబాయి భారత్ ను పాలించారని, ఆమె జీవిత చరిత్ర నేటి యువతకు తెలియాలన్నారు. ప్రధాని మోడీ పిలుపు మేరకు అహల్యాబాయి జీవితచరిత్రను భారతీయులందరికి తెలియజేయాలని జయంత్రి కార్యక్రమాలను పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అహల్యా బాయి హోల్కర్ కార్యక్రమ జిల్లా కన్వీనర్లు కటారి వాసుదేవ నాయుడు, బజరంగ్ రామకృష్ణ, నడ్డి నాగమల్లేశ్వరీ యాదవ్, జూపూడి దుర్గాభవాని, డాక్టర్ రాధ మాధవి, మకుటం శివ సినీయర్ నాయకుల జూపూడి రంగరాజు, యశ్వంత్, భిమినేని చంద్రశేఖర్, యడ్లపాటి స్వరూపరాణి, కొక్కెర శ్రీనివాస్ యాదవ్, పాలపాటి రవికుమార్, చరక కుమార్ గౌడ్, కొతూరి వెంకట సుబ్బారావు, నేరెళ్ళ మాధవ్‌రావు, శనక్కాయల ఉమాశంకర్, పాండు రంగ విఠల్, వెలగలేటి గంగాధర్, మంత్రి సుగుణ, బిట్ర కనక దుర్గ, కోలా రేణుకదేవి, మైలా హరికృష్ణ, తులిమిల్లి శ్రీనివాస్, దారా అంబేడ్కర్, కంతెటి బ్రహ్మయ్య, కన్నా రవి దేవరాజ్, దర్శనపు శ్రీనివాస్, పంచుమర్తి ప్రసాద్, అనంతాచార్యులు, రాచమల్లు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు ఆస్తిలో సమానవాటా కల్పించిన రాజకీయ చాణక్యుడు ఎన్‌టిఆర్: రోజారాణి, అజయ్‌కుమార్ రెడ్డి

**ఎ కొండూరు, మే 29, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా ఎ కొండూరు మండలం రామచంద్రాపురం గ్రామంలో మండల టిడిపి అధ్యక్షుడు గడ్డి కృష్ణారెడ్డి సతీమణి గడ్డి రోజారాణి, వారి తనయుడు ప్రవాసాంధ్రుడు గడ్డి అజయ్‌కుమార్ రెడ్డి గడ్డి రామతులశమ్మల ఆధ్వర్యంలో తెదేపా వ్యవస్థాపక అధ్యక్షుడు నటసార్వభౌమ మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఎన్‌టిఆర్ జయంతిని పార్టీ శ్రేణులు, నాయకులు



కార్యకర్తలు ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా రోజారాణి మాట్లాడుతూ అన్న ఎన్‌టిఆర్ రాజకీయ రంగ ప్రవేశం ఒక చారిత్రాత్మక ఘట్టమని ఎన్‌టిఆర్ రాకతో మహిలలకు ఆస్తిలో సమాన వాట మహిళలకు రాజకీయ రంగంలో చట్ట సభల్లో సముచిత స్థానం కల్పించి మహిళమణులకు సమాజంలో ఒక గుర్తింపు తెచ్చిన రాజకీయ దురందరుడని రోజారాణి తెలిపారు. ప్రవాసాంధ్రుడు అజయ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ అన్న ఎన్‌టిఆర్ స్ఫూర్తితో సిఎం చంద్రబాబు వారి తనయుడు లోకేష్‌బాబులు రాష్ట్రాభివృద్ధికి పేద ప్రజల సంక్షేమానికి పి.4 లాంటి విప్లవాత్మకమైన సంస్కరణలు తేవడం తెలుగు జాతి అదృష్టమని వీరు తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు కుప్పాల శ్రీనివాసరావు ఒంటేరు రామారావు మాజీ ఎంపిటిసి మెంబర్ సేకు శ్రీనివాసరావు తదితరులు పాల్గొని ఎన్‌టిఆర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

## జూన్ 1న ఎల్‌విపిఈఐ వైటథాన్ రన్

**విజయవాడ, మే 29, ప్రభాతవార్త :** జూన్ 1న విజయవాడ బిఆర్‌టిఎస్ రోడ్డు వద్ద వైటాథాన్ రన్ నిర్వహిస్తామని ఎల్‌విపిఈఐ కోడె వెంకటాద్రి చౌదరి క్యాంపస్ హెడ్ డా అనుసువా కపూర్ తెలిపారు. ఈరన్‌కు సంబంధించిన టీషర్టును కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ




ఆవిష్కరించి మాట్లాడుతూ ఇటువంటి అవగాహన కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. డా అనసువా మాట్లాడుతూ పిల్లల్లో రెటినోబ్లాస్టోమా (కంటి క్యాన్సర్ పై అవగాహనకోసం ఈ రన్ నిర్వహిస్తున్నామన్నారు. పాల్గొనాలనుకునే వారు 9247243377ద్వారా సంప్రదించాలన్నారు.

## ఎ కొండూరు చీమలపాడు కంభంపాడు హైస్కూళ్లలో యోగా కాంపిటేషన్ : ఎంపిడివో

**ఎ కొండూరు, మే 29, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి లక్ష్మీశ సూచనల మేరకు ఎ కొండూరు మండలంలో గురువారం ఘనంగా నిర్వహించారు. అలాగే శుక్రవారం మండల పరిదిలోని ఆయా గ్రామాల సచివాలయల స్థాయిలో యోగా కాంపిటేషన్ నిర్వహించనున్నట్లు ఎంపిడివో బొజ్జగాని శ్రీనివాసరావు మీడియాకు తెలిపారు. పోలిశెట్టిపాడు, వల్లంపట్ల కంభంపాడు-1, కంభంపాడు-2, గొల్లమందల, కోడూరు, ఎ కొండూరు, ఎ కొండూరు తండా, రేపూడి, కుమ్మరికుంట్ల మాధవరం కృష్ణారావుపాలెం చీమలపాడు రామచంద్రాపురం గ్రామాల సచివాలయాల స్థాయిలో కంభంపాడు చీమలపాడు ఎ కొండూరు జిల్లా పరిషత్ హైస్కూళ్లలో నిర్వహిస్తారని శ్రీనివాసరావు తెలిపారు. జూన్ 2న మండల స్థాయి ఆ తర్వాత జిల్లా స్థాయిలో యోగా పోటీలకు ఎంపికైన వారికి నిర్వహిస్తారని ఎంపిడివో బొజ్జగాని శ్రీనివాసరావు తెలిపారు.

## బిఎఎస్ ఎఫ్ ఉత్పాదనలు వాలెక్సియో మిటెల్యా విడుదల

**అమరావతి, మే 29, ప్రభాతవార్త :** భారతదేశపు ఆహారభద్రత ఎజెండాకు సహాయపడేలా బిఎఎస్‌ఎఫ్ ఇండియా తన ఆధునిక విశ్వ పంటరక్షణ కోసం రూపొందించిన కీటకనాశని, మిటెల్యా శిలీంద్ర నాశిని లను మార్కెట్లో ఆవిష్కరించారు. వరి నష్టం చేసే దోమపోటు, పొడతెగులు నియంత్రణకు ఉత్తమపరిష్కారమని బిఎఎస్‌ఎఫ్ అగ్రికల్చరల్ సొల్యూషన్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మార్కో గ్రోజ్ దనోవిక్ పేర్కొన్నారు.

## ఘనంగా అంకమ్మ తల్లి కొలుపులు

**రొంపిచర్ల, మే 29 ప్రభాతవార్త :** స్థానిక తూర్పు బజారులో వేంచేసియున్న శ్రీ అంకమ్మతల్లి ఆలయంలో గురువారం అమ్మవారి కొలుపులు కార్యక్రమం ఘనంగా జరిగింది. అమ్మవారి ఆలయ ప్రతిష్ఠ జరిగి 41 రోజులు అయిన సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి కొలుపులు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అమ్మవారి వీరతాళ్ళ ఊరేగింపు కార్యక్రమం వైభవంగా జరిగింది. కనకతప్పెట్లతో, మేళతాళాలతో అమ్మవారి వీరతాళ్ళ ఊరేగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు వేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. వీరతాళ్ళను గ్రామంలో ఉన్న పోలేరమ్మ ఆలయం



వద్దకు ఊరేగింపు వెళ్ళి అక్కడ అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా అంకమ్మతల్లి ఆలయాన్ని భక్తులు, మహిళలు, గ్రామస్తులు సందర్శించి పూజలు నిర్వహించారు. రాత్రివేళల్లో ఆలయ ఆవరణలో భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది.

## సౌతిండియాకు శామ్సంగ్ సాల్వ్‌ఫర్ టుమారో సీజన్4 విస్తరణ

**విజయవాడ, మే 29, ప్రభాతవార్త :** తమ సాల్వ్ ఫర్ టుమారో సీజన్4ను దక్షిణ భారతదేశానికి విస్తరిస్తున్నట్లు శాంసంగ్ ఇండియా ప్రతినిధులు తెలిపారు. హైదరాబాద్‌లోని ప్రగతిశీల విద్యాసంస్థల్లో, బెంగుళూరులోని ప్రముఖ టెక్నాలజీ కేంద్రాల్లోని విద్యార్థులు సానుభూతి, ప్రయోజనం, డిజైన్ థింకింగ్ సూత్రాల ఆధారంగా స్థానిక సమస్యలకు వినూత్న పరిష్కారాలను రూపొందించేందుకు ముందుకొస్తున్నారన్నారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన సాల్వ్‌ఫర్ టుమారో రోడ్‌షో సందర్భంగా వందలాది మంది విద్యార్థులు డిజైన్ థింకింగ్ వర్క్‌షాప్‌లో పాల్గొని ప్రస్తుత పరిస్థితులను ప్రశ్నిస్తూ ప్రాథమిక జీవితంలో ఎదురయ్యే సమస్యలకు సృజనాత్మక పరిష్కారాలను కనుగొన్నారు.

## భారత మార్కెట్లో రియల్మీ జిటి7

**విజయవాడ, మే 29, ప్రభాతవార్త :** యాస్టన్ మార్టిన్ ఫార్ములా వన్ టీంతో కలిసి తాము సృష్టించిన రియల్‌మి జిటి7 సిరిస్‌ను భారత మార్కెట్లో ఆవిష్కరించామని రియల్‌మి ప్రతినిథులు తెలిపారు. పేరిస్‌లో చేసిన గ్లోబల్ లాంచ్‌తో సింక్‌లో వుంటుందన్నారు. దీనికి ఎఎంఎఫ్1 యొక్క సహబ్రాండెడ్ స్మార్ట్ఫోన్‌గా పరిచయం చేసిందన్నారు.

## డెట్టాల్ బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంఎస్ థోని

**విజయవాడ, మే 29, ప్రభాతవార్త :** తమ సబ్బులు, బాడీవాష్, హ్యాండ్‌వాష్ శ్రేణికోసం బ్రాండ్ అంబాసిడర్‌గా భారతదేశపు ఒరిజినల్ కెప్టెన్ కూల్ మహేంద్రసింగ్ థోని వ్యవహరిస్తారని ప్రముఖ బ్రాండ్ డెట్టాల్ సంస్థ ప్రతినిథులు తెలిపారు. ఐసికూల్ కూల్‌గా వుండడానికి సహకరించే డెట్టాల్‌తో జతకట్టడం ఉత్సాహంగా వుందని థోని అన్నారు.

30-5Pg5.qxd:30-5Pg5.qxd 01/01/01 8:55 AM Page 1



# సంక్షోభాలతో బెంగాల్ సతమతం




## 'నిర్మమత' ప్రభుత్వం నడుస్తోంది..

### ముఖ్యమంత్రి మమతపై ప్రధాని మోడీ వ్యాఖ్యలు

**కోల్‌కతా, మే 29:** పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని ఉద్దేశించి ప్రధాని నరేంద్రమోడీ తీవ్ర విమర్శలు చేశారు. ప్రస్తుతం రాష్ట్రం వరుస సంక్షోభాలతో సతమతమవుతోందని అన్నారు. ముర్షిదాబాద్, మాల్డాలో చోటుచేసుకున్న ఘర్షణలు ఆమె ప్రభుత్వ క్రూరత్వం, ఉదాసీనతకు నిదర్శనమని ధ్వజమెత్తారు. ప్రస్తుతం రాష్ట్రంలో 'నిర్మమత' ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. ఆ రాష్ట్రంలో నిర్వహించిన ర్యాలీలో ఈ వ్యాఖ్యలు చేశారు. కేంద్రం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఇటీవల మాల్డా, ముర్షిదాబాద్, సౌత్ 24 పరగణాలు, హుగ్లీ జిల్లాల్లో నిరసనకారులు పెద్దఎత్తున ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పలు ప్రధాన రహదారులు, రైల్వే ట్రాక్‌లను దిగ్బంధించారు. ఈ క్రమంలోనే పోలీసులపైనా ఆందోళనకారులు రాళ్లు రువ్వడంతో లాఠీఛార్జికి దారితీసింది. ముర్షిదాబాద్ ప్రాంతంలో పోలీసు వాహనాలకు నిప్పు పెట్టడం వంటి ఘటనలతో అక్కడ విధ్వంసానికి దారితీసింది. ఈ ఘర్షణలపై కలకత్తా హైకోర్టు నియమించిన నిజనిర్ధారణ కమిటీ ఇచ్చిన నివేదికతో ఇప్పటికే తృణమూల్ కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వక్ఫ్‌చట్ట వ్యతిరేక నిరసనల ఫలితంగా చెలరేగిన మతపరమైన ఘర్షణలకు స్థానిక ఎమ్మెల్యే, నాయకులు కారణమని నివేదిక ప్రస్తావించింది. ఆ సమయంలో పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని ఎత్తి చూపింది. ఈ వ్యవహారం బిజెపి చేతిలో అస్త్రంగా మారింది. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో తాజా ర్యాలీలో మమత ప్రభుత్వాన్ని మోడీ ఎండగట్టారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ వ్యక్తులు కొన్ని ఇళ్లను గుర్తించి తగులబెడుతుంటే, పోలీసులు దానిని అడ్డుకోకుండా చూస్తూ ఉంటే అది ఎంతటి భయానక పరిస్థితో అర్థం చేసుకోండి. ఇక్కడి ప్రభుత్వంపై ప్రజలకు విశ్వాసం లేదు. ప్రభుత్వాన్ని నడిపేది ఇలాగేనా? ఇక్కడ ప్రతి సమస్యకు కోర్టు జోక్యం చేసుకోవాల్సి వస్తుంది. లేకపోతే ఏదీపరిష్కారం కాదుఅని మోడీ దుయ్యబట్టారు. ర్యాలీలో ఆపరేషన్ సిందూర్ గురించి ప్రస్తావించారు. ఆ ఆపరేషన్ ఇంకా పూర్తికాలేదు, బెంగాల్ గడ్డ మీద నిలబడి, 140 కోట్ల మంది భారతీయుల తరఫున ప్రకటిస్తున్నాను. ఏప్రిల్ 22 జరిగిన పహల్గాం ఉగ్రదాడిపై బెంగాల్‌లో కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. సిందూరం శక్తి ఏంటో మన ఆర్మీ ఉగ్రవాదులకు రుచి చూపించింది. మనం వారి ఇంట్లోకి ప్రవేశించి, మూడు సార్లు దాడులు చేశామని పాకిస్తాన్ అర్థం చేసుకోవాలి అని అన్నారు. 2016లో జరిగిన సర్జికల్ స్ట్రైక్స్, 2019లో జరిగిన బాలాకోట్ దాడులు, ఇప్పటి ఆపరేషన్ సిందూర్‌ను ఉద్దేశించి మోడీ పరోక్షంగా ప్రస్తావించారు.



## ట్రంప్‌నకు న్యూయార్క్ కోర్టు షాక్!

**వాషింగ్టన్, మే 29:** పరస్పర సుంకాల అంశంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు ఎదురుదెబ్బ తగిలింది. అత్యవసర అధికారాల చట్టం కింద దిగుమతులపై ట్రంప్ భారీ సుంకాలను విధించకుండా ఫెడరల్ ట్రేడ్ కోర్టు అడ్డుకుంది. ట్రంప్ తన అధికారాన్ని అతిక్రమించారని, అమెరికా వాణిజ్య విధానాన్ని తన ఇష్టాయిష్టాలపై ఆధారపడి ఉంచి ఆర్థిక గందరగోళానికి దారితీశారని వ్యాజ్యాలు దాఖలయ్యాయి. వీటిపై విచారణ జరిపిన న్యూయార్క్‌లోని కోర్ట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ట్రేడ్, అత్యవసర అధికారాల చట్టం కింద దిగుమతులపై ట్రంప్ భారీ సుంకాలను విధించకుండా తీర్పు ఇచ్చింది. సుంకాల ద్వారా దిగుమతిని నియంత్రించడానికి అంతర్జాతీయ అత్యాయిక ఆర్థిక అధికారాల చట్టం (ఐఇఇపిఎ) చట్టం అధ్యక్షుడికి ఇచ్చిన అధికారం మించి పోయిందని కోర్టు వ్యాఖ్యానించింది. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ఈ చట్టం కింద ప్రపంచ దేశాలపై ఆర్థిక ఆంక్షలు విధించే అవకాశం అధ్యక్షుడికి ఉంటుందని ఫెడరల్ కోర్టు తేల్చి చెప్పింది. దేశాలతో వాణిజ్యాన్ని నియంత్రించేందుకు కాంగ్రెస్‌కు రాజ్యాంగం ప్రత్యేక అధికారాన్ని కల్పించిందని, దీన్ని అధ్యక్షుడి అత్యవసర అధికారాలతో అధిగమించలేరని తెలిపింది. ఇలా చేయడం రాజ్యాంగ విరుద్ధమే అవుతుందని తీర్పును వెలువరించింది. దీనిపై వెంటనే ట్రంప్ సర్కారు అప్పీల్ దాఖలు చేసింది. ఇక సుంకాలకు సంబంధించి ప్రస్తుతం అనేక దేశాలతో చర్చలు జరుగుతున్నాయని ట్రంప్ సర్కార్ న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లింది. ఈ వాణిజ్య ఒప్పందాలను ఖరారు చేసుకునేందుకు జులై 7 వరకు గడువు ఉందని, అప్పటివరకు దీన్ని చాలా సున్నితమైన అంశంగా పరిగణించాలని కోరింది. అయితే ఆ వాదనలను కోర్టు తిరస్కరించింది.

ట్రంప్ వాణిజ్య విధానంలో కేంద్ర బిందువు అయిన టారిఫ్‌లను సవాలు చేస్తూ ఇంతకు ముందు ఏడు వ్యాజ్యాలు దాఖలయ్యాయి. ఇక కోర్టు తీర్పుతో వైట్‌హౌస్ శ్వేతసౌధం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్న దానిపై స్పష్టత లేదు. ఎమర్జెన్సీ పవర్ టారిఫ్‌ను నిలిపివేయనుందా? లేదా కొత్త సుంకాలు విధిస్తారా అన్నది తెలియాల్సి ఉంది. ఈ సుంకాలను నిలిపివేస్తే ట్రంప్‌నకు ఉన్న అధికారాల ప్రకారం ద్రవ్యలోటు ఉన్న దేశాలతో తాత్కాలికంగా 150 రోజుల వరకు 15శాతం దిగుమతిపన్ను విధించే అవకాశాలున్నాయి. ఇక ఒక దశలో ప్రపంచంలోని చాలా దేశాలపై ఆయన సుంకాలను విధించడం వల్ల మార్కెట్లు కుదేలయ్యాయి.



## పాక్‌కు రహస్యాలుచేరవేస్తున్న రాజస్థాన్ ఉద్యోగి అరెస్టు!

**జైపూర్, మే 29:** పాకిస్థాన్‌కు దేశ రహస్యాలు చేరవేస్తున్నాడన్న అభియోగాలపై రాజస్థాన్ ప్రభుత్వ ఉద్యోగి ఒకరిని ఇంటెలిజెన్స్ విభాగం అధికారులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. షాకూర్‌ఖాన్ అనే ఈ ఉద్యోగి ప్రభుత్వ భద్రత సంబంధిత సమాచారాన్ని పాకిస్థాన్ వేగులకు చేరవేస్తున్నాడని గుర్తించారు. జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో పనిచేస్తున్న ఖాన్ పాకిస్తాన్ దేశ కోడ్‌తో ఉన్న నంబర్లు అనేకం ఆతని ఫోన్‌లో స్టోర్‌చేసి ఉన్నట్లు నిఘా అధికారులు తెలిపారు. పాకిస్తాన్‌కోసం షాకూర్ ఖాన్ పనిచేస్తున్నట్లు తమకు సమాచారం వచ్చిందని, దీనితో ఆతనిపై నిఘా ఉంచినట్లు తెలిపారు. ఆతని ఫోన్‌లోనే అనేక పాకిస్థానీ ఫోన్ నంబర్లు ఉన్నాయని, వాటిని ఎందుకు భద్రపరుచుకున్నారన్నదానిపై ఖాన్ జవాబివ్వడంలేదని కూడా అధికారులు చెప్పారు., ఇటీవలికాలంలో కనీసం ఏడుపర్యాయాలు పాకిస్థాన్‌లో పర్యటించినట్లు తెలిపారు. షాకూర్‌ఖాన్ అంతకుముందు గతంలో కాంగ్రెస్‌ప్రభుత్వంలో మంత్రిగాపని చేసిన షేల్ మహమ్మద్‌కు వ్యక్తిగత సహాయకునిగా కూడా పనిచేసారు. ఆ మంత్రి స్వస్థలానికి చెందినవాడే కావడంతో ఆయన షాకూర్‌ను తన పిఎగా నియమించుకన్నాడు.

## సంతకాలుజరిగినా డెలివరీలు కనిపించవు!

### రక్షణరంగ కాంట్రాక్టులపై ఎయిర్‌మార్షల్ అమర్‌ప్రీత్‌సింగ్

**న్యూఢిల్లీ, మే 29:** రక్షణ రంగంలోని ప్రధాన కాంట్రాక్టుల ఆలస్యంపై వాయుసేన అధిపతి ఎయిర్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. వీటిపై సంతకాలు జరుగుతాయి కానీ, డెలివరీలు మాత్రం మొదలుకావని అన్నారు. సిఐఐ వార్షిక సమావేశంలో పాల్గొన్న ఆయన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సమక్షంలోనే ఈవ్యాఖ్యలుచేశారు. చాలాసార్లు కాంట్రాక్టులపై సంతకాలు జరుగుతాయి. కానీ, ఆయుధాలు మాత్రం అందవు. ఇందులో టైమ్‌లైన్ అనేది ప్రధాన సమస్య. సకాలంలో పూర్తయిన ఒక్క ప్రాజెక్టు కూడా నాకు గుర్తుకురావట్లేదు. మనం చేయలేని పనికి వాగ్దానాలు చేయడం దేనికని అన్నారు. తేజస్ ఎంకే1 చాలా ఆలస్యమైంది. ఇక తేజస్ ఎంకే2 ప్రొటోటైప్ కూడా అందుబాటులోకి రాలేదు. ఇక ఆమ్కా ఫైటర్‌కు సంబంధించి ఇప్పటివరకు ప్రొటోటైప్ కూడా రాలేదు. మన దళాలు పరిశ్రమ మధ్య విశ్వాసం పెరగాల్సిన అవసరం ఉంది. పారదర్శకత చాలా అవసరం ఉంటుంది. మనం ఒక్కసారి దేనికైనా కట్టుబడితే దానిని అందించి తీరాల్సిందే. మేకిన్



ఇండియా కోసం వాయుసేన శక్తివంచన లేకుండా పని చేస్తోంది. మనం ఈ రోజు సంసిద్ధంగా ఉంటేనే భవిష్యత్తుకు రెడీ కాగలము. రానున్న పదేళ్లలో మన పరిశ్రమలు ఉత్పత్తిని గణనీయంగా పెంచగలవు. కానీ, ప్రస్తుతానికి మనం త్వరగా చర్యలు తీసుకోవడం అవసరం. దళాలను శక్తిమంతం చేసుకొంటేనే యుద్ధాలు గెలుస్తామని ఎయిర్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్‌పేర్కొన్నారు. యుద్ధ రంగంలో వేగంగా మారిపోతున్న సాంకేతికతలను అందిపుచ్చుకోవాలని ఎయిర్ మార్షల్ ఎపి సింగ్ సలహా ఇచ్చారు. మన నౌకాదళాధిపతి చెప్పినట్లు యుద్ధ రంగం వేగంగా మారిపోతోంది. ప్రతి రోజు సరికొత్త సాంకేతికత అందుబాటులోకి వస్తున్నట్లు చూస్తున్నాం. ఆపరేషన్ సిందూర్‌తో మనం ఎక్కడ ఉన్నాం, భవిష్యత్తుకు ఏం కావాలనే దానిపై స్పష్టమైన అవగాహన వచ్చింది. మనం చేయాల్సింది చాలా ఉంది. ఆమ్కా ప్రాజెక్టును ప్రైవేటు సెక్టార్ కోసం కూడా క్లియర్ చేశారు. ఇది చాలా పెద్ద నిర్ణయం. మన ప్రైవేటు రంగంపై దేశానికి ఆ రేంజ్‌లో విశ్వాసం ఉంది. భవిష్యత్తులో భారీ మార్పులకు ఇది బాటలు పరుస్తుందని చెప్పారు. అంతకుముందు ఈ ఏడాది జనవరిలో కూడా వాయుసేనాధిపతి తేజస్ డెలివరీలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తయారీ సంస్థలు ఉత్పత్తి వేగం పెంచడానికి అత్యాధునిక వ్యవస్థలపై పెట్టుబడులు పెట్టాలి. వారి మానవ వనరుల నైపుణ్యాలకు మెరుగుపరచాలి. తేజస్ తొలి ఎయిర్ క్రాఫ్ట్ 2001లోనే గాల్లోకిఎగిరింది. కానీ, 2016 నుంచి ఇప్పటివరకు తొలి 40 విమానాల డెలివరీకూడా పూర్తికాలేదని ఆయన వ్యాఖ్యానించారు.

## థరూర్‌జీ మీతో ఏకీభవిస్తున్నా -పవన్ ఖేడా



**న్యూఢిల్లీ, మే 29:** మోడీ సర్కార్‌కు అనుకూల వ్యాఖ్యలు చేస్తూ సొంత పార్టీ నుంచి విమర్శలు ఎదుర్కొంటున్నారు కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్. దీనిపై తాజాగా స్పందించిన మరో సీనియర్ నేత పవన్ ఖేడా గతంలో ఎన్డీయే ప్రభుత్వాన్ని ఉద్దేశిస్తూ శశిథరూర్ రాసిన పుస్తకంలోని ఒక పేరాను ఎక్స్‌లో షేర్ చేశారు. 2016లో జరిగిన సర్జికల్ స్ట్రైక్‌పై థరూర్ తన పుస్తకంలో తెలిపిన ఉద్దేశంతో తానూ ఏకీభవిస్తున్నట్లు పోస్టు చేశారు. 2016లో జరిగిన సర్జికల్ స్ట్రైక్‌ను రాజకీయ మైలేజీ కోసం వినియోగించుకున్నారు. మయన్మార్‌లో తిరుగుబాటుదారులను ఎదుర్కోవడంలో భాగంగా జరిగిన సైనిక దాడినికూడా ఎన్నికల ప్రచారంలో వాడుకున్నారు. అవకాశం ఉన్నప్పటికీ కాంగ్రెస్ ఇలాంటి పని ఎన్నడూ చేయలేదు అని శశిథరూర్ విమర్శించారు. ఇందుకు సంబంధించిన పేరా ఫొటోను పవన్‌ఖేడా ఎక్స్‌లో షేర్ చేశారు. ప్రస్తుతం ఈ పుస్తకాన్ని నేను చదువుతున్నాను. శశిథరూర్ మీరు చేసిన వ్యాఖ్యలతో నేను ఏకీభవిస్తున్నాఅని పోస్టు చేశారు. ఇటీవల పనామాలో విలేకరుల సమావేశంలో మాట్లాడిన శశిథరూర్ ఎన్డీయే సర్కార్‌ను కొనియాడారు. 2016లో నిర్వహించిన సర్జికల్ స్ట్రైక్ సందర్భంగా పాకిస్తాన్ భూభాగంలోకి తొలిసారిగా భారత్ చొచ్చుకుపోయిందని ఆయన అన్నట్లు వార్తలు వచ్చాయి. ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన కాంగ్రెస్ ఆయనపై మండిపడింది. తాను ప్రస్తుతం జరిగిన ఉగ్రదాడుల గురించి మాత్రమే మాట్లాడానని, గత యుద్ధాల గురించి ప్రస్తావించలేదంటూ శశిథరూర్ వివరణ ఇచ్చారు. తాజాగా దీనిపై స్పందించిన పవన్ ఖేడా గతంలో థరూర్ చేసిన వ్యాఖ్యలను తన పోస్టు ద్వారా గుర్తు చేశారు.

# పిఓకె ప్రజలు మనవాళ్లే

## గ్రేట్ ఇండియా మా సంకల్పం : రాజ్‌నాథ్‌సింగ్



**శ్రీనగర్, మే 29:** పిఓకె ప్రజలు మన వాళ్లేనని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. అక్కడున్న వారికి భారత్‌తో దృఢమైన సంబంధాలున్నాయని అన్నారు. ఈ మేరకు ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడారు. 'భౌగోళికంగా విడిపోయినా పిఓకె ప్రజలు రాజకీయంగా ఏదో ఒకరోజు భారత్‌లో ఏకమవుతారు. ఆ రోజు ఎంతో దూరం లేదు. పిఓకె దానంతట అదే తిరిగి వస్తుంది. అక్కడున్న వారికి భారత్‌తో దృఢమైన సంబంధాలున్నాయి. గ్రేట్ ఇండియా మా సంకల్పం. అక్కడ కొందరు మాత్రమే తప్పుదారి పట్టారు. మనం ఏమైనా చేయగలిగేవాళ్లం. అయితే శక్తితోపాటు సంయమనం కూడా ముఖ్యం.

ఆపరేషన్ సిందూర్ ద్వారా దేశభద్రతకు మేకిన్ ఇండియా ముఖ్యమని ప్రూవ్ అయింది. మనం ఇప్పుడు ఫైటర్ జెట్లు, క్షిపణి వ్యవస్థలను నిర్మించడంతోపాటు.. కొత్తతరం యుద్ధ సాంకేతికతలపైనా దృష్టి పెట్టాం' అని మంత్రి వెల్లడించారు. 'ఆపరేషన్ సిందూర్ సమయంలో ఉపయోగించిన దేశీయంగా అభివృద్ధి చెందిన వ్యవస్థలు ప్రపంచం మొత్తాన్ని షాక్‌కు గురిచేశాయి. శత్రుకవచాన్ని దాటుకొని వెళ్లగలమని నిరూపించాం. ఉగ్రస్థావరాలు, తర్వాత శత్రువుకు చెందిన మిలిటరీ స్థావరాలను ఎలా ధ్వంసం చేశామో మీరు చూశారు. ఇంకా చాలా చేయగలం. బలం, నిగ్రహం మధ్య సమన్వయాన్ని ప్రపంచానికి చూపాం' అని చెప్పారు. ఈ సందర్భంగా పాకిస్థాన్‌పై విరుచుకుపడ్డారు. ఉగ్రవాద వ్యాపారాన్ని నడపడానికి పెద్ద ఖర్చేం కాదు కానీ, దాని వల్ల భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. అదే ఇప్పుడు పాక్‌కు అర్థమైందన్నారు.

పాకిస్థాన్ ఎన్నో యేళ్లుగా పెంచి.. పోషిస్తున్న ఉగ్రవాదాన్ని భారత సైన్యం కేవలం 23 నిమిషాల్లో తుడిచిపెట్టేసిందని ఇటీవల రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం పాక్ చర్యలను భారత్ పరిశీలిస్తున్నదని.. తేడా వస్తే మరింత కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ ఆపరేషన్ సిందూర్‌పై గురువారం ప్రధాని మోడీ కూడా మాట్లాడారు. భారత్‌లో ఉగ్రవాదం వ్యాప్తి చేసేవారికి సరైన సమాధానం ఈ ఆపరేషన్ అని వ్యాఖ్యానించారు. పహల్గాంలో ఉగ్రమూక చేసింది మానవత్వంపై దాడి అని, ఇప్పుడు మనం టెర్రరిజానికి వ్యతిరేకంగా పోరాడేందుకు ఏకమయ్యామన్నారు.

## గాజాలో ఆహార సంక్షోభం తీవ్రతరం

### గోదాములపై దాడులు

**టెల్‌అవీవ్, మే 29:** ఇజ్రాయెల్-హమాస్‌ల మధ్య పోరు తీవ్రతరమైంది. ఈ పోరులో గాజాలో అనేకమంది సాధారణ ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు ఆ ప్రాంతంలో ఆకలి సంక్షోభం నెలకొంది. అన్నపానీయాలతోపాటు ఇతర అత్యవసర సామగ్రి సరిగా అందక ప్రజలు అల్లాడుతున్నారు. ఈ క్రమంలో ఆకలి తీర్చుకునేందుకు అంతర్జాతీయ సంస్థలు ఏర్పాటు చేసిన గిడ్డంగుల పైనే ఏకంగా దాడులకు పాల్పడుతున్నారు. దీనిని సంబంధించిన విడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి. గాజా ప్రజలకు అందించే మానవతా సాయం తరలింపునకు టెల్‌అవీవ్ పరిమితంగానే అనుమతించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే డీర్ అల్ బలాహ్‌లోని ఆహార పదార్థాల గిడ్డండిపై ప్రజలు దాడి చేశారని గిడ్డంగి అధికారులు తెలిపారు. గోధుమపిండి, ఇతర ఆహార పదార్థాలు కలిగి ఉన్న పెట్టెలను లూటీ చేసినట్లు వెల్లడించారు. గాజాలో మానవతా అవసరాలు అదుపుతప్పాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు అందే సాయాన్ని తక్షణమే పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఈ గందరగోళం నేపథ్యంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా.. పలువురు గాయపడినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి నెట్టింట వైరల్ అవుతున్న విడియోలో గన్ పేలుడు శబ్దాలు కూడా వినిపిస్తున్నాయి. ఐక్యరాజ్యసమితితో పాటు అంతర్జాతీయ సంస్థలకు చెందిన 121 ట్రక్కుల మానవతా సాయం బుధవారం గాజాలోకి ప్రవేశించాయని ఇజ్రాయెల్ అధికారులు తెలిపారు. అయితే, ఇది అక్కడి ప్రజలు అవసరానికి అందుబాటులో లేదని ఐక్యరాజ్య సమితి అధికారులు పేర్కొంటున్నారు. ఈ సాయం మరింత పెరగాలని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఐరాస మానవతా కార్యాలయం అధికారి జొనాథన్ విఠల్‌మాట్లాడుతూ.. గాజాకు అందించే సాయాన్ని హమాస్ మళ్లిస్తోందనే ఆరోపణలను ఖండించారు. ఇజ్రాయెల్‌లోని కెరెమ్ షాలోమ్ సరి హద్దులుదాటే సమయంలో ఒక క్రిమినల్ గ్యాంగ్ ఈసాయాన్ని లూటీచేస్తోందని ఆరోపించారు.

2023 అక్టోబరు నుంచి ఇజ్రాయెల్-హమాస్‌ల మధ్య జరుగుతోన్న పోరులో 54 వేల మంది ప్రాణాలు కోల్పోయారని స్థానిక యంత్రాంగం వెల్లడించింది. మానవతా సాయాన్ని పరిమితంగా అందించేందుకు ఇజ్రాయెల్ అనుమతిచ్చింది. అయితే, ఇది అక్కడి ప్రజలకు ఏమాత్రం సరిపోదనే ఆందోళన వ్యక్తమవుతోంది. కాగా.. గాజాలో మానవతాసాయాన్ని ఇప్పటిరకు ఐరాస సంస్థలు, ఇతర స్వచ్ఛంద సంస్థలు పర్యవేక్షించేవి. అయితే ఆ సాయం హమాస్‌కు చేరుతోందని, దాన్ని తప్పించేందుకు గాజా హ్యూమానిటేరియన్ ఫౌండేషనల్‌ను ఇజ్రాయెల్ ఏర్పాటు చేసింది.



## చిక్కుల్లో కమల్ హాసన్

### బెంగళూరులో కేసు నమోదు

**చెన్నై, మే 29:** కన్నడ భాష తమిళం నుంచే పుట్టింది అని ప్రముఖ నటుడు కమల్ హాసన్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు కర్ణాటకలో దుమారం రేపుతున్నాయి. తన తాజా చిత్రం 'థగ్ లైఫ్' ఆడియో రిలీజ్ ఈవెంట్‌లో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు కన్నడిగుల ఆగ్రహానికి కారణమయ్యాయి. ఆయన వ్యాఖ్యల నేపథ్యంలో కర్ణాటకలోని పలు ప్రాంతాలలో నిరసన ప్రదర్శనలు జరిగాయి. ఈ క్రమంలో కమల్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ కర్ణాటక రక్షణ వేదిక రంగంలోకి దిగింది. బెంగళూరులోని ఆర్‌టి నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఆయనపై ఫిర్యాదు చేసింది.

కమల్ వ్యాఖ్యలు కన్నడిగుల మనోభావాలను దెబ్బతీశాయని, కన్నడిగులు, తమిళుల మధ్య విద్వేషాలను సృష్టించేలా ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొంది. ఆయనపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కెఆర్‌వి డిమాండ్ చేసింది. దీంతో కమల్‌పై పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది. అయితే తన వ్యాఖ్యలపై కమల్ హాసన్ స్పందిస్తూ ఇప్పటికే సారీ చెప్పారు. తాను ప్రేమతో ఆ వ్యాఖ్యలు చేశానని, ఎవరినీ అగౌరవపరచాలనే ఉద్దేశం తనకు లేదని అన్నారు. భాషల చరిత్ర గురించి మాట్లాడే అర్హత రాజకీయ నాయకులకు లేదని పేర్కొన్నారు.

ఈ చర్చను చరిత్రకారులు, భాషా నిపుణులకు వదిలేయాలని అన్నారు. ఈ వివాదంపై కర్ణాటక రాజకీయ నేతలు కూడా స్పందించారు. కర్ణాటక సిఎం సిద్ధరామయ్య మాట్లాడుతూ కమల్‌కు కన్నడ భాష చరిత్రపై సరైన అవగాహన లేదన్నారు.

ఇతర భాషలను అవమానించడం సరైంది కాదని పేర్కొన్నారు. కర్ణాటక బిజెపి చీఫ్ బివై విజయేంద్ర కూడా కమల్ వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పలువురు నేతలు కమల్ హాసన్ సినిమాలను కర్ణాటకలో నిషేధించాలని కోరారు.

## ఇజ్రాయెల్‌లో చేతిలో శక్తిమంతమైన లేజర్ వెపన్

**జెరూసలేం, మే 29:** ఇజ్రాయెల్ తమ అమ్ముల పొదిలోని కాంతి ఖడ్గం శక్తిని యుద్ధంలో పరీక్షించింది. డజన్లకొద్దీ ప్రత్యర్థి డ్రోన్లను కూల్చింది. తాము లేజర్ ఆయుధమైన ఐరన్ బీమ్ వ్యవస్థలో తక్కువ శక్తిమంతమైన ఆయుధం వాడినట్లు బుధవారం ఆ దేశ రక్షణ శాఖ, ఐడిఎఫ్ ప్రకటించాయి. ఈ సరికొత్త సిస్టమ్‌లో తక్కువ శక్తి లేజర్ బీమ్‌ను తాము ఇంటర్‌సెప్టర్‌గా యుద్ధంలో వాడినట్లు పేర్కొన్నాయి. దీనిని ఈ యేడాది ద్వితీయార్థంలో పూర్తిస్థాయిలో సైన్యానికి అందించనున్నట్లు వెల్లడించారు. ఈ వ్యవస్థను ఇజ్రాయెల్‌కు చెందిన రఫేల్ సంస్థ అభివృద్ధి చేసింది. హెజ్‌బొల్లా నుంచి డ్రోన్ల ముప్పు పెరగడంతో అనుకున్న సమయం కంటే వేగంగా దీనిని రూపొందించినట్లు రక్షణ శాఖ వెల్లడించింది.

'ప్రస్తుత యుద్ధంలో మా వైమానిక రక్షణ వ్యవస్థలతో సహా.. లేజర్ వ్యవస్థలను కూడా మోహరించాము. అవి చాలా అద్భుతంగా పనిచేశాయి. శత్రువులు ప్రయోగించిన ఆయుధాలను అద్భుతంగా అడ్డుకొని పౌరుల ప్రాణాలు కాపాడటంతోపాటు.. దేశ ఆస్తులను రక్షించాయి' అని ఐడిఎఫ్, ఇజ్రాయెల్ రక్షణ శాఖ వెల్లడించాయి. ఈ మేరకు ఐరన్ బీమ్ వ్యవస్థ విజయవంతంగా డ్రోన్లను కూల్చివేసిన దృశ్యాలను విడుదల చేసింది.

మరోవైపు రఫేల్ సంస్థ ఛైర్మన్ యువల్ స్టెయింట్జ్ స్పందిస్తూ.. 'ప్రపంచంలోనే తొలిసారి అత్యంత శక్తిమంతమైన లేజర్‌ను పూర్తిగా వినియోగించి.. యుద్ధాల్లో ఇంటర్ సెప్టర్ వాడిన దేశంగా ఇజ్రాయెల్ నిలిచింది' అని పేర్కొన్నారు.

**మూడు శ్రేణుల్లో లేజర్ల అభివృద్ధి..**

ఇజ్రాయెల్ ఇప్పటివరకు మూడు శ్రేణుల్లో లేజర్ ఆయుధాలను అభివృద్ధి చేసింది. వీటిల్లో ఐరన్ బీమ్-ఎం అనేది భారీ వాహనాలపై అమర్చే శక్తిమంతమైన ఆయుధం. ఇది 50 కిలోవాట్ల శ్రేణి లేజర్‌తో ప్రత్యర్థి ఆయుధాలను కూల్చేస్తుంది. వివిధ లేయర్లు ఉండే రక్షణ వ్యవస్థల్లో భాగంగా దీనిని వాడొచ్చు. ఐరన్ బీమ్‌లోనే తేలికపాటి తేలికపాటి వెర్షన్ భావించి లైట్ బీమ్‌ను కూడా అభివృద్ధి చేసింది. దీనిని చిన్న వాహనాలపై అమర్చి ఉపయోగించవచ్చు. ఇది 10 కిలోవాట్ల శ్రేణి హైఎనర్జీ లేజర్ ఆయుధం. యుఎవిలు, డ్రోన్ల దండుపై ప్రభావంతంగా పనిచేస్తోంది. దీంతో ప్రత్యర్థి డ్రోన్లను కూల్చుడానికి అయ్యే ఖర్చు నామమాత్రమే అని రఫేల్ కంపెనీ వెల్లడించింది. దీంతో ప్రత్యర్థి డ్రోన్లను కూల్చడానికి అయ్యే ఖర్చు నామమాత్రమే అని రఫేల్ కంపెనీ వెల్లడించింది. ఏకకాలంలో కొన్ని కిలోమీటర్ల దూరంలోని 10 లక్ష్యాలను ఇది కూల్చగలదు.

ఇక యుద్ధనౌకల పైనుంచి వినియోగించే నేవల్ ఐరన్‌బీమ్‌ను కూడా అభివృద్ధి చేసింది. ఇది 100 కిలోవాట్ల హైఎనర్జీ లేజర్‌ను వాడి యుద్ధ నౌకలను రక్షిస్తుంది. యుద్ధ నౌకలపై ఉన్న రక్షణ వ్యవస్థలు పెద్ద సంఖ్యలో దూసుకొస్తున్న ముప్పుతో (సాచురేటెడ్ అటాక్) బిజీగా మారినప్పుడు ఇది శక్తిమంతంగా పనిచేస్తుంది. కొన్ని వందల మీటర్ల నుంచి కొన్ని కిలోమీటర్ల దూరంలోని ముప్పును ఇది అడ్డుకొంటుంది. ఇంటర్‌సెప్షన్‌కు అయ్యే ఖర్చు కూడా చాలా నామమాత్రమని కంపెనీ పేర్కొంటోంది.

## అణు క్షిపణులపై ఇరాన్ దృష్టి

### ఆస్ట్రియా నిఘా సంస్థలు

**వియన్నా, మే 29:** ఇరాన్ దీర్ఘశ్రేణి అణు క్షిపణులను అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టిందని ఆస్ట్రియాకు చెందిన నిఘా సంస్థలు నివేదికలు ఇచ్చాయి. 'ప్రాంతీయంగా ఉన్న రాజకీయ లక్ష్యాలను బలంగా ముందుకు తీసుకెళ్లేందుకు.. ఇస్లామిక్ రిపబ్లిక్ పునర్ వ్యవస్థీకరణకు ఇరాన్ తీవ్రంగాయత్నిస్తోంది. అణ్వాయుధాలతో బయటదాడుల నుంచి రక్షణపొందుతూ.. పశ్చిమాసియా చుట్టుపక్కల ఆధిపత్యాన్ని పెంచుకోవడం ప్రయత్నిస్తోంది. ఇరాన్ అణుకార్య క్రమం చాలా పురోగతి సాధించింది. దీంతో పాటు దానిఅమ్ములపొదిలో సుదూర ప్రాంతాల్లో అణు వాంహెడ్‌లను ప్రయోగించగల సామర్థ్యం కూడా పెరుగుతోంది' అని పేర్కొన్నారు.

## బిష్ణోయ్‌గ్యాంగ్ షార్ప్‌షూటర్ ఎన్‌కౌంటర్‌లో హతం

**హాపూర్, మే 29:** యూపి టాస్క్‌ఫోర్స్, ఢిల్లీపోలీసుల జాయింట్ ఆపరేషన్‌లో లారెన్స్ బిష్ణోయ్‌గ్యాంగ్‌కు చెందిన షార్ప్‌షూటర్‌ను మట్టుపెట్టారు. కొత్వాలి ప్రాంతంలోని హాపూర్‌వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఈ షార్ప్‌షూటర్ చనిపోయినట్లు తేలింది. మృతుడు నవీన్‌కుమార్‌గా గుర్తించారు. అనేక కేసుల్లో వాంటెడ్ క్రిమినల్‌గా ఉన్నాడు. ఎంకోకా చట్టం కింద నమోదయిన హత్యకేసులో కూడా నిందితుడుగా ఉన్నట్లు సీనియర్‌పోలీసు అధికారులు తెలిపారు. ఎస్‌టిఎఫ్ ఎడిజిపి అమితాబ్ యాష్ మాట్లాడుతూ నిందతుడి ఆచూకీ తెలియడంతో వెంటనే చుట్టుముట్టామని, హాపూర్‌కొత్వాలిలో ఉన్న ఆప్రాంతంలో తమపై కాల్పులు ప్రారంభించడంతో జరిగిన ఎదురు కాల్పుల్లో కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయన్నారు. స్థానిక ఆసుపత్రికి తరలించామని, అక్కడే వైద్యులు ఆతడు మృతిచెందినట్లు నిర్ధారించారన్నారు.

ఘజియాబాద్ జిల్లాలోనిలోని గ్రామానికిచెందిన కుమార్ బిష్ణోయ్ గ్యాంగ్‌లో షార్ప్ షూటర్‌గా నిలిచాడు. గ్యాంగ్ సభ్యుడు హషీమ్ బాబాతో సన్నిహితంగా నిలిచాడు. సుమారు 20 కేసుల వరకూ ఆతనిపై నమోదయ్యాయి. ఒకటి హత్యాయత్నం, కిడ్నాప్, రాబరి, మహారాష్ట్ర కోకా చట్టం కింద హత్యకేసులు నమోదయినట్లు తేలిపారు. ఢిల్లీ, యూపిల్లోనే ఈకేసులున్నాయి. ఆయుధచట్టం కింద 2008లో మొట్ట మొదటి కేసు ఢిల్లీలోని సీమాపురి స్టేషన్‌లో నమోదయింది. 2009లో ఆతడు సహిబాబాద్ స్టేషన్ ప్రాంతంలో ఒకరిని హత్యచేసినట్లు తేలింది. దీనితో ఆతడిపై గ్యాంగ్‌స్టర్ చట్టంకింద 2010లో ఉత్తర ప్రదేశ్‌పోలీసులు కేసులు నమోదుచేసారు.

30-5Pg6exHMNWJQE.qxd:30-5Pg6exHMNWJQE.qxd 01/01/01 10:03 AM Page 1



# రైతు అవసరాలకు తగ్గట్లు పరిశోధనలు చేపట్టాలి

## - వ్యవసాయ సంచాలకులు ఢిల్లీ రావు

**విజయవాడ,మూ29,ప్రభాతవార్తప్రతినిధి:** వ్యవసాయ శాస్త్ర వేత్తలు తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి రైతు అవసరాలను కేంద్రీకృతం చేసుకుని ,వాటికి తగ్గట్టు పరిశోధనలను చేబట్టాలని రాష్ట్ర వ్యవసాయ సంచాలకులు డిల్లీ రావు శాస్త్రవేత్తలను కోరారు .ఎన్టీఆర్ జిల్లాలలోని గరికపాడు కె వి కె నందు ఈ రోజు జరిగిన వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు .వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా ఈ రోజు 29 నుండి వచ్చే నెల జూన్ 12 వరకు వ్యవసాయం మరియు అనుబంధ రంగములైన పశుసంవర్ధక ,మత్స్య ,పౌల్ట్రీ రైతులకు రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం,కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్ర వేత్తలు ,కేంద్ర వ్యవసాయ పరిశోధన సంస్థలలోని శాస్త్రవేత్తలు క్షేత్ర స్థాయిలోనీ రైతుల పొలాల వద్దకు అందుబాటులో ఉండి ,తగు సాంకేతిక సూచనలను అందిస్తారని తెలిపారు/ఈ కార్యక్రమంలో రైతులు పూర్తి స్థాయిలో పాల్గొని వారి అనుమానాలను నివృత్తి చేసుకోవాలన్నారు .ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ గారి ఆకాంక్ష మేరకు కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ గారి ప్రోద్బలంతో రైతులు వారి పంట ఉత్పత్తులను పెంచే దిశగా ఈ పథకం రూపొందించడం జరిగిందని తెలిపారు.శాస్త్రవేత్తలు సాగు రైతులకు వారి పరిశోధనస్థానాలలోని నూతన సాంకేతిక ఆవిష్కరణలను పంట పొలాలవరకు ( పరిశోధన ల నుండి పంట పొలాల వరకు ) ఈ కార్యక్రమము ద్వారా తీసుకెళ్లాలని కోరారు .రైతులు ఆర్థికంగా బలోపేతానికి అయ్యే ప్రక్రియ కు అదనంగా జ్ఞానసముపార్జన చేయడం ద్వారా సంపూర్ణ సంపన్న రైతులుగా ఎదగ వచ్చని ,అటువంటి వారు దేశానికి గర్వకారణం అని తెలిపారు.

శాస్త్రవేత్తలు ఈ వేదికల ద్వారా రైతులకు వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానంను అవగాహన కల్పించి రైతులను సాధికారం సాధించి సంపన్నులుగా మార్చే దిశగా

ఈ కార్యక్రమము ఉండాలని కోరారు . క్షేత్ర సందర్శనలో భాగముగా అనుమంచిపల్లి గ్రామంలో జరిగిన డ్రోన్ వినియోగం సాంకేతిక పరిజ్ఞానం పై క్షేత్ర ప్రదర్శన , పరిశీలనలో పాల్గొన్నారుఈ కార్యక్రమంలో కె వి కె కోఆర్డినేటర్ అచ్యుత రాజు , శాస్త్ర వేత్తలు శివప్రసాద్ ,వెంకట్ రెడ్డి,రాజశేఖర్ ,లక్ష్మీకళ ,జస్వంత్ రెడ్డి ,ప్రభావతి ,యన్ టి ఆర్ జిల్లా వ్యవసాయ అధికారి విజయకుమారి ,రైతులు ,వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు

# జనసంద్రమైన కడప



### లక్ష్యలాదిగా తరలివచ్చిన నేతలు, కార్యకర్తలు, అభిమానులు

### ఆకట్టుకున్న చంద్రబాబు, లోకేష్ ప్రసంగాలు

**కడప, మే 29, ప్రభాతవార్త బ్యూరో** చరిత్రలో నిలిచి పోయేలా తెలుగుదేశం మహానాడు కడప నగరమంతా పసుపు మయం తరలివచ్చిన కేంద్ర మంత్రులు రాష్ట్ర మంత్రులు ఎంపీలు ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు నేతలు ప్రముఖులు అభిమానులు కార్యకర్తలు ఘనంగా ప్రారంభమై చివర రోజు భారీ బహిరంగ సభతో ముగిసిన మహానాడు మూడు రోజులు పండగ చరిత్రలో నిలిచిపోయే విధంగా తెలుగుదేశం పార్టీ కడపలో మహానాడు నిర్వహించింది ఈనెల 27 28 29 తేదీల్లో నిర్వహించిన పసుపు పండగ ఘనంగా జరిగింది. గురువారం సాయంత్రం సుమారు ఐదు లక్షల మంది అభిమానులు కార్యకర్తలు నేతలతో భారీ బహిరంగ సభ జరిగింది. ఈ సభతో మూడు రోజులు పండగ ముగిసింది. ఈ నెల 27 28 29 తేదీల్లో మహానాడు కడప నగర సమీపంలోని సీకేతిని మండలం పబ్బాపురం సమీపంలో సుమారు 150ఎకరాలలో ఎకరాలు లో మహానాడు వేడుక నిర్వహించారు ఈ వేడుకలలో తెలుగుదేశం పార్టీ పాలన ఘనతలు తెలియజేసే విధంగా డిజిటల్ ఫోటో ఎగ్జిబిషన్ ఈ ఎడాది కోటను విజయనికి సంబంధించి సమాచారం కోటమే పాలన అభివృద్ధి సంక్షేమం లోకేష్ పాదయాత్ర సంబంధించి ఈ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి ఈ ప్రాంగణంలో ముఖ్యమంత్రి కి తాత్కాలిక కార్యాలయం 25వేల మంది ప్రతినిధులు కూర్చునే విధముగా సభా ప్రాంగాన్ని ఏర్పాటు చేశారు 400 మంది వరకు కూర్చునే విధంగా ప్రధాన వేదిక ఏర్పాటు చేశారు చివరి రోజు ఐదు లక్షల మందితో భారీ బహిరంగ సభ ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ప్రసంగించారు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి మంత్రి లోకేష్ అవసరాలు ఆలోచన తగినట్టుగా మారుదాం పార్టీ పరిష్టానికి ఆరు సూత్రాలను శాసనాలుగా పాటిద్దాం పాటిద్దాం అంటూ నా తెలుగుదేశం కుటుంబం అన్న కాన్సెప్ట్ తో ఆరు సంవత్సరాల ఆయన మహానాడు వేదికపై ప్రకటించారు పార్టీకి శాసనాలుగా 6 సూత్రాల పేర్కొన్నారు తెలుగుజాతి విశ్వ ఖ్యాతి ఇవ్వగలం స్త్రీ శక్తి పేదల సేవలో సోషల్ రీ ఇంజనీరింగ్ అన్నదాత పండగ కార్యకర్త అధినేత అన్న ఈ ఆరు అంశాలను లోబడి పార్టీ ఇకపై పని చేయాలని నారా లోకేష్ స్పష్టం చేశారు మధ్యాహ్నం పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేశారు రాష్ట్రంలో అభివృద్ధి వికేంద్రీకరణ వెనుకబడిన ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ మౌలిక సదుపాయాల కల్పనపై చర్చించడం జరిగింది . రెండవ రోజు ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులర్పించారు వివిధ అంశాలపై చర్చించారు సాయంత్రం ఏడు గంటలకు పార్టీ జాతి అధ్యక్షుడిగా ఎన్నిక ప్రకటన ప్రమాణం ప్రసంగం నారా చంద్రబాబునాయుడు చేశారు తిరిగి ఆయన జాతీయ అధ్యక్షుడుగా ఎన్నిక కావడంతో కేంద్ర మంత్రులు మంత్రులు ఎంపీలు ఎమ్మెల్యేలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు మూడవరోజు గురువారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి భారీ బహిరంగ సభ ప్రారంభమైంది ఈ బహిరంగ సభకు సుమారు 5 లక్షల మంది పైబడి కార్యకర్తలు అభిమానులు వచ్చారు కడప నగరంతో పాటు సభా ప్రాంగణమంతా ఉదయం ఐదు గంటల నుంచి సందడి మొదలైంది వివిధ ప్రాంతాల నుంచి భారీగా జనం రావడంతో కడప నగరం కిక్కిరిచ్చిపోయింది ఉదయం ఐదు గంటల నుంచి అభిమానులు కార్యకర్తలు సభా పరంగానికి రావడం మొదలైంది కడప చరిత్రలో ఎన్నడు లేని విధంగా తెలుగుదేశం పార్టీ నిర్వహించిన మహానాడు మూడు రోజులు పండగ జరిగింది.

# వైద్య కళాశాలలను ప్రైవేట్ విద్యా సంస్థలకు కట్టబెట్టే యత్నాలను చేస్తున్న ప్రభుత్వం : మాజీ మంత్రి విడదల రజని

**విజయవాడ,మే29,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో పేద విద్యార్థులకు వైద్య విద్యను చేరువ చేయాలనే గొప్ప సంకల్పంతో గత ప్రభుత్వంలో సీఎం వైయస్ జగన్ తీసుకువచ్చిన కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీలను కూటమి సర్కార్ దుర్మార్గంగా ప్రైవేటు వ్యక్తులకు కట్టబెటుతోందని మాజీ మంత్రి, వైయస్ఆర్‌సీపీ పీఏసీ మెంబర్ విడదల రజిని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడేపల్లి వైయస్ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ లీజు ముసుగులో దాదాపు రూ.8500 కోట్ల విలువైన ఆస్తులను కేవలం రూ.5వేలకే ప్రైవేటు వ్యక్తులక దారాదత్తం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లీజు ముసుగులో ప్రభుత్వ మెడికల్ కాలేజీలను 66 ఏళ్ళ పాటు ప్రైవేటు యాజమాన్యాలకు అప్పగించి, పేద విద్యార్థుల భవిష్యత్తుతో కూటమి ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని ధ్వజమెత్తారు. దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా గత వైయస్ జగన్ పాలనలో ఐదేళ్లలోనే 17 మెడికల్ కాలేజీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టి, వేగంగా పనులు మొదలుపెట్టారు. నాడు నేడు ద్వారా ప్రపంచశ్రేణి వసతులతో అపోలో, ఏఐజీ వంటి కార్పొరేట్ స్థాయి ఆస్పత్రులకు దీటుగా కాలేజీల నిర్మాణంను పరుగులు పెట్టించారు. మూడు విడతల్లో సుమారుగా రూ. 8500 కోట్లతో కాలేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. వైద్య విద్యను అభ్యసించాలని కలలు కనే పేదింటి బిడ్డల ఆశలను నెరవేర్చాలనే గొప్ప ఆశయంతో వైయస్ జగన్ ముందడుగు వేశారు. ప్రతి జిల్లా ప్రజలకు స్థానికంగానే సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ఉచితంగా అందించాలని వినూత్నమైన ఆలోచనలను ఆచరణలో పెట్టారు. అందరికీ అందుబాటులో ఉండేలా ఆయా ఆస్పత్రుల నిర్మాణం కోసం అతి కష్టం మీద ప్రైమ్ ఏరియాల్లోనే 50 ఎకరాల చొప్పున భూములు సేకరించారు. మొదటి దశలో ఐదు మెడికల్ కాలేజీలు పూర్తి చేసి క్లాసులు కూడా ప్రారంభించారు. రెండో దశలో పాడేరు, పులివెందుల, మార్కాపురం, ఆదోని, మదనపల్లె మెడికల్ కాలేజీలు పూర్తి చేయాలని నిర్ణయించాం. పాడేరు కాలేజీకి 50 సీట్లు కూడా మంజూరయ్యాయి. పులివెందుల కాలేజీకి ఎన్ఎంసీ సీట్లు కేటాయించినా వద్దని వెనక్కి ఇచ్చేసిన నీచ చరిత్ర చంద్రబాబుది. రెండో దశలో పూర్తి కావాల్సి న మెడికల్ కాలేజీల నిర్మాణం కోసం కూటమి ప్రభుత్వం వచ్చాక ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకుండా మూలన పడేసింది.

ప్లగ్ అండ్ ప్లే తరహాలో ఎంబీబీఎస్ తరగతులు నిర్వహించేందుకు సకల సౌకర్యాలతో తీర్చిదిద్దిన కాలేజీలను ప్రైవేటుకు కట్టబెట్టి ఏకంగా 66 ఏళ్ల పాటు హక్కులు కల్పించబోతోంది. గత ప్రభుత్వంలో దాదాపుగా పూర్తయిన 10 మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తోంది. ప్రభుత్వం చేస్తున్న కుట్రలకు ఆమోద ముద్ర వేయించుకునేందుకు ఓ కన్సల్టెన్సీ ని తెరపైకి తెచ్చి కథ నడిపిస్తున్నారు. అధ్యయనం చేసి ప్రైవేటు వ్యక్తులకు ఏవిధంగా ఇస్తే బాగుంటుందో చెప్పే బాధ్యతను కేపీఎంజీ అనే ఒక కన్సల్టెన్సీకి అప్పగించారు.

# ముఖ్యమంత్రికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు లేఖ

**విజయవాడ,మే29,ప్రభాతవార్తప్రతినిధి:** అమెరికా వెళ్లే విద్యార్థుల వీసాలు తాత్కాలికంగా నిలిపేయడం, సోషల్ మీడియా అకౌంట్ల తనిఖీపై రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడిచేసి నిబంధనలు తొలగించేందుకు కృషిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు గురువారం లేఖ రాశారు. భారతదేశం నుండి ఏటా మూడు లక్షల మంది చదువుకునేందుకు అమెరికా వెళుతున్నారని తెలిపారు. అందులో ఎపి నుండి వెళ్లేవారు గణనీయంగా ఉన్నారని, ఇప్పుడు అమెరికా అధ్యక్షులు ట్రంప్ నిర్ణయం వల్ల అనేక మంది విద్యార్థులకు వీసాలు రాకుండా నిలిపేస్తున్నారని పేర్కొన్నారు. సోషల్ మీడియా ఎకౌంట్లను పూర్తిగా తనిఖీ చేసిన తరువాతనే అనుమతిస్తున్నారని వివరించారు. ఈ సంవత్సరం సుమారు 38 శాతం మందికి తిరస్కరించారని, ఈ నిర్ణయంలో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనతో ఉన్నారని వివరించారు. భారతదేశంలో వివిధ యూనివర్శిటీల్లో వివిధ అభిప్రాయాలు కలిగిన విద్యార్థులుంటారని, తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా సోషల్ మీడియాలో తెలుపుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. అమెరికా గురించి దానికి వ్యతిరేకంగా ఉండే దేశాల గురించి భారత్‌లో ఉండే విద్యార్థులు తమ అభిప్రాయాలు పోస్ట్ చేయకుండా ఉండాలనడం అప్రజాస్వామికమని పేర్కొన్నారు. ఇప్పుడు ఆ పేరుతో విద్యార్థుల వీసాలు తిరస్కరించడం సరైంది కాదని తెలిపారు. అంతర్జాతీయ సహజ న్యాయ సూత్రాలకు, ప్రోటోకాల్స్‌కి ఇది విరుద్ధమని వివరించారు. అమెరికా నుండి వచ్చే వారికి మన ప్రభుత్వం ఇలాంటి ఆంక్షలు విధించడం లేదని పేర్కొన్నారు. అప్పులు చేసి మరీ విద్యార్థుల తల్లిదండ్రులు వీసాలకు దరఖాస్తు చేసి ఎదురు చూస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం కూడా విదేశీ విద్యకు సహాయమందిస్తోందని, ఈ పరిస్థితుల్లో సోషల్ మీడియా పోస్టుల పరిశీలన చేసి, దాని ఆధారంగా వీసాలివ్వడం అంటే భారతదేశం పట్ల వివక్షతను చూపడమే అవుతుందని వివరించారు. ఈ పక్షపాత ధోరణి వల్ల విద్యార్థులు తీవ్ర వివక్షకు గురైన నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై జోక్యం చేసుకుని కేంద్ర ప్రభుత్వం ద్వారా అమెరికా కొత్తగా పెట్టిన నిబంధనలు ఉపసంహరించుకునేటట్లు చర్యలు తీసుకోవాలని కోరారు. అదే సమయంలో అమెరికాతో పోటీపడగలిగిన నాణ్యత కలిగిన విద్యను దేశంలో ప్రభుత్వ రంగంలో అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

# జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు మరో మూడు నెలల పొడిగింపు

**విజయవాడ,మే 28,**ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువు ముగుస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల కాలపరిమితిని మరో మూడు నెలలు పాటు జూన్ 1, 2025 నుండి ఆగష్టు 31, 2025 వరకు లేదా కొత్త కార్డులు జారీ ప్రక్రియ చేయడం గానీ ఏది ముందు జరిగితే అప్పటివరకు పొడిగింపు ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్ల గురువారం ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం మే 31 నాటికి అక్రిడిటేషన్ కార్డులు పనిచేస్తున్న పాత్రికేయులకు మాత్రమే మరో మూడు నెలలు జూన్ 1, 2025 నుండి ఆగష్టు 31, 2025 వరకు ఈ పొడిగింపు సౌకర్యం వర్తిస్తుందని ఆ ప్రకటనలో సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్ల తెలియజేశారు.

# వీఆర్ఓ బదిలీలపై ప్రభుత్వం స్పష్టతనివ్వాలి: ఏపి వీఆర్ఓ అసోసియేషన్

**విజయవాడ, మే 29, ప్రభాతవార్త :** రాష్ట్రంలో వీఆర్ఓలకు బదిలీలకు సంబంధించిన అంశంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్ర రాజు, ప్రధాన కార్యదర్శి ఎం అప్పలనాయుడులు డిమాండ్ చేశారు. బదిలీలకు సంబంధించి ఈనెల 15న జిఓ.నెం.23ను ప్రభుత్వం జారీ చేసిందని, ఈ మేరకు సిసిఎల్ఎ ఈనెల 15న గైడ్‌లైన్స్ ఇచ్చారన్నారు. ఆ మేరకు బదిలీలు జరుగుతాయని తామంతా అనుకుంటున్న తరుణంలో మంత్రి డోల వీరాంజనేయులు ఈనెల 21న మాట్లాడుతు సచివాలయాల రేషనలైజేషన్ జరుగుతున్నందన సచివాలయ సిబ్బందికి బదిలీలు జరగవని మీడియాకు చెప్పారన్నారు. కానీ ఇప్పటివరకు గ్రామ, వార్డు, సచివాలయాల శాఖద్వారా ఎటువంటి ఆదేశాలు అధికారికంగ రాలేదన్నారు. ఇప్పటికే బదిలీల ప్రక్రియలో ఆలస్యం జరిగినందున వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకుని బదిలీలపై స్పష్టతనివ్వాలని డిమాండ్ చేశారు.

# రైలు ప్రయాణికుల భద్రతే ధ్యేయం

## - డిఆర్ఎం గుప్తా ఉద్ఘాటన

**గుంతకల్లు రైల్వే,మే 29,ప్రభాతవార్త** రైలు ప్రయాణికుల భద్రతే ధ్యేయంగా ప్రతిఒక్కరు నిబద్ధతలతో పనిచేయాలని డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా ఉద్ఘాటించారు. అదనపు డిఆర్ఎం సుధాకర్,సీనియర్ డిఇఎన్(సమన్వయం) జీబీఎస్ శ్రీనివాస్‌లతో కలిసి గురువారం రైల్వే డివిజన్ పరిధిలోని ఇంజనీరింగ్ అధికారులు, సీనియర్ సబార్డినేట్లతో సమీక్షా సమావేశం నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి కాలవ్యవధి దాటిన స్టేషన్ భవనాలు,ప్లాట్ ఫాంలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు,షెల్టర్లు,ప్రయాణికులు అధికంగా ఉండే ఇంటర్ ఫేస్ జోన్‌లపై దృష్టి సారించి శిథిలావస్థలో ఉన్న భవనాలను, కనిపించే పగుళ్లను,గోడలను,పైకప్పు నీటి లీకేజీలను, లోపాల్లాయాలను గుర్తించి వాటి నివారణకు తీసుకోవాల్సి న చర్యలు చేపట్టడంతో పాటు తక్షణమే మరమత్తులు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగానికి చెందిన అధికారులు పి. సింగ్,కె శ్రీనివాస్,ఇ సుదర్శన్‌రెడ్డి,సుబ్బారావు, నందగోపాల్,సబ్ డివిజన్‌కు చెందిన అధికారులు, సీనియర్ సబార్డినేట్లు తదితరులు పాల్గొన్నారు.

# విజయవంతంగా మనక్‌మంథన్

## - బిఐఎస్ నేతృత్వంలో అవగాహన కార్యక్రమం

**విజయవాడ, మే 29, ప్రభాతవార్త :** బిఐఎస్ నేతృత్వంలో విజయవాడలో గురువారం మనక్‌మంథన్ ద్వారా అవగాహన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. బిఐఎస్ విజయవాడ బ్రాంచ్ ఆఫీస్ డైరెక్టర్ మరియు హెడ్ ప్రేమ్ సంజాని పి, మరియు విజయవాడ హెడ్ డా చింతా శేఖర్ లు ఆహుతులకు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ యొక్క వస్తువుల ప్రామాణీకరణ, మార్కింగ్, నాణ్యత ధృవీకరణ (ఐఎస్ఐ), నిర్వహణ వ్యవస్థ ధృవీకరణ, సిస్టం సర్టిఫికేషన్, దానికి సంబంధించిన విషయాలకోసం బిఐఎస్ సురక్షితమైన నమ్మగదిన నాణ్యమైన వస్తువులనందించడం అంశాలపై తమ ప్రసంగంలో వివరించారు. వినియోగదారులకు ఆరోగ్య ప్రమాదాలను తగ్గించడం, ఎగుమతులు, దిగుమతుల ప్రత్యామ్నాయంను ప్రోత్సహించడం, హాల్‌మార్కింగ్, ప్రామాణీకరణ, సర్టిఫికేషన్, పరీక్షల ద్వారా క్వాలిటీ నిర్ణయం అంశాలను సోదాహరణంగా వివరించారు. విజయవాడ బిఐఎస్ సైంటిస్ట్ డి అండ్ జాయింట్ డైరెక్టర్ కె సాయి కౌశిక్ ఈ భారతీయ ప్రమాణాలపై అవగాహన కల్పిస్తూ ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రయోగశాలల అధికారులు, తయారీదారులు, విజయవాడలోని సిపిఇటి నుండి ఇంటర్న్‌లు సలహాదారులు దాదాపు 40 మంది పాల్గొన్నారు. వారు కొత్తగా ప్రచురించిన ప్రమాణంపై చర్చల్లో పాల్గొన్నారు. వారికి బిఐఎస్ అమలు చేస్తున్న హాల్‌మార్క్, ఐఎస్ఐ మార్క్, రిజిస్ట్రేషన్ మార్క్ వంటి నాణ్యతా ప్రమాణీకతను ఎలా ధృవీకరించాలో మార్గనిర్దేశనాని ్న బిఐఎస్ అధికారులు తెలిపారు. బిఐఎస్ కేర్ యాప్ ద్వారా ప్రమాణాలను తెలుసుకోవడం, ఫిర్యాదు చేయడం వంటి వివరాలందించారు. కార్యక్రమంలో బిఐఎస్ సైంటిస్ట్ /డిప్యూటి డైరెక్టర్ వివేక్ వర్ధన్ రెడ్డి, బిఐఎస్ విజయవాడ బ్రాంచ్ కార్యాలయం ప్రమోషన్ ఆఫీసర్ కృష్ణవీర్ వర్మ , బిఐఎస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మనక్‌మంథన్ లో పాల్గొన్నవారికి అవగాహన కల్పిస్తున్న బిఐఎస్ అధికారులు

# మాధవమాల హస్తకళల హబ్‌కు మంచిరోజులు: కలెక్టర్

**శ్రీకాళహస్తి,మే 29 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని హస్తకళలకు కొత్త ప్రోత్సాహం ఇస్తామని,కలంకారి కళాకారులను ఆదుకుంటామని ఏర్పేడు మండలం మాధవమాల హస్తకళల అభివృద్ధికి ప్రత్యేక గుర్తింపు ఇవ్వటానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్ అన్నారు. గురువారం ఆయన శ్రీకాళహస్తి తిరుపతి మార్గంలోని మాధవ మాల హస్తకళల హబ్‌ను ప్రత్యేకంగా పరిశీలించారు. హస్తకళలను ప్రోత్సహించుటకు కళాకారులను ఆదుకొనుటకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందన్నారు. హస్తకళల ఉత్పత్తులకు,దారు శిల్పాలను లేపాక్షి ద్వారా విక్రయించే అవకాశం కల్పిస్తామని ఆయన తెలిపారు. కలంకారి క్లస్టర్‌లో కళాకారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసారు. మాధవమాల క్లస్టర్‌లో కళాకారుల నైపుణ్యాన్ని తిలకించిన కలెక్టర్ వెంకటేశ్వరన్ వారిని అభినందించారు. ఎంతో చాతుర్యం, కళానైపుణ్యం ఉన్న కళాకారులను ప్రోత్సహిస్తే వారిలోని ప్రతిభ ఇంకా ఇనుమడిస్తుందన్నారు. కళాకారులతో కలెక్టర్ మాట్లాడుతూ మీకు ఏ సదుపాయం కావాలని ప్రశ్నించినపుడు వారు. తమకు మార్కెటింగ్ సదుపాయం ఎంతో ముఖ్యమన్నారు. పోటీ ప్రపంచంలో భారీ పరిశ్రమల దాటికి తట్టుకోలేకపోతున్నామని కళాకారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారికి భరోసా ఇస్తూ 'తాను శ్రీబాలాజి వుడ్ కార్వింగ్ ఆర్టిజన్‌మ్యూచువల్ ఏయిడెడ్ కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ వారి ద్వారా కళాకారులకు కావాల్సి న సదుపాయాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. అంతేకాక ప్రభుత్వం పరంగా ఏ సదుపాయం కావాలన్నా ఏర్పాటు చేయిస్తామని వివరించారు. తిరుపతి జిల్లాలో హ్యాండీ క్రాఫ్ట్ హబ్‌గా మాధవమాలలోని కళా ఖండాలకు దేశ,విదేశాల్లో ఎంతో గుర్తింపు ఉందని వివరించారు. నేటి టెక్నాలజీని ఉపయోగించి యంత్రాల ద్వారా బొమ్మలు తయారు చేస్తే కోర్ స్కిల్ పోతుందని కలెక్టర్‌కు కళాకారులు వివరించారు. అయితే పని చేస్తున్న వారికి టూల్ కిట్స్ ను అందిస్తామని కలెక్టర్ వివరించారు.



కలంకారి కళాఖండాన్ని చూపుతున్న పద్మావతి

# 'చిరుత'పట్టివేతకు సెర్చ్‌ఆపరేషన్ !

## -టెక్నాలజీతో వేట మొదలుపెట్టిన టిటిడి

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** దట్టమైన శేషాచలంఅటవీప్రాంతంలో ఏడుకొండలకు ఉన్న అలిపిరి కాలినడక మార్గంలో చిరుతల సంచారం మొదలవడంతో ,ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పట్టివేతకు టిటిడి సెర్చ్‌ఆపరేషన్ మొదలుపెట్టింది. అలిపిరి మెట్లమార్గంలో 2.5కిలోమీటర్లు ఏడవమైలునుండి లక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకు ఇరువైపులా గుబురుగా అడవి ఉండటంతో చిరుతల కదలికలపై నిఘాకు నడకదారిలో స్టాటిక్ కెమెరాలు, మోషన్‌సెన్సార్ కెమెరాలతో పటిష్టభద్రత, నిఘాపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే ఒంటరి చిరుతపులి కాలినడకమార్గంతోబాటు మొదటిఘాట్‌లో వినాయకుడిగుడి వద్ద రైలింగ్‌పిట్టగోడపై కూర్చుని ఉండటం, వాహనాల ఫోకస్‌య వెలుతురుకు, శబ్ధాలకు పరుగులుతీయడం తెలిసిందే. వేసవిలోనే చిరుతలు భక్తులపై దాడిచేస్తుండటం గతంలో విషాద ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పుడు చిరుతను బంధించేందుకు టిటిడి, అటవీశాఖ, ప్రభుత్వ అటవీశాఖ సంయుక్తంగా చర్యలు చేపట్టింది. టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, విజిలెన్స్,అటవీశాఖ అదికారులతో కలసి స్వయంగా అడవిలో నడకదారులు, స్టాటిక్ కెమెరాలను గమనించారు. కాలినడక మార్గాల్లో "గోవిందా...గోవింద"నామస్మరణలతో భక్తివిశ్వాసాలతో వస్తున్న భక్తులకు పూర్తిరక్షణ కల్పించడమే లక్ష్యంగా చర్యలకు ఉపక్రమించారు. ప్రస్తుతం అలిపిరి నడకమార్గంలో గాలిగోపురం వద్ద నుంచి ఏడవమైలు మీదుగా లక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకు మెట్లమార్గంలో వందమంది వరకు భక్తులను గుంపులుగా పూర్తి రక్షణవలయంలో కొండకు పంపుతున్నారు. అడవిలో ,కాలినడక మార్గాల్లో చిరుత కదలికలను గమనిస్తూ సిసికెమెరాల ట్రాఫ్ చేస్తూన్నారు. గత ఏడాదిన్నర క్రిందట కాలినడక మార్గాల్లోని అడవిలో నాలుగు చిరుతపులులను బంధించి తిరుపతి ఎస్వీజూకు తరలించారు.



# సాంఘిక గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొంది బాధ్యతలు స్వీకరించిన లక్ష్మీ సుజాత

**జగ్గయ్యపేట, మే 29, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలోని బలుసుపాడు రోడ్‌లోగల సాంఘిక గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా కొండపల్లి లక్ష్మీ ్మ సుజాత పదోన్నతి పొంది గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు కామర్స్ లెక్చరర్‌గా, పాఠశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తించిన లక్ష్మీ ్మ సుజాత గత నెల మార్చిలో పదోన్నతి పొందారు. అలాగే పట్టణంలోని జివిజె జిల్లా పరిషత్ బాలుర హైస్కూలు ప్రధానోపాధ్యాయునిగా పారేపల్లి నాగేశ్వరరావు బాధ్యతలు స్వీకరించగా, బదిలీల్లో భాగంగా పోచంపల్లి ఉన్నత పాఠశాల నుండి జగ్గయ్యపేట బాలికల జెడ్‌పి హైస్కూలు గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయురాలిగా కె హేమ మాధవి గురువారం బాధ్యతలు స్వీకరించారు.

# ఎమ్మెల్సీ కవిత మాట్లాడింది నిజమే!

## బిజెపి ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్(గన్‌ఫౌండ్రి), మే 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వాడి వేడిగా కొన సాగుతున్న రాజకీయ వేడిపై గోషామహల్ నియోజకవర్గం బిజెపి శాసన సభ్యుడు టి.రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బిఆర్ఎస్‌లో వాడి, వేడి రాజకీ యాలు చోటు చేసుకుంటున్న సమ యంలో ఎమ్మెల్యే రాజాసింగ్ ఎమ్మెల్సీ కవిత మాట్లాడినది నిజమే అని పెద్ద ప్యాకేజీ దొరికితే కలి పోతా రని వ్యాఖ్యలు చేశారు. ప్యాకేజీ వచ్చిందంటే మా వాళ్లు కూడా బిఆర్ఎస్‌కి వెళ్లి పోతారని రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేయడం పట్ల బిజెపి పార్టీలో చర్చ కొనసాగుతుంది. కవిత చేసిన వ్యాఖ్యలు సంచలనం రేపుతున్నాయి. బిఆర్ఎస్‌ను బిజెపిలో కలిపేందుకుగాను ప్రయత్నిస్తున్నారని, అందుకు అడ్డుగా ఉన్న తనను తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారని కవిత ఆరోపిం చారు. అయితే కవిత కామెట్లపై ఆఫ్ ది రికార్డు బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వ కుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలు నిజమేనని తాను భావిస్తున్నానంటూ తెలి పారు. ముఖ్యంగా బిజెపికి చెందిన కొంతమంది నేతలు పెద్ద ప్యాకేజీ లభిస్తే బిఆర్ఎస్‌లోకి వెళ్లేందుకు కూడా సిద్ధంగా ఉంటారని వ్యాఖ్యలు చేయడం పట్ల బిజెపి పార్టీలో ఎవరు ఆ పెద్ద నాయకులు వారని చర్చిం చుకుం టున్నారు. ప్రతి ఎన్నికల్లో మా వాళ్లు కుమ్మకైపోతారు.

# జూన్ 3 నుండి నవగ్రహ మండపం పునప్రతిష్ట

**ఇంద్రకీలాద్రి, మే 29, ప్రభాతవార్త** అమ్మలగన్నమ్మ బెజవాడ కనకదుర్గమ్మవారి ఆలయంలో జూన్ 3 నుండి 5 వరకు నవగ్రహ మండపం పున:ప్రతిష్ట కార్యక్రమం నిర్వహిస్తామని ఇఒ వికె శీనా నాయక్ తెలిపారు. ఆలయ వైదిక కమిటీ సూచనల మేరకు జరిగే ఈ కార్యక్రమాలు జూన్ 3న ఉదయం 7.30లకు విఘ్నేశ్వర పూజ, ఋత్విక్ వరుణ, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, అంకురార్పణ, క్షీరాధివాసం, ఉదయం 8.30 గంటలకు మంటప పూజలు, మూలమంత్ర హవనములు, అధివాసములు, సాయంత్రం 4 గంటలకు కలశ స్థాపన, అగ్ని ప్రతిష్టాపన, మండపారాధన, అధివాసములు, హారతి, మంత్రపుష్పము, ప్రసాద వితరణ జరుగుతాయన్నారు. 4వ తేదీ ఉదయం మంటప పూజలు, మూలమంత్ర హవనములు, అధివాసములు, సాయంత్రం 4 గంటలకు మూలమంత్ర హవనములు, మంటప పూజలు, హారతి, మంత్రపుష్పము, ప్రసాద వితరణ, 5వ తేదీ ఉదయం 7.52లకు నవగ్రహ ప్రతిష్ట, యంత్ర ప్రతిష్ట, పూర్ణాహుతి, కలశోద్వాసన, మార్జనము, ప్రసాద వితరణ, కార్యక్రమ స్వస్థి జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొని శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి అమ్మవార్ల కృపకు పాత్రులవ్వాలన్నారు. దుర్గమ్మవారి ఆలయంలో జరిగే శాశ్వత అన్నదాన పథకానికి విజయవాడకు చెందిన బి పూర్ణచంద్రరావు రు.1లక్ష, 116లు విరాళం, హైదరాబాద్‌కు చెందిన తాతినేని శేషగిరి రావు రు.1,01,116ల విరాళాన్ని ఆలయాధికారులకు గురువారం అందించారు.



విరాళమందించిన దాతలకు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

# నెల్లూరులో ఆటోను ఢీకొన్న బస్సు

## - భర్త మృతి, భార్యకు గాయాలు

**నెల్లూరు క్రైమ్, మే 29, ప్రభాతవార్త :** మితిమీరిన వేగంతో వస్తున్న ప్రైవేటు ట్రావెల్ బస్సు వెనక నుండి ఢీకొనడంతో ఆటో ముందున్న కంటైనర్ కిందకు దూసుకెల్లడంతో నుజ్జు నుజ్జు అయింది. ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న భర్త మృతిచెందగా, బయటకు దూకి భార్య ప్రాణాలు దక్కించుకుంది. ట్రాఫిక్ పోలీసుల కథనం మేరకు స్థానిక ప్రగతి నగర్‌కు చెందిన హబీబ్ (46), ఆలియా దంపతులు జిల్లా కోర్టు ప్రాంగణం ఎదురుగా బిర్యానీ హోటల్ నిర్వహిస్తున్నారు. బుధవారం రాత్రి హబీబ్, ఆలియాలు దుకాణం మూసుకొని వస్తువులన్నింటినీ తమ ఆటోలో వేసుకుని ఇంటికి బయలుదేరారు. కె.వి.ఆర్ పెట్రోల్ బంక్ కూడలి వద్దకు చేరుకునేసరికి ఓ భారీ కంటైనర్ మాగుంట లేఅవుట్ వైపు వెళ్తూ కూడలి వద్ద కాస్త స్లో అయింది. ఇది గమనించిన హబీబ్ ఆటోను నిలిపాడు. ఇదే సమయంలో ఆర్టిసి బస్టాండ్ వైపు నుండి మితిమీరిన వేగంతో వస్తున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఆటోను వెనక నుండి బలంగా ఢీ కొట్టింది. దీంతో ఆటో కంటైనర్ కిందకు దూసుకెళ్లి నుజ్జునుజ్జయింది. ఆటో నడుపుతున్న హబీబ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆలియా ఆటోలో నుండి దూకడంతో స్వల్ప గాయాలతో తప్పించుకుంది. సంఘటన విషయం తెలుసుకున్న నగర డిఎస్పి సింధుప్రియ, సౌత్ ట్రాఫిక్ సిఐ వెంకట్ రెడ్డి, రోశయ్య ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.



గురువారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం భవనంలో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, స్పీకర్ ప్రసాద్‌కుమార్

# ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

### ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

**రంగారెడ్డి ప్రతినిధి, హైదరాబాద్, మే 29, ప్రభాతవార్త:** ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రతి సంక్షేమ పథకాలను భూభారతి, రాజీవ్ యువ వికాసం, ఖరీఫ్ సన్నద్ధతపై ఐటీ పరిశ్రమల శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం భవనంలో మంత్రి శీధర్‌బాబు, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రభుత్వ చీఫ్ పట్నం మహేందర్ రెడ్డితో కలిసి ఇందిరమ్మ కీలక అంశాలపై సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యాసంగిలో వరి ధాన్యం సేకరణ, త్వరలో ప్రారంభం కానున్న ఖరీఫ్ సీజన్ కు సన్నద్ధత, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు, భూ భారతి చట్టం అమలు తీరు, రాజీవ్ యువ వికాసం తదితర అంశాలతో పాటు వాటిలోని లోటుపాట్లను శాసనసభ్యులు సూచించగా వాటిపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు.రాజీవ్ యువ వికాసం పై పలువురు శాసన సభ్యులు బ్యాంకు స్కోరింగ్ లో ఇబ్బందులు పెడుతున్నందున అట్టి విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని మంత్రిని కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ ప్రభుత్వం దృష్టికి ఇట్టి విషయాన్ని తీసుకెళ్లి రాజీవ్ వికాస్ పథకాన్ని పకడ్బందీగా అమలు అయ్యేలా చూస్తామని తెలిపారు. ఈ పథకాన్ని అమలు చేసి నిరుద్యోగ యువతకు బాసటగా నిలవాలని బ్యాంక్ అధికారులకు సూచించారు. అదేవిధంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టాన్ని జూన్ మూడో తేదీ నుండి అన్ని మండలాల్లో విజయవంతంగా అమలు చేసేలా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని మంత్రి కలెక్టర్లకు, అధికారులకు దిశా నిర్దేశం చేశారు రైతులకు సరిపడా ఎరువులు విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని రైతులకు పంట సాగుపై అవగాహన కల్పిస్తూ అవగాహన కల్పిస్తూ సూచనలు సలహాలు అందజేయాలని అధికారులకు సూచించారు. రాజు యువ వికాసంలో ఆయా ప్రాంతాల్లో ప్రాధాన్యత ఉన్న యూనిట్లను ఎంపిక చేసి వారికి సరైన అవకాశం కల్పించాలని మంత్రి కలెక్టర్లకు సూచించారు ప్రభుత్వ భూములు ఎక్కడైనా ఆక్రములకు గురైతే అటు విలువైన భూములను కాపాడాలని మంత్రి అన్నారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఇందిరమ్మ ఇండ్ల పై మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 17,440 ఇండ్లకు అలాట్మెంట్ ఇవ్వగా అందులో 16,617 ఇండ్లకు మంజూరు ఇవ్వడం జరిగిందని, 4 వేల 84 ఇండ్ల గ్రౌండింగ్ ఇప్పటికే పూర్తయిందని వచ్చే వారంలో పదివేల ఇండ్లు ప్రారంభించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.ఈ సమీక్ష సమావేశంలో శాసనసభ్యులు కాల యాదయ్య ఆర్కెపూడి గాంధీ కసిరెడ్డి నారాయణరెడ్డి వీలపల్లి శంకర్ మనోహర్ రెడ్డి రామ్మోహన్ రెడ్డి, రంగారెడ్డి, వికారాబాద్ మేడ్చల్ జిల్లాల కలెక్టర్లు అదనపు కలెక్టర్లు వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సొంత కుటుంబసభ్యులు ఒకరి గొంతు ఒకరు కోసుకుంటున్నారు

### కవిత తీరుపై ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

**హైదరాబాద్, మే 29, ప్రభాతవార్త:** మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ సొంత కుటుంబ సభ్యులు ఒకరి గొంతు ఒకరు కోసుకుంటున్నారంటూ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ అధికారంలోకి వచ్చేందుకే ఇలాంటి కుతంత్రాలకు తెర తీశారంటూ మండిపడ్డారు. కెసిఆర్ కుటుంబాన్ని తెలంగాణ ప్రజలు నమ్మరని అన్నారు. సొంత కుటుంబాన్ని మేనేజ్ చేసుకోలేని వ్యక్తి కెసిఆర్ తెలంగాణను ఎలా పాలిస్తారా? అని ప్రశ్నించారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, ఎమ్మెల్సీ కవిత ప్రజలకు కొత్త సినిమా చూపిస్తున్నారంటూ ఎద్దేవా చేశారు.

## బిజెపి స్ట్రీట్ ఫైట్ చేయదు

### పది నెలల్లోనే రేవంత్ సర్కార్ ప్రజలను నిండా ముంచింది: ఎంపి ఈటల

**హైదరాబాద్, మే 29, ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ ప్రజాస్వామిక పార్టీ అని ఎంపి ఈటల రాజేందర్ అన్నారు. గురువారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మాట్లాడారు. బిజెపి స్టేట్ ఫైట్ చేస్తుందే తప్ప స్ట్రీట్ ఫైట్ చేయదన్నారు. తాము నేరుగా ఫైట్ చేస్తామే తప్ప కుట్రలు కుతంత్రాలు చేయమన్నారు. ఎవరో బయటి వాళ్ల ఏదేదో మాట్లాడితే మమ్ముల్ని నిజమా అబద్ధమా అని అడగడం మంచిది కాదన్నారు. ఒక్కటి సత్యం ఏంటంటే తెలంగాణ సమాజంలో వచ్చిన పెను మార్పు వచ్చింది. అది ఏమిటంటే కెసిఆర్‌కు ఓటు వేసిన ఖర్మానికి పదేళ్లలో నట్టేట ముంచాడన్నారు. పది నెలలకే రేవంత్ రెడ్డి సర్కారు నిండా ముంచిందన్నారు. ఇక బిజెపికే ఓటు వేయాలని ప్రజలు డిసైడ్ అయ్యారని అన్నారు. మోడీ సహకారంతో పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో ఎలా దూసుకుపోతుందో చూస్తున్నామన్నారు. కానీ తెలంగాణ వెలవెలబోతుంది అని బాధపడుతున్నారు. అప్పుల ఊబి నుండి బయటపడాలంటే అభివృద్ధి జరగాలంటే బిజెపి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. గాలి వార్తల గురించి నేను మాట్లాడను. నాయకుల ఫోన్లు కుటుంబసభ్యుల ఫోన్లు టాప్ చేయడం నాయకుల మధ్య మనసంబంధాలు లేకుండా చేసింది కెసిఆర్ అని అన్నారు. దానిని కొనసాగిస్తుంది రేవంత్ సర్కార్ అన్నారు. నాయకులు కనిపించినప్పుడు నమస్కారం చేసుకోవడం సంస్కారం అన్నారు. కాళేశ్వరంపై విచారణకు వెళతానన్నారు. బిజెపి చట్టాన్ని గౌరవించే పార్టీ అన్నారు. బిఆర్ఎస్, భాజపాలో ఎందుకు విలీనమవుతుంది? మేమెందుకు వారిని చేర్చుకుంటాం? ఉద్యమకారులను కలిసి ఎమ్మెల్సీ కవిత ఏం చేస్తారు? కవిత దగ్గర ఉద్యమకారుల జాబితా ఉందా? అంటూ ప్రశ్నించారు. మావోయిస్టుల అంశంపై కెసిఆర్ ద్వంద్వ వైఖరి కనబరిచారని అన్నారు. అధికారంలోకి రాకముందే జైలుకు వెళ్లి కూర రాజన్నను కలిశారన్నారు. అధికారంలోకి వచ్చాక నెల రోజుల్లోనే ఆయనలో భూమికి, ఆకాశానికి మధ్య ఉన్నంత తేడా వచ్చిందన్నారు. ఇటీవల నిర్వహించిన బిఆర్ఎస్ సమావేశంలో ఆపరేషన్ కగార్ ఆపాలని కేంద్రానికి లేఖ రాస్తానన్నారు రాశారా?" అని ఈటల ప్రశ్నించారు.

## వెటర్నరీ కోర్సుల్లో సెల్ఫ్ ఫైనాన్స్ సీట్ల పెంపు

**హైదరాబాద్, మే 29, ప్రభాతవార్త:** తెలంగాణ పశువైద్య విశ్వవిద్యా లయంలో వివిధ కోర్సులకు సంబంధించిన సీట్ల సంఖ్యను పెంచుతూ యూనివర్సిటీ నిర్ణయించింది. 2025-26 విద్యా సంవత్సరం నుంచి బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ (బీవీఎస్సీ) డిగ్రీ కోర్సుల్లో సెల్ఫ్ ఫైనాన్స్ (ఎన్ఆర్ఐ) కోటా సీట్లను 15కు పెంచాలని విశ్వవిద్యాలయ పాలకమండలి తీర్మానం చేసింది. రాజేంద్రనగర్, కోరుట్లలో ఒక్కో దానిలో 5 సీట్ల చొప్పున 10 ఉన్నాయి. కొత్తగా వరంగల్ జిల్లా మాములూరు కళాశాలకు జాతీయ వైద్య మండలి విసిఐ గుర్తింపు లభించినందున దానిలోను మరో ఐదు సీట్లను సెల్ఫ్ ఫైనాన్స్ కింద భర్తీ చేసేందుకు పాలకమండలి అనుమతి ఇచ్చిందని వీసీ జ్ఞాన ప్రకాశ్ ఒక ప్రకటనలో తెలిపారు.

# రాజకీయాల్లో ప్రకంపనలు సహజం

### కవితకు షోకాజ్ నోటీసు..అదంతా ప్రచారమే

### త్వరలోనే ఆమెను కలుస్తా: వినోద్‌కుమార్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, మే 29:** తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితఎపిసోడ్ హాట్ టాపిక్‌గా మారింది. ఈ క్రమంలో బిఆర్ఎస్ అగ్రనేతలపై కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే కవిత వ్యాఖ్యలకు గానూ షోకాజ్ నోటీసులు ఇచ్చారనే ప్రచారం జరిగింది. అయితే ఈ విషయంపై మాజీ ఎంపీ, బీఆర్ఎస్ సీనియర్ నేత బోయినపల్లి వినోద్‌కుమార్ క్లారిటీ ఇచ్చారు. మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడిన విషయంలో కవితకు షోకాజ్ నోటీసు ఎలా ఇస్తామని ప్రశ్నించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కవితలో ఇంత ఆవేదన ఉంది అనే విషయం ఈ రోజే తెలిసిందని, కవిత వ్యాఖ్యలపై పార్టీలో చర్చ జరుగుతుందని పేర్కొన్నారు.

కవితతో మాట్లాడే ప్రయత్నం చేస్తా, కవిత సమస్యపై పార్టీలో తొందరలోనే కొలిక్కి వస్తుందని అనుకుం టున్నానని పేర్కొన్నారు. టిడిపి, కాంగ్రెస్, వామపక్షాలతో కలిసి పనిచేశాం. ఒక్క బిజెపితోనే మేము కలిసి పని చేయలేదని పేర్కొన్నారు.

రాజకీయాల్లో ప్రకంపనలు సహజం, చాలా పార్టీల్లో ఇలాంటి ప్రకంపనలు చూశాం, మా పార్టీ మొదటి కాదు,చివరిది కాదు, పార్లమెంట్‌లో కరుణానిధి, అళగిరి, కనిమొలి ఫ్యామిలీ రాజ కీయాలు చూశాం అని చెప్పారు. సమస్యలు త్వర లోనే కచ్చితంగా సద్దుమణుగుతాయని పేర్కొన్నారు. ఒక్క బిజెపితో మాత్రమే పని చేయలేదని, బిజెపితో కలిసి పనిచేయాలనుకుంటే ఎప్పుడో పొత్తు పెట్టుకునేవాళ్లమని వ్యాఖ్యానించారు.

# ముగిసిన సరస్వతి పుష్కరాలు

### కాళేశ్వరం హుండీకి భారీగా ఆదాయం

**హైదరాబాద్, మే 29, ప్రభాతవార్త:** తెలంగాణలోని కాళేశ్వర క్షేత్రం వద్ద జరిగిన సరస్వతి పుష్కరాలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ పన్నెండు రోజుల వేడుకకు తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుండి భక్తులు భారీగా తరలివచ్చారు. పుష్కరాల సందర్భంగా ఆలయానికి రూ.2.83 కోట్ల ఆదాయం వచ్చింది. ఆర్టీసీకి కూడా సుమారు రూ.8 కోట్ల ఆదాయం లభించింది. సీఎం రేవంత్ రెడ్డితో సహా పలువురు ప్రముఖులు త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారు. బంగారం, వెండి కానుకలు కూడా లభించాయి. అంతర్వాహిని అయిన సరస్వతి నది తెలంగాణలో త్రివేణి సంగమం వద్ద కలుస్తుంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వర క్షేత్రం ఉన్న త్రివేణి సంగమంలో సరస్వతి నది పుష్కరాలు జరిగాయి. పుష్కరాల నేపథ్యంలో ఆచరించేందుకు తెలంగాణ నుంచే కాక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక ప్రాంతాల నుంచి భారీ ఎత్తున జనాలు తరలి వచ్చి.. పుష్కర స్నానం ఆచరించారు. దీంతో పుష్కరాల వేళ కాళేశ్వరం హుండీకి భారీగా ఆదాయం వచ్చింది. 12 రోజుల పాటు సాగిన సరస్వతి పుష్కరాలు.. మే 15న ప్రారంభం అయ్యి.. మే, 26న ముగిశాయి. పుష్కర స్నానం ఆచరించేందుకు ఈ 12 రోజుల పాటు పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. పుష్కరాల వేళ ప్రతి రోజు వేలాది మంది భక్తులు కాళేశ్వరం ముక్తేశ్వర ఆలయాన్ని దర్శించుకున్నారు. స్వామి వారికి భారీగా కానుకలు సమర్పించుకున్నారు. పుష్కరాలు ముగిసిన సందర్భంగా కాళేశ్వరం ఆలయంలోని హుండీని లెక్కించారు ఆలయ సిబ్బంది. వరంగల్ సహాయ కమిషనర్ సమక్షంలో హుండీ లెక్కింపు జరిగింది.

సరస్వతి పుష్కరాల నేపథ్యంలో మొత్తం 12 రోజులతో పాటుగా అంతకు ముందు రెండు నెలలకు గాను కాళేశ్వరం ఆలయానికి రూ.2.83 కోట్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. డబ్బుతో పాటు బంగారం 15 గ్రాములు, 750 గ్రాముల వెండి కూడా వచ్చినట్లు తెలిపారు. అలానే పుష్కరాల వేళ ఆర్టీసీకి కూడా భారీగా ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. ఈ 12 రోజుల్లోనే ఆర్టీసీకి సుమారు రూ.8 కోట్ల ఆదాయం లభించింది అన్నారు. సరస్వతి పుష్కరాల నేపథ్యంలో ఈ 12 రోజుల పాటు భక్తుల పుణ్యస్నానాలు, దర్శనాలతో త్రివేణి సంగమం పులకించిపోయింది. కాళేశ్వరం ముక్తీశ్వరుడిని దర్శించుకునేందుకు నిత్యం భారీ ఎత్తున భక్తులు ఆలయాన్ని సందర్శించారు. పుష్కరాల నేపథ్యంలో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి సామాన్య భక్తులతో పాటుగా, వీఐపీలు, స్వాములు, పీఠాధిపతులతో రాకతో త్రివేణి సంగమంలో ఈ 12 రోజులు సందడి నెలకొంది. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు త్రివేణి సంగమంలో పుష్కర స్నానాలు ఆచరించారు. పుష్కరాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.35 కోట్లు కేటాయించింది.

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇవే తొలి పుష్కరాలు కావడంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వీటిని నిర్వహించింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంది.

# సీజనల్ వ్యాధుల నుంచి జాగ్రత్తగా ఉండాలి

### మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా రాకుండా చూసుకోవాలి

### పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవీందర్ నాయక్

**హైదరాబాద్, మే 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావారణ శాఖ హెచ్చరికలతో వైద్య, ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరిక జారీ చేసిన నేపథ్యంలో సీజనల్ వ్యాధుల మూలంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. అలాగే జిల్లా వైద్యాధికారులు, సిబ్బంది అందరికీ అందుబాటులో ఉండాలని పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీందర్ నాయక్ సూచించారు. వర్షాల నేపథ్యంలో నీటి ద్వారా సంక్రమించే వ్యాధులు రావచ్చుని.. వాటి నుండి రక్షణ పొందడానికి, వర్షాకాలంలో ఆరోగ్యంగా ఉండటానికి చిట్కాలు పాటించాలని సూచించారు. మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యాలను ఎదుర్కోవడానికి దోమల ముప్పును ఎదుర్కోవడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడా కూడా నీరు నిలిచిపోకుండా చూసుకోవాలని, దోమలు పెరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తమ ఇంటి చుట్టూ నిలిచి ఉన్న నీటిని తొలగించడానికి ప్రతి వారంలో శుక్రవారం డ్రై డేగా పాటించాలన్నారు. నీటి ద్వారా సంక్రమించే కామెర్లు, టైఫాయిడ్ రోగాలు రాకుండా ఫిల్టర్ చేసిన, వేడిచేసిన నీటిని త్రాగాలని ప్రజలకు సూచించారు. ప్రధానంగా భోజనానికి ముందు, తరువాత కూడా చేతులను శుభ్రంగా కడుక్కోవాలన్నారు. బయటి ఆహారాన్ని తినకుండా ఉండాలని, గాలి ద్వారా సంక్రమించే ఇన్ఫెక్షన్ల నుండి జాగ్రత్త వహించాలన్నారు. వైరల్ జ్వరాలు, ఇనుఫ్లూయెంజా అనారోగ్యంతో ఉన్న వారితో కలవకూడదన్నారు. ఇన్ఫెక్షన్ బారిన పడకుండా ఉండటానికి తరచుగా హ్యాండ్ శానిటైజర్లను ఉపయోగించాలని.. తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు చేతి రుమాలు ఉపయోగించాలన్నారు. ఎవరికైనా జ్వరం, తలనొప్పి, గొంతు నొప్పి, శరీర నొప్పులతో కూడిన దగ్గు వంటి ఫ్లూ లక్షణాలు కనిపిస్తే, సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి పరీక్షలు చేయించుకోవలని డాక్టర్ రవీందర్ నాయక్ సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా, ప్రభుత్వం అన్ని ప్రజారోగ్య కేంద్రాలలో ప్రత్యేక పడకలు, ఐవి ద్రవాలు, అవసరమైన మందులను అందించడం ద్వారా విస్తృతమైన ఏర్పాట్లను చేసిందన్నారు. ఏవైనా అత్యవసర పరిస్థితులను తీర్చడానికి ఏఎన్ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీ కార్యకర్తల వద్ద మందులు, ఓఆర్ఎస్ సాచెట్లు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు.

# విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరిస్తే చూస్తూ ఊరుకోం

### యుపి ప్రభుత్వ తీరుకు వ్యతిరేకిస్తూ ఆందోళన

### తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జెఎసి

**హైదరాబాద్, మే 29, ప్రభాతవార్త:** ఉత్తరప్రదేశ్‌లో విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నామని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ తెలిపింది. నేషనల్‌కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ అండ్ ఇంజినీర్స్ పిలుపుమేరకు గురువారం జేఏసీ ఆధ్వర్యంలో మింట్ కాంపౌండ్‌లోని టిజిఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయం ముందు పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా




టిజిఎస్‌పిడిసిఎల్ ప్రధాన కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న జెఎసి నేతలు

జేఏసీ చైర్మన్ సాయిబాబా మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్‌లో విద్యుత్ పంపిణీ సంస్థలను ప్రైవేటీకరించడాన్ని వ్యతిరేకిస్తూ 184 రోజుల నుండి నిరసన కార్యక్రమాలు చేస్తున్న యూపీ విద్యుత్ ఉద్యోగులకు అండగా ఉంటామని తెలిపారు. ఉద్యోగులకు సంబంధించి సర్వీస్ రెగ్యులేషన్లను మార్చి రిమూవల్ చేసేందుకు అక్కడి యాజమాన్యం ప్రయత్నించిందని దీనికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళన చేయాలని నిర్ణయించామన్నారు. క న్వీనర్ రత్నాకర్‌రావు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా విద్యుత్ ఉద్యోగులు ఈరోజు కార్య క్రమంలో పాల్గొ న్నారన్నారు. ప్రజాస్వా మ్య పద్ధతిలో ఉద్యోగులు నిరసన చేస్తుంటే వారిని భయభ్రాంతులకు గురిచేసి విధంగా అక్కడి ప్రభుత్వం ప్రయ త్నిస్తుందని అలా చేయాలని చూస్తే యపి విద్యుత్ ఉద్యోగులకు అన్ని రాష్ట్రాల ఉద్యోగులు యుపి ఉద్యోగులకు అండగా ఉంటామని ,దేశవ్యాప్త ఆందోళనకు వెనకడుగు వెయ్యమని తెలిపారు.జేఏసీ నాయకులు బి సి రెడ్డి, కరుణాకర్ రెడ్డి, గోవర్ధన్, మోసెస్, శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరణ కానివ్వకుండా చూస్తామని దానికోసం ఎంతవరకైనా వెళ్లడానికి సిద్ధం అన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని విద్యుత్ కార్మికులను వేదిస్తే దేశంలోని 27 లక్షల మంది విద్యుత్ కార్మికులు మౌనంగా ప్రేక్షకులుగా ఉండరని, రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేస్తారని దీనికి యుపి ప్రభుత్వం బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. గురువారం ప్రధానంగా హైదరాబాద్, త్రివేంద్రం, విజయవాడ, చెన్నై, బెంగళూరు, ముంబై, నాగ్‌పూర్, రాయ్‌పూర్, భోపాల్, జబల్‌పూర్, వడోదర, రాజ్‌కోట్, గౌహతి, షిల్లాంగ్, కోల్‌కతా, భువనేశ్వర్, పాట్నా, రాంచీ, శ్రీనగర్, జమ్మూ, సిమ్లా, డెహ్రాడూన్, పాటియాలా, జైపూర్, కోట, హిసార్ మరియు లక్నోలలో పెద్ద ప్రదర్శనలు జరిగాయని తెలంగాణాలో హైదరాబాద్, వరంగల్‌తోపాటు అన్ని జెనరేటింగ్ స్టేషన్ లో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు.

మింట్ కాంపౌండ్‌లో జరిగిన ఈ ఆందోళన కార్యక్రమంలో బి సి రెడ్డి, సదానందం, భూపాల్ రెడ్డి, తాజుద్దీన్, వరప్రసాద్, వేణు, శ్రీనివాస్ రెడ్డి, గోపాల్ రావు, విద్యాసాగర్, కిరణ్, బుచ్చయ్య, వెంకటేష్, ప్రశాంత్, అనిల్, కైలాస్, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి వైద్యానికి రూ.400 కోట్లు

### కరోనా పట్ల అప్రమత్తంగా ఉండాలి

### సంస్థ సిఎండి బలరామ్

**హైదరాబాద్, మే 29, ప్రభాతవార్త:** సింగరేణి ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణ కోసం యాజమాన్యం ఏటా రూ.400 కోట్లను ఖర్చు చేస్తోందని ఆ సంస్థ సిఎండి ఎన్ బలరామ్ తెలిపారు. సింగరేణి ఆసుపత్రులను ఆధునికీకరిస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్ లోనూ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు దిశగా ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో గురువారం అన్ని ఏరియాల వైద్యాధికారుల సమీక్షలో ఆయన మాట్లాడుతూ కరోనా విషయంలో అప్రమత్తంగా ఉండాలని సింగరేణి వైద్య అధికారులకు సూచించారు. సింగరేణి కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు వైద్య సేవలు అందించడం కోసం ఖర్చుకు వెనకాడకుండా అన్ని రకాల వైద్య పరీక్షల యంత్రాలు, ఔషధాలు సమకూర్చటానికి యాజమాన్యం సంసిద్ధంగా ఉందన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే పలుమార్లు చెప్పానని, అయినప్పటికీ కొన్ని ఏరియా ఆసుపత్రుల నుండి ప్రతిపాదనలు పంపడంలో ఎందుకు శ్రద్ధ వహించడం లేదదని నిలదీశారు. ఏరియా ఆసుపత్రుల యాజమాన్యాలు తక్షణమే వారికి కావలసి ఉన్న కనీస వైద్య పరికరాలు, అవసరమైన మందుల ప్రతిపాదనలు పంపించాలని, తన తదుపరి తనిఖీలలో ఏ ఒక్క పరికరం లేదు అనే మాట రాకూడదని హెచ్చరించారు. వార్షిక ప్రణాళిక పేర్లతో సంబంధం లేకుండా ఎప్పటికప్పుడు ఏ ఏ పరికరాలు కావాలన్నది నిర్ధారించుకొని ప్రతిపాదనలు పంపించాలన్నారు. ఇప్పటికే ఏరియా ఆసుపత్రులకు వైద్యుల్ని కేటాయించామని, ఇంకా అవసరమైన వైద్యుల్ని, టెక్నీషియన్ లను సమకూర్చేందుకు యాజమాన్యం సంసిద్ధంగా ఉందన్నారు. చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు ఉన్న రోగులకు ఏరియా ఆసుపత్రుల్లో వైద్యం అందించే అవకాశం ఉన్నప్పటికీ అలా చేయకుండా వెంటనే హైదరాబాద్ ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారని, తద్వారా గత మూడేళ్లలో 30 కోట్ల రూపాయలు ఉన్న రిఫరల్ బిల్లులు ఇప్పుడు రూ100 కోట్లకు చేరాయి అన్నారు. కంపెనీ డాక్టర్లు తమ సమర్థతను, నైపుణ్యాన్ని చూపించకుండా ప్రతి చిన్న కేసును రిఫర్ చేయడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. డాక్టర్లు అంకితభావంతో వైద్య సేవలు అందించాలని, విధి నిర్వహణలో పూర్తి క్రమశిక్షణ పాటించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు సత్య నారాయణరావు, సూర్యనారాయణరావు, వేంకటేశ్వర్లు, ఇడి ఎస్.డి.ఎం.సుభానీ, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్ రాజ్ కుమార్, అన్ని ఏరియా ఆసుపత్రుల ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

# ఇంధన రంగంలో స్వయం సమృద్ధి

### బొగ్గులో నాణ్యత ప్రమాణాలు పెంచాలి

### కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, మే 29, ప్రభాతవార్త:** ఇంధన రంగంలో స్వయం సమృద్ధిని సాధించే విషయంలో ప్రభుత్వ బొగ్గు సంస్థలు కీలకంగా వ్యవహరించాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి సూచించారు. డిమాండ్‌కు తగినట్టుగా నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేసేయాలన్నారు. ఢిల్లీ నుంచి గురువారం కేంద్ర బొగ్గు శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్‌దత్‌తో కలసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో భాగంగా కోలిండియా సహా సింగరేణిపై కీలక సమీక్ష సమావేశాన్ని నిర్వహించింది. ప్రధానంగా బొగ్గు ఉత్పత్తి వ్యయం తగ్గింపు, నాణ్యత, సరఫరా తదితర అంశాల్లో ఎదురవుతున్న సవాళ్లు, వాటిపై తీసుకోవాల్సిన చర్యలపై కీలక దిశా నిర్దేశం చేశారు. ఈ సమీక్షలో హైదరాబాద్‌లోని సింగరేణి ప్రధాన కార్యాలయం నుండి ఆ సంస్థ సిఎండి ఎన్.బలరామ్ పాల్గొన్నారు. దీన్ని పురస్కరించుకుని బలరామ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సింగరేణి సంస్థ ప్రగతి, భవిష్యత్తు ప్రణాళికలు తదితర అంశాలపై కూలంకశంగా వివరించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ కార్మికుల జీతాలు, సంక్షేమ కార్యక్రమాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా బొగ్గు ఉత్పత్తి ఖర్చు గణనీయంగా తగ్గించాలన్నారు. ఇందుకోసం కార్మిక సంఘాల సహకారాన్ని తీసుకోవాలని, పని సంస్కృతి మెరుగుపరచాలని సూచించారు. అలాగే ఉత్పత్తి ఖర్చు తగ్గింపునకు సింగరేణి అధికారులు మరియు బొగ్గు మంత్రిత్వ శాఖ నిపుణులతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. ఈ కమిటీ ప్రత్యక్షంగా క్షేత్రస్థాయి పరిశీలన జరుపుతుందని, కమిటీ చేసే ఆచరణాత్మక సూచనలను వెంటనే అమలు జరిపి ఉత్పత్తి ఖర్చును తగ్గించాలని సూచించారు. వినియోగదారులు సింగరేణి సంస్థకు దూరం కాకుండా ఉండాలంటే నాణ్యతపై కూడా గట్టి దృష్టి పెట్టాలన్నారు. బొగ్గు శాఖ కార్యదర్శి దేవ్‌దత్ మాట్లాడుతూ బొగ్గు సంస్థల మనుగడకు కొత్త గనులను పెంచుకోవడం అత్యంత అవసరమని స్పష్టం చేశారు. అలాగే ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం ద్వారా వినియోగదారులకు బొగ్గు ధర అందుబాటులోకి తీసుకురావొచ్చన్నారు. దీంతో అంతిమంగా విద్యుత్ ఉత్పత్తి వ్యయం కూడా తగ్గి ప్రజలకు లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కేంద్ర బొగ్గు శాఖ అధికారులతో పాటు, సింగరేణి డైరెక్టర్లు పాల్గొన్నారు.

## ఐఐఐటి మంజూరుపై ఉమ్మడి పాలమూరు జిల్లా నేతల హర్షం

### ముఖ్యమంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యేలు

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 29, ప్రభాతవార్త:** రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నా లజీ, ట్రిపుల్ ఐటీ కళాశాలను మహబూబ్‌నగర్ జిల్లాలో ఏర్పాటు చేసినందుకుగాను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉమ్మడి జిల్లా నేతలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు సీఎంను మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డితో పాటు దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి, జనంపల్లి అనిరుధ్ రెడ్డి, వాకిటి శ్రీహరి, డాక్టర్ చిట్టెం పర్ణికా రెడ్డి, తూడి మేఘా రెడ్డి, వీర్లపల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యా లయం(ఆర్జీయూకేటీ) బాసర, మహబూబ్ నగర్(కొత్తగా ఏర్పాటైన)లలో ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్‌లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైందని అధికారులు వెల్లడించారు. మొత్తం 1,680 సీట్లకు అభ్యర్థులు మే 31 నుంచి జూన్ 21 వరకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని అధికారులు సూచించారు. పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తారు. ప్రతి సబ్జెక్టులో వచ్చిన మార్కులను పరిశీలి స్తారు. వచ్చిన మార్కులకు జిల్లా పరిషత్తు, ఆదర్శ పాఠశాలలు, వసతి గృహాలలో ఉండకుండా బయట చదువుకున్న విద్యార్థులకు వెనుకబాటు సూచీ కింద 4 శాతం మార్కులను కలిపి మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తారని తెలిపారు.



జూరాల నుంచి దిగువకు విడుదలవుతున్న వరద

## జూరాలకు పోటెత్తిన వరద

### 10 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 29, ప్రభాతవార్త :** ఎగువన కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జూరాల ప్రాజెక్ట్‌కు క్రమంగా వరద పెరుగుతోంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వరప్రదాయిని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువన కర్ణాటకలో కురుస్తున్న వర్షాలకు భారీగా వరద వచ్చి చేరుతున్నది. దీంతో గురువారం ఇన్ ఫ్లో 40 వేల క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 1,559 క్యూసెక్కులు ఉన్నట్లు తెలుస్తోంది. రేపటి లోపు లక్ష క్యూసెక్కులకు వరద చేరుకునే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318.516. మీటర్లు ఉండగా ప్రస్తుత నీటిమట్టం..317.360 మీటర్లు ఉంది.ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి సామర్థం 9.657 టీఎంసీలు ఉండగా, ప్రస్తుత నీటి నిల్వ 7.379 టీఎంసీలు ఉంది. ఈ కారణంగా నేడు స్పిల్ వే గేట్స్ తెరిచే అవకాశం కనిపిస్తోంది. జూరాల ప్రాజెక్టు భారీగా వరద చేరడంతో ప్రాజెక్ట్ అధికారులు 10 గేట్లు ఎత్తి 66 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ఈ నేపథ్యంలో కృష్ణా నది పరివాహక ప్రాంతంలో జాలర్లు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. కాగా, మే నెలలో జూరాల ప్రాజెక్టు గేట్లు ఎత్తడం ఇదే తొలిసారి అని అధికారులు వెల్లడించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## బోనాల వేడుకల్లో డాన్స్ చేసిన కల్వకుంట్ల కవిత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 29:** రాజకీయాల్లో కల్వకుంట్ల కవిత వ్యవహారం చర్చనీయాంశమైన వేళ ఆమె సరదాగా డాన్స్ చేసిన వీడియో వైరలవుతోంది. మేడ్చల్ జిల్లా,శామీర్‌పేట్ మండలం సేవాలాల్ మల్లన్న తండాలో ఆమె గురువారం సాయంత్రం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులతో సరదాగా గడిపారు. భోగ్ బండారా బోనాల వేడుకల్లో తలకు బంజారా టోపీ ధరించి డప్పు చప్పుళ్లకు స్టెప్పులు వేశారు. బిఆర్ఎస్‌లో తనకు కెసిఆర్ తప్ప మరో లీడర్ లేరని కవిత గురువారం ఉదయం చేసిన వ్యాఖ్యలు పార్టీలో కలకలం రేపిన విసయం తెలిసిందే.

## బిఆర్ఎస్‌లో దయ్యాలు ఎవరో కవిత చిత్తశుద్ధితో చెప్పాలి

### ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, మే 29, ప్రభాతవార్త:** బిఆర్ఎస్‌లో దయ్యాలు ఎవరో ఎమ్మెల్సీ కవిత చిత్తశుద్ధితో చెప్పాలని ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. బిఆర్ఎస్, బిజెపి కలిసి రాజకీయ నాటకాలకు తెరలేపాయని ఎంపి తెలిపారు. గురువారం ఈ మేరకు ఎంపి ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలపై చామల స్పందించారు. తాము ఊహించినట్లుగా బిజెపితో బిఆర్ఎస్ బేరసారాలు చేసిందని విమర్శించారు. కవిత లిక్కర్ కేసు నుంచి బయటపడేసేందుకు బిజెపికి మద్దతు ఇచ్చారని, ఎమ్మెల్సీ ఎన్నికలల్లోనూ బిజెపికి బిఆర్ఎస్ మద్దతు ఇచ్చిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ఎంపిగా తనకు తెలిసినంత వరకు తమకు కవిత అవసరం లేదని చెప్పారు. మాజీ సిఎం కెసిఆర్ ఒక్కరే లీడర్ అని చెప్పడంలో ఆంతర్యం ఏమిటీ? అని చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు.

### ఆసియా ఇండోర్ రెగట్టాలో భారత్‌కు

# పతకాల పంట

## 9 స్వర్ణాలతో సహా 15 పతకాలు



**న్యూఢిల్లీ:** ఆసియా ఇండోర్ రెగట్టాలో మొదటి రోజు భారత రోవర్లు అదరగొట్టారు. థాయ్‌లాండ్‌లోని పట్టాయాలో ప్రారంభమైన ఈ మెగా ఈవెంట్‌లో వివిధ విభాగాల్లో తొమ్మిది స్వర్ణాలతో సహా 15 పతకాలను గెలుచుకుని, ఆసియా ఇండోర్ రోయింగ్ ఛాంపియన్‌షిప్-2025లో భారతదేశం సంచలనాత్మక ఆరంభం చేసింది. హోరాహోరీగా జరిగిన తొలి రోజు పోటీలో భారత్ పతకాల జోరును పెంచింది. టీమ్ ఇండియా తొమ్మిది స్వర్ణాలు, ఐదు రజతాలు, 1 కాంస్య పతకంతో అద్వితీయ విజయాన్ని సాధించింది.

భారత్‌కు బంగారు పతకాలు బాలుర అండర్17లో మాస్టర్ సాక్షం, అండర్ 19 పురుషులలో గుర్సేవక్ సింగ్, మహిళల అండర్19లో గౌరీ నందా, పారా పిఆర్3 పురుషులలో కొంగనపల్లె నారాయణ, పారా పిఆర్3 మహిళలలో అనిత, పారా పిఆర్3 ఐడి పురుషులలో అన్యతం రాజ్ కుమార్, మాస్టర్స్ 30-39 వయస్సు విభాగంలో సిద్ధార్థ్ సునీల్ గెలుచుకున్నారు. మాస్టర్స్ 50-59 లైట్ వెయిట్ పురుషులలో పస్పుల కృష్ణారావు, మాస్టర్స్ 60+ పురుషులలో జేమ్స్ జోసెఫ్ కూడా స్వర్ణం సాధించారు. అలాగే అలాన్ జోషి, ఆదిత్య రవీంద్ర కేదారి, మాస్టర్స్ 30-39 లైట్ వెయిట్ పురుషుల్లో అమిత్ కుమార్, మాస్టర్స్ 40-49 పురుషుల్లో శాంటు గర్రై, మాస్టర్స్ 50-59 మహిళల్లో డాక్టర్ మృదుల కులకర్ణిలకు రజత పతకం, అలాగే మాస్టర్స్ 30-39 లైట్ వెయిట్ ఉమెన్ విభాగంలో హర్‌ప్రీత్ కౌర్‌కు కాంస్య దక్కింది. దీంతో ఛాంపియన్‌షిప్‌లో మొదటి రోజు భారత్ పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది. కాగా దక్షి ణ కొరియా, ఇరాన్, కువైట్, సౌదీ అరేబియా, మలేషియా, శ్రీలంక, సింగపూర్, పాకిస్తాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఆతిథ్య థాయిలాండ్ మరియు భారత్‌తో సహా మొత్తం 11 దేశాలు వారం రోజుల పాటు జరిగే క్రీడా మహోత్సవంలో పాల్గొంటున్నాయి.

### భారత్ జూనియర్

# మహిళల విక్టరీ

## అర్జెంటీనాపై 2-0తో గెలుపు



**న్యూఢిల్లీ:** ఫోర్ నేషన్స్ టోర్నమెంట్ షూటౌట్‌లో అర్జెంటీనాపై భారత జూనియర్ మహిళల హాకీ జట్టు 2-0 తేడాతో గెలుపొందింది. 1-1తో డ్రాగా ముగిసిన తర్వాత తమ మూడో మ్యాచ్‌లో ఈ విక్టరీని సాధించింది. అర్జెంటీనాలోని రోసారియోలో జరిగిన మొదటి క్వార్టర్‌లో మిలాగ్రోస్ డెల్ వల్లే (10వ నిముషంలో) ఆతిథ్య జట్టుకు ఆధిక్యాన్ని అందించడంతో అర్జెంటీనా బలమైన ఆరంభాన్ని ఇచ్చింది. మూడో క్వార్టర్‌లో కనికా 44వ నిమిషంలో గోల్ చేసి తన జట్టును తిరిగి పోటీలోకి తీసుకువచ్చింది. మరో గోల్స్ లేకపోవడంతో మ్యాచ్ పూర్తి సమయంలో టై అయి, పెనాల్టీ షూటౌట్‌కు వెళ్ళింది. గోల్ కీపర్, కెప్టెన్ నిధి వరుసగా నాలుగు సేవ్‌లు చేసి ఆతిథ్య జట్టును ఆదుకుంది. లాల్రిన్‌పుయి మరియు లాల్తాంట్లువాంగి తమ అవకాశాలను సద్వినియోగం చేసుకుని భారతదేశానికి మంచి విజయాన్ని అందించారు. కాగా ఈ నెల 25న అర్జెంటీనాలోని రోసారియోలో చిలీపై 2-1 తేడాతో విజయం సాధించి భారత జూనియర్ మహిళలు ఫోర్ నేషన్స్ టోర్నమెంట్‌ను సానుకూలంగా ప్రారంభించారు. భారత్ తరపున సుఖ్‌వీర్ కౌర్ (39వ నిముషం), కనికా సివాచ్ (58వ నిముషం) గోల్స్ సాధించారు. చిలీ తరపున జవేరియా సెంజ్ (20వ నిముషంలో) ఏకైక గోల్ చేసింది. రెండో అర్ధభాగంలోకి అడుగుపెట్టే సమయానికి తన జట్టుకు స్వల్ప ఆధిక్యాన్ని అందించింది. అయితే, భారత్ వెంటనే ప్రతిఘటించి 39వ నిమిషంలో సుఖ్‌వీర్ కౌర్ సౌజన్యంతో మూడవ క్వార్టర్‌లో గోల్‌ను సమం చేసింది.

మ్యాచ్ చివరి నిమిషాల్లో, కనికా సివాచ్ 58వ నిమిషంలో విజయ గోల్ చేసి భారత్ విజయాన్ని నిర్ధారించింది. ఇక ఈ నెల 26న జరిగిన రెండో మ్యాచ్‌లో ఉరుగ్వేపై 3-2 తేడాతో విజయం సాధించింది. మూడో క్వార్టర్ ముగిసే సమయానికి ఆట సమంగానే ఉంది, కానీ చివరి దశలో కనికా సివాచ్ కీలకమైన బ్రేస్ గోల్స్ చేసి భారత్ విజయం సాధించడంలో సహాయపడింది. ఆమె మొదట 46వ నిమిషంలో పెనాల్టీ కార్నర్ ద్వారా గోల్ చేసింది, ఆ తర్వాత 50వ నిమిషంలో నిర్ణయాత్మక ఫీల్డ్ గోల్ చేసి అర్థమైన విజయాన్ని నమోదు చేసింది.



# టి20లో పాకిస్థాన్ విజయం

## 37 పరుగుల తేడాతో బంగ్లాదేశ్ ఓటమి

**న్యూఢిల్లీ:** టీ20 సిరీస్ తొలి మ్యాచ్‌లో లో బంగ్లాదేశ్‌పై పాకిస్తాన్ గెలుపొందింది. నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు నష్టానికి 37 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో ఈ సిరీస్‌లో పాక్ 1-0 ఆధిక్యతతో నిలిచింది. పాకిస్తాన్ నిర్ధేశించిన 202 పరుగుల లక్ష్య ఛేదనలో బంగ్లాదేశ్ 164 పరుగులకే ఆలౌట్ అయింది. పాకిస్తాన్ కొత్త వైట్ బాల్ హెడ్ కోచ్ మైక్ హెస్సన్‌కు హసన్ అలీ విజయవంతమైన ఆరంభాన్ని అందించడంలో సహాయపడ్డాడు. పాకిస్తాన్ కెప్టెన్ సల్మాన్ అఘా 34 బంతుల్లో 56 పరుగులు చేసి తన కెరీర్‌లో అత్యుత్తమ స్కోరుతో విజయానికి పునాదులు వేశాడు, ఆ తర్వాత హసన్ బంతితో అద్భుతంగా రాణించాడు. హసన్ తన తొలి ఐదు వికెట్లు పడగొట్టాడు, 5-30 తో ముగించాడు, ఆతిథ్య జట్టు పేలవంగా ఆరంభించింది, ఓపెనర్లు సైమ్ అయూబ్ డకౌట్ గా, ఫఖర్ జమాన్ (ఒకటి) తొలి రెండు ఓవర్లలోనే వికెట్లు కోల్పోవడంతో వారు ప్రారంభంలోనే 5-2తో వెనుకబడ్డారు. ఆల్ రౌండర్ షాదాబ్ ఖాన్ 25 బంతుల్లో 48 పరుగులు చేసి పాకిస్తాన్ చివరి ఐదు ఓవర్లలో 58 పరుగులు జోడించడంలో సహాయపడ్డాడు, బంగ్లాదేశ్ విజయం కోసం మొత్తం 202 పరుగులు నిర్దేశించింది. ఇక లక్ష్య సాధనలో తంజిద్ హస్సాన్ భారీ సిక్స్‌తో బంగ్లాదేశ్ ఖాతాను తెరిచినప్పటికీ, అలీ బౌలింగ్‌లో అలీ బౌలింగ్‌లో అలీ ఔట్ అయ్యాడు.బంగ్లాదేశ్ తరఫున లిట్టన్ దాస్ 48 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు మరియు జాకర్ 21 బంతుల్లో 36 పరుగులు చేశాడు, కానీ పాకిస్తాన్ సిరీస్ ఆధిక్యంలోకి వెళ్లకుండా ఆపడానికి అదిసరిపోలేదు. మిగిలినబ్యాటర్లు పేలవ ప్రదర్శన చేసి విఫలం చెందడంతో 19.2 ఓవర్లకు 164 పరుగులకే ఆలౌట్ అయ్యారు.

# సన్‌రైజర్స్ ప్రక్షాళన

## టీమ్ నుండి ఐదుగురు ఔట్.. ఫ్లాప్ అయిన ప్లేయర్లకు ఉద్వాసన



**న్యూఢిల్లీ:** ఐపీఎల్-2025, సీజను 18పై ఎన్నో ఆశలతో అడుగుపెట్టిన సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టు గ్రూప్ దశలోనే ఇంటిదారి పట్టింది. 6 విజయాలు, 7 ఓటములతో పాయింట్ల పట్టికలో 6వ స్థానంలో నిలిచింది. దీంతో జట్టును ప్రక్షాళన చేయాలని సన్‌రైజర్స్ ఫ్రాంచైజీ యాజమాన్యం నిర్ణయించింది. జట్టు కూర్పును బలోపేతం చేసుకోవడానికి, కొంతమంది ఆటగాళ్లను విడుదల చేయాలని జట్టు యాజమాన్యం భావిస్తోంది. ఈ ఐపీఎల్ సీజన్‌లో ఆశించిన స్థాయిలో రాణించని లేదా అధిక ధర పలికిన ఆటగాళ్లను రిలీజ్ చేసే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అటువంటి వారిలో మొహమ్మద్ షమీ ఒకడు. ఐపీఎల్ 2025 వేలంలో షమీని హైదరాబాద్ రూ.10 కోట్లకు కొనుగోలు చేసింది. అయితే, గాయాలు, ఫిట్‌నెస్ సమస్యలతో ఈ సీజన్‌లో పేలవమైన ప్రదర్శన చేసి ఆశించిన ప్రభావం చూపలేకపోయాడు. 9 మ్యాచ్‌లలో 6 వికెట్లు మాత్రమే తీసి, 11.23 ఎకానమీ రేటుతో పరుగులు సమర్పించుకున్నాడు. అతని అధిక ధర, ప్రస్తుత ఫామ్ దృష్ట్యా రాయల్ ఛాలెంజర్స్ అతనిని విడుదల చేసి, యువ భారతీయ పేసర్లపై పెట్టుబడి పెట్టాలని చూస్తోంది. అలాగే ఆస్ట్రేలియా స్పిన్నర్ ఆడమ్ జంపాను రూ.2.40 కోట్లకు కొనుగోలు చేసింది. స్పిన్ విభాగాన్ని బలోపేతం చేయాలనే లక్ష్యంతో జంపాను తీసుకున్నప్పటికీ, అతను ప్రభావం చూపలేకపోయాడు. ఈ సీజనులో కేవలం రెండు మ్యాచ్‌లు మాత్రమే ఆడి, 8 ఓవర్లలో 94 పరుగులు ఇచ్చి 2 వికెట్లు మాత్రమే తీశాడు. ఇక నితీష్ కుమార్‌ను హైదరాబాద్ రూ.8 కోట్లకు అట్టిపెట్టుకుంది. అతను గత సీజన్‌లో అద్భుతమైన ప్రదర్శన చేసినప్పటికీ, ఈ సారి రాణించలేకపోయాడు. బ్యాటింగ్‌లో 11 మ్యాచ్‌లలో 178 పరుగులు మాత్రమే చేసి, బంతితో పెద్దగా ప్రభావం చూపలేకపోయాడు. ఇక వికెట్ కీపర్, బ్యాటర్ ఇషాన్ కిషన్‌ను సన్‌రైజర్స్ రూ.11.25 కోట్లకు కొనుగోలు చేసింది. అయితే, ఈ సీజన్‌లో అతని ప్రదర్శన ఆశించిన స్థాయిలో లేదు. రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన ఒక మ్యాచ్‌లో సెంచరీ మినహా, మిగిలిన మ్యాచ్‌లలో చెప్పుకోదగ్గ ప్రదర్శన చేయలేదు. అతని అధిక ధర, అస్థిరమైన ఫామ్ కారణంగా, అతనిని విడుదల చేసి, కొత్త ఓపెనింగ్ లేదా వికెట్ కీపింగ్ ఆప్షన్ కోసం వెతికే అవకాశం ఉంది. కాగా బ్యాట్స్‌మెన్ అభినవ్ మనోహర్‌ను రూ.3.2 కోట్లకు కొనుగోలు చేసింది. అతను ఈ ఐపీఎల్ 7 మ్యాచ్‌లలో కేవలం 61 పరుగులు మాత్రమే చేశాడు. ఈ మధ్యకాలంలో అతని ప్రదర్శన అంతగా ఆకట్టుకోలేదు. ఈ ఆటగాళ్లను విడుదల చేయడం ద్వారా తమ పర్స్‌ను పెంచుకొని, 2026 మెగా వేలంలో జట్టును మరింత బలోపేతం చేసుకోవాలని చూస్తోంది. ముఖ్యంగా భారతీయ బౌలర్లు, ఆల్‌రౌండర్లపై దృష్టి సారించే అవకాశం ఉనట్లు తెలుస్తోంది.



# క్వార్టర్ ఫైనల్స్‌కు సాత్విక్ జోడీ

## సింధు, ప్రణయ్, ట్రీసా-గాయత్రి నిష్క్రమణ

**న్యూఢిల్లీ:** బిడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్ 750 ఈవెంట్ అయిన సింగపూర్ ఓపెన్-2025, పురుషుల డబుల్స్ విభాగంలో భారత్‌కు చెందిన సాత్విక్ సాయిరాజ్ రాంకిరెడ్డి-చిరాగ్ శెట్టి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నారు. దక్షిణ కొరియాలోని గుమిలో గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో ఇండోనేషియాకు చెందిన సబర్ కార్యమాన్ గుటామా-ముహమ్మద్ రెజా పహ్లేవి ఇస్ఫహానీ జోడీని సాత్విక్, చిరాగ్ ద్వయం ఓడించింది. పురుషుల సింగిల్స్ విభాగంలో హెచ్‌ఎస్ ప్రణయ్‌కు అపజయం ఎదురైంది. ఫ్రాన్స్‌కు చెందిన క్రిస్టో పోపోవ్ చేతిలో అతడు ఓడిపోయాడు. కాగా మహిళల సింగిల్స్ విభాగంలో పివి సింధు చైనాకు చెందిన చెన్ యు ఫీపై ఓడిపోయింది. కాగా మహిళల డబుల్స్ జట్టు ట్రీసా జాలీ-గాయత్రి గోపీచంద్ తమ ప్రీక్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో చైనాకు చెందిన జియా యిఫాన్, జాంగ్ షుక్సియన్ చేతిలో ఓడిపోయారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత జోడీ రోహన్ కపూర్-గద్దె రుత్విక శివాని హాంకాంగ్‌కు చెందిన టాంగ్ చున్ మాన్, త్సే యింగ్ సూట్ చేతిలో ఓడిపోయారు.మహిళల డబుల్స్‌లో అమృత ప్రముతేష్-సోనాలిసింగ్ 21-23,7-21 స్కోరుతో ఆస్ట్రేలియాకు చెందిన గ్రోన్యా సోమర్‌విల్లే, ఏంజెలాయు చేతిలో ఓడిపోయారు.

# వాణిజ్యం

# టాటా కెమికల్స్ చైర్మన్‌గా 'ఎస్ పద్మనాభన్'

**ముంబై, మే 29:** దిగ్గజ వ్యాపార సంస్థ టాటా గ్రూప్‌లో కీలక పరిణామం చోటు చేసుకుంది. టాటా సన్స్ చైర్మన్ 'ఎన్ చంద్రశేఖరన్' టాటా కెమికల్స్ డైరెక్టర్ అండ్ చైర్మన్ పదవి నుంచి తప్పుకున్నారు. ఈ విషయాన్ని ఎక్స్ఛేంజ్ ఫైలింగ్స్‌లో కంపెనీ వెల్లడించింది. నా ప్రస్తుత భవిష్యత్తు నిబద్ధతలను జాగ్రత్తగా పరిశీలించిన తర్వాత, నేను బోర్డు నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నాను. టాటా కెమికల్స్ బోర్డుకు అధ్యక్షత వహించడం గౌరవంగా ఉంది. అంతేకాకుండా నా పదవీకాలంలో నాకు మద్దతు, సహకారాన్ని అందించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు' అంటూ టాటా సన్స్ చైర్మన్ కంపెనీ డైరెక్టర్ల బోర్డును ఉద్దేశించి ప్రసంగించారు. ఎన్ చంద్రశేఖరన్ పదవి నుంచి వైదొలిగిన తర్వాత, 2025 మే 30 నుంచి 'ఎస్.పద్మనాభన్' కొత్త చైర్మన్ బాధ్యతలను తీసుకుంటున్నట్లు కంపెనీ వెల్లడించింది. తమిళనాడులోని నామక్కల్‌లోని మోహనూర్‌లోని ఒక వ్యవసాయ కుటుంబంలో జన్మించిన ఎన్ చంద్రశేఖరన్, ప్రభుత్వ పాఠశాలలో



ప్రాథమిక విద్యను పూర్తి చేసి, తర్వాత కోయంబత్తూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి అప్లైడ్ సైన్సెస్‌లో బ్యాచిలర్ డిగ్రీని పొందారు. ఆ తర్వాత తిరుచిరాపల్లిలోని రీజినల్ ఇంజినీరింగ్ కళాశాలలో మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ డిగ్రీని పూర్తిచేశారు. టాటాగ్రూప్‌తో ఆయన ప్రయా ణం 1987లో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌లో ఇంటర్న్‌గా చేరడంతో ప్రారంభమైంది. సెప్టెంబర్ 2007లో చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ స్థాయికి త్వరగా ఎదిగారు. అక్టోబరు 2009లో, కేవలం 46 సంవత్సరాల వయసులో టిసిఎస్ సిఇఒగా నియమితులయ్యారు.

# లాభాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ



**ముంబై, మే 29:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లలో సానుకూల సంకేతాల నడుమ ఉదయం లాభాల్లో ప్రారంభమైన సూచీలు కాసేపు లాభ నష్టాల మధ్య చలించాయి. ప్రధాన షేర్లలో కొనుగోళ్ల అండతో తిరిగి పుంజుకున్నా యి. దీంతో మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 320 పాయింట్లు లాభపడగా.. నిఫ్టీ 24,800 పైన ముగిసింది. సెన్సెక్స్ ఉదయం 81,591.03 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,312.32) లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 81,106.98 81,816.89 పాయింట్ల మధ్య కదలాడింది. చివరికి 320 పాయింట్ల లాభంతో 81,633 వద్ద స్థిరపడింది. నిఫ్టీ ఇంట్రాడేలో 24,892.60 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 81 పాయింట్ల లాభంతో 24,833.60 వద్ద ముగిసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు 85.50 వద్ద ముగిసింది. ఇండస్ ఇండ్ బ్యాంక్, సన్‌ఫార్మా, అదానీ పోర్ట్స్, ఎటర్నల్, టాటా స్టీల్, టెక్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, టాటా మోటార్స్, ఇన్ఫోసిస్, ఎంఅండ్ఎం, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, మారుతీ సుజుకీ షేర్లు లాభపడ్డాయి. బజాజ్ ఫైనాన్స్, ఐటీసీ, బజాజ్ ఫిన్‌సర్వ్, ఏషియన్ పెయిం ట్స్, టీసీఎస్, ఎన్టీపీసీ షేర్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 65.84 డాలర్ల వద్ద ట్రేడవగా, బంగారం ఔన్సు 3,282 డాలర్ల వద్ద కొనసాగింది.

# మైక్రోసాఫ్ట్, యోటా టైఅప్



**న్యూఢిల్లీ, మే 29:** భారత్‌లో కృత్రిమ మేధని మరింతగా వినియోగంలోకి తెచ్చే దిశగా మైక్రోసాఫ్ట్, యోటా డేటా సర్వీ సెస్ చేతులు కలిపాయి. ఈ ఒప్పందం ప్రకారం యోటా ఎఐ క్లౌడ్ ప్లాట్‌ఫాం అయిన శక్తి క్లౌడ్‌లో మైక్రోసాఫ్ట్ తమ అజూర్ ఎఐ సర్వీసు లను అందుబాటులోకి తెస్తుంది. దీంతో డెవలపర్లు, స్టార్టప్‌లు, కంపెనీలు, ప్రభుత్వ రంగ సంస్థలు, ఇండియాఎఐ మిషన్‌లో భాగమైన సంస్థలకు అధునాతన సేవలు అందుబాటులోకి వస్తాయి. దేశీయంగా కృత్రిమ మేథ సామర్థ్యాలను పెంపొం దించడం, నవకల్పనలను ప్రోత్సహించడం, మౌలిక సదుపాయాలను పటిష్ట పర్చడం ద్వారా ఇండియాఎఐ మిషన్ లక్ష్యాల సాధనకు కూడా మైక్రోసాఫ్ట్-యోటా భాగస్వామ్యం తోడ్పడనుంది. ఇండియాఎఐ మిషన్ అనేది దేశంలోని కృత్రిమ మేధ వ్యవస్థ ను బలోపేతం చేయడానికి భారత ప్రభుత్వం ప్రారంభించిన జాతీయ చొరవ. ఎఐ ఇన్నోవేషన్‌ను ప్రోత్సహిం చడం, స్వదేశీ ఎఐమోడళ్లను అభివృద్ధిచేయడం, పటిష్టమైన ఎఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను సృష్టించడం ఈ మిషన్ లక్ష్యం. దేశీయ ఎఐ మోడల్స్‌ను రూపొందించడానికి సంబంధించి 2025 మే నాటికి ఇండియాఎఐ మిషన్‌కు 500పైగా ప్రతిపాదనలు వచ్చాయి.

# ఐఫోన్ల ఎగుమతుల్లో భారత్ రికార్డ్

**ముంబై, మే 29:** ఐఫోన్ ఎగుమతుల్లో భారతదేశం చైనాను అధిగమించింది. ముఖ్యంగా అమెరికాలో భారతదేశంలో ఉత్పత్తి చేసిన ఐఫోన్ ప్రొడెక్ట్స్‌కు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో కొన్ని నివేదికల్లో ఈ విషయం వెల్లడైంది. భారతదేశంలో ఐఫోన్ ప్రొడెక్ట్స్ ఎగుమతులు సంవత్సరానికి 76 శాతం వృద్ధిని సాధించాయి. ఈ అభివృద్ధికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనా ఉత్పత్తులపై విధించిన 30 శాతం పరస్పర సుంకం కారణమని నిపుణులు స్పష్టం చేస్తుంది. ట్రంప్ నిర్ణయంతో భారతదేశం నుంచి అమెరికన్ మార్కెట్‌కు ఐఫోన్ ఎగుమతులు భారీగా పెరిగాయి. భారతదేశం ఏప్రిల్‌లో దాదాపు 3 మిలియన్ ఐఫోన్‌లను (లేదా 30 లక్షల యూనిట్లు) అమెరికాకు ఎగుమతి చేసింది అయితే చైనా నుంచి ఈ షిప్‌మెంట్‌లు కేవలం 9,00,000 యూనిట్లు మాత్రమే ఉన్నాయి.



2020లో కోవిడ్ మహమ్మారి కారణంగా ఎక్స్‌పోర్ట్ చెయిన్‌లో ఏర్పడిన అంతరాయాల దృష్ట్యా ఆపిల్ చైనా బయటి దేశాల్లో తయారీ కార్యకలాపాలను స్థాపించాలని నిర్ణయం తీసుకుంది. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకున్న భారత్ దేశంలో ఐఫోన్ ఉత్పత్తుల తయారీకు ప్రత్యేక సౌకర్యాలను ఏర్పాటు చేసింది. దీంతో చైనా తర్వాత ఐఫోన్ ఉత్పత్తికి దేశాన్ని రెండవ అతిపెద్ద కేంద్రంగా నిలిపింది. అలాగే ఏప్రిల్ 2 నుంచి అమెరికాలో చైనా నుంచి ఐఫోన్‌లపై అమలు చేసిన 30 శాతం సుంకం భారతదేశంతో పాటు ఇతర దేశాల నుండి దిగుమతులపై మరింత అనుకూలమైన 10 శాతం సుంకానికి భిన్నంగా ఉంటుందని నిపునులు చెబుతున్నారు. జూన్ త్రైమాసికం నుంచి భారతదేశంలో తయారైన ఐఫోన్‌లు యూఎస్ మార్కెట్లో అందుబాటులో ఉంటాయని ఆపిల్ సీఈఓ టిమ్ కుక్ ఇటీవల ధ్రువీకరించారు. అయితే ఆశాజనకమైన వృద్ధి ఉన్నప్పటికీ ప్రస్తుత పెరుగుదల స్వల్పకాలికం కావచ్చని పరిశోధన సంస్థలు హెచ్చరిస్తున్నాయి. యూఎస్ ఐఫోన్‌ల డిమాండ్ ప్రతి త్రైమాసికంలో 20 మిలియన్ యూనిట్ల వరకు ఉంది. కానీ భారతదేశం 2026 వరకు ఈ లక్ష్యాన్ని చేరుకోకపోవచ్చని చెబుతున్నారు. ఆపిల్ భారతదేశంలో దాని తయారీ సామర్థ్యాన్ని విస్తరించడానికి కృషి చేస్తుండగా ఉత్పత్తి ఎంత పెరగవచ్చనే దానిపై పలు పరిమితులు ఉండడం గమనార్హం.






Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14